


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 60

గురువారం 22-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'ప్లే ఆఫ్స్'కు ముంబై

ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 59 పరుగులతో ఘన విజయం -14లో



మళ్లీ బంగారం రయ్...!

పది గ్రాములకు రూ.1,910 ర్యాలీ.. మళ్లీ రూ.98 వేల పైకి చేరిక -15లో



ఇస్లాంలో తప్పనిసరి భాగం కాదు

వక్ఫ్(సవరణ) చట్టం–2025ను కేంద్రం సమర్థించుకుంది. వక్ఫ్ అనేది ఇస్లాంలో తప్పనిసరి భాగం కాదని తేల్చిచెప్పింది.

- వివరాలు 6లో▶



అగ్రరాజ్యానికో గోల్డెన్ డోమ్!

175 బిలియన్ డాలర్ల వ్యయంతో గోల్డెన్ డోమ్ మిస్సైల్ డిఫెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

- వివరాలు 6లో▶



దెబ్బతిన్న ముందుభాగంతోనే...

220 మందికి పైగా ప్రయాణికులతో బుధవారం ఢిల్లీ నుంచి శ్రీనగర్ బయల్దేరిన ఇండిగో విమానానికి పెనుముప్పు తప్పింది.

- వివరాలు 6లో▶



ఐఎస్ఐ ఏజెంట్లను కలిశా

పాక్ నిఘా అధికారులతో తనకు పరిచయం ఉందని, పాకిస్తాన్‌లో వాళ్లను కలిశానని యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా ఒప్పుకున్నారు.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

రహదారులు రక్తసిక్తం



హైదరాబాద్‌లోని హయత్‌నగర్, కర్ణాటకలోని విజయపుర జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 8 మంది మృతి చెందారు. కర్ణాటకలో జరిగిన ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఓ కుటుంబంలో ఒక్కరు తప్ప అందరూ మృత్యుఒడికి చేరారు.

- వివరాలు 5లో▶

ఉన్న బోధకులకే 'కొత్త' శిక్షణ



ఇంజనీరింగ్ ఎమర్జింగ్ కోర్సుల బోధనకు ఆధునిక మెళకువలు అవసరమని ఏఐసీటీఈ సూచించింది. ప్రస్తుత ఫ్యాకల్టీకే శిక్షణనివ్వడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చంది.

- వివరాలు 16లో▶

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్ రెస్పాన్స్ షీట్



ఐఐటీల్లో ప్రవేశానికి ఈ నెల 18న కాన్పూర్ ఐఐటీ నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ అడ్వాన్స్‌డ్) రెస్పాన్స్ షీట్ గురువారం విడుదలయ్యే అవకాశం ఉంది. మే 26లోపు 'కీ' విడుదల చేసే వీలుంది.

- వివరాలు 16లో▶

డ్యాన్స్ బేబీ డ్యాన్స్



పార్కిన్‌సన్‌లో ఏ కదలికా లయబద్ధంగా ఉండదు. డ్యాన్స్‌లో లయబద్ధంగా లేని ఒక్క కదలికా ఉండదు. కానీ ఐ.ఎ.డి.ఎం.టి. పార్కిన్‌సన్స్ వ్యాధిగ్రస్తుల్ని శక్తిమంతం చేయటానికి భారతీయ నృత్య రీతుల్ని ఒక చికిత్సా విధానంగా ఉపయోగిస్తోంది.

- వివరాలు 2లో▶

నంబాల ఎన్‌కౌంటర్

ఎదురుకాల్పుల్లో మరణించిన మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్

పలువురు కీలక నేతలు సహా మొత్తం 27 మంది మృతి



నంబాల కేశవరావు మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మఢ్ అడవుల్లో నెత్తుటి ధారలు

- ఎదురుకాల్పుల్లో డీఆర్‌జీ జవాన్ ఒకరు మృతి.. మరి కొంతమందికి గాయాలు
- పక్కా సమాచారంతో భద్రతా దళాల ఆపరేషన్
- బుధవారం తెల్లవారుజామున గర్జించిన తుపాకులు
- కేశవరావు మరణించినట్టు ప్రకటించిన అమిత్ షా
- ప్రధాన కార్యదర్శి హోదా ఉన్న నేత మరణించడం ఇదే మొదటిసారని వెల్లడి
- అసాధారణ విజయం అన్న ప్రధాని మోదీ
- నంబాలపై కోటిన్నర రూపాయల రివార్డు!
- వరంగల్ ఆర్‌ఈసీలో ఎంటెక్ చదువుతూ అజ్ఞాతంలోకి వెళ్లిన శ్రీకాకుళం జిల్లా వాసి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్, జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు (71) మృతి చెందారు. ఈ ఎదురుకాల్పుల్లో పలువురు కీలక నేతలు సహా మొత్తం 27 మంది మావోయిస్టులు కూడా మరణించారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్–బీజాపూర్ జిల్లా సరిహద్దు అబూజ్‌మఢ్ అడవుల్లో ఇంద్రావతి నది పరీవాహక ప్రాంతంలో బుధవారం ఉదయం ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఓ డీఆర్‌జీ జవాను కూడా మృతి చెందగా పలువురు గాయపడినట్లు ఛత్తీస్‌గఢ్ సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. కేశవరావు మరణాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ధ్రువీకరించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న ఓ మావోయిస్టు నేత ఎదురుకాల్పుల్లో మరణించడం ఇదే మొదటిసారని తెలిపారు. ప్రధాని మోదీ కూడా ఎన్‌కౌంటర్‌పై స్పందించారు. 'ఇదో అసాధారణ విజయం' అని పేర్కొన్నారు. కేశవరావు తలపై కోటిన్నర రూపాయల రివార్డు ఉన్నట్లు సమాచారం. కాగా మావోయిస్టు ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల మృతి మావోయిస్టు పార్టీకి పెద్ద ఎదురుదెబ్బని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో జన్మించిన కేశవరావు వరంగల్ ఆర్‌ఈసీ (ఇప్పటి నిట్)లో ఎంటెక్ చదువుతూ అజ్ఞాతంలోకి వెళ్లారు.

పక్కా సమాచారంతో..

అబూజ్‌మఢ్ అడవుల్లో ఇంద్రావతి నది సమీపాన మావోయిస్టు అగ్రనేత షెల్టర్ తీసుకున్నారని, పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులతో పాటు మిగతా 12వ పేజీలో ▶

45 ఏళ్ల అజ్ఞాతం.. అడవిలోనే అంతం

- శ్రీకాకుళం జిల్లా జియ్యన్నపేట కేశవరావు స్వస్థలం
- ఆర్‌ఎస్‌యూ సభ్యుడి నుంచి సుప్రీం కమాండర్‌గా ఎదిగిన నంబాల
- 35 ఏళ్లపాటు మిలటరీ ఆపరేషన్ల నిర్వహణ బాధ్యతలు
- 'అలిపిరి' సహా అనేక దాడులకు బాధ్యుడు, వ్యూహకర్త

12 లో

మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ

- తాజా ఎన్‌కౌంటర్‌లో సుప్రీం కమాండర్ కేశవరావు మృతి
- ఒకవైపు 'కగార్'తో తరుముతున్న సాయుధ బలగాలు
- మరోవైపు వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
- తుడిచిపెట్టుకుపోతున్న పార్టీ నాయకత్వం


12 లో

అసాధారణ విజయం



అమిత్ షా 'ఎక్స్'లో చేసిన పోస్టును రీ పోస్ట్ చేసిన ప్రధాని మోదీ

మైలురాయి లాంటి విజయం: అమిత్ షా



వచ్చే మార్చి నాటికి నక్సలిజాన్ని అంతం చేస్తామని ప్రకటన

- వివరాలు 12లో

పాక్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని వెనకడుగు

- ఇందిరాగాంధీ హయాంలో పాక్‌కు గట్టి గుణపాఠం
- చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే రాహుల్‌పై విమర్శలు
- దేశ భద్రత, సమగ్రత విషయంలో జవాన్లకు అండగా ఉంటాం
- రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పహల్గాం దాడి ఘటన నేపథ్యంలో పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని మోదీ వెనకడుగు వేశారని.. అదే ఇందిరమ్మ హయాంలో ఉగ్రవాదుల ముసుగులో భారత పౌరులపై దాడులకు తెగబడిన పాక్‌కు గట్టి గుణపాఠం చెప్పారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సచివాలయం ముందు ఆయన విగ్రహానికి రేవంత్ పుష్పాంజలి ఘటించారు. రాజీవ్ వర్ధంతి రోజున 'ఉగ్రవాద వ్యతిరేక దినం'గా పాటిస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేస్తూ.. ఉగ్రవాదంపై పోరాటం చేయడం ప్రతి భారతీయుడి దృఢ సంకల్పమన్నారు. దేశ భద్రత, సమగ్రతను కాపాడే విషయంలో రాజకీయాలకు తావు లేకుండా కేంద్ర ప్రభుత్వానికి, భారత వీర జవాన్లకు ఎప్పుడూ అండగా నిలబడతామని చెప్పారు. కశ్మీర్‌లో పర్యాటకులపై కాల్పుల ఘటన, ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పోరాటం చేస్తున్న వీర సైనికులకు అండగా తెలంగాణ ప్రభుత్వం మొట్టమొదటగా సంఘీభావ ర్యాలీ నిర్వహించిందని గుర్తుచేశారు.

నాడు ఇందిర అంగీకరించలేదు...: ఉగ్రవాదులను నిర్మూలించడంలో ఇందిరమ్మ ఆదర్శంగా నిలిచారని, నాడు యుద్ధం సందర్భంగా అమెరికా లేదా ఇతర దేశాల మధ్యవర్తిత్వాన్ని మిగతా 2వ పేజీలో ▶

సీఎం రేవంత్‌రెడ్డిది పర్సంటేజీ పాలన

- కమీషన్ల గురించి మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారు
- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో శవాలూ తీయలేని దద్దమ్మ ప్రభుత్వమిది
- నోటీసులకు, విచారణకు భయపడం.. ప్రభుత్వాన్ని వదిలిపెట్టం
- బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ఎన్నికల వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ప్రచారం చేస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వం కుట్ర పూరితంగా ఇచ్చే నోటీసులకు, విచారణలకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. నల్లగొండ పట్టణంలో బుధవారం ఓ వివాహానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని, పర్సంటేజీల పాలన అని విమర్శించారు. కమీషన్లు ఇవ్వనిదే ఈ ప్రభుత్వంలో పనులు కావని స్వయంగా మంత్రులు, ఎమ్మెల్యేలే బహిరంగ వేదికలపైనే చెబుతున్నారని అన్నారు. 20 శాతం, 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని కాంట్రాక్టర్లు రాష్ట్ర సచివాలయంలోనే ధర్నా చేశారని గుర్తుచేశారు. ఈ కమీషన్ల వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కమిషన్ల ఏర్పాటు, నోటీసులు అంటున్నారని ఎద్దేవా చేశారు.

ఇది దద్దమ్మ ప్రభుత్వం: ఇచ్చిన హామీలు నెరవేర్చే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ విమర్శించారు. 'ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోయి గురువారానికి మూడు నెలలు పూర్తవుతుంది. అందులో చనిపోయినవారి శవాలను కూడా తీసుకురాలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. సుంకిశాల మిగతా 3వ పేజీలో ▶

అందాల భామలకు అగ్నిపరీక్ష



- కీలక అంకంలోకి మిస్ వరల్డ్ పోటీలు
- హెడ్ టు హెడ్ చాలెంజ్‌లో 24 మంది ఎంపిక
- ఎంపిక కాని మిగతావారికి ఇతర రౌండ్లలో అవకాశం
- ఖండానికి 10 మంది చొప్పున మొత్తం 40 మంది ఎంపిక

సాక్షి, హైదరాబాద్: పది రోజులుగా రాష్ట్రంలోని పలు దర్శనీయ స్థలాలను మండుటెండల్లో చుట్టేసి చెదరని చిరునవ్వు, అందం–అభినయంతో పరవశింపచేసిన సుందరీమణులు ఇప్పుడు చాలెంజ్ రౌండ్లలో దూసుకుపోతూ మిస్ వరల్డ్ పోటీలను రసవత్తరంగా మార్చారు. ఈనెల 10న ప్రారంభోత్సవం మొదలు వివిధ ప్రాంతాలను చుట్టేసిన అందాల భామలు.. ఆటవిడుపునకే పరిమితమయ్యారు. ఇప్పుడు అసలైన పోటీల్లో దిగి రెండు రోజులుగా మేధోసంపత్తితో అలరిస్తున్నారు. ఇప్పటిదాకా ఆటవిడుపుగా సాగిన పోటీలు అభిమానులకు రసవత్తరంగా మారగా, పోటీదారులకు అగ్నిపరీక్షగా నిలిచాయి. దీంతో మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ కీలక అంకంలోకి చేరినట్లయింది.

సత్తా చాటిన 24 మంది: టీ–హబ్‌లో రెండు రోజులపాటు జరిగిన హెడ్ టు హెడ్ చాలెంజ్ రౌండ్‌లో 24 మంది విజయం సాధించి తదుపరి 23న జరిగే కీలక టాలెంట్ పోటీకి ఎంపికయ్యారు. 107 దేశాలకు చెందిన పోటీదారులు ఇందులో పాల్గొనగా, 24 మందిని ఉన్నత ప్రతిభావంతులుగా న్యాయనిర్ణేతలు తేల్చారు. హెడ్ టు హెడ్ చాలెంజ్‌లో ఇండియా, అమెరికా, పోలండ్, నైజీరియా, ఫిలిప్పీన్స్, మాల్టా, ఇటలీ, ఇండోనేసియా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, ఎస్టోనియా, జర్మనీ, బ్రెజిల్, కేమాన్ ఐలాండ్స్, నెదర్లాండ్స్, వేల్స్, చెక్ రిపబ్లిక్, జమైకా, అర్జెంటీనా, ఐర్లాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, ఇథియోపియా, కామెరూన్, కెన్యా ముద్దుగుమ్మలు విజేతలుగా నిలిచారు. వీరు 23న జరిగే టాలెంట్ కాంపిటీషన్‌లో తలపడి తమ ఖండంలోని టాప్–10లో భాగమవుతారు.

వారికి మళ్లీ సత్తా చాటే చాన్స్: హెడ్ టు హెడ్ చాలెంజ్‌లో 24 మంది విజేతలుగా నిలిచి సెమీఫైనల్ బెర్తుకు చేరువయ్యారు. ఈ రౌండ్‌లో ఓడిన వారు ఎలిమినేట్ కారు. వారు పోటీలో ఇతర విభాగాలైన మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఒకసారి భారత్‌కు కూడా కృతజ్ఞతలు చెప్పుకుంటాడట సార్! ఓడించినందుకు!



3 రోజులు వానలు

తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

- నేటి ఉదయం అరేబియా సముద్రంలో అల్పపీడనం... 36 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం
- రాష్ట్రానికి ఎల్లో అలర్ట్ జారీ

2 లో

నోటికాడి బువ్వ.. నీటిపాలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కురిసిన వర్షం



ఆసిఫాబాద్ జిల్లా దహెగాంలోని కొనుగోలు కేంద్రంలో వర్షపు నీటిలో ధాన్యం నిల్వలు

- కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం రాశులు
- ప్రభుత్వం సేకరించిన ధాన్యం 56 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇంకా సేకరించాల్సింది దాదాపు 10 ఎల్ఎంటీ
- తడిచిన ధాన్యం కొనుగోలు హామీ ఉత్తమాటే
- కళ్లముందే ధాన్యం తడిచిపోవటంతో రైతుల ఆవేదన

సాక్షి, హైదరాబాద్/ నల్లగొండ/ మంచిర్యాల అగ్రికల్చర్/ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/ నిజామాబాద్ అర్బన్: రాష్ట్రంలో అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో వివిధ జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం బుధవారం కురిసిన వర్షానికి చాలా వరకు తడిచిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే తడిచిపోవటంతో రైతులు ఆవేదనకు గురయ్యారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు సైతం తడిచిపోవడంతో మిల్లర్లు వాటిని తీసుకుంటారో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు లేకపోవడంతో వర్షాలకు ధాన్యం తడిచిపోతోంది.

ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం 10 ఎల్ఎంటీ

రాష్ట్రంలో ఇప్పటివరకు 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చినట్లు పౌరసరఫరాల సంస్థ అధికారికంగా చెబుతోంది. అందులో 56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు మిగతా 2వ పేజీలో ▶

స్త్రీ హృదయ దీపానికి మరింత కాంతి



మైనారిటీ సమాజంలోని స్త్రీల జీవితాన్ని, సంఘర్షణను కథలుగా రాసిన కన్నడ రచయిత్రి బాను ముష్తాక్‌కు మంగళవారం ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ ప్రకటించారు.

- వివరాలు 13లో

రూ.142 కోట్ల ఆస్తులు కాజేశారు



- సోనియా, రాహుల్ మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారు
- నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ చార్జిషీట్

6 లో

అద్భుతమా, అసంబద్ధమా? ఏమిటిది! నియంత్రణ లేని కదలికలకు నియమబద్ధమైన కదలికలతో చికిత్సా?! 'పార్కిన్‌సన్స్' డిసీజ్ అంటే నడక అదుపు తప్పటం, చేతులు కదలకపోవటం, కాళ్లు మెదలకపోవటం, తల వణకడం, ఉన్నట్లుండి అదిరి పడటం, నాడీ వ్యవస్థకు, ఇంద్రియాలకు మధ్య సమన్వయం గాడి తప్పటం!! దేహం ఇంత దుర్భరంగా ఉన్నప్పుడు నృత్యం చెయ్యటం ఎంత దుర్లభం! పైగా దుర్లభమే దుర్భరానికి చికిత్స అవటం ఇంకెంత విడ్డూరం! అయితే ఇది విడ్డూరమేమీ కాదు, ప్రయోగాత్మకంగా నిర్ధారణ అయిన విషయమే అంటోంది 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డ్యాన్స్ మూవ్‌మెంట్ థెరపీ' (ఐ.ఎ.డి.ఎం.టి).

పార్కిన్‌సన్‌లో ఏ కదలికా లయబద్ధంగా ఉండదు. డాన్స్‌లో లయబద్ధంగా లేని ఒక్క కదలికా ఉండదు. కానీ ఐ.ఎ.డి.ఎం.టి. పార్కిన్‌సన్స్ వ్యాధిని నయం చేయటానికి, వ్యాధిగ్రస్తుల్ని శక్తిమంతం చేయటానికి భారతీయ నృత్య రీతుల్ని ఒక చికిత్సా విధానంగా ఉపయోగిస్తోంది. విశాలమైన ఒక నిశ్శబ్దపు గది, వెనుక నుంచి మంద్రస్థాయిలో వినిపించే తబలా బీట్ వంటి ఒక సంగీత వాద్యం ఈ చికిత్సలో ముఖ్య భాగంగా ఉంటాయి. స్త్రీలు, పురుషులు, ముఖ్యంగా వృద్ధులు అంతా కలిసి ఆ గదిలో ఉంటారు. అందరూ కూడా పార్కిన్‌సన్స్ బాధితులే. మనసును తాకుతున్న నేపథ్య ధ్వనికి అనుగుణంగా వాళ్ల చేతులు మబ్బుల్లా తేలుతాయి. చేతి వేళ్ల మృదువైన హావభావాలు అవుతాయి. పాదాలు లయకు అనుగుణంగా కదులుతాయి. గొప్ప పారవశ్యంతో మదిలోంచి జనించే ఉద్దేశపూర్వకమైన ఆంగికం (అవయవాల కదలిక)తో వారు ఒక మహా విజయాన్ని సాధిస్తారు. పార్కిన్‌సన్స్‌లో ప్రమేయం లేని కదలికలు మాత్రమే ఉంటాయి కనుక ఉద్దేశపూర్వకంగా శరీరాన్ని కదలించటం అన్నది మహా విజయమే.

సాక్షి, స్పెషల్ డెస్క్

డ్యాన్స్ బేబీ డ్యాన్స్



పార్కిన్‌సన్స్‌కు నృత్య చికిత్స

వృద్ధులకు మృదువైన ట్రీట్మెంట్ | ప్రయోగాత్మకంగా నిర్ధారణ

మానసికంగానూ మెరుగు

డ్యాన్స్ మూవ్‌మెంట్ థెరపీతో సత్ఫలితాలు

తప్పిన పట్టు తిరిగి వచ్చేస్తోంది

''ఇక్కడికి వచ్చిన వారు కొన్ని నెలల క్రితం వరకు కూడా పడిపోతామేమో అనే భయం లేకుండా నడవలేకపోయిన వారే. కానీ వారిని ఈ నృత్య చికిత్స ఎంతగానో మెరుగు పరిచింది'' అంటారు ఐ.ఎ.డి.ఎం.టి. అధ్యక్షురాలు, 'డ్రామా థెరపీ ఇండియా' వ్యవస్థాపకురాలు అన్షుమా క్షేత్రపాల్. పార్కిన్‌సన్స్‌లో నాడీ వ్యవస్థ–శరీరావయవాల పరస్పర చర్యల మధ్య సమన్వయం (మోటార్ కంట్రోల్) దెబ్బతింటుంది. మానసికంగానూ పార్కిన్‌సన్స్ వ్యాధిగ్రస్తులు పట్టుతప్పుతారు. ఈ స్థితిలో వారికొక ఉనికిని, వ్యక్తీకరణ శక్తిని, మునుపటి ఆనందకరమైన జీవితంలోకి మార్గాన్ని నృత్య చికిత్స ఏర్పరుస్తుందని అన్షుమా చెబుతున్నారు. ఈ సంస్థల శాఖలు ముంబై, పుణే, బెంగళూరులలో ఉన్నాయి.

నృత్యం తెచ్చే మార్పేమిటి?

పార్కిన్‌సన్స్ మెదడు క్రియాశీలతను, డోపమైన్ కేంద్రమైన 'బేసల్ గాంగ్లియా'ను ప్రభావితం చేస్తుంది. దాంతో స్వచ్ఛంద కదలికలు కష్టతరం అవుతాయి. కానీ మెదడు మాత్రం 'లయ'లకు స్పందిస్తుందని అన్షుమా అంటున్నారు. ''సంగీతాన్ని వింటున్నప్పుడు మెదడులో దెబ్బతినని సర్క్యూట్‌లు (పార్కిన్‌సన్స్ వల్ల దెబ్బతిన్నవి కాకుండా) వేర్వేరు నాడీ రహదారుల ద్వారా కదలికలను తెస్తాయి. నాడీ శాస్త్రపరంగా, ఈ నృత్య చికిత్స బలాల్లో ఒకటి రిథమిక్ ఆడిటరీ స్టిమ్యులేషన్ (ఆర్.ఎ.ఎస్.) ఉద్దీపన చెందటం. దీనివల్ల అవయవ సమన్వయం ఏర్పడుతుంది. డోపమైన్, ఎండార్ఫిన్‌లు, సెరోటోనిన్‌ల వంటి న్యూరో ట్రాన్సిమీటర్ హార్మోన్‌లు పెరుగుతాయి. దాంతో కదలికలు మాత్రమే కాదు, మానసిక స్థితీ మెరుగుపడుతుంది'' అని ఆమె అంటున్నారు.

గర్బా నృత్యంపై తొలి ప్రయోగం

గుజరాతీ సంప్రదాయ నృత్యం 'గర్బా'పై 2024లో ప్రయోగాత్మకంగా జరిగిన అధ్యయనంలో పార్కిన్‌సన్స్ రోగులపై ఈ డ్యాన్స్ చక్కటి ప్రభావం చూపినట్లు వెల్లడైంది. పార్కిన్‌సన్స్‌కు చికిత్సగా నృత్య రీతుల్ని ఆశ్రయించటం 2009లో ముంబైలోని 'పార్కిన్‌సన్స్ డిసీ జ్ అండ్ మూవ్‌మెంట్ డిజార్డర్ సొసైటీ' ప్రయత్నాలతో మొదలైంది. అదే సమయంలో అర్జెంటీనాలో టాంగో, సల్సా డ్యాన్సులు పార్కిన్సన్స్‌కు చికిత్సగా ఉపయోగపడతాయా అన్న దానిపై అధ్యయనం జరుగుతోంది. ఆ స్ఫూర్తితో 2010లో మన దగ్గర శాస్త్రీయ నృత్యాల చికిత్సా తరగతులు వారానికి రెండుసార్లు 3 నెలల పాటు ముంబైలో జరిగాయి. ప్రస్తుతం దేశంలోని అనేక కమ్యూనిటీ సెంటర్లు భరతనాట్యం, గర్బా, కూడియట్టంలతో చికిత్స చేస్తున్నాయి.

పార్కిన్‌సన్స్ లక్షణాలు – కారణాలు

ప్రధానంగా ఇవి శారీరకమైనవి. వణుకు, బిగదీసుకుపోవటం, కదలికలు నెమ్మదించటం, భంగిమలో అస్థిరత వంటివి కనిపిస్తాయి. క్రమంగా ఆందోళన, కుంగుబాటు మొదలౌతుంది. ఎవ్వరితోనూ కలవలేక, ఆత్మ విశ్వాసం సన్నగిల్లి అపారమైన దుఃఖం మిగులుతుంది. మెదడులో డోపమైన్ రసాయనాన్ని ఉత్పత్తి చేసే నాడీ కణాలు సక్రమంగా పని చెయ్యకపోవటం లేదా నశించటం పార్కిన్‌సన్స్‌కు ప్రధాన కారణం. మనిషి తను కదలాలనుకున్నట్లు కదలటానికి డోపమైన్ అవసరం. డోపమైన్ లోపించటం వల్ల కదలికలు అస్తవ్యస్తం అవుతాయి. మెదడులో డోపమైన్ ఉత్పత్తి తగ్గటానికి గల కారణాలపై పరిశోధకులింకా స్పష్టమైన నిర్ధారణకు రాలేదు. ఒక కారణం మాత్రం వృద్ధాప్యం. అరవై ఏళ్లు పైబడిన వాళ్లలో సుమారు ఒక శాతం మందికి పార్కిన్‌సన్స్ వచ్చే అవకాశాలున్నాయని అంచనా. డోపమైన్‌ను భర్తీ చేసే మందులు, మెదడు ఉద్దీపన వంటి వైద్య చికిత్సలలో పురోగతి సాధించినప్పటికీ ఫలితాలైతే అనుకున్నంతగా లేవు.

రోగులు తమకు తామే వైద్యులు

సాధారణ వైద్యంలా ఈ 'డ్యాన్స్ మూవ్‌మెంట్ థెరపీ' ఎవరో సూచించేది కాదు. ఎవరికి వారుగా అనుసరించేది. ఎలా కదలాలన్నదీ ఎవరూ చెప్పరు. కదిలే మార్గాలను ఎవరికి వారే అన్వేషించేలా మాత్రం ప్రోత్సహిస్తారు. నడక లేదా భంగిమను సరిదిద్దుతారు. శ్వాసపై నియంత్రణ కల్పిస్తారు. ఊహాశక్తిని, వ్యక్తీకరణను లయబద్ధం చేస్తారు. చికిత్సలో పాల్గొనే వారిలో కొంతమంది కూర్చుని నృత్యం చేస్తారు. మరికొందరు స్థిరంగా నిలబడతారు. కొందరు మరింత స్వేచ్ఛగా కదులుతారు. మొత్తానికి వాళ్లంతా రోగుల్లా కాకుండా, దేన్నో సృష్టిస్తున్నట్లుగా ఉంటారు.

క్లుప్తంగా...

ప్రభుత్వాసుపత్రిలో సేవలకు గడువు వద్దు

పీజీ వైద్యులకు హైకోర్టులో ఊరట

సాక్షి, హైదరాబాద్: మెడికల్ పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులకు హైకోర్టు ఊరట నిచ్చింది. ప్రభుత్వాసుపత్రిలో తప్పనిసరిగా సేవలందించాలన్న నిబంధన అమలుకు ఎలాంటి గడువు విధించవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పీజీ పూర్తి చేశాక రిజిస్ట్రేషన్‌కు ముందే సర్కార్ ఆస్పత్రిలో సేవలందించాలన్న తప్పని సరి నిబంధనను సవాల్ చేస్తూ పీజీ గ్రాడ్యుయేట్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2017లో ప్రభుత్వం జారీ చేసిన ఈ జీవోను కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వాసుపత్రిలో పనిచేయాలంటూ రూ.50 లక్షల బాండ్ తీసుకున్నారని, కోర్సు పూర్తయినా సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. గడువు విధించవద్దని చెబుతూ, కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేశారు.

ఈడీ దర్యాప్తును నిలిపివేయలేం: హైకోర్టు

భూదాన్ భూములపై కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: భూదాన్ భూములకు సంబంధించి పలువురిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసు నిలిపివేతకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. దర్యాప్తుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. భూదాన్ భూముల కేసులో ఈడీ కేసును కొట్టివేయాలని కోరుతూ మహమ్మద్ మునావర్‌ఖాన్, ఖాదర్ ఉన్నీసా హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా నమోదు చేసిన కేసును కొట్టివేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. కనీసం పిటిషన్‌లో తీర్పు వెలువడే వరకు దర్యాప్తుపై స్టే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రూ.వేల కోట్ల విలువైన భూముల ఆక్రమణ జరిగిందని, విచారణ పారదర్శకంగా సాగుతోందని ఈడీ తరఫు న్యాయవాది వాదించారు. ఈ దశలో దర్యాప్తులో జోక్యం చేసుకోవద్దని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశిస్తూ, విచారణ జూన్ 10కి వాయిదా వేశారు.

వక్ఫ్ చట్ట సవరణతో దేశంలో అనిశ్చితి: ఒవైసీ



సభలో మాట్లాడుతున్న అసదుద్దీన్ ఒవైసీ

రామగిరి (నల్లగొండ): వక్ఫ్ చట్టం సవరణతో దేశంలో అనిశ్చితి నెలకొంటుందని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో నల్లగొండలో బుధవారం రాత్రి జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు దేశం ప్రశాంతంగా ఉందని, కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు వల్ల మతాల మధ్య వైషమ్యాలు పెరుగుతాయన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని సూచించారు. ఈ నెల 25న బిల్లును వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మానవహారం నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. అదే విధంగా జూన్ 1న హైదరాబాద్‌లో పెద్దఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు ఖాలిద్ సైఫుల్లా రహమానీ పాల్గొన్నారు.

రాష్ట్రంలో మూడు రోజులు వానలు

తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

- నేటి ఉదయం అరేబియా సముద్రంలో అల్పపీడనం
- 36 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం
- రాష్ట్రానికి ఎల్లో అలర్ట్ జారీ



హైదరాబాద్‌లోని మూసారాంబాగ్ బ్రిడ్జిపై వర్షపు నీరు

సాక్షి, హైదరాబాద్: అండమాన్ దీవులతోపాటు బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లో చురుకుగా సాగుతున్న నైరుతి రుతుపవనాలు రానున్న మూడు, నాలుగు రోజుల్లో కేరళను తాకే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం కొనసాగుతున్న వేగంతో రుతుపవనాల కదలికలు మరికొన్ని రోజులు సాగితే వాటి వ్యాప్తి కూడా వేగంగా ఉంటుందని అంచనా వేసింది. ప్రస్తుతం తూర్పు–మధ్య అరేబియా సముద్రంలో ఉత్తర కర్ణాటక తీరానికి సమీపంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా బలపడుతోంది. గురువారం తెల్లవారుజామున్కల్లా అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. అది మరింత బలపడి తదుపరి 36 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు చెప్పింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఉత్తరాదిన కొన్ని జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు నమోదు కావొచ్చని చెప్పింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

తగ్గిన ఉష్ణోగ్రతలు

వాతావరణంలో నెలకొన్న మార్పులతో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గాయి. బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతల్ని పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో అత్యధికంగా 40.3 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో అత్యధికంగా 19 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. బుధవారం చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4–9 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. హనుమకొండ, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 9 డిగ్రీలు తక్కువగా నమోదు కాగా... హైదరాబాద్‌లో 6.6, ఖమ్మంలో 5.4 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం సాధారణం కంటే 2 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ చెప్పింది.

అప్రమత్తంగా ఉండండి

మార్కెట్లలో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోండి

వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధానితోపాటు పలు జిల్లాల్లో పడుతున్న వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మరో మూడు రోజులపాటు ఈ వర్షాలు కొనసాగే అవకాశముందన్న వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని, హైదరాబాద్‌లో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. జీహెచ్‌ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించిన సీఎం.. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును ఆదేశించారు.

రుతుపవనాలొస్తున్నాయి... జాగ్రత్త

వరద ప్రణాళికను విడుదల చేసిన విపత్తు నిర్వహణ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోకి ఈ నెలాఖరులోగా రుతుపవనాలు ప్రవేశిస్తాయన్న అంచనాల మేరకు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో తీసుకున్న చర్యలతోపాటు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వరద ప్రణాళికను రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ అందుబాటులో ఉంచింది. ఈ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ బుధవారం వరద ప్రణాళిక ఉత్తర్వులను జారీ చేశారు. వీటి ప్రకారం ఈసారి వర్షాకాలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడటంతోపాటు ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు 12 రాష్ట్ర విపత్తు సహాయక బృందాల (ఎస్‌డీఆర్‌ఎఫ్)ను అందుబాటులో ఉంచారు. ప్రతి బృందంలో తెలంగాణ స్పెషల్ పోలీస్ విభాగానికి చెందిన 100 మంది సుశిక్షితులైన సభ్యులుంటారు. ఈ బృందాలను ఆయా బెటాలియన్లు ఉన్న ప్రాంతాల్లో అందుబాటులో ఉంచుతారు. వీటితోపాటు మరో మూడు జాతీయ విపత్తు సహాయక బృందాలు (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలు అందుబాటులో ఉన్నాయి. అగ్నిమాపక కేంద్రాల్లో వరద విపత్తును ఎదుర్కొనేందుకు అవసరమైన సామగ్రిని కూడా అందుబాటులో ఉంచుతున్నారు.

నోటికాడి బువ్వ.. నీటిపాలు



నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్)లో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రాల్లో కాంటా వేయగా, మిల్లులకు తరలించింది 54.33 ఎల్‌ఎంటీ మాత్రమే. అంటే ఇంకా సుమారు 6 ఎల్‌ఎంటీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉంది. ములుగు, మహబూబాబాద్, ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలో అక్కడక్కడ కోతలు ఆలస్యమైన నేపథ్యంలో మరో 5 ఎల్‌ఎంటీకి పైగా ధాన్యం రైతుల కల్లాల్లోనో, పొలాల్లోనో ఉంది. మొత్తంగా మరో 10 ఎల్‌ఎంటీ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ, 17 శాతానికి తేమ తగ్గేవరకు ఆరబెట్టిన తరువాతే కొనుగోలు చేస్తామని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెప్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా, తేమ 20% ఉన్నా కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లేఖ రాసినట్లు సమాచారం.

నీటిపాలైన ధాన్యం

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొత్తపేట, కట్టంగూర్, ఐటిపాముల, శాలిగౌరారం, గుడివాడ, తుంగతుర్తి, మద్దిరాల, నాగారం, నూతనకల్ మండలాల్లో, భూదాన్ పోచంపల్లి, గూడూరు ప్యాక్స్ కేంద్రాల్లో ధాన్యం నీట మునిగింది. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పెద్దగట్టులో పిడుగుపాటుకు రెండు ఆవులు మృతిచెందాయి. జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొట్టుకుపోయింది. సూర్యాపేటలోని సీతారాంపురంలో పిడుగుపడి 10 గొర్రెలు, చివ్వెంల మండలం గంటోనిగూడెంలో 14 గొర్రెలు, కోదాడ మండలం నల్లబండగూడెంలో 38 మేకలు మృతిచెందాయి.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారం, ఆజంనగర్, రాంపూర్, కమలాపూర్, గొల్ల బుద్ధారం, పాంబాపూర్, భీమ్ ఘనపూర్ గ్రామాల్లో ధాన్యం తడిచింది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ఇంధనపల్లి గ్రామంలో ధాన్యం నీటిపాలైంది.
- మహబూబ్‌నగర్‌లో బుధవారం ఉదయం 7 గంటల నుంచి 9.30 గంటలకు వరకు, రాత్రి 7.30 గంటల నుంచి 9.30 గంటలకు వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. పలు కాలనీల్లో ఓపెన్ నాలాలు, డ్రెయినేజీలు పొంగిపొర్లటంతో. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దేవరకద్ర, మిడ్జిల్, వెల్దండ ప్రాంతాల్లో వర్షాలకు ధాన్యం తడిచిపోయింది.
- మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో కలిపి లక్ష మెట్రిక్ టన్నుల మేర నష్టం జరిగినట్లు సమాచారం.
- ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం మండలంలో బచ్చోడు కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిచిపోయింది. కరేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో రైతులు నష్టపోయారు.
- వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని మార్కెట్ యార్డులో భారీగా ధాన్యం తడిచిపోయింది.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో దహెగాంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిచింది. పెంచికల్‌పేట్, కౌటాల మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కొట్టుకుపోయాయి.
- నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద, లోకేశ్వరం, కుంటాల, భైంసా రూరల్, ఖానాపూర్, మామడ తదితర మండలాల్లో అకాల వర్షం రైతులను ఆగం చేసింది. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిచి ముద్దయింది.
- భారీ వర్షాలకు ములుగు జిల్లా ఎస్‌ఎస్ తాడ్వాయి మండలం మేడారం, ఎస్‌ఎస్ తాడ్వాయి మధ్య రోడ్డుపై చెట్టు అడ్డుగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యంతోపాటు ధాన్యం బస్తాలు తడిచిపోయాయి. వరంగల్ జిల్లా నర్సంపేట, ఇల్లంద వ్యవసాయ మార్కెట్లలో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది.
- నిజామాబాద్ జిల్లాలో 4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మోపాల్ మండలం చిన్నాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలింది. ముదక్‌పల్లి, నర్సింగ్‌పల్లిలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పెర్కిట్, ఆర్మూర్, ఆలూర్ మండలంలో ఆరబోసిన వరిధాన్యం, సజ్జ పంట తడిశాయి.

8 వేల హృదయాల స్పందన..

చిన్నారి చికిత్స కోసం రూ.14 కోట్ల క్రౌడ్ ఫండింగ్

సికింద్రాబాద్ రెయిన్‌బో ఆసుపత్రిలో కీలక జన్యు చికిత్స



చిన్నారితో వైద్యులు, కుటుంబ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్‌ఎంఏ) అనే వ్యాధితో బాధపడుతున్న 10 నెలల చిన్నారి చికిత్స కోసం 8 వేల మంది దాతలు స్పందించారు. ఈ పాప చికిత్సలో ఉపయోగించే 'జోల్జెన్స్మా'ఇంజెక్షన్ ఖరీదు రూ.14 కోట్లు కాగా...దాతల సాయంతో విజయవంతంగా చికిత్స పూర్తి చేశామని సికింద్రాబాద్ రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రి వైద్యుడు రమేశ్ కోనంకి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నగరానికి చెందిన వినీత్ చౌదరి దంపతులకు పది నెలల క్రితం చిన్నారి జన్మించింది. పుట్టిన తరువాత నాలుగు నెలలు గడిచినా కండరాల్లో సరైన కదలికలు లేకపోవడంతో వైద్యులను సంప్రదించారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం చిన్నారికి ఎస్‌ఎంఏ అనే వ్యాధి సోకిందని నిర్ధారించారు. సకాలంలో చికిత్స అందకపోతే రెండేళ్లకు మించి చిన్నారి బతకడం కష్టమని గుర్తించారు. ఈ చికిత్సకు ఉపయోగించే జోల్జెన్స్మా ఒక డోసు ఇంజెక్షన్ ఖరీదు రూ.14 కోట్లు ఉంటుందని చెప్పారు. దీనికోసం క్రౌడ్ ఫండింగ్‌ను అనుసరించగా.. సుమారు 8 వేల మంది సాయం చేశారని డాక్టర్ రమేశ్ తెలిపారు. దీంతో సికింద్రాబాద్ రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రిలో చిన్నారికి వారం రోజుల క్రితం విజయవంతంగా చికిత్స చేశామని, ఇప్పుడు పాప పూర్తిగా కోలుకుందని తెలిపారు. చిన్నారి తండ్రి వినీత్ చౌదరి మాట్లాడుతూ చికిత్సకు సాయం చేసిన ఎంతో మంది దాతలు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

దేశంలోనే తెలంగాణ పోలీసు మేటి

డీజీపీ జితేందర్.. 52 మంది పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు



సాక్షి, హైదరాబాద్: దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీసు శాఖగా అవతరించి, జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసు శాఖ ప్రశంసలు అందుకుంటోందని డీజీపీ డాక్టర్ జితేందర్ తెలిపారు. డీజీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో, నేర విచారణ, నేర గుర్తింపు, ఇతర సంబంధిత రంగాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన 52 మంది పోలీసు సిబ్బందికి డీజీపీ ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025 ప్రకారం తెలంగాణ పోలీసు శాఖ దేశంలో మొదటి స్థానం సాధించిందని వెల్లడించారు. సెల్‌ఫోన్ స్వాధీనంలో కూడా తమ శాఖ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది అసాధారణ పనితీరు.. శాఖ విజయానికి గణనీయంగా దోహదపడిందని, వారు ప్రశంసలు, ప్రోత్సాహానికి అర్హులని స్పష్టం చేశారు. సీఐడీ డీజీ శిఖా గోయల్ మాట్లాడుతూ.. 2024 సంవత్సరంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన 52 మంది అధికారులను పలు విభాగాల కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. పౌరుల అభిప్రాయ సేకరణ ద్వారా (క్యూఆర్ కోడ్ సహా) అత్యధిక రేటింగ్ పొందిన హైదరాబాద్, మెదక్, రామగుండం వంటి టాప్ 3 యూనిట్లు, టాప్ 10 పోలీస్ స్టేషన్‌లకు కూడా ఈ కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇంటలిజెన్స్ డీజీ బి.శివధర్ రెడ్డి, అడిషనల్ డీజీలు మహేష్ భగవత్, అనిల్ కుమార్, ఐజీలు ఎం.రమేశ్, చంద్రశేఖర్ రెడ్డి, రమేశ్ నాయుడు, శ్రీనివాస్, సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, సీఐడీ ఎస్పీ శ్రీనివాస్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

పాక్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని వెనకడుగు

▶ మొదటి పేజీ తరువాయి

ఆమె అంగీకరించలేదని రేవంత్‌రెడ్డి చెప్పారు. భారత దేశ భద్రతను కాపాడుకోవడంలో ఎవరి సూచనలు, మధ్యవర్తిత్వం అక్కర్లేదని స్పష్టంగా చెప్పారన్నారు. ట్రంప్ చెబితే కాల్పుల విరమణ చేసిన పరిస్థితి ఇప్పటి కేంద్ర ప్రభుత్వానిదని ఎద్దేవా చేశారు. కశ్మీర్ ఘటనలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు అందరం కేంద్రానికి, పోరాటం చేస్తున్న వీర జవానులకు అండగా నిలబడ్డామన్నారు. –చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. రాహుల్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలకు తావివ్వకుండా దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రతను కాపాడటంలో కృషిచేసిన మహాత్మాగాంధీ, ఇందిరా గాంధీ,, రాజీవ్ గాంధీ, బీఆర్ అంబేడ్కర్, పీవీ నరసింహారావు విగ్రహాలతో ఈ ప్రాంతం భారతీయులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చెప్పారు. దేశాభివృద్ధిలో రాజీవ్ గాంధీ పాత్ర మరువలేనిదని కొనియాడారు. ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు ఓటు హక్కు కల్పించారని, ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో 21వ శతాబ్దంవైపు దేశాన్ని నడిపించారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

కొత్తగూడ/గూడూరు: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, గూడూరు మండలాల్లో బుధవారం పిడుగుపాటుకు ఇద్దరు చనిపోయారు. కొత్తగూడ మండలం ఓటాయికి చెందిన ఏశబోయిన చేరాలు(50) గొర్రెలను మేపేందుకు గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లాడు. మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడటంతో గొర్రెలను తోలుకుని ఇంటికి వెళుతున్న క్రమంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే చనిపోయాడు. అదేవిధంగా గూడూరు మండలం గుండెంగకు చెందిన మైదం ప్రవీణ్‌కుమార్ అలియాస్ ప్రభు (30) రోజువారీ కూలి. మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లిన ప్రవీణ్, వర్షం వస్తుండడంతో రోడ్డు పక్కనే ఉన్న చెట్టు కింద నిలబడ్డాడు. అదే సమయంలో భారీ శబ్దంతో చెట్టుపై పిడుగుపడడంతో అక్కడికక్కడే చనిపోయాడు.

అందాల భామలకు అగ్నిపరీక్ష

▶ మొదటి పేజీ తరువాయి

మిస్ వరల్డ్ టాలెంట్ ఫైనల్, టాప్ మోడల్–ఫ్యాషన్ ఫైనల్, జ్యువెలరీ–పెర్ల్ ఫ్యాషన్ షోల్లో పాల్గొనవచ్చు. వీటిల్లో మెరుగ్గా రాణిస్తే తదుపరి రౌండ్లకు అర్హత సాధిస్తారు. అయితే, ఆ 24 మందితో పోలిస్తే వీరికి ఎక్కువ సవాళ్లు ఉంటాయి. మిస్ వరల్డ్ పోటీల్లో హెడ్ టు హెడ్ చాలెంజ్‌ను ఫాస్ట్–ట్రాక్ ఈవెంట్‌గా పరిగణిస్తారు. ఇందులో విజేతలు నేరుగా క్వార్టర్–ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు.

- **మిస్ వరల్డ్ టాలెంట్ ఫైనల్:** ఈ పోటీ మే 22న శిల్పకళా వేదికలో జరుగుతుంది. ఇందులో పాల్గొనే వారు సంగీతం, నృత్యం, కళలు ఇతర ప్రతిభలను ప్రదర్శిస్తారు.
- **టాప్ మోడల్–ఫ్యాషన్ ఫైనల్:** ఇది మే 24న హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉంటుంది.
- **జ్యువెలరీ–పెర్ల్ ఫ్యాషన్ షో:** మే 25న హైటెక్స్‌లో జరుగుతుంది, ఇందులో తెలంగాణలోని ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లు కూడా హాజరవుతారు.

ఈ అన్ని పోటీల్లో వడపోత కార్యక్రమం కొనసాగుతుంది. అమెరికా–కరేబియన్, ఆసియా–ఓషియానా, ఆఫ్రికా, యూరప్.. ఈ నాలుగు విభాగాల్లో తొలుత ఒక్కో ఖండం నుంచి 10 మంది ఎంపికవుతారు. తదుపరి రౌండ్‌లో ఆ సంఖ్య ఐదుకు పరిమితమవుతుంది. ఆ తర్వాత ఇద్దరు చొప్పున ఉంటారు. 31న జరిగే గ్రాండ్ ఫినాలేలో మొత్తం 8 మంది మిగులుతారు. వారిలో విజేత, రన్నరప్, రెండో రన్నరప్‌ను ఎంపిక చేస్తారు. విజేతకు మిస్‌వరల్డ్–2024 క్రిస్టీనా పిజ్కోవా రూ.6.21 కోట్ల విలువైన కిరీటాన్ని అలంకరింపజేస్తారు. ఈ గ్రాండ్ ఫినాలే 31న హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతుంది.

పాలమూరు–రంగారెడ్డి పిటిషన్ డిస్మిస్

నాగం జనార్దన్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

- ఆరోపణలు తప్పు, ఆధారాలు లేవని కేసు కొట్టివేత
- హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోలేమన్న జస్టిస్ నాగరత్న ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో ఆరోపణలు తప్పు ఎలాంటి సహేతుక ఆధారాలు లేవని జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ ప్రాజెక్టులో ఎలాంటి అవినీతి జరగలేదన్న సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) నివేదికను సమర్థిస్తూ నాగం పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ కేసులో 'తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనదే.. మేము దానిలో జోక్యం చేసుకోలేం'అంటూ సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది.

నేర దర్యాప్తునకు సాధ్యపడదు

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ నాగం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం విచారణ జరిపింది. విచారణ సందర్భంగా ప్రతివాదుల తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ, ఇదే అంశంపై పిటిషనర్ పలు పిల్‌లు దాఖలు చేయగా.. ఇప్పటికే కొట్టివేసినట్లు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ప్రాజెక్టు ప్రారంభమై కొంత భాగం పూర్తయిన తర్వాత ఈ రకమైన పిటిషన్లకు తావు ఉండదని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. సీవీసీ 2017లో ఇచ్చిన నివేదికలో ఈ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టంగా పేర్కొన్నట్లు వ్యాఖ్యానించింది. సీబీఐ దర్యాప్తునకు హైకోర్టు నిరాకరించడం సరైనదేనని జస్టిస్ నాగరత్న ధర్మాసనం పేర్కొంది. ప్రజాప్రయోజన వ్యాజ్యంలో ఇలా నేర దర్యాప్తునకు ఆదేశించడం సాధ్యపడదని స్పష్టం చేసింది.

ప్రతీ ప్రభుత్వ చర్యను కోర్టులు పర్యవేక్షించలేవు

పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ రేట్ల సవరణ అంశంలో అవకతవకలు ఉన్నందున సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. పాలమూరు ప్రాజెక్టులో పెద్దఎత్తున ఆర్థిక అవకతవకలు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.2,426 కోట్ల నష్టం జరిగిందన్నారు. పంపులు, మోటర్లు, సివిల్ వర్క్స్ కోసం 65:35 శాతం నుంచి 20:80 శాతానికి చెల్లింపులు ఎలా మారాయని ప్రశ్నించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రేట్ల సవరణలు రాష్ట్ర వాణిజ్య విచక్షణను ప్రతిబింబిస్తాయని, కోర్టులు ప్రతి ప్రభుత్వ చర్యను పర్యవేక్షించలేవని వ్యాఖ్యానించింది. ఇదే సమయంలో ముకుల్ రోహత్గీ స్పందిస్తూ ఈ వ్యవహారంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని సీవీసీ కూడా తేల్చిందని, బీహెచ్ఈఎల్ కూడా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, ఏదో ఒక పత్రాన్ని తీసుకొచ్చి కేసులు వేస్తున్నారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న ధర్మాసనం సీబీఐ దర్యాప్తు అభ్యర్థనను తిరస్కరించే హైకోర్టు విచక్షణాధికారాన్ని సమర్థించింది. హైకోర్టు నిర్ణయానికి తగిన కారణాలు ఉన్నందున ఈ పిటిషన్‌కు అర్హత లేదంటూ కొట్టివేసింది.

కేసీఆర్ నాయకత్వంతోనే అభివృద్ధి బాటలో రాష్ట్రం:హరీశ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఆర్థిక రంగంలో అసాధారణ విజయం సాధించిందని, ఈ విజయం వెనుక కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన నీటి పారుదల ప్రాజెక్టులు, వ్యవసాయ విధానాలు, బలమైన పారిశ్రామిక వృద్ధి ఉన్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 2015లో తలసరి జీఎస్‌వీఏ (పర్‌క్యాపిటా గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్)లో 9వ స్థానంలో ఉన్న తెలంగాణ, 2024 నాటికి దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఐసీఆర్ఏ 'స్టేట్ ఎకనామిక్ ట్రెండ్స్ మే 2025' నివేదిక వెల్లడించిందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తలసరి ఆదాయం రూ.1.25 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు రెట్టింపు కాగా, 6.8 శాతం సీఏజీఆర్‌తో ఈ పురోగతి సాధ్యమైందని వెల్లడించారు. కేసీఆర్ సమర్థవంతమైన పాలన, దీటైన ఆర్థిక వ్యూహాలతో తెలంగాణను దేశంలో అభివృద్ధికి చిహ్నంగా నిలిపినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణను దివాలా రాష్ట్రంగా చిత్రీకరిస్తూ వస్తున్నారని ఆరోపించారు.

విచారణకు భయపడను: ఈటల

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న కమిషన్ విచారణకు పూర్తిగా సహకరిస్తానని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నుంచి ఇంకా నోటీసులు అందలేదని అన్నారు. చట్టాలు, కోర్టులు, కమిషన్లపై నమ్మకం ఉందని వెల్లడించారు. విచారణకు భయపడేదిలేదని, తప్పు ఎవరు చేసినా శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో కొంతమంది చిల్లర ఆరోపణలు చేస్తున్నారని ఈటల ధ్వజమెత్తారు.

సీఎం రేవంత్‌రెడ్డిది పర్సంటేజీ పాలన

▶ మొదటి పేజీ తరువాయి

రిటైనింగ్ వాల్ కూలిపోతే ఇప్పటివరకు విచారణ లేదు. అందుకు కారణమైన సంస్థపై చర్యలు లేవు. కాంగ్రెస్ వచ్చాక వట్టెం పంపుహౌస్ మునిగింది. పెద్దవాగు రెండుసార్లు కొట్టుకుపోయినా చర్యలు లేవు. కాంగ్రెస్, బీజేపీ కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును విఫల ప్రాజెక్టుగా ప్రచారం చేస్తున్నా ప్రజలకు వాస్తవాలు తెలుసు. దేశంలో చట్టాల మీద, న్యాయ వ్యవస్థ మీద తమకు సంపూర్ణ నమ్మకం ఉంది. ఎన్ని నోటీసులు ఇచ్చినా న్యాయం, ధర్మమే గెలుస్తుంది. తెలంగాణకు మేలు చేసినవారిని ఆ దేవుడే కాపాడుతాడు. ఎన్ని నోటీసులు ఇచ్చినా హామీలు అమలు చేసేంతవరకు ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు'అని తేల్చి చెప్పారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇది తెలంగాణ సమాజానికి ఇచ్చిన నోటీసు

- రేవంత్ ఒత్తిడి మేరకే జస్టిస్ పీసీ ఘోష్ వైఖరి మార్చుకున్నాడు
- మూడు పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టు పనికిరాదన్నట్లు ప్రచారం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి విచారణ కమిషన్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడమంటే మొత్తం తెలంగాణ సమాజానికి ఇచ్చినట్లేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో మూడు పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టు పనికిరాదు అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి బుధవారం తెలంగాణ భవన్‌లో గంగుల కమలాకర్ మీడియాతో మాట్లాడారు. 2024 మార్చి 13న ఏర్పాటు చేసిన కాళేశ్వరం విచారణ కమిషన్‌కు వంద రోజుల గడువు విధించగా, అదే ఏడాది మే 31లోగా నివేదిక ఇస్తామని కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ చెప్పారన్నారు. విచారణ పూర్తయిందని చెప్పిన జస్టిస్ ఘోష్.. రేవంత్ ఒత్తిడి మేరకు వైఖరి మార్చుకుని కేసీఆర్, హరీశ్‌కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు.

గోదావరి జలాల తరలింపు కుట్ర

అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గ్రామాల్లోకి వెళ్లలేని పరిస్థితి ఉందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీని మరమ్మతు చేయకుండా గోదావరి జలాలను ఏపీకి తరలించే కుట్ర జరుగుతోందన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం, సుంకిశాల, వట్టెం పంప్‌హౌస్ తదితర ఘటనలపై ఎందుకు నోటీసులు ఇవ్వలేదని శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. రేవంత్ తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులను వేధించాలనుకుంటున్న రేవంత్ పప్పులు ఉడకవని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు.



వర్తమానంగా మార్చుకోలేని గతాన్ని గుర్తుంచుకోవడం ఎందుకు?
- సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 22 మే 2025

గూఢచర్యం జాడలివిగో!

గూఢచర్యానికి నిర్దిష్టమైన రూపురేఖలుండవు. దాన్ని సకాలంలో గుర్తించటం, కట్టడి చేయటం ఆషామాషీ కాదు. మన వేషభాషలతోనేవుంటూ, నిత్యం మనతో సన్నిహితంగా మెలగుతూ ప్రాణ ప్రదమైన మన రహస్యాలను బయటికి చేరేసేవారిని ఆనవాలు కట్టడం అంత సులభం కూడా కాదు. పహల్‌గామ్‌లో గత నెల 22న అమాయక పౌరులు 26 మందిని ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నాక మన త్రివిధ దళాలు పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు నిర్వహించి దాదాపు వందమందిని మట్టుబెట్టాయి. సింధూ నదీజలాల ఒప్పందంనుంచి వెనక్కి రాదల్చుకున్నట్టు ప్రకటించటంతోసహా అనేక అంశాల్లో పాకిస్తాన్‌కు ఇన్ని దశాబ్దాలుగా అందుతున్న ప్రయోజనాలను మన దేశం నిలుపుచేసింది. దానికి అనుబంధంగా దేశంలో అధికార, విపక్షాల మధ్య వాగ్యుద్ధాలు సాగటం, పహల్‌గామ్‌లో భద్రతాలోపాలపై ప్రశ్నించినవారినీ, జవాబుదారీ తనాన్ని కోరినవారినీ ఉగ్రవాద సమర్థకులుగా ముద్రేయటం మొదలైంది. ఇది అవాంఛనీయమైన పరిణామం. ఈ నేపథ్యంలో నిఘానేత్రాల కళ్లుగప్పి కీలకమైన సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరేస్తున్న 11 మందిని గుర్తించి అరెస్టు చేయటం కీలక మలుపు. అరెస్టయినవారిలో చాలామంది మధ్యతరగతి యువత. వారిలో జ్యోతి మల్హోత్రా అనే యువతి పాకిస్తాన్ గూఢచారి సంస్థలకు కీలకమైన సమాచారం అందించిందన్నది పోలీసుల అభియోగం. సామాజిక మాధ్యమాల సందడి పెరిగాక ఒక కొత్త తరం బయల్దేరింది. విచక్షణా జ్ఞానం లోపించటం, లోతైన సమాచారం లేకుండానే దేనిపైన అయినా అభిప్రాయాలు ఏర్పర్చుకోవటం, ఆధారాలున్నాయా లేదా అనేదాంతో నిమిత్తం లేకుండా సమాచారాన్ని వ్యాప్తిచేయటం, సామాజిక మాధ్యమాలపై మోజున్న యువతరానికి అలవాటుగా మారింది. సెల్‌ఫోన్‌తో దేన్నయినా చిత్రించటం, వెనకా ముందూ ఆలోచించకుండా అందరికీ చేరేయటం రివాజైంది. మనం కూడా ఏదో ఒకటి చేయాలన్న కుతూహలంతో మొదలై, అందరికన్నా ఎక్కువమంది వీక్షకుల్ని ఆకట్టుకోవటం లక్ష్యంగా మారటం, ప్రముఖ వ్యక్తిగా గుర్తింపు పొందటం, ప్రశంసలు, వాటి వెంబడే ఆదాయం మొదలవుతుంది. ఇక ఆ వ్యామోహం నుంచి వెనక్కిరావటం వాళ్లవల్ల కాదు.

తాము చేసే పని ఏ మంచికి హాని చేస్తుందో, ఏ చెడును ప్రోత్సహిస్తుందో గ్రహించేంత సామర్థ్యం లేకపోవటం సామాజిక మాధ్యమాల్లో పాపులర్ అయిన అత్యధిక యువతలో కనబడే ప్రాథమిక లక్షణం. ఇలాంటివారిని ఆకట్టుకుని, వీరితో సంబంధ బాంధవ్యాలు నెరపి దగ్గరకావటం పొరుగు దేశ గూఢచార సంస్థలకు సులభం. జ్యోతి మల్హోత్రా విషయంలో జరిగింది అదే. ఆమె తగిన పత్రాలను సమర్పించి ప్రభుత్వానికి తెలిసే విధంగానే పాకిస్తాన్ వెళ్లింది. అక్కడ వేర్వేరు వ్యక్తుల్ని కలిసింది. పాకిస్తాన్ జాతీయ దినోత్సవంలో పాల్గొన్నది. అక్కడున్నవారిని పరిచయం చేసింది. వారితో మాట్లాడించింది. విదేశాలకు పోవటం, అక్కడి ప్రాంతాలను సందర్శించటం, వారితో సంభాషించటం వగైరాలు సహజంగానే సాధారణ వీక్షకులకు ఎంతో ఆసక్తి అనిపిస్తాయి. జ్యోతి నిర్వహించే యూట్యూబ్ చానెల్‌కు దాదాపు 4 లక్షలమంది చందాదార్లుండటం, ఫేస్‌బుక్‌లో 3 లక్షలమందిపైగా ఆమె ఎప్పటికప్పుడు పెట్టే వీడియోలను వీక్షించటం, ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు లక్షన్నరమంది చూడటం ఇందువల్లే. తమ అరకొర పరిజ్ఞానంతో గంటల తరబడి దేనిపైన అయినా అనర్గళంగా మాట్లాడటం నచ్చటంవల్లే ఇన్నేసి లక్షలమంది వారిని అనుసరిస్తుంటారు.

శత్రు దేశాల మధ్య యుద్ధాలు సరిహద్దుల్లోనే జరగవు. అవి కేవలం సైనికుల మధ్యే సాగవు. అనేక రూపాల్లో నిరంతరం కొనసాగుతుంటాయి. కనీసం జ్యోతి ప్రభుత్వానికి తెలిసేవిధంగా పాకిస్తాన్ వెళ్లింది. కానీ చడీచప్పుడూ లేకుండానే శత్రుదేశానికి అత్యంత కీలకమైన సమాచారాన్ని చేరేసేవారుంటారు. పాకిస్తాన్ హైకమిషన్‌లో ఇటీవల వరకూ పనిచేసి బహిష్కరణకు గురైన డానిష్ అనే ఉద్యోగి అడిగిన సమాచారమంతా ఆమె అందించిందని నిఘా వర్గాలంటున్నాయి. ఆ పని చేయటం పర్యవసానంగా తోటి పౌరులే ప్రమాదాల్లో చిక్కుకుంటారని, అది దేశద్రోహమని వారికి అనిపించదు. డబ్బుకు ఆశపడటం ఒక్కటే ఇలాంటి కార్యకలాపాలకు కారణం అనుకోవటానికి లేదు. వేరే దేశానికి చెందినవారు వీడియోలను చూడటం, పొగడ్తలు గుప్పించటం, తమ ప్రాంతాలకొచ్చి అక్కడి విశేషాలను కూడా చూపాలని అడగటం వగైరాలు వారిని ఆకర్షిస్తాయి. తమ ఘనత అంతర్జాతీయ స్థాయికి చేరుకుందన్న భ్రమ వారిని నిలకడగా ఆలోచించనీయదు.

గూఢచర్యం కేవలం అవతలి దేశాన్ని నష్టపరచటానికో, చికాకుపరచటానికో పరిమితం కాదు. వారి ఆయుధాగారాల్లో వచ్చి చేరుతున్న రక్షణ సామగ్రి సామర్థ్యం ఏమిటో, ఎక్కడెక్కడ వారి సైనిక స్థావరాలు పనిచేస్తున్నాయో తెలుసుకోవటంతోపాటు పారిశ్రామిక, ఆర్థిక, పరిశోధనారంగాల్లో ఆ దేశం ఏం చేస్తున్నదో సమాచారాన్ని సేకరిస్తుండటం గూఢచారుల పని. పహల్‌గామ్‌లో ఉగ్రదాడి తర్వాత ఎక్కడ మన వైఫల్యం వున్నదో, అందుకు కారణమేమిటో తెలుసుకునే పనిలో ప్రభుత్వం తలమునకలై వుండగా దేశభక్తి పేరిట కొందరు మత విద్వేషాలను రెచ్చగొట్ట జూశారు. ఇప్పుడు పట్టుబడినవారి నేపథ్యం గమనిస్తే ఫలానా మతంవారే దేశద్రోహానికి పాల్పడతారన్నది ఎంత బూటకమో తెలుస్తుంది. శత్రువు కీలకమైన సమాచారాన్ని ఒడుపుగా తస్కరించగలుగుతున్నాడంటే నిస్సందేహంగా అది మన వైఫల్యం. దాన్ని కప్పిపుచ్చి అసత్యాలు ప్రచారం చేయటానికి బదులు, లోపాలను సరిదిద్దుకుని పటిష్టమైన వ్యవస్థలు రూపొందించటం వర్తమాన అవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
వైశాఖ మాసం, **తిథి:** బ.దశమి రా.8.47 వరకు, తదుపరి ఏకాదశి,
నక్షత్రం: పూర్వాభాద్ర ప.1.49 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర.
వర్జ్యం: రా.10.54 నుండి 12.25 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.48 నుండి 10.39 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.46 వరకు,
అమృత ఘడియలు: ఉ.6.10 నుండి 7.41 వరకు, హనుమజ్జయంతి.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.22
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ఆ వాఙ్మూలం ముమ్మాటికీ చెల్లదు!

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

ఆంధ్రప్రదేశ్ మద్యం విధానం కేసులో కె. ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేసే సమయంలో సహనిందితుల నేరాంగీకార వాఙ్మూలానికి సంబంధించి హైకోర్టు అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. కేవలం సహనిందితుడి నేరాంగీకారం ఆధారంగా ఒక వ్యక్తి బెయిల్‌పై నిర్ణయం తీసుకోరాదని వ్యాఖ్యానించింది. సీఆర్‌పీసీ 161 సెక్షన్ కింద ఇచ్చిన వాఙ్మూలాన్ని మరొకరికి వ్యతిరేకంగా ఉపయోగించరాదన్నది ప్రాథమిక సూత్రమని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. 'భారతీయ సాక్ష్యాల చట్టం–1872' సెక్షన్ 30 కింద తుది విచారణ సందర్భంగా ఏ వాఙ్మూలాలను అయితే పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందో, వాటిని ముందస్తు బెయిల్, బెయిల్ మంజూరు సమయంలో కూడా పరిగణనలోకి తీసుకోవచ్చని హైకోర్టు చెప్పడాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించింది.

ఆంధ్రప్రదేశ్ మద్యం కేసులో పిటిషనర్లకు హైకోర్టు ముందస్తు బెయిల్ ఎందుకు నిరాకరించింది అనేది ముఖ్యమైన ప్రశ్న. రిజిస్టర్ చేసిన కేసులో ఆరోపణలు తీవ్రమైనవి. ఐపీసీ సెక్షన్ 409, 420, 12బి, రెడ్ విత్ సెక్షన్ 34, 37 కింద ఈ కేసు నమోదయ్యింది. అయితే, ముందస్తు బెయిల్‌ను కొట్టివేసే సమయంలో సహనిందితుని వాఙ్మూలానికి సంబంధించి ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, సెక్షన్ 30కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అభిప్రాయాలను సుప్రీంకోర్టు తప్పుబట్టింది. సహనిందితుడి పోలీసు భయం ఆధారంగా నేరాంగీకార ప్రకటన నిలబడదనీ, కనుక అలాంటి అరెస్టు చెల్లదనీ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

చెప్పారా, చెప్పించారా?

నేరాలు చేసినప్పుడు సాక్ష్యాలు దొరకవు. పరిశోధనలో, దర్యాప్తులో కొన్ని సాక్ష్యాలు దొరుకుతాయి. పోలీసులు న్యాయంగా సాక్ష్యాలు సేకరిస్తే, అందులో లంచగొండితనం లేకపోతే నిజాలు రుజువయ్యే అవకాశం ఉంటుంది. కానీ మన లోకంలో, లౌక్యంలో ఏం చెప్పగలం? అందరికీ తెలుసు, పోలీసులు నాలుగు తగిలిస్తే తప్ప నిజాలను కక్కడం సాధ్యం కాదు అంటారు. చాలా వరకు నిజం. కానీ తన్నినప్పుడు చెబుతున్నారా, లేక తంతున్నప్పుడు దెబ్బలు భరించలేక నేరాన్ని ఒప్పుకొంటున్నారా? ఈ రెండిటికీ చాలా తేడా ఉంటుంది. 'దెబ్బలు నా వల్ల కాదు' అనుకున్నపుడు, దానికన్నా నేరం ఒప్పుకొంటే కోర్టుకు పోయేదాకా బతికిపోవచ్చు అనుకుంటారు. కనుకనే పోలీసుల హింసలో చెప్పిన అంశాలను కోర్టులో చూపినప్పుడు, ఆ నిందితుడు ఇదంతా హింసించడం వల్ల రాసిందే గానీ నిజం కాదని చెప్పినప్పుడే తగాదా మొదలవుతుంది. అక్కడే లాయర్లు వస్తారు. నేరం రుజువు కాదు. నేరాంగీకారం రుజువు కాదు.

సహ నింద భరించే గతి!

నేర విచారణలో ఒక నిందితుడు, మరొక వ్యక్తి కూడా ఆ నేరంలో పాలు పంచుకున్నాడని వాఙ్మూలం ఇస్తే, సంబంధిత రెండవ వ్యక్తి సహ నిందితుడు అవుతాడు. పోలీసులు చెప్పించుకున్న నేరాంగీకారం వాడుకుని మొదటి వాడినీ, తరువాత రెండో వాడినీ కూడా జైలుకు పంపిస్తారు. అప్పుడు బెయిల్ కోసం పోరాటం ప్రారంభమవుతుంది. అది లాయర్ల భారీ ఫీజు ఆధారంగా, కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టుదాకా న్యాయ పోరాటం సాగుతూ ఉంటుంది. అందుకే తీర్పులు ఆలస్యమవుతాయి. వాయిదాలు వస్తాయి. అప్పీల్సు ఉంటాయి. మధ్యలో తాత్కాలిక ఆర్డర్స్ వస్తాయి. (అంటే అంతిమ నిర్ణయం వంటిది కాకుండా వచ్చే తాత్కాలిక ఉత్తర్వు ఇస్తారు. అక్కడ ఉన్నపుడే, తరువాతి స్థాయి, అంటే సెషన్స్ కోర్టు, హైకోర్టు, సుప్రీం కోర్టులలో అన్యాయంగా జైలుకు పోకుండా బెయిల్ హక్కుల్ని కాపాడుకుని విడుదల అవుతూ ఉంటారు. మన పత్రికా భాషలో 'నిందితుడికి సుప్రీం నుంచి ఊరట' అని అంటూ ఉంటాం.)



సీఆర్‌పీసీ సెక్షన్ 161 కింద (ఇది పాత కేసు. పాత నేరం కావడం వల్ల కొత్త ఎన్‌డీఏ సర్కారు రచించిన భారతీయ న్యాయ చట్టాలను ఈ సందర్భంలో ఉటంకించడం లేదు. కూడదు. లేకపోతే అయోమయంలో పడిపోతాం) అనుమానితుడి వాఙ్మూలానికి విలువ ఉన్నప్పటికీ, పోలీసులకు చెప్పిన నేరాంగీకారాన్ని వాడుకుంటూ సహ నిందితుడిని అరెస్టు చేయడం న్యాయమా? నేరారోపణ అనే గుడ్డ కాల్చి మొఖాన పారేసినప్పుడు జైల్లో పడేస్తారు. అందులో నిజానిజాలు తేలకుండానే ఉన్నప్పుడు ఏం చేయాలి? బెయిల్ ఇవ్వాల్సిందే! రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని చెప్పగలిగితే, ఆ యా అంశాలను కోర్టు విశ్వసిస్తే, పోలీసులను నమ్మని దశలో బెయిల్ దొరుకుతుంది. అంటే పోలీసులు సాధించిన నేరాంగీకారాల ఆధారంగా నిందితులు, అనుమానితులు అనే పేరుతో అమాయకులను జైలుకు పంపిస్తే, కోర్టే దిక్కు. న్యాయమూర్తులు, జిల్లా స్థాయి న్యాయాధికారులు... మంత్రుల వంటి పెద్దల వీవీఐపీ కేసులని భయపడకుండా ఉత్తర్వులు ఇస్తేనే బెయిల్ దొరుకుతుంది. న్యాయం లభిస్తుంది. ఊరట లభిస్తుంది. ఇది అటువంటి కేసు! వారి ఆరోపణలు నిజమో కాదో ఇప్పుడే చెప్పలేము. కానీ మొదటి దశలోనే పోలీసుల భయం ఆధారంగా వచ్చిన నేరాంగీకారాలు తీసుకుని అరెస్టు చేయకూడదు.

మన 'కొత్త' నేర చట్టాలు

మన 'భారతీయ' సాక్ష్య చట్టం కొత్తది కాదు. ఇది ఆంగ్లేయులు రాసిపెట్టిన సాక్ష్యాల చట్టం... ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్. భారతీయ సాక్ష్యాల చట్టం 1872 నుంచి... అంటే 153 ఏళ్ల నుంచి అమలులో ఉన్న చట్టం. (మనం అంతా కొత్త చట్టాలు చేశామని ప్రగల్భాలు పలుకుతున్నాం. పాత సాక్ష్య చట్టపు నియమం కొత్త న్యాయ చట్టంలోనూ ఉంది.) పోలీసుల ముందు నేరాన్ని ఒప్పుకొంటే అనుమానం ఉంటుంది. కనుక ఆ వాఙ్మూలానికి ఆమోద యోగ్యత ఉండదు. ఇది సెక్షన్లు 24, 25, 30 కింద అనుమానితమైన ప్రకటన అని 153 సంవత్సరాల నాటి సూత్రం. దీనిపైన ఎన్నో వందల కేసులలో సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చింది. నేరాంగీకారాన్ని అనుమానిస్తారు. పోలీసుల సమక్షంలో, లాకప్‌లో, లేదా మరెక్కడైనా సరే కొందరు పోలీసులు ఎదురుగా ఉండినప్పుడు ఈ అనుమానం బలవంతం అని అనుకుంటారు. చట్టం తెలియకపోయినా, సాధారణంగా మామూలు మనుషులకు కూడా ఈ విషయం తెలుసు. భారత శిక్షాస్మృతి (ఐపీసీ), భారతీయ సాక్ష్య చట్టం, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ భారతదేశ న్యాయ వ్యవస్థలపైన, సమాజం పైన, న్యాయస్థానాల్లోనూ ఇప్పటికీ నిలబడిన చట్టాలు. 153 సంవత్సరాల నుంచి ఈ సూత్రాలు ఇప్పటికీ ఉపయోగిస్తున్నారు. ఎందుకంటే ఇవి మౌలికమైన సూత్రాలు. ప్రపంచంలోని అనేక దేశాల్లో కూడా అమలు చేయవలసిన సూత్రాలు. బ్రిటిష్ వారి సూత్రాలు కాబట్టి పనికిరావని అనుకోవడానికి వీల్లేని నియమాలు ఇవి. ఆ సూత్రాలను కాపాడుకుంటూ కొన్ని మార్పులు చేశారు. అయితే, ఈ చట్టాలు మన న్యాయ వ్యవస్థకు పునాదిగా ఉన్నప్పటికీ, ఆధునిక భారతదేశ సంక్లిష్టతలను పరిష్కరించడానికి ఇబ్బంది పడ్డాయి. అందుకే 2020లో ప్రొఫెసర్ (డాక్టర్) రణబీర్ సింగ్ అధ్యక్షత వహించిన 'కమిటీ ఫర్ రిఫార్మ్స్ ఇన్ క్రిమినల్ లాస్' (సీఆర్‌సీఎల్) ఏర్పాటు చేశారు. ఆ కమిటీ రూపొందించిన కొత్త చట్టాల పేర్లు ఇవి: భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినియమం, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత.

బెదిరిస్తే, ప్రలోభ పెడితే...

నేరారోపణకు గురైన వ్యక్తి చేసిన అంగీకారం ఏదైనా ప్రేరేపణ లేదా బెదిరింపు లేదా లాభం చేస్తామనే వాగ్దానంతో జరిగినట్లు కనిపిస్తే, ఆ వ్యక్తి నేరాంగీకారం అసంబద్ధం. ఇది కీలకమైన సూత్రం. పోలీసు కస్టడీలో నేరాంగీకరణ విషయంలో ఇది కీలకమైన సుప్రీం కోర్టు తీర్పు. తాజాగా 2022లో కూడా ఇంద్రేశ్ కుమార్ కేసులో సీఆర్‌పీసీ సెక్షన్ 161 కింద ఇటువంటి నేరాంగీకారాన్ని ఒప్పుకోవడం కుదరదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది.

మద్యం కేసులో కృష్ణమోహన్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, 'వికాస్ సిమెంట్స్' డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప ముందస్తు బెయిల్‌కై హైకోర్టుకు వెళ్లారు. ఆపై సుప్రీంకు అప్పీలు చేశారు. 'నేర విచారణ ప్రక్రియలో ఓ నిందితుడి వాఙ్మూలాన్ని సహనిందితుడికి వ్యతిరేకంగా ఉపయోగించరాదన్నది ప్రాథమిక సూత్రం' అని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించడమే కాక, దీనిపై సంపూర్ణ వివరణ ఇచ్చింది. బెయిల్ మంజూరు సమయంలో కోర్టులు ఆ యా అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని నిర్దేశించింది. ముందస్తు బెయిల్, బెయిల్ మంజూరు సమయంలో సహనిందితుల వాఙ్మూలాలను పరిగణనలోకి తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా' ప్రొఫెసర్

సోషల్ మీడియా

మనకైనా చెప్పొద్దా?



ప్రపంచాన్ని విశ్వాసంలోకి తీసుకునే ముందు, భారతీయులను విశ్వాసంలోకి తీసుకోనక్కర్లేదా? ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటుచేసి, మే 7–10 వరకు జరిగిన సంఘటనల గురించి పూర్తి సమాచారాన్ని ఇవ్వద్దా? ప్రాథమికంగా ఎంపీలు ఉన్నదే అందుకు కదా! (ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో విదేశాలకు ప్రతినిధి బృంధాలను పంపుతున్న నేపథ్యంలో.)

- సుశాంత్ సింగ్, కాలమిస్ట్


సరైన పని



అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మూదాబాద్‌కు మధ్యంతర బెయిల్ లభించింది. ఆయన పోస్టులపై దర్యాప్తునకు సిట్‌ను ఏర్పాటు చేయాలని హరియాణా పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆయన ఫేస్‌బుక్ పోస్టుల పరిశీలనకు సిట్ వేశారంటే... నిజంగానే మన దగ్గర పనిలేని పోలీసులు చాలామంది ఉన్నారనుకోవాలి. భావస్వేచ్ఛ విషయంలో కార్యనిర్వాహక శాఖ అధికార దుర్వినియోగంపై మన కోర్టులు ఒక బలమైన సందేశాన్ని పంపి ఉండాల్సింది! అయినా, ఇలా తరచుగా కోల్పోతున్న స్వేచ్ఛకు ఎవరు మూల్యం చెల్లిస్తారు?

- రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

అదే శిక్ష



ప్రక్రియే శిక్షగా తయారవుతుంది... ప్రత్యేకించి కార్యనిర్వాహక శాఖ దాన్ని న్యాయంగా కాక తెలివిగా వాడుకున్నప్పుడు!

- సుహాస్ పల్శీకర్, ప్రొఫెసర్

కెనడా వైఖరి



అర్జెంటుగా జరగాల్సినవి: ఇజ్రాయెలీ బందీలను హమాస్ విడుదల చేయాలి. కాల్పుల విరమణ జరగాలి. పౌరులకు ప్రాణాన్ని నిలబెట్టే మానవతా సాయం అందాలి. రెండు దేశాలుగా ఏర్పడడమే పరిష్కారం. హమాస్ ఆయుధాలను వదిలిపెట్టి, గాజాలో ఏ పాత్రా పోషించకూడదు.

- అనితా ఆనంద్, కెనడా విదేశాంగ మంత్రి

భాష కన్నా...



ఒక ఎస్బీఐ మేనేజర్ కన్నడం మాట్లాడటానికి తిరస్కరించిన వార్తను చూశాను. దానికి బదులుగా ఆమె మర్యాదగా– 'సారీ... నాకు కన్నడం బాగా రాదు, మా సహోద్యోగి మీకు సాయపడతారు' అని చెబితే పోయేది. మ్యాటర్ క్లోజ్. కానీ ఆమె అహంకారంతో ప్రవర్తించింది. అది అంగీకరించలేనిది. మన వైఖరే అన్నింటి కంటే ముఖ్యం. ఇక (హిందీ, కన్నడం) అదంతా వేరే చర్చ.

- కిరణ్ కుమార్ ఎస్., కన్నడ వ్యాఖ్యాత

మనమెక్కడ?



కార్లు, గాడ్జెట్స్, విమానాలు, కృత్రిమ మేధ – ఇలా అన్ని సాంకేతిక, సాంకేతికేతర ఉత్పత్తుల్లో యూఎస్‌తో చైనా పోటీ పడుతోంది. తరచుగా అధిగమిస్తోంది కూడా! కానీ మనమేమో పెద్ద టెక్ బ్రాండ్లను ఇక్కడి చౌక కార్మిక శక్తితో ఉత్పత్తి చేయమని ఆహ్వానించడానికే సంతోషపడుతున్నాం. ఆ ఉత్పత్తినే మనం 'ఎగుమతి'గా చెప్పుకొంటున్నాం.

- మనోజ్ అరోరా, ఫైనాన్సియల్ ప్లానర్

ఇన్ బాక్స్

ప్రజా శాస్త్రవేత్త

ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త జయంత్ విష్ణు నార్లీకర్ గొప్ప ఖగోళ శాస్త్రవేత్తే కాక... అలుపెరుగని సైన్స్ ప్రచారకర్త కూడా! ఇది అరుదైన విషయం. 86 ఏళ్ల వయసులో మే 20న ఆయన మృతి చెందడంతో దేశం ఒక అద్భుతమైన ప్రజా శాస్త్రవేత్తను కోల్పోయింది. ఖగోళ శాస్త్ర రంగంలో ప్రపంచ స్థాయి పరిశోధనలు చేశారు. దేశంలో ఖగోళ శాస్త్ర పరిశోధన, అధ్యయనాలకు సంబంధించి 'అయుకా' (ఐయూసీఏఏ– ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్) వంటి అగ్రగామి సంస్థలను స్థాపించారు. విశ్వం పుట్టుకకు సంబంధించిన విశేషాలను ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు చేరవేయడంలో ఆయన విశేషంగా కృషి చేశారు.



జయంత్ విష్ణు నార్లీకర్

నార్లీకర్ విద్యార్థి దశలోనే కేంబ్రిడ్జిలో చేసిన పరిశోధనలతో ప్రపంచస్థాయి గుర్తింపు పొందారు. అక్కడ తన పీహెచ్‌డీ గురువు హోలేతో కలిసి 'హోలే–నార్లీకర్ గ్రావిటీ సిద్ధాంతా'న్ని ప్రతిపాదించారు. విశ్వ ఆవిర్భావానికి సంబంధించి ప్రామాణికమైన బిగ్ బ్యాంగ్ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయంగా ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలకు గాను ప్రపంచస్థాయి గౌరవం లభించింది. అందుకనే 26 సంవత్సరాల చిన్న వయసులోనే ఆయన 'పద్మభూషణ్' పురస్కారం పొందారు. ప్రయోగాలు, పరిశోధనలు, తరగతి గది ఉపన్యాసాలకు మాత్రమే పరిమితం కాకుండా నిరంతరం ప్రజలతో మమేకం కావడం ఆయన జీవిత కార్యాచరణలో ఒక అరుదైన లక్షణం.

సంక్లిష్టమైన సైన్సు విషయాలను ప్రజలకు సులువుగా వివరించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. దీనికోసం ఆయన తరచుగా పత్రికలు, టీవీ మాధ్యమాలలో నేరుగా ప్రసంగాలు, రచనలు చేసేవారు. అలాగే, పిల్లల కోసం అనేక సైన్స్ ఫిక్షన్ పుస్తకాలను, వ్యాసాలను విరివిగా రచించారు. మరాఠీ, హిందీ భాషలలో ఆయన చిన్న పుస్తకాలకు చాలా మంచి ఆదరణ ఉంది. మరాఠీ భాషలో ఆయన రాసిన ఆత్మకథకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం కూడా ఆయన గొప్పతనాన్ని తెలియజేస్తుంది. శాస్త్ర ప్రచారానికిగాను ప్రఖ్యాత 'యునెస్కో–కళింగ' పురస్కారాన్ని కూడా ఆయన పొందారు. 'పద్మ విభూషణ్', 'మహారాష్ట్ర భూషణ్' లాంటి అనేక పురస్కారాలు ఆయనకు దక్కాయి. డా॥ నరేంద్ర దాభోల్కర్‌తో కలిసి జ్యోతిష్యంలోని అశాస్త్రీయ విషయాల పట్ల అవగాహన కలిగించారు. మూఢనమ్మకాల బండారాన్ని బయటపెట్టారు. ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు, శాస్త్రీయ సమాజాన్ని నిర్మించడానికి నిరంతరం కృషి చేయటమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి.

– సంపతి రమేష్ మహారాజ్, జన విజ్ఞాన వేదిక

మనల్ని కాపాడే వైవిధ్యం!

సందర్భం



బలిజేపల్లి శరత్ బాబు

'ప్రకృతితో సామరస్యం, సుస్థిర అభివృద్ధి' అనే ఇతివృత్తంతో ఈ యేటి 'అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం' నేడు జరుపుకొంటున్నాం. మానవుని కార్యకలాపాల కారణంగానే ఈ భూమిపై జీవ వైవిధ్యం దెబ్బతింటోంది. గత దశాబ్దంలో, మనం గణనీయమైన జీవవైవిధ్య నష్టాన్ని చవిచూశాం. 467 జాతులు అంతరించిపోయాయి. ఈ నష్టం అస్థిరమైన వనరుల వినియోగం, కాలుష్యం, అన్యజీవుల ఆవాస ప్రాంతాల దురాక్రమణ వంటి వాటి వల్ల సంభవించిందే. గత దశాబ్దంలో వివిధ కారణాల వల్ల గణనీయమైన పంట జన్యు వైవిధ్యం కోల్పోయాం. జీవ వైవిధ్య నష్టానికి వాతావరణ మార్పు ఒక ముఖ్యమైన చోదకంగా లేదా ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మారుతున్న వర్షపాత పరిమాణాలు, అడవి మంటలు వంటి సంఘటనలు జీవ జాతుల ఆవాసాలను నాశనం చేస్తాయి.



పొంచి ఉన్న జీవవైవిధ్య సంక్షోభం జన్యు వనరులకు తీవ్రమైన ముప్పును కలిగిస్తుంది, ఇది జాతుల జన్యు వైవిధ్యంలో క్షీణతకు, వాటి విలుప్తానికి కూడా దారితీస్తుంది. ఆహార భద్రతను కాపాడుకోడానికి, కొత్త ఔషధాల అభివృద్ధికి, వాతావరణ మార్పులకు అనుగుణంగా జీవజాలంలో ఉన్న మారగలిగిన సామర్థ్యాన్ని కోల్పోకుండా ఉండేందుకు జన్యు వైవిధ్యం తప్పనిసరి.

జీవవైవిధ్య పరిరక్షణ లక్ష్యంగా జాతీయ, అంతర్జాతీయ 'చట్టపరమైన చట్రాలు' ఉన్నప్పటికీ, ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. దేశంలోని జీవ వైవిధ్య చట్టంలో చేసిన కొన్ని సవరణలు, జీవవైవిధ్య పరిరక్షణ స్ఫూర్తికి అనుగుణంగా లేవని చెప్పక తప్పదు. అలాగే చట్టాల బలహీనమైన అమలు, అవినీతి, రాజకీయ జోక్యం, అవగాహనా రాహిత్యం, ప్రజా మద్దతు కొరవడటం, జీవవైవిధ్యానికి అపార నష్ట హేతువులు.

జీవవైవిధ్యాన్ని కాపాడటానికి 'ఇన్–సీటూ' పరిరక్షణ అవసరం ఉంది. ఆ యా జీవ జాలాల సహజ ఆవాసాలలో ఉండే పరిస్థితుల రక్షణ ఒక కీలకమైన వ్యూహం కావాలి. జీవజాలాల ఆవాసాల పునరుద్ధరణ, నిర్వహణలలో ప్రజలకు అవగాహన కల్పించి వారిని ఆ ప్రక్రియలో భాగస్వాములను చేయాలి. జాతీయ ఉద్యానాలు, వన్యప్రాణుల అభయారణ్యాలు వంటి రక్షిత ప్రాంతాలను స్థాపించాలి. కేంద్ర ప్రభుత్వ రెండవ 'జీన్ బ్యాంక్' నిర్మాణానికి పూనుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. స్థానిక సమాజాల 'కమ్యూనిటీ విత్తన నిధుల'ను అనుసంధాన పరచడం జీవ వైవిధ్య పరిరక్షణలో అత్యంత కీలకమైన అంశం అవుతుంది. వ్యవసాయం, అడవులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటివాటి విషయంలో భూవినియోగ ప్రణాళికను జీవవైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించాలి. ఈ అన్ని చర్యలూ జీవవైవిధ్యాన్ని కాపాడి భూగోళాన్ని సజీవంగా ఉంచుతాయి.

వ్యాసకర్త జాతీయ జన్యు వనరుల బ్యూరో విశ్రాంత శాస్త్రవేత్త

(నేడు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం)

ఎవడు వివేకి?

వివేకి లోక విషయాల్లోని దోషాన్ని గ్రహిస్తాడు. అలౌకికాన్ని ఆరాధిస్తాడు. అవివేకి అజ్ఞానంతో లౌకిక విషయాసక్తుడై అలౌకిక సత్యాన్ని ఆలోచించలేడు. పైగా లౌకిక విషయ సుఖమే సత్యంగా భావించి దాన్ని అనుభవిస్తూండటం వివేకమనుకుంటాడు. అటువంటి వారు అతితెలివితో భ్రాంతచిత్తులయి తమాషాగా ప్రవర్తిస్తారు. అలాంటి కథ ఇది:

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మిక్కిలి తెలివి గల ఒక రాజు ఉన్నాడు. మనిషి మంచివాడే. కాకపోతే కొంచెం వక్రంగా ఆలోచిస్తాడు. అందుకే అందరికంటే వివేకహీనుడెవడో చూచి వాడికి సన్మానం చేయాలనుకుంటాడు. అటువంటివాడిని తీసుకురమ్మని సేవకులను రాజ్యం నలుమూలలకూ పంపాడు. అతి కష్టం మీద రాజసేవకులు ఏ పనీ చేయని, ఎవరితోనూ మాట్లాడని, చింపిరి గుడ్డలు కట్టుకొని ఆకులు అలములు తింటూ తిరుగాడేవాడిని తీసుకొస్తారు. రాజు కూడా అవివేకి ఇతడే అని సంతోషించి సన్మానంలో ఒక వజ్రాలు పొదిగిన ఉంగరాన్ని అతనికి బహూకరించాడు. కొంతకాలం గడిచిన తర్వాత ఆ రాజుకు తీవ్రమైన రోగం వచ్చింది. ఎవరూ వైద్యం చేయలేమని చేతులెత్తేసిన సమయంలో అవివేకిగా సన్మానితుడైన మనిషి వచ్చి రాజు రోగాన్ని నయం చేస్తానన్నాడు. అయితే వైద్యం ప్రారంభించే ముందు... 'ఓ రాజా! మీరింతవరకూ సుఖాలెన్నో అనుభవిస్తూ వచ్చారు. మరి మీరు చనిపోతే మీ శరీరం ఈ సుఖభోగాల ననుభవించలేదు కదా! అందువల్ల మరణించే ముందైనా, ఇప్పటినుంచే ఆ భోగాలన్నింటినీ వదిలిపెట్టి ఉండగలరా చెప్పండి?' అన్నాడు. 'ఇంతవరకు అలవాటు పడిన ఈ భోగాలను వదలి ఉండలేను' అని సమాధానం చెప్పాడు రాజు. 'రాజా! నేను ఆకులలములు తింటూ ఏవో గుడ్డ పీలికలు కట్టుకొని, కటిక నేలపై పడుకొంటూ ఇప్పటికీ సుఖంగానే ఉన్నాను. మరి నాకు కష్టం, సుఖం వేరుగా కనబడలేదు. నాకెంతో తృప్తిగా ఉంది. కానీ మీరు, ప్రాణాంతకమైన రోగం వచ్చినా రక్షించలేని ఈ సుఖాలను, కొంతకాలమైనా వదిలి పెట్టలేకపోతున్నారు. అన్నీ ఉన్నా మీకు తృప్తిలేదు. విషయ సుఖలాలసత ఇంకా కోరుతున్న మీరు, సిసలైన అవివేకులు. కనుక మీరు నాకిచ్చిన వజ్రపుటుంగరం తిరిగి మీకే ఇస్తున్నాను తీసుకోండి' అని ఉంగరం ఇస్తూ తన యోగదృష్టి పాతంతోనే రాజుకు పరిపూర్ణమైన ఆరోగ్య భాగ్యాన్ని ప్రసాదించాడాయన.

ఆయన ఎవరో కాదు. సర్వసిద్ధులూ కలిగిన 'అవధూత'. **'విరతి రాత్మరతి శ్చేతి వివేకస్య పరమం లక్షణమ్'**. విషయసుఖాలపై వైరాగ్యముండటం, సర్వదా ఆత్మానుసంధానంతో ఉండటమూ వివేకానికి లక్షణమని అర్థం. అవధూత స్థితి ఇలాంటిది. కనుక గురూపదేశంతో ప్రతి ఒక్కరూ సుఖదుఃఖ సమభావన సాధించాలి.

అయోమయం... గందరగోళం

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు టెండర్లలో నిబంధనలు గాలికి..

- నాణ్యత ప్రమాణాల డిజైన్ ఊసులేదు.. కాలపరిమితీ లేదు..
- బిడ్ తెరవాల్సిన తేదీ ముగిసి వారమైనా ఖరారుకాని కాంట్రాక్టర్లు
- గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో 398 ప్లాంట్ల ఏర్పాటుకు టెండర్లు



సాక్షి, హైదరాబాద్: గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో ఆర్వో (రివర్స్ ఆస్మోసిస్) వాటర్ ప్లాంట్ల ఏర్పాటు టెండరు ప్రక్రియపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెండరు నిబంధనల రూపకల్పన, దరఖాస్తుదారుల ఆర్థిక అంశాల ఎంపిక తికమకగా ఉన్నాయి. టెండర్‌లో పాల్గొనే వారు తయారీదారులై ఉండాలా? లేక పంపిణీ దారుడైతే సరిపోతుందా? అనే అంశంపై స్పష్టత లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ గిరిజన గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని గురుకుల పాఠశాలల్లో 398 ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు ఈనెల 7న గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం టెండర్లు పిలిచింది. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికల్లా కాంట్రాక్టర్లను ఖరారు చేసి ఆర్వో ప్లాంట్లను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేలా గిరిజన సంక్షేమ శాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. టెండరు ప్రక్రియలో లోపాలున్నాయని, ప్రభుత్వం దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేస్తున్నారు.

టెండరు ప్రక్రియ ఇలా...

రాష్ట్రంలో మూడు ఏజెన్సీ ప్రాంతాలున్నాయి. ఉట్నూరు, ఏటూరు నాగరం, భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఉన్న విద్యాసంస్థల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు మూడు టెండర్లు పిలిచారు. అదేవిధంగా మన్ననూరు ప్రాజెక్టుకుతోపాటు హైదరాబాద్ కేంద్రంగా నిర్దేశించిన విద్యాసంస్థల కోసం మరో టెండరు పిలిచారు. మొత్తం నాలుగు టెండర్ల ద్వారా 398 ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. ఇందులో 244 ప్లాంట్లు 500 లీటర్/అవర్, మిగతా 154 ప్లాంట్లు వెయ్యి లీటర్/అవర్ సామర్థ్యం గలవి. వీటికి రూ.25 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఈనెల 7 నుంచి 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు టెండర్లకు గడువు విధించారు. ఈనెల 16న సాయంత్రం 5 గంటలకు బిడ్లు తెరిచి కాంట్రాక్టరును ఖరారు చేసేలా షెడ్యూల్‌లో ప్రకటించారు. అయితే బిడ్ తెరవాల్సిన తేదీ ముగిసి వారమైనా కాంట్రాక్టరును ఖరారు చేయకపోవడం గమనార్హం.

నిబంధనలపై అభ్యంతరాలివీ..

- టెండరు ప్రక్రియలో దరఖాస్తు గడువు కీలకం. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం టెండరు ప్రక్రియలో మూడు వారాలపాటు అవకాశం కల్పించాలి. అత్యవసర సందర్భంలో గడువు పది రోజులు ఇవ్వొచ్చు. కానీ ఇక్కడ వారం మాత్రమే ఇచ్చారు.
- టెండర్లలో పాల్గొనే వాళ్లు ప్లాంటు తయారీదారులై ఉండాలా? లేక నమోదైన పంపిణీదారుడై ఉండాలా? లేక చిన్నపాటి సరఫరాదారుడై ఉన్నా సరిపోతుందా? అనేదానిపై స్పష్టత లేదు.
- ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు సంబంధించి నాణ్యత ప్రమాణాలతోపాటు టెక్నికల్ డ్రాయింగ్, డిజైన్ తప్పనిసరిగా ప్రకటించాలి. కానీ అలాంటిది లేదు.

ప్రాంతాల వారీగా ఆర్వో వాటర్ ప్లాంట్ల సంఖ్య

ప్రాంతం	500 లీటర్/అవర్	1000 లీటర్/అవర్
ఉట్నూరు	43	38
ఏటూరునాగారం	42	13
భద్రాచలం	5	18
మన్ననూరు–హైదరాబాద్	154	85
మొత్తం	244	154

- సాధారణంగా మిషనరీ, ఇతర పరికరాల కొనుగోలు విషయంలో తప్పనిసరిగా ఆర్థిక నిబంధనలు ప్రస్తావించాలి. టెండరు నిబంధనల్లో సాల్వెన్సీ సర్టిఫికెట్ అంశం లేకపోవడం గమనార్హం.
- ప్లాంటు ఏర్పాటుకు సంబంధించిన కాలపరిమితి, వారంటీ వివరాలపై స్పష్టత లేదు.
- బిడ్డర్‌కు వార్షిక టర్నోవర్ రూ.10 కోట్లు లేదా సగటున రూ.7 కోట్లు ఉంటే సరిపోతుందని పేర్కొన్నారు. కానీ కాంట్రాక్టు పరిమితి రూ.13.99 కోట్ల విలువ ఉండటంతో నిర్దేశించిన టర్నోవర్‌తో ఎలా సాధ్యమవుతుందనే సందేహం వ్యక్తమవుతోంది. ప్రాజెక్టు విలువకు కనీసం ఆరు రెట్లు అధికంగా టర్నోవర్ ఉండాలని నిబంధనలున్నాయి.

రాత్రికి రాత్రే కట్టేశారు..

- నిలోఫర్ ఆసుపత్రి ఆవరణలో ప్రైవేటు మందుల షాపు నిర్మాణం
- కోట్ల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు
- సీఎంఓ, మంత్రి ఆదేశాల మేరకేనన్న సూపరింటెండెంట్ డాక్టర్ రవి కుమార్



ప్రైవేటు మందుల దుకాణం కోసం రాత్రికి రాత్రే నిర్మించిన కట్టడం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని చిన్నపిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన నిలోఫర్ ఆసుపత్రికి రోజూ వందలాది మంది చిన్నారులు వైద్యం కోసం వస్తుంటారు. వారికి అవసరమైన మందులను ప్రభుత్వమే అందించాల్సి ఉంటుంది. అయితే ఖరీదైన మందులను అందించలేని పరిస్థితుల్లో ప్రిస్క్రిప్షన్ ద్వారా ప్రైవేటు మందుల దుకాణాల్లో కొనుగోలుకు సిఫారసు చేస్తారు. గతంలో ఆసుపత్రి పక్కన ప్రైవేటు వ్యక్తులకు చెందిన ఓ బడా మందుల దుకాణం కొనసాగితే.. కోర్టు తీర్పుతో అప్పటి సూపరింటెండెంట్ దాన్ని తొలగించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఉచితంగా మందులు ఇస్తుంటే, ప్రైవేటు దుకాణాలు ఆసుపత్రి ఆవరణలో ఉండకూడదని సాక్షాత్తు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టంచేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల ఆవరణల్లో ఉన్న ప్రైవేటు మెడికల్ షాపులను తొలగించాలని ఆదేశించారు. కానీ ఉన్నట్టుండి నిలోఫర్ ఆసుపత్రి ఆవరణలో పిల్లలు ఆడుకొనే పార్కు స్థలాన్ని తవ్వి రాత్రికిరాత్రే ప్రైవేటు మందుల దుకాణం కోసం ఏకంగా శాశ్వత కాంక్రీట్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. గతంలో తొలగించిన ఏజెన్సీకే మందుల దుకాణం నిర్మించి ఇవ్వడం విస్మయానికి గురిచేస్తోంది. దీని వెనుక కోట్ల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి.

కలెక్టర్ ఆదేశాలిచ్చారన్న సూపరింటెండెంట్

దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి కుమార్‌ను 'సాక్షి'సంప్రదించగా... ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే ఈ దుకాణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం కార్యాలయంతోపాటు మంత్రి కూడా చెప్పారని, కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడంతోనే దీన్ని నిర్మిస్తున్నామన్నారు. స్థానిక నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్‌హుస్సేన్ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిర్మాణాన్ని తొలగించాలని కోరారు.

పెళ్లింట విషాదం

- కుమారుడి పెళ్లి జరుగుతుండగా విద్యుదాఘాతంతో తండ్రి మృతి



వెంకటి

చిలుకూరు: కుమారుడి పెళ్లి జరుగుతుండగా విద్యుదాఘాతానికి గురై తండ్రి మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో బుధవారం ఈ ఘటన జరిగింది. బేతవోలుకు చెందిన మాజీ వార్డు సభ్యుడు రెమిడాల వెంకటి(54)కి ముగ్గురు కుమారులు. మొదటి కుమారుడు, మూడో కుమారుడి పెళ్లిళ్లు ఇదివరకే జరిగాయి. బుధవారం రెండో కుమారుడి వివాహం వారి ఇంటి వద్ద జరుగుతుండగా వర్షం కురిసింది. దీంతో బంధువులు అందరూ ఇంట్లోకి వస్తుండటంతో వెంకటి ఇంట్లోని దండెంపై ఉన్న దుస్తులు తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో ఒక్కసారిగా ఆ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

టీఎన్ఎంజీఆర్ఎంయూతో వీఐటీ ఒప్పందం



సాక్షి, హైదరాబాద్: వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ), తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ ఒక ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం.. ఆరోగ్య సంరక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అప్లికేషన్‌లో సహకార పరిశోధనను ప్రోత్సహిస్తారు. వీఐటీ చెన్నై ప్రో–వైస్ చాన్స్‌లర్ డాక్టర్ టి.త్యాగరాజన్, చాన్స్‌లర్ సలహాదారు డాక్టర్ ఎస్పీ త్యాగరాజన్, టీఎన్ ఎంజీఆర్ఎంయూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.శివసంగీత సమక్షంలో.. వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం, టీఎన్ఎంజీఆర్ఎంయూ ఉపకులపతి డాక్టర్ కె. నారాయణసామి ఈ ఒప్పందంపై సంతకం చేశారు.

న్యూయార్క్ పరిశోధన సంస్థకు డాక్టర్ అచ్యుత సమంత పేరు



సాక్షి, హైదరాబాద్: అమెరికాలో న్యూయార్క్ నగర విశ్వవిద్యాలయం (సీయూఎన్‌వై) కొత్తగా స్థాపించిన పరిశోధన సంస్థకు ప్రముఖ విద్యావేత్త డాక్టర్ అచ్యుత సమంత పేరు పెట్టారు. 'అచ్యుత సమంత ఇండియా ఇనిషియేటివ్ సీయూఎన్‌వై క్రెస్ట్ ఇనిస్టిట్యూట్'(ఏఎస్ఐఐసీసీఐ) పేరుతో ఈ సంస్థ మంగళవారం న్యూయార్క్‌లో ప్రారంభమైంది. అమెరికాలోని ఒక పరిశోధన సంస్థకు భారతీయుడి పేరు పెట్టడం ఇదే మొదటిసారి. ఒడిశా కళ, వారసత్వంపై అమెరికన్ విద్యార్థులు చేసే పరిశోధనలకు ఈ సంస్థ మద్దతు ఇస్తుంది. సీయూఎన్‌వై పరిధిలోని బ్రోంక్స్ కమ్యూనిటీ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ మిల్టన్ శాంటియాగో ఇటీవల భువనేశ్వర్‌లోని కేఐఐటీ, కేఐఎస్ఎస్‌లను సందర్శించిన తర్వాత.. డాక్టర్ సమంత పేరు నామకరణంపై ప్రతిపాదించారు. డాక్టర్ శాంటియాగో ఆహ్వానం మేరకు డాక్టర్ సమంత కూడా ఏఎస్ఐఐసీసీఐ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు.

రహదారులు రక్తసిక్తం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 8 మంది దుర్మరణం

- హయత్‌నగర్‌లో డీసీఎంను ఢీకొట్టిన కారు
- ముగ్గురు యువకుల మృతి
- కర్ణాటకలో ట్రావెల్స్ బస్సును ఢీకొన్న కారు
- కెనరా బ్యాంక్ మేనేజర్, ఆయన భార్య, కుమారుడు, కుమార్తె మృతి




భాస్కర్, పవిత్ర దంపతులు



అభిరాం



చంద్రసేనారెడ్డి



త్రినాథ్‌రెడ్డి



వర్షిత్‌రెడ్డి



జ్యోత్స్న

హయత్‌నగర్ (హైదరాబాద్)/గద్వాల క్రైం: బుధవారం హైదరాబాద్‌లోని హయత్‌నగర్, కర్ణాటకలోని విజయపుర జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 8 మంది మృతిచెందారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురు యువకులు వారి కుటుంబాల్లో ఒక్కరే మగపిల్లలు కాగా, కర్ణాటకలో జరిగిన ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఓ కుటుంబంలో ఒక్కరు తప్ప అందరూ మృత్యుఒడికి చేరారు.

విషాదం మిగిల్చిన అతివేగం..

హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ప్రమాదంలో అతి వేగం నాలుగు కుటుంబాలలో పెను విషాదం మిగిల్చింది. వేగంగా వచ్చిన కారు ఎదురుగా వస్తున్న డీసీఎంను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా ఒకరు గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్‌కు చెందిన పిన్నింటి చంద్రసేనారెడ్డి (24), చుంచు త్రినాథ్‌రెడ్డి (24), చుంచు వర్షిత్‌రెడ్డి (23), ఎలిమేటి పవన్‌కల్యాణ్‌రెడ్డి చిన్నప్పటినుంచి స్నేహితులు. బుధవారం తెల్లవారుజామున వారంతా పస్మాముల వైపు నుంచి కుంట్లూర్‌కు స్కోడా కారులో వస్తున్నారు. ఉదయం 5:40 గంటల సమయంలో కుంట్లూర్‌లోని నారాయణ కళాశాల సమీపంలోని గ్యాస్ బంకు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో కారులో ఉన్న చంద్రసేనారెడ్డి, త్రినాథ్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డిలు అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడ్డ పవన్ కల్యాణ్‌రెడ్డిని కారులో నుంచి బయటికి తీసిన పోలీసులు చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించారు. కాగా, మంగళవారం రాత్రి ఓ రిసెప్షన్‌కు హాజరైన ఈ యువకులు మధ్యలో ఓ ఫాంహౌస్‌లో గడిపినట్లు తెలిసింది. అక్కడి నుంచి ఇంటికి బయలుదేరిన వారు కొద్దిసేపట్లో ఇంటికి చేరుకోవాల్సి ఉండగా మృత్యుఒడిలోకి చేరుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులలో ముగ్గురు మృతి చెందగా, డ్రైవర్‌సీటు పక్కన కూర్చున్న పవన్‌కల్యాణ్‌రెడ్డి గాయాలతో బయటపడ్డాడు. అతను సీటు బెల్టు పెట్టుకోవడంతో బెలూన్ ఓపెన్ అయినట్లు పోలీసులు తెలిపారు.

వారసులను కోల్పోయిన కుటుంబాలు...

పిన్నింటి చంద్రసేనారెడ్డి, చుంచు త్రినాథ్‌రెడ్డి, చుంచు వర్షిత్‌రెడ్డి వారి కుటుంబాల్లో ఒకరే మగపిల్లలు. వీరిలో త్రినాథ్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డిలు అన్నదమ్ముల కుమారులు. వారిద్దరూ ప్రమాదంలో మృతి చెందడంతో తమకు వారసులు లేకుండా పోయారని, చేతికి అందివచ్చిన కొడుకులు ఇలా మృతిచెందారని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఒకే కుటుంబంలో నలుగురు మృతి..

కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. వీరిలో జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గద్వాల పట్టణం బీసీ కాలనీకి చెందిన తెలుగు భాస్కర్ (41) మహారాష్ట్రలో కెనరా బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. ఇటీవల మహారాష్ట్రలోని భండారా జిల్లా వార్ధి ప్రాంతం నుంచి హైదరాబాద్ మెయిన్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. దీంతో బుధవారం భార్య పవిత్ర (38), కుమార్తె జ్యోత్స్న (10), కుమారులు అభిరాం (8), ప్రవీణ్‌తో పాటు కర్ణాటకకు చెందిన డ్రైవర్ శివప్ప (45)తో కలిసి కారులో బయల్దేరారు. ఈ క్రమంలో కర్ణాటకలోని విజయపుర జిల్లా మనగులి సమీపంలో సోలాపూర్– చిత్రదుర్గ హైవేపై వీరు ప్రయాణిస్తున్న స్కార్పియో కారు డివైడర్‌ను ఢీకొని అవతలి లేన్‌లో ఎదురుగా వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో స్కార్పియో కారు తుక్కు తుక్కు కాగా అందులో ఉన్న భాస్కర్, పవిత్ర, జ్యోత్స్న, అభిరాం, డ్రైవర్ శివప్పలు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం అక్కడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయాలతో బయటపడిన ప్రవీణ్ కుటుంబసభ్యులను కోల్పోయి అనాథగా మిగిలాడు.

ఇంత వేగంగా మధ్యంతర ఉత్తర్వులివ్వలేం

- గాలి జనార్దన్‌రెడ్డి, ఇతరులకు హైకోర్టు స్పష్టీకరణ
- ఓఎంసీ కేసులో తదుపరి విచారణ 28కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఓబులాపురం మైనింగ్ కేసు (ఓఎంసీ)లో ఇరుపక్షాల వాదనలు వినకుండా, పూర్తిస్థాయిలో డాక్యుమెంట్లను పరిశీలించకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. వేసవి సెలవుల్లోని కోర్టుకు సుదీర్ఘ విచారణ చేపట్టడం సాధ్యంకాదని వెల్లడించింది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నుంచి సూచనలు పొంది వివరాలు అందజేయాలని సీబీఐ తరఫు న్యాయవాదిని ఆదేశించింది. తొలుత సెలవుల తర్వాతకు వాయిదా వేయాలని న్యాయస్థానం నిర్ణయించగా, పిటిషనర్ల తరఫు న్యాయవాదుల విజ్ఞప్తితో తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది. ఓఎంసీ కేసులో దోషులుగా తేలడంతో గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాలకు సీబీఐ కోర్టు మే 6న ఏడేళ్ల జైలు విధించిన విషయం తెలిసిందే. అనంతరం వీరిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ప్రస్తుతం జైలులో ఉన్న గాలి జనార్దనరెడ్డికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా జైలు అధికారులను ఆదేశించాలని కోరుతూ గత వారం సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్‌దాఖలు చేయగా.. కోర్టు తిరస్కరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రధాన కేసులో నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ నిందితులు హైకోర్టులో పిటిషన్‌దాఖలు చేశారు. అలాగే తమకు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఇప్పటికే మూడున్నరేళ్లకుపైగా జైలులో ఉన్నారని, ఏడేళ్లలోపు శిక్షకు వెంటనే బెయిల్ మంజూరు చేయవచ్చని పిటిషనర్ తరఫు న్యాయవాదులు చెప్పారు. కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని సీబీఐ తరఫు న్యాయవాది కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్లకు మధ్యంతర ఉపశమన ఆదేశాలు ఇచ్చేందుకు నిరాకరించారు. తదుపరి విచారణ 28కి వాయిదా వేశారు.

'టిమ్స్' పనులు త్వరగా పూర్తి చేస్తాం

- అధికారుల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ రంగంలో ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న 'టిమ్స్'(తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న 'టిమ్స్'ఆసుపత్రి ప్రాంగణాన్ని బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తూ, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి హరిచందన దాసరి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, వైద్య విద్యా సంచాలకుడు నరేంద్ర కుమార్, మేఘా ఇంజనీరింగ్ సంస్థతో పాటు ఆర్అండ్‌బీ శాఖకు చెందిన అధికారులు సందర్శించారు. నిమ్స్, కిమ్స్, యశోద, ఏఐజీ ఆసుపత్రుల సీనియర్ వైద్యులు, పరిపాలనా నిపుణులు కూడా వచ్చి టిమ్స్ ఆసుపత్రిని ఎలా మెరుగ్గా తీర్చిదిద్దవచ్చన్న అంశంపై పలు సూచనలు చేశారు. నిర్మాణ ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం ప్రస్తుత పురోగతిపై సమీక్ష జరిపారు. మిగిలిన పనులు వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. కార్డియో, కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్సలు, అవయవ మార్పిడి వంటి ప్రత్యేక వైద్య విభాగాలతో సనత్‌నగర్ టిమ్స్‌ను రాష్ట్రానికి తలమానికంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు. కాగా జూన్ 2న సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభించాలని భావించినప్పటికీ నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు మరికొంత కాలం పట్టే అవకాశం ఉందని అధికారులు చెపుతున్నారు.

ఏసీబీకి చిక్కిన మిషన్ భగీరథ డీఈఈ

- మెజర్‌మెంట్ బుక్ రాయడానికి కాంట్రాక్టర్ నుంచి రూ.లక్ష డిమాండ్
- పది కిలోమీటర్లు వెంబడించి పట్టుకున్న ఏసీబీ అధికారులు

కోదాడ, చిలుకూరు: సూర్యాపేట జిల్లా కేంద్రంలో మిషన్ భగీరథ విభాగంలో డీఈఈగా పనిచేస్తున్న ఇస్లావత్ వినోద్, కోదాడ వద్ద ఓ కాంట్రాక్టర్ నుంచి లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు చిక్కాడు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం శీత్లాతండాకు చెందిన ఇస్లావత్ వినోద్ నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో ఏఈగా పని చేస్తూ గత సంవత్సరం జూలైలో బదిలీపై డీఈఈగా సూర్యాపేటకు వచ్చారు. ఆయన మక్తల్‌లో పనిచేస్తున్న సమయంలో ఓ కాంట్రాక్టర్ రూ.20 లక్షల విలువైన పనులు చేశారు. ఆ పనులకు సంబంధించిన మెజర్‌మెంట్ పుస్తకాలను వినోద్ తన వద్దే ఉంచుకున్నాడు. ఎంబీ రాయాలంటే తనకు లక్ష రూపాయలు లంచం ఇవ్వాలని వినోద్ డిమాండ్ చేయడంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. అధికారుల సూచన మేరకు లంచం ఇస్తానని కాంట్రాక్టర్ చెప్పడంతో అతడిని డబ్బు తీసుకొని కోదాడకు రావాలని వినోద్ చెప్పాడు.

పారిపోతూ చిక్కాడు..: మంగళవారం సాయంత్రం కోదాడ బైపాస్‌రోడ్డులో ఉన్న ఫుడ్‌ప్లాజా వద్దకు డబ్బులు తీసుకొని రావాలని కాంట్రాక్టర్‌కు వినోద్ సూచించడంతో ఆయన అక్కడకు వచ్చారు. ఐదు గంటల సమయంలో కారులో తన సోదరుడు ఇస్లావత్ మూర్తితో కలసి వినోద్ ఫుడ్‌కోర్టు వద్దకు వచ్చి కాంట్రాక్టర్‌ను తన కారులో ఎక్కించుకున్నాడు. అతని వద్ద డబ్బులు తీసుకొని వాటిని ఇస్లావత్ మూర్తికి ఇచ్చాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు అతడిని పట్టుకోవడానికి ప్రయత్నించారు. ఇది గమనించిన వినోద్.. కారును ముందుకు పోనిచ్చి కొద్ది దూరం వెళ్లిన తరువాత కాంట్రాక్టర్‌ను కారులో నుంచి దింపేశాడు. మరికొంత దూరం వెళ్లిన తరువాత వినోద్ కూడా కారు దిగిపోగా.. అతని బాబాయి కొడుకు మూర్తి డబ్బులు తీసుకొని పరారయ్యాడు. దీంతో దాదాపు పది కిలోమీటర్లు వెంబడించి ఏసీబీ అధికారులు వినోద్‌ను పట్టుకున్నారు. అతని చేతి వేళ్లకు లంచం డబ్బుకు ఉన్న రసాయనం అంటుకోవడంతో నీటితో పరీక్ష చేయగా రంగు మారిందని అధికారులు చెప్పారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శీత్లాతండాకు వెళ్లిన అధికారులు రాత్రి 11 గంటల సమయంలో మూర్తి ఇంటి వద్ద డబ్బును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వినోద్‌ను అరెస్ట్ చేసి బుధవారం నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీబీ అధికారులు చెప్పారు. మూర్తి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సమాచారం.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావుకు నోటీసు

- గాంధీభవన్‌లో ధర్నా ఘటనపై వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని పార్టీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావుకు పార్టీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఆమెకు ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా బుధవారం ఈ నోటీసు జారీ చేశారు. 'ఈనెల 14వ తేదీన పీసీసీ అధ్యక్షుడికి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో మీరు ధర్నా చేపట్టారు. ఇలా చేయడం క్రమశిక్షణా రాహిత్యమే. మీ హోదాకు తగింది కాదు. పార్టీ కార్యకర్తలతో పాటు నాయకత్వ స్థానాల్లో ఉన్న వారు.. వారి అభిప్రాయాలను సరైన రీతిలో, సరైన సమయంలో, సరైన వేదికలపై లేవనెత్తాల్సి ఉంటుంది. కానీ మీరు ధర్నా చేయడం పార్టీలో అంతర్గత క్రమశిక్షణను దెబ్బతీయడమే కాకుండా పార్టీకి నష్టం కలిగించే విధంగా ఉంది. ఈ ధర్నా ఎందుకు చేయాల్సి వచ్చిందనే విషయాన్ని నోటీసు అందిన వారం రోజుల్లో లిఖిత పూర్వకంగా వెల్లడించాల్సి ఉంటుంది. లేని పక్షంలో మీపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది'అని ఆ నోటీసులో పేర్కొన్నారు.

ట్రాఫికింగ్ డాన్ హితేశ్ అరెస్ట్

ఢిల్లీ విమానాశ్రయంలో అరెస్టు చేసిన అధికారులు

- చైనీస్ సైబర్ కేఫ్‌లకు వందలాది మంది భారతీయుల విక్రయం
- తెలంగాణ కంటే ముందే అదుపులోకి తీసుకున్న గుజరాత్
- బండి సంజయ్ చొరవతో తెలంగాణకు అప్పగింత
- మానవ అక్రమ రవాణాపై గతంలో 'సాక్షి' వరుస కథనాలు



హితేశ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: విదేశాల్లో కొలువుల పేరిట వందలాది మంది భారతీయులను విదేశాల్లోని చైనా సైబర్ కేఫ్‌లకు విక్రయించిన మానవ అక్రమ రవాణా డాన్ హితేశ్ ఎట్టకేలకు అరెస్టయ్యాడు. భారత విదేశాంగ శాఖ కోరిక మేరకు అతడిని మంగళవారం రాత్రి థాయ్‌లాండ్ ఇమిగ్రేషన్ అధికారులు ఇండియాకు డిపోర్ట్ చేశారు. బుధవారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన హితేశ్‌ను ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకుని, విదేశాంగ శాఖకు అప్పగించారు. మార్చిలో కరీంనగర్ పోలీసులు జారీచేసిన లుక్‌అవుట్ నోటీసుల ఫలితంగా హితేశ్ ఇండియా రాగానే అదుపులోకి తీసుకున్నారు. హితేశ్ ఇండియాకు వస్తున్నాడన్న సమాచారంతో మంగళవారం రాత్రి కరీంనగర్ జిల్లా మానకొండూరు పోలీసులు ఢిల్లీకి చేరుకున్నారు. అయితే, గుజరాత్‌కు చెందిన హితేశ్‌ను తెలంగాణ పోలీసుల కంటే ముందే ఆ రాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రోజంతా జరిగిన హైడ్రామా తర్వాత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలుగజేసుకోవటంతో ఎట్టకేలకు హితేశ్‌ను తెలంగాణ పోలీసులకు అప్పగించారు. దీంతో కరీంనగర్ పోలీసులు అతన్ని సాయంత్రానికి కరీంనగర్‌కు తరలించారు.

దేశవ్యాప్త నెట్‌వర్క్

గుజరాత్‌లోని పోర్‌బందర్‌కు చెందిన హితేశ్ మానవ అక్రమ రవాణా సూత్రధారి. ఇతను థాయ్‌లాండ్, మయన్మార్, లావోస్ దేశాల్లో సైబర్ నేరాలకు పాల్పడే కేఫ్‌లకు మనుషులను అక్రమంగా పంపిస్తాడు. విదేశాల్లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలిప్పిస్తానని, నెలకు రూ.లక్ష జీతమని నమ్మబలికి ఒక్కో వ్యక్తిని 3,000 డాలర్లకు చైనీస్ సైబర్ కేఫ్‌లకు విక్రయించేవాడు. మనదేశంలో ఇతనికి ప్రతి రాష్ట్రంలో ఏజెంట్లు ఉన్నారు. ఇప్పటివరకు అతడు దాదాపు 300 మందికి పైగా భారతీయులను విక్రయించాడని సమాచారం. ఇతని ఏజెంట్లలో జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన శ్యామారావు రాజశేఖర్ ఒకడు. వీరిద్దరు కలిసి గతేడాది డిసెంబర్‌లో కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన మధుకర్‌రెడ్డి అనే యువకుడిని మయన్మార్‌కు పంపారు. అక్కడ ఆ యువకుడు తిరగబడ్డాడు. ఈ విషయాన్ని 'సాక్షి'వరుస కథనాలతో వెలికితీయడంతో స్పందించిన బండి సంజయ్.. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు వివరించారు. దీంతో తొలుత అక్కడ సైబర్‌కేఫ్‌లో చిక్కుకున్న 540 మందిని మయన్మార్ సైన్యం సాయంతో కాపాడారు. తెలంగాణ సైబర్ పోలీసులు కూడా దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మానకొండూరు, ఖానాపూర్‌లో హితేశ్‌పై కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లోనే కరీంనగర్ పోలీసులు హితేశ్‌పై లుక్‌అవుట్ నోటీసులు జారీచేశారు. మరో కీలక నిందితుడు రాజశేఖర్ లావోస్‌లో తలదాచుకుంటున్నాడని సమాచారం. భారతీయ యువతీ యువకులను చైనీయులకు విక్రయించిన హితేశ్.. వారు తిరగబడితే చిత్రహింసలు పెట్టి చీకటిగదుల్లో వేయించేవాడు. చైనీయుల కోసం వందల మంది భారతీయులను అంగడి సరుకుగా విక్రయించాడు. చివరికి ఆ చైనీయులే అతన్ని చితకబాది థాయ్‌లాండ్ ఇమిగ్రేషన్ అధికారులకు పట్టించడం కొసమెరుపు.



రాజ్యాంగం, 'సుప్రీం' మధ్య విడదీయరాని బంధం

సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్

న్యూఢిల్లీ: దేశంలో ప్రాథమిక హక్కుల పరిధిని మరింత విస్తరింపజేయడంలో సుప్రీంకోర్టు కీలక పాత్ర పోషిస్తోందని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ చెప్పారు. 75 ఏళ్ల సుప్రీంకోర్టు ప్రయాణాన్ని భారత రాజ్యాంగం నుంచి విడదీసి చూడలేమని అన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మధ్యవర్తిత్వం, ఎన్నికల ప్రక్రియ వంటి ముఖ్యమైన అంశాల్లో మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా న్యాయస్థానం తీర్పులు ఇస్తున్నట్లు వివరించారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యాల ద్వారా సమాజంలో అట్టడుగు వర్గాలకు న్యాయం చేకూరుస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రసంగించారు. సుప్రీంకోర్టు 75 ఏళ్ల స్మారక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ ఏడాది మన రాజ్యాంగం, సుప్రీంకోర్టు 75 ఏళ్లు పూర్తి చేసుకున్నాయని, ఇది చరిత్రాత్మక సందర్భమని వ్యాఖ్యానించారు. రెండింటి మధ్య విడదీయరాని బంధం కొనసాగుతున్నట్లు స్పష్టంచేశారు. ఇవి ఒకే నాణేనికి రెండు ముఖాలు అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టును రాజ్యాంగమే సృష్టించిందని, రాజ్యాంగ ఆదేశాల ప్రకారమే సుప్రీంకోర్టు పనిచేస్తోందని ఉద్ఘాటించారు. అదేసమయంలో రాజ్యాంగానికి సుప్రీంకోర్టు అత్యుత్తమ రక్షణ కవచంగా వ్యవహరిస్తోందని జస్టిస్ గవాయ్ వివరించారు.

జస్టిస్ ఓకా పని రాక్షసుడు

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్.ఓకా తనకు మంచి మిత్రుడు, పని రాక్షసుడు జస్టిస్ బి.ఆర్.గవాయ్ చెప్పారు. జస్టిస్ ఓకా ఈ నెల 24న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో బుధవారం సుప్రీంకోర్టు అడ్వొకేట్–ఆన్–రికార్డు అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ మాట్లాడారు. జస్టిస్ ఓకాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. న్యాయ వ్యవస్థకు ఆయన అందించిన సేవలను ప్రశంసించారు. జస్టిస్ ఓకా మాట్లాడుతూ.. జస్టిస్ గవాయ్ అసలైన ప్రజాస్వామ్యవాది అని కొనియాడారు.

అగ్రరాజ్యానికో గోల్డెన్ డోమ్!

భూతల, గగనతల దాడుల నుంచి కాపాడే రక్షణ వ్యవస్థ

అమెరికా భద్రతకు త్వరలో అత్యాధునిక వ్యవస్థ

175 బిలియన్ డాలర్లతో ప్రతిపాదించిన అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్: ప్రపంచంలోనే అగ్రరాజ్యం, అతిపెద్ద ఆర్థికవ్యవస్థ, అమేయమైన సైనిక శక్తి.. ఇలా అన్నీ ఉన్నా అమెరికాను సువిశాలమైన, విస్తారమైన భూభాగం భయపెడుతోంది. భూమి ఎక్కువుంటే ఎందుకు భయపడాలనే సందేహం రావొచ్చు. దేశం ఓ మోస్తరు విస్తీర్ణంలో ఉండే ఉన్న భూభాగమంతటికీ సమగ్ర స్థాయిలో రక్షణ కల్పించొచ్చు. అదే విశాల భూభాగమైతే శత్రు దేశ క్షిపణులు ఎక్కడ పడతాయో ఊహించడం కూడా కష్టం. అమెరికాను వేధిస్తున్న ఈ సమస్యకు అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థతో చెక్ పెడతానని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలో ప్రకటించారు. మొత్తంగా 175 బిలియన్ డాలర్ల వ్యయంతో గోల్డెన్ డోమ్ మిస్సైల్ డిఫెన్స్ వ్యవస్థను ఏర్పాటుచేయనున్నట్లు ఆయన వెల్లడించారు. 2029 జనవరిలోగా ఈ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి యావత్ అమెరికా భూభాగాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చేస్తానని ఆయన ప్రకటించారు. అయితే ఈ గోల్డెన్ డోమ్ వ్యవస్థను ఏర్పాటుచేయడం అత్యంత ఖర్చుతో కూడిన వ్యవహారమని కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ స్పష్టంచేసింది. భూమి మీదే కాదు ఆకాశంలోనూ ఇందుకు సంబంధించి లేజర్ కాంతిపుంజం వెదజల్లే వ్యవస్థలను ప్రవేశపెట్టాల్సి ఉంటుందని బడ్జెట్ ఆఫీస్ తెలిపింది. ఇంతటి సంక్లిష్టమైన అధునాతన సాంకేతికతతో కూడిన అసాధారణ వ్యవస్థ నిర్వహణకు రాబోయే 20 సంవత్సరాల్లో ఏకంగా 542 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని అంచనావేసింది. ప్రస్తుతానికి అమెరికా పార్లమెంట్‌లో ట్రంప్ తొలి దఫాగా ప్రాజెక్ట్ కోసం కేవలం 25 బిలియన్ డాలర్లు మాత్రమే ప్రతిపాదించారని బడ్జెట్ ఆఫీస్ తెలిపింది.



చైనా, రష్యా నుంచి ముప్పు..

రష్యా, చైనా తమ ఉపగ్రహాలకు అధునాతన శక్తిసామర్థ్యాలను సంతరింపజేశాయి. అవి అమెరికా ఉపగ్రహాలను నిర్వీర్యంచేయగలవు. ఈ నేపథ్యంలో గోల్డెన్ డోమ్ అవసరం ఏర్పడిందని అమెరికా రక్షణ వర్గాలు తెలిపాయి. కేవలం అంతరిక్షంలో వాడేందుకు రష్యా ఒక కొత్తతరహా అణ్వాయుధాన్ని తయారుచేస్తోందని అమెరికా ఆరోపిస్తోంది. ఈ అణ్వాయుధం అంతరిక్షంలో సంచరిస్తూ విడతలవారీగా పేలుతూ సమీప శత్రుదేశ ఉపగ్రహాలను నాశనంచేయగలదని అమెరికా వాదిస్తోంది. అమెరికా గోల్డెన్ డోమ్ ఆలోచనను ఇప్పటికే రష్యా, చైనాలు తీవ్రంగా తప్పుబట్టాయి. శక్తివంతమైన లేజర్‌కాంతి వ్యవస్థలను అంతరిక్షంలో ఏర్పాటుచేసి ఉపగ్రహాలు సంచరించే కక్ష్యలను రణక్షేత్రాలుగా మార్చొద్దని ఇరు దేశాలు గోల్డెన్ డోమ్ ఆలోచనపై అభ్యంతరం వ్యక్తంచేశాయి.

ఏమిటీ గోల్డెమ్ డోమ్?

ఆపరేషన్ సిందూర్ వేళ పాకిస్తాన్ క్షిపణులను మన భూభాగంపై మోహరించిన సుదర్శన చక్ర(ఎస్–400) గగనతల రక్షణ వ్యవస్థ విజయవంతంగా అడ్డుకుంది. మార్గమధ్యంలోనే ఆ మిస్సైళ్లను కూల్చేసింది. గాజా భూభాగం మీద నుంచి హమాస్ సాయుధులు సంధించిన వందలాది క్షిపణులను సైతం ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' గగనతల రక్షణ వ్యవస్థ ఇలాగే నేలమట్టంచేసి తమ నేలను కాపాడుకుంది. ఎస్–400, ఐరన్‌డోమ్‌లు భూతలం మీద మొహరించిన రక్షణ వ్యవస్థలు. వాహనాలపై బిగించిన రాకెట్ లాంఛర్ ఇందులో కీలకం . అయితే అమెరికా సిద్ధంచేయబోతున్న గోల్డెన్ డోమ్ కాస్తంత భిన్నమైంది. ఇది భూతల, గగనతల రక్షణ వ్యవస్థల మేళవింపు. లేజర్ కాంతి ఎంతటి కఠినమైన లోహాలనైనా కోసి పారేస్తుంది. ఆకాశంలోని ఉపగ్రహం లాంటి వ్యవస్థ ఈ లేజర్ కాంతి పుంజాన్ని శత్రు క్షిపణులపై ప్రయోగించి వాటిని సెకన్ల వ్యవధిలో నాశనం చేస్తుంది. గోల్డెన్ డోమ్‌లో ఈ లేజర్‌కాంతి విభాగమే అత్యంత కీలకమైంది. గోల్డెన్‌డోమ్‌లో భాగంగా పెద్దసంఖ్యలో ఉపగ్రహాలను నింగిలోకి ప్రవేశపెట్టి వాటిని నిఘా, దాడి వ్యవస్థలుగా తీర్చిదిద్దనున్నారు.

లేజర్ కాంతి, సెన్సార్లు, శాటిలైట్ల సమ్మేళనం

ఈ గోల్డెన్ డోమ్‌ను లేజర్ కాంతి, సెన్సార్లు, పలు ఉపగ్రహాల, క్షిపణుల సమ్మేళనంగా చెప్పొచ్చు. అన్నీ కలిసి ఏకకాలంలో సమన్వయంతో పనిచేస్తూ నవతరం 'మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్'గా నిలిచిపోనున్నాయి. కృత్రిమ మేధ సాయంతో పనిచేసే సెన్సార్లను భూతలం మీద ఉండే గగనతల రక్షణ వ్యవస్థతో అనుసంధానిస్తారు. ఫలానా ప్రాంతం నుంచి శత్రు క్షిపణి దూసుకొస్తున్న విషయాన్ని భూతల, గగనతల సమ్మిళిత వ్యవస్థలు గుర్తించి వెంటనే ఆకాశంలోని లేజర్ కాంతిపుంజ విభాగానికి చేరవేస్తాయి. లేజర్‌కాంతి అవసరంలేని సందర్భాల్లో శత్రు క్షిపణిని అడ్డుకునేందుకు వెనువెంటనే క్షిపణులను ప్రయోగిస్తారు. సొంత క్షిపణితో పనికాదని నిర్ధారించుకోగానే అత్యంత తీక్షణమైన లేజర్ కాంతిని ఆ శత్రు క్షిపణిపై ప్రసరింపజేస్తారు. నేల మీద మొబైల్ లాంచర్ నుంచి, యుద్ధవిమానం నుంచి వచ్చే క్షిపణులనూ ఈ లేజర్‌కాంతి నాశనం చేయగలదు. అలా అమెరికా గగనతలంలో కీలకమైన చోట్ల ఈ లేజర్‌బీమ్ లైటింగ్ సిస్టమ్స్‌ను సిద్ధంచేస్తారు. ఈ బహుళ అంచెల వ్యవస్థలన్నీ ఎల్లవేళలా సమన్వయంతో పనిచేస్తూ అమెరికాను కంటికి రెప్పలా కాపాడతాయి. గోల్డెన్ డోమ్ ముఖ్యంగా నాలుగు పనులు చేస్తుంది. 1. ఫలానా చోట శత్రు క్షిపణి క్రియాశీలకంగా మారిందని గుర్తించగానే అది లాంఛర్‌ను దాటి బయటికొచ్చేలోపే నాశనంచేస్తుంది. 2. ఒకవేళ అప్పటికే బయల్దేరితే తొలిదశలోనే అడ్డుకుంటుంది. 3. లేదంటే మార్గమధ్యంలో నేలకూలుస్తుంది. 4. అప్పటికీ చేయిదాటిపోతే అది లక్ష్యాన్ని ఢీకొట్టే చిట్టచివరి నిమిషంలోనైనా మిస్సైల్‌ను మట్టుబెడుతుంది. ఈ పనులను కృత్రిమమేధ ఆధారిత కమాండ్ సిస్టమ్ చూసుకుంటుంది.

స్టార్‌వార్స్ సిద్ధాంతం నుంచి..

అంతరిక్షం నుంచి కాంతిపుంజాన్ని ప్రయోగించడమనేది ఇంకా ప్రయోగదశలోనే ఉందని అమెరికా ఎయిర్‌ఫోర్స్ సెక్రటరీ ట్రాయ్ మెయింక్ మంగళవారం వెల్లడించారు. అమెరికా రక్షణ శాఖ, యూఎస్ నార్తర్న్ కమాండ్‌లు సమష్టిగా గోల్డెన్ డోమ్ ప్రాజెక్టుపై పనిచేస్తున్నాయి. '' సంప్రదాయక క్రూయిజ్, బాలిస్టిక్, హైపర్‌సోనిక్ క్షిపణులు, డ్రోన్లతోపాటు అణ్వస్త్ర సామర్థ్య క్షిపణులనూ ఈ గోల్డెన్ డోమ్ విజయవంతంగా అడ్డుకుంటుంది'' అని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ చెప్పారు. యూఎస్ స్పేస్‌ఫోర్స్ జనరల్ మైఖేల్ గెటెలిన్ ఈ ప్రాజెక్టుకు సారథ్యంవహిస్తారు. ఫోర్‌స్టార్ జనరల్ అయిన గెటెటిన్‌కు వైమానిక రంగంలో 30 ఏళ్ల అనుభవం ఉంది. తాము సైతం ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వాములుగా చేరతామని కెనడా తన ఆసక్తిని వెల్లడించింది. ఆయుధరంగ దిగ్గజం 'లాక్‌హీడ్ మార్టిన్' సంస్థ గోల్డెన్ డోమ్ ఉపకరణాలను అభివృద్ధిచేయనుంది. 80వ దశకంలో అమెరికా అధ్యక్షునిగా సేవలందించిన రొనాల్డ్ రీగన్ 'స్టార్‌వార్స్' సిద్ధాంతం, ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ వ్యవస్థల నుంచే గోల్డెన్ డోమ్ ఆలోచన పురుడుపోసుకుంది. క్షిపణులను అడ్డుకునే టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్, ఏగిస్ సిస్టమ్‌లనూ గోల్డెన్ డోమ్‌లో వినియోగించనున్నారు.

సందేహాలు, అనుమానాలు

ఇంతవరకు అంతరిక్షంలో పరీక్షించని ఈ వ్యవస్థను కేవలం నాలుగేళ్లలోపు ఎలా అందుబాటులోకి తెస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. గోల్డెన్ డోమ్‌లో పెద్ద సంఖ్యలో కొత్త ఉపగ్రహాలు, ఏఐ సెన్సార్లు అవసరం. ప్రపంచంలోనే అత్యధిక రుణభారాన్ని మోస్తున్న అమెరికా సర్కార్ ఈస్థాయి కొత్త భారీ బడ్జెట్‌ను ఇంత తక్కువ సమయంలో సమకూర్చుకోగలదా? అసలు ఇది సమర్థవంతంగా పనిచేస్తుందా? అనే సందేహాలు ఎక్కువయ్యాయి. హమాస్–ఇజ్రాయెల్ యుద్ధం తొలినాళ్లలో ఒకేరోజు ఒకేసారి 20 నిమిషాల వ్యవధిలో హమాస్ 5,000 స్వల్పశ్రేణి క్షిపణులను ప్రయోగించింది. వాటిని అడ్డుకోవడంలో ఐరన్‌డోమ్ విఫలమైంది. ఈ నేపథ్యంలో ఒక సాయుధ సంస్థే ఇన్ని మిస్సైళ్లను ప్రయోగించగల్గితే పెద్ద యుద్ధమే వస్తే రష్యాలాంటి దేశం ఇంకెంత స్థాయిలో విరుచుకుపడుతుందో ఊహించడం కూడా కష్టం. ఈ నేపథ్యంలో గోల్డెన్ డోమ్ శక్తిసామర్థ్యాలు ఏపాటివో అందుబాటులోకి వస్తేగానీ చెప్పలేమని అంతర్జాతీయ నిపుణులు అభిప్రాయపడ్డారు.

ప్రత్యేక గడియారం ధరించనున్న వ్యోమగామి శుభాన్షు శుక్లా

న్యూఢిల్లీ: భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ప్రత్యేక గడియారాలను ధరించనున్నారు. శుభాన్షుతో సహా నలుగురు వ్యోమగాములు వీటిని ధరిస్తారని మిషన్ నిర్వాహక సంస్థ అక్సియమ్ స్పేస్ ధ్రువీకరించింది. ఒమేగా గడియారాలను మరోసారి రోదసీ యాత్రకు తీసుకెళ్లడానికి ఎదురుచూస్తున్నామని తెలిపింది. ఈ గడియారాలను స్విట్జర్లాండ్‌కు చెందిన ఒమేగా సంస్థ తయారు చేసింది. ఈ ప్రత్యేక గడియారాలు మానవ అంతరిక్ష ప్రయాణంలో తొలి రోజుల నుంచే భాగమయ్యాయి. నాసాతో ఒమేగా అనుబంధం 1960ల్లో ప్రారంభమైంది. మొదటిసారి స్పీడ్‌మాస్టర్‌ను అక్టోబర్ 3, 1962న మెర్క్యురీ సిగ్మా 7 మిషన్‌లో వ్యోమగామి వాలీ షిర్రా ధరించి వెళ్లారు. అయితే ఇది అనధికారికంగా ఉపయోగించారు. అప్పటికి నాసా ఇంకా ఆమోదించలేదు. 1965 మార్చి 1న మానవసహిత మిషన్లలో ఉపయోగించడానికి నాసా ఒమేగా స్పీడ్‌మాస్టర్‌ను అధికారికంగా ధ్రువీకరించింది. దీనిని అపోలో మిషన్లలో విస్తృతంగా ఉపయోగించారు. అపోలో 11తో మొదటిసారి చంద్రునిపైనా కాలుపెట్టింది. నేటికీ వ్యోమగాములతో అంతరిక్షానికి వెళుతోంది. ఈ గడియారాలను గురుత్వాకర్షణ లేని పరిస్థితులు, తీవ్రమైన ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, అధిక పీడనం వరకు అంతరిక్షంలోని అన్ని రకాల పరిస్థితులను తట్టుకునేలా రూపొందించారు. శుక్లాతో సహా ప్రతి వ్యోమగామికి రెండు ఒమేగా స్పీడ్‌మాస్టర్ గడియారాలు అందుతాయి.



అజంతా గుహ నుంచి సముద్ర అలల మీదకు

- ప్రాచీన కుడ్యచిత్రంలోని నౌకకు నేవీ ప్రాణప్రతిష్ట
- ఐఎన్ఎస్‌వీ కౌండిన్యను రూపొందించిన వైనం

కర్వార్(కర్ణాటక): ప్రఖ్యాత అజంతా గుహలోని ఒక శిలపై చిత్రించిన పెయింటింగ్ నుంచి స్ఫూర్తి పొందిన భారత నావికాదళం ఎట్టకేలకు ఐదో శతాబ్దినాటి పడవకు ప్రాణప్రతిష్టచేసింది. ప్రాచీన భారతీయ నావికా సాంస్కృతికి నిలువెత్తు నిదర్శనంగా ఈ నౌకను రూపొందించింది. కర్ణాటకలోని వ్యూహాత్మకమైన కర్వార్ నావికా స్థావరంలో ఈ పురాతన సంప్రదాయక రీతిలో నిర్మించిన ఐఎన్ఎస్‌వీ కౌండిన్యను ఇండియన్ నేవీ బుధవారం ఆవిష్కరించింది. ఒకటో శతాబ్దంలో హిందూ మహాసముద్రంలో సముద్ర యానం చేసి ఆగ్నేయాసియాను చుట్టొచ్చిన ప్రఖ్యాత భారత నావికుడు కౌండిన్య పేరును ఈ ఇండియన్ నావల్ సెయిలింగ్ వెసెల్(ఐఎన్ఎస్‌వీ)కి పెట్టారు. ఈ నౌకకు ఎన్నో విశిష్టతలున్నాయని దీని ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ బుధవారం చెప్పారు. ఆధునిక తరం నౌకలతో పోలిస్తే ఇది పూర్తిగా భిన్నమైంది. నీటిలో మునిగే ప్రధాన భాగం, చదరపు తెరలు, వేరే ఆకృతిలో తెడ్డులతో దీనిని సహజ ముడి సరుకులతో నిర్మించామని నేవీ అధికార ప్రతినిధి చెప్పారు. '' ఈ నౌకకు సంబంధించిన వాస్తవ కొలతల మ్యాప్‌లు, బ్లూప్రింట్‌లు అందుబాటులో లేవు. ద్విమితీయ చిత్రంలో ఉన్న ఒక్కో అంశాన్ని స్పష్టంగా అర్థంచేసుకుని వాటినే కొలతలుగా భావించి వాస్తవిక ఊహతో నౌక నిర్మాణం మొదలెట్టాం. పురాతన నౌక నిర్మాణాలు, నౌకా నిర్మాణ శాస్త్రం , సాంప్రదాయక విధానాలను మేళవిస్తూ ఈ నౌక సముద్ర పరిస్థితులను ఏ విధంగా తట్టుకోగలదనే అంచనాతో నౌకకు తుదిరూపునిచ్చాం'' అని నేవీ అధికారి తెలిపారు. ''భారతీయుల సముద్రయాన ఘనతను, వారసత్వాన్ని గుర్తు చేస్తూ ఆనాటి నిర్మాణ కౌశల్యాన్ని కళ్లముందే సాక్ష్యాత్కరిస్తోంది'' అని మంత్రి షెకావత్ అన్నారు. పురాతన విధానంలో నిర్మించిన ఈ నౌక పనితీరు, సామర్థ్యాన్ని విశ్లేషించేందుకు త్వరలోనే దీనిని గుజరాత్ తీరం నుంచి ఒమన్‌కు నడపనున్నారు.

8 రోజుల్లో మరో పాక్ అధికారి ఔట్

న్యూఢిల్లీ: భారతీయులను పలు విధాలుగా ప్రలోభపెట్టి గూఢచర్యానికి వినియోగించుకున్నాడన్న నేరానికి మే 13న ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్ ఉద్యోగిని భారత్ బహిష్కరించిన 8 రోజులకే మరో ఉద్యోగిపైనా భారత్ అదే వేటు వేసింది. అధికార విధులను మీరి ప్రవర్తిస్తున్నాడని, హోదాకు తగ్గట్లు ప్రవర్తించట్లేడనే కారణంగా 24 గంటల్లోపు భారత్‌ను వీడాలని బుధవారం ఆదేశించింది. ఈమేరకు పాక్ హైకమిషన్‌లో సంబంధిత వ్యవహారాల ఉన్నతాధికారి సాద్ వరాయిచ్‌కు 'అధికారికంగా దౌత్య నిరసన' నోటీసును అందజేసినట్లు విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఇస్లాంలో తప్పనిసరి భాగం కాదు

- వక్ఫ్ అంటే సేవా కార్యక్రమం
- ఆస్తులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- సుప్రీంకోర్టులో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా

న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ) చట్టం–2025ను కేంద్ర ప్రభుత్వం గట్టిగా సమర్థించుకుంది. వక్ఫ్ అనేది ఇస్లామిక్ భావనే అయినప్పటికీ ఇస్లాంలో అది తప్పనిసరి భాగం కాదని తేల్చిచెప్పింది. వక్ఫ్ అంటే ఇస్లాంలో ఒక సేవా కార్యక్రమం అని స్పష్టంచేసింది. వక్ఫ్(సవరణ) చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో బుధవారం వాదనలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు. సేవా కార్యక్రమాలను ప్రతి మతం గుర్తించి, ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఏ మతంలోనైనా ఇలాంటి సేవా కార్యక్రమాలను తప్పనిసరి భాగంగా చూడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. 'వక్ఫ్ బై యూజర్' సూత్రం ఆధారంగా ప్రభుత్వ ఆస్తులు, భూములపై ఎవరూ హక్కులు కోరలేరని అన్నారు. వక్ఫ్ బై యూజర్ నిబంధనను అడ్డం పెట్టుకొని వక్ఫ్ ఆస్తులను రాష్ట్రాలు బలవంతంగా లాక్కోలేవని చెప్పారు. దీనిపై ఆందోళన అవసరం లేదని వివరించారు. వక్ఫ్ బై యూజర్ అనేది ప్రాథమిక హక్కు కాదని, ఇది శాసన వ్యవస్థ తీసుకొచ్చిన నిబంధన అని గుర్తుచేశారు. దాన్ని తొలగించే అధికారం కూడా శాసన వ్యవస్థకు ఉందన్నారు. ప్రభుత్వ భూములపై ఎవరికీ హక్కు ఉండదని అన్నారు. ప్రభుత్వ భూములను ప్రభుత్వం కచ్చితంగా రక్షించాలని సుప్రీంకోర్టు గతంలో తీర్పు ఇచ్చినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వ భూములతోపాటు వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 14 కోట్ల మంది పౌరుల తరఫున వక్ఫ్ ఆస్తులకు ప్రభుత్వం సంరక్షకురాలిగా వ్యవహరిస్తోందని ఉద్ఘాటించారు.

వక్ఫ్(సవరణ) చట్టం ప్రకారం సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్(సీడబ్ల్యూసీ)తోపాటు స్టేట్ వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమిస్తారంటూ ఆందోళన చెందడం అర్థరహితమని తుషార్ మెహతా వ్యాఖ్యానించారు. సీడబ్ల్యూసీలో మొత్తం 22 మంది సభ్యులను నియమించే అవకాశం ఉందని, అందులో ముస్లిమేతరులు గరిష్టంగా నలుగురు మాత్రమే ఉంటారని వెల్లడించారు. ఇక స్టేట్ వక్ఫ్ బోర్డుల్లో 11 మంది సభ్యులకు అవకాశం ఉండగా, అందులో ముస్లిమేతరులు ముగ్గురు మాత్రమేనని వివరించారు. ఎక్స్–అఫీషియో సభ్యులు ముస్లిమేతరులు అయితే సభ్యులుగా ఇద్దరు ముస్లిమేతరులకే స్థానం దక్కుతుందని పేర్కొన్నారు. వక్ఫ్(సవరణ) చట్టంతో ముస్లిమేతరులు కూడా ప్రభావితం అవుతున్నారు కాబట్టి వారిని సభ్యులు నియమించే నిబంధన తీసుకొచ్చినట్లు తెలియజేశారు. ఈ చట్టంపై వాదనలు గురువారం కూడా కొనసాగనున్నాయి.

ఒక్క రోజు ముందు రిటైరయ్యేవారికీ నోషనల్ ఇంక్రిమెంట్

న్యూఢిల్లీ: వార్షిక ఇంక్రిమెంట్ పెరగడానికి ఒక్క రోజు ముందు రిటైరైన కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఇకపై ఆ లబ్ధి చేకూరనుంది. వారికి నోషనల్ ఇంక్రిమెంట్ లబ్ధి ప్రయోజనాలు వర్తింపజేస్తామని కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఉదాహరణకు రూ.79,000 వేతనం పొందే కేంద్ర ప్రభుత్వోద్యోగి జూన్ 30న రిటైరవడంతో జూలై 1న రావాల్సిన రూ.2,000 వార్షిక ఇంక్రిమెంట్ కోల్పోయాడు. పెన్షన్ గణింపులో మాత్రం ఆయన చివరి వేతనాన్ని రూ. 81,000గా పరిగణిస్తారు. దాంతో రిటైర్మెంట్ తాలూకు ఆర్థిక ప్రయోజనాలు పెరుగుతాయి. ఇకపై జూన్ 30, డిసెంబర్ 31న రిటైరయ్యే వారికి తదుపరి నోషనల్ ఇంక్రిమెంట్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటామని కేంద్రం వివరించింది. ఇటీవలి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. ఆలిండియా ఎన్‌పీఎస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ దీన్ని స్వాగతించింది. నిబంధనల ప్రకారం కేంద్ర ఉద్యోగులకు జూలై 1, లేదా జనవరి 1న ఇంక్రిమెంట్ ప్రకటిస్తారు.

రూ.142 కోట్ల ఆస్తులు కాజేశారు

- సోనియా గాంధీ, రాహుల్ మనీలాండరింగ్‌కు పాల్పడ్డారు
- నేషనల్ హెరాల్డ్ కేసులో ఢిల్లీ ప్రత్యేక కోర్టులో ఈడీ చార్జిషీట్



న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ వ్యవహారంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ భారీగా లబ్ధి పొందారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) స్పష్టంచేసింది. స్వలాభంతోపాటు కుమారుడు రాహుల్ గాంధీకి మేలు చేయడానికి అప్పటి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ తాజాగా ఢిల్లీ ప్రత్యేక న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసింది. సోనియా, రాహుల్ తమ పదవులను అడ్డం పెట్టుకొని ప్రజాధనాన్ని యంగ్ ఇండియా సంస్థ ద్వారా సొంత అవసరాలకు మళ్లించుకున్నారని, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని వెల్లడించింది. నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌ను యంగ్ ఇండియా కంపెనీ ద్వారా సొంతం చేసుకున్నారని ఆరోపించింది. రూ.142 కోట్ల విలువైన ఆస్తులను అక్రమంగా కాజేశారని వెల్లడించింది. కాంగ్రెస్ నాయకుల నుంచి విరాళాల రూపంలో డబ్బులు సేకరించి, యంగ్ ఇండియా కంపెనీని ఏర్పాటు చేశారని ఈడీ వెల్లడించింది. విరాళాలు ఇచ్చినవారికి ప్రతిఫలంగా పదవులు కట్టబెడతామంటూ ఆశ చూపారని తెలియజేసింది. నేషనల్ హెరాల్డ్ విషయంలో మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో సోనియా గాంధీని నెంబర్ 1గా, రాహుల్ గాంధీని నెంబర్ 2 నిందితులుగా చేర్చారు. మరో ఐదుగురిని కూడా నిందితులుగా పేర్కొన్నారు. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో బుధవారం ఢిల్లీ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టింది. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపించారు. నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసే వరకూ వాటిపై వచ్చిన ఆదాయాన్ని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అప్పనంగా అనుభవించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

సత్యమేవ జయతే: జైరాం రమేశ్

కాంగ్రెస్ అగ్రనేతలపై ఢిల్లీ స్పెషల్ కోర్టులో ఈడీ చార్జిషీట్ దాఖలు చేయడం పట్ల ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తాము భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ప్రభుత్వ వేధింపులపై భారత జాతీయ కాంగ్రెస్, దాని నాయకత్వం మౌనంగా ఉండదని తేల్చిచెప్పారు. సత్యమేవ జయతే అంటూ జైరాం రమేశ్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

ఐఎస్ఐ ఏజెంట్లను కలిశా

నేరాన్ని ఒప్పుకున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా



చండీగఢ్: గూఢచర్యం ఆరోపణలతో అరెస్టయిన మహిళా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పోలీసు కస్టడీలో కొత్త విషయాలను బయటపెట్టారు. పాకిస్తాన్‌లోని నిఘా అధికారులతో తనకు పరిచయం ఉందని, పాకిస్తాన్‌లో వాళ్లను కలిశానని ఆమె ఒప్పుకున్నారు. మే 13న దేశ బహిష్కరణకు గురైన ఢిల్లీలోని పాక్ హైకమిషన్ ఉద్యోగి డ్యానిష్‌తో తాను తరచుగా యాప్స్ ద్వారా సంప్రదింపులు జరిపానని ఆమె వెల్లడించారు. పాక్‌కు వెళ్లేందుకు అవసరమైన వీసా సాధించేందుకు ఢిల్లీలోని పాక్ హైకమిషన్‌కు 2023 నవంబర్‌లో తొలిసారిగా వెళ్లినప్పుడు అక్కడి ఉద్యోగి డ్యానిష్ అలియాస్ ఎహసార్ ఉర్ రహీమ్‌తో పరిచయం ఏర్పడిందని ఆమె తెలిపారు. అరెస్ట్ తర్వాత పోలీసులు జ్యోతికి చెందిన మూడు మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను ఫోరెన్సిక్ పరిశీలనకు పంపించారు. ఇంకొన్ని ఎలక్ట్రానిక్ ఉపకరణాలనూ స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం జ్యోతిని జాతీయ దర్యాప్తు సంస్థ, ఇంటెలిజెన్స్ బ్యూరో, మిలటరీ ఇంటెలిజెన్స్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత రెండేళ్లలో మూడుసార్లు పాకిస్తాన్‌కు వెళ్లడంతోపాటు చైనా, బంగ్లాదేశ్ ఇతర దేశాల్లో జ్యోతి పర్యటించారు. ఆపరేషన్ సిందూర వేళ భారత్, పాక్ సైనిక చర్యల సమయంలోనూ డ్యానిష్‌తో జ్యోతి సంప్రతింపులు జరిపినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. ఆమె నాలుగు బ్యాంక్ అకౌంట్లను విశ్లేషిస్తున్నారు. జ్యోతి పాక్ జాతీయుడిని పెళ్లాడినట్లు, మతం మారినట్లు ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు.



దెబ్బతిన్న ముందుభాగంతోనే లాండింగ్

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

శ్రీనగర్: 220 మందికి పైగా ప్రయాణికులతో బుధవారం ఢిల్లీ నుంచి శ్రీనగర్ బయల్దేరిన ఇండిగో విమానానికి పెనుప్రమాదం తప్పింది. భారీ వర్షాలు, ఈదురు గాలుల నేపథ్యంలో ప్రయాణం ఆద్యంతం విమానం భారీ కుదుపులకు లోనైంది. పైలట్ అత్యవసరంగా శ్రీనగర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించాడు. తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్యే సాయంత్రం 6.30కు విమానాన్ని సురక్షితంగా లాండ్ చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులంతా తీవ్ర భయాందోళనలకు లోనై దైవప్రార్థనలు చేస్తున్న దృశ్యాలకు సంబంధించిన వీడియోలతో పాటు విమానం తాలూకు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైన ఫొటోలు వైరల్‌గా మారాయి. అది లాండింగ్‌కు ముందే విరిగిపోయిందని, చావు ముంగిటి దాకా వెళ్లొచ్చామని ఓ ప్రయాణికుడు చెప్పుకొచ్చాడు.

పొరపాటున నోరు జారి.. జపాన్ మంత్రి రాజీనామా

టోక్యో: జపాన్ వ్యవసాయ శాఖ మంత్రి పొరపాటున చేసిన వ్యాఖ్యలు ఆయన రాజీనామాకు దారి తీశాయి. దేశంలో సాంప్రదాయ ఆహారమైన బియ్యం ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలనుద్దేశించి మాట్లాడిన మంత్రి టాకు ఎటో... ఎవరో ఒకరు బియ్యం బహుమతిగా ఇస్తుండటంతో తాను ఇంతవరకూ బియ్యం కొనాల్సిన అవసరం రాలేదని వ్యాఖ్యానించారు. మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలతో పాటు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలు బ్రౌన్ రైస్‌కు సంబంధించినవేనని, తాను తెల్లబియ్యం కొంటానని మంత్రి తన వ్యాఖ్యలను సరిదిద్దుకునే ప్రయత్నం చేశారు. అయినా దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. జూలైలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తన వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగిస్తాయని భావించిన మంత్రి బుధవారం రాజీనామా సమర్పించారు. బియ్యం ధరలతో జనం ఇబ్బంది పడుతుంటే అనుచిత వ్యాఖ్యలు చేశానని రాజీనామా అనంతరం మంత్రి ఎటో మీడియాతో అన్నారు.



వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.0/22.0

నగరంలో గురువారం కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులతో కూడిన ఓ మోస్తరు వర్షం పడవచ్చు. గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

కూకట్‌పల్లి ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ



జల్లులై.. వెల్లువై..



చాదర్‌ఘాట్ వంతెన కింద వరద నీటిలో వాహనాలు

నగరాన్ని జోరు వర్షం ముంచెత్తింది. బుధవారం ఉదయం నుంచి కారు మబ్బులతో వాతావరణం చల్లబడగా.. మధ్యాహ్నం నుంచి చిరుజల్లులతో మొదలై ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆ తర్వాత రాత్రి 9 గంటల నుంచి సుమారు గంట పాటు జోరుగా వాన పడటంతో లోతట్టు ప్రాంతాలతో పాటు రహదారులు జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 10 గంటల వరకు బండ్లగూడ మండలం కలేందర్ నగర్‌లో 8.7, ఆస్మాన్‌గఢ్, మలక్‌పేట్‌లలో 8.2, అంబర్‌పేట్‌లో 7.9, సరూర్‌నగర్‌లో 7.7, ఉప్పల్‌లో 7.5, ఎల్బీ నగర్‌లో 6.9, చంపాపేట్‌లో 6.6, హయత్‌నగర్‌లో 6.1, కుర్మగూడలో 5.6 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. మరో మూడ్రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఈ నేపథ్యంలో బల్దియా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. - సాక్షి, సిటీబ్యూరో



మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో..



బషీర్‌బాగ్‌లో..



ట్యాంక్‌బండ్ వద్ద ముసురు వర్షం

నేరాల నియంత్రణకే కొత్త ఠాణాలు: సీవీ ఆనంద్



దరఖాస్తుదారుకు తొలి ఎఫ్ఐఆర్ పత్రాన్ని అందజేస్తున్న సీవీ ఆనంద్

గోల్కొండ: నగరంలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం కొత్త ఠాణాలను ఏర్పాటు చేసినట్లు సీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఇటీవల కొత్తగా ఏర్పాటైన టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఇక్కడ నమోదైన తొలి ఎఫ్ఐఆర్ పత్రాన్ని ఫిర్యాదుదారుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. నగరంలో నేరగాళ్ల పాలిట పోలీసులు సింహస్వప్నంలా మారారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూనే.. నేర నియంత్రణలోనూ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను నగర పోలీసులు దేశంలోనే రికార్డు స్థాయిలో రికవరీ చేశారన్నారు. కార్యక్రమంలో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్, టోలిచౌకీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మాన్సూన్ టీమ్స్!

వర్షాకాల ఇబ్బందుల పరిష్కారానికి..

- టెండర్లు ఆహ్వానిస్తున్న జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాల సమస్యలను ఎదుర్కొనే సన్నద్ధతలో భాగంగా జీహెచ్‌ఎంసీ దాదాపు 400 మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను ఏర్పాటు చేయనుంది. వచ్చే జూన్ ఆరంభం నుంచి వర్షాకాలం ముగిసేంత వరకు (అక్టోబర్ నెలాఖరు వరకు) ఈ టీమ్స్ పని చేస్తాయి. ఇందుకుగాను దాదాపు రూ. 45 కోట్లు ఖర్చు చేయనున్నారు. వర్షాకాలంలో వానొస్తే రోడ్లు, కాలనీలు నీటి నిల్వలతో చెరువులుగా మారడం, మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్లు పొంగిపొర్లడం తెలిసిందే. ఈ సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఈ టీమ్స్ పనిచేస్తాయి. నగరంలో ప్రతియేటా నీరునిల్వ ఉండే ప్రాంతాలు జీహెచ్‌ఎంసీలోని సంబంధిత అధికారులకు తెలుసు. అలాంటి ప్రాంతాల్లో స్టాటిక్ టీమ్స్ నియమిస్తారు. నిల్చిపోయే నీటిని ఎప్పటికప్పుడు టీమ్స్‌లోని కార్మికులు తోడి పోస్తారు. వీటితో పాటు వాహనాలతో కూడిన మొబైల్ టీమ్స్ కూడా ఉంటాయి. ఇవి కాలనీలు, బస్తీలతో పాటు ఎక్కడ నీరు నిలిచినా వెళ్లి



తొలగిస్తాయి. జీహెచ్‌ఎంసీ కంట్రోల్ రూమ్‌కు అందే ఫిర్యాదులను బట్టి ఆయా ప్రాంతాలకు వెళ్లి నిల్వ నీటిని తొలగిస్తాయి. షిఫ్టులవారీగా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ పని చేస్తాయి. ఈ టీమ్స్‌లోని కార్మికులు నీరు తోడిపోసేందుకు, అవసరమైన ప్రాంతాల్లో స్వల్ప మరమ్మతులు చేసేందుకు యంత్ర సామగ్రిని కలిగి ఉంటారు. వీటి ఏర్పాటు కోసం జోన్లలో సర్కిళ్ల వారీగా సంబంధిత ఈఈలు టెండర్లు పిలుస్తున్నారు.

మొబైల్ ఎమర్జెన్సీ టీమ్స్ ఇలా..

ఒక్కో టీమ్‌కు వాహనం, నలుగురు కార్మికులు, నీటిని తోడి పోసేందుకు పరికరాలు ఉంటాయి. షిఫ్టుల వారీగా ఈ టీమ్స్ పనిచేస్తాయి. ఇలాంటి టీమ్స్ దాదాపు 150 వరకు ఉంటాయి.

జీహెచ్‌ఎంసీ అని తెలిసేలా..

మొబైల్ ఎమర్జెన్సీ టీమ్స్ వాహనాలకు జీహెచ్‌ఎంసీ లోగోతో బోర్డు పెట్టాలని, టీమ్‌కు నేతృత్వం వహించే వారి ఫోన్ నంబర్లను అన్ని పోలీస్‌స్టేషన్లకు అందజేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఇటీవల జరిగిన వర్షాకాల సన్నద్ధత సమావేశంలో ఆదేశించారు. వర్షాల సమయంలో ఇంజినీర్లు సైతం 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. అంతేకాకుండా వాటర్ లాగింగ్ సమస్యల పరిష్కారంపైనా దృష్టి సారించిన కమిషనర్ బేగంపేటలో నీటి నిల్వకు కారణాన్ని గుర్తించి పై నుంచి వచ్చే నీటిని నియంత్రించేందుకు స్లూయిస్ ఏర్పాటు చేయాల్సిందిగా సూచించడం తెలిసిందే.

స్టాటిక్ టీమ్స్

నీరు అధికంగా నిలిచిపోయి రోడ్లు చెరువులుగా మారే ప్రాంతాల్లో, క్యాచ్‌పిట్ల వద్ద ఒకరు లేదా ఇద్దరు కార్మికులతో ఈ టీమ్స్ ఉంటాయి. వీటిల్లోని కార్మికులు నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తోడిపోస్తారు. ఇలాంటి టీమ్స్ దాదాపు 250 ఉంటాయి.


కరోనాపై ఆందోళన వద్దు

ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్–1

- వేగంగా వ్యాప్తి.. ప్రమాదం తక్కువ
- ఎక్కడా ఒక్క పాజిటివ్ కేసు నమోదు కాలేదు
- అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణుల సూచన



గాంధీ ఆస్పత్రిలో 30 పడకలతో కోవిడ్ వార్డు ఏర్పాటు



గాంధీ ఆస్పత్రి : మరోసారి వేగంగా వ్యాపిస్తున్న కరోనాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని వైద్యనిపుణులు సూచించారు. రాష్ట్ర నోడల్ కేంద్రమైన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో 30 పడకలతో కోవిడ్ వార్డును ఏర్పాటు చేశామని, కరోనాను సమర్థంగా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామని వివరించారు. థర్డ్‌వేవ్‌లో వచ్చిన ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్- 1 ప్రస్తుతం వ్యాప్తిలో ఉందని, కానీ.. ఇది ప్రమాదకారి కాదన్నారు.

దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు, వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాండమిక్, ఎపిడమిక్, ఎండమిక్ మూడు స్టేజ్‌లు ఉంటాయని, కరోనా వైరస్ వీటిలో చివరిదైన ఎండమిక్ స్టేజ్‌లో ఉందన్నారు. రెస్పిరేటరీ వైరస్‌లలో కోవిడ్ పాజిటివ్ కేసులు 60శాతం ఉన్నాయని ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) తాజాగా విడుదల చేసిన గణాంకాలు వెల్లడిస్తున్నాయన్నారు. కోవిడ్ వైరస్‌ను ప్రాణాంతకమైన మహమ్మారిలా చూసే పరిస్థితి లేదని, జలుబు, దగ్గు వంటి సాధారణ రుగ్మతగానే వచ్చిపోతుందని, గతంలో వేసుకున్న కోవిడ్ వ్యాక్సిన్ ప్రభావం తగ్గిపోయినప్పటికీ, ప్రజల్లో హెర్డ్ ఇమ్యూనిటీ వచ్చిందన్నారు.

చిన్నారుల్లో నమోదు కావడం లేదు



ప్రస్తుతం సింగపూర్, హాంకాంగ్‌తో పాటు మన దేశంలోని మహారాష్ట్రలో వ్యాప్తిలో ఉన్న ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్–1 వైరస్ చిన్నారుల్లో నమోదు కావడంలేదు. ఒమిక్రాన్ బీఏ.2.86 నుంచి రూపాంతరం చెందిన జేఎన్–1లో మూడు సబ్ వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, పీసీ.2.1, ఎక్స్ఈసీ.25.1లు ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నట్లు ఐసీఎంఆర్ గుర్తించింది. మహారాష్ట్రలో జేఎన్–1 వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. కానీ ఇది ప్రమాదకారి కాదు. భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. మాస్కులు ధరించి అప్రమత్తంగా ఉంటే సరిపోతుంది.

- ప్రొఫెసర్ కిరణ్ మాదల, క్రిటికల్ కేర్ మెడిసిన్

సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధం



కరోనా వైరస్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర నోడల్ కేంద్రమైన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో సర్వం సిద్ధం చేశాం. ఓపీ భవనం రెండో అంతస్తులో 30 పడకలతో కోవిడ్ వార్డు ఏర్పాటు చేశాం. నిష్ణాతులైన వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారు. యాంటివైరల్ డ్రగ్స్, వైరాలజీ ల్యాబ్, రీఏజెంట్స్ (ద్రావకాలు) ఇతర మందులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. తెలంగాణ ప్రజలు హెర్డ్ ఇమ్యూనిటీ సాధించారు. కరోనా లక్షణాలైన జలుబు, దగ్గు, కీళ్ల నొప్పులు, శ్వాసకోశ ఇబ్బందులు వంటి రుగ్మతలకు గురైనవారు స్వీయ సంరక్షణ పాటిస్తూ, వైద్యుల సలహా మేరకు మందులు వేసుకోవాలి. జన సమూహ ప్రాంతాల్లో మాస్క్ తప్పనిసరిగా ధరించాలి.

- ప్రొఫెసర్ సునీల్‌కుమార్, గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్

కొత్త సభ్యులకు రేషన్ కోటా!

1.8 లక్షలకు పైగా కొత్త యూనిట్లు

- పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్స్ వేగిరం
- పౌరసరఫరాల శాఖ అధికారుల కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: తెల్లరేషన్ (ఆహార భద్రత) కార్డుల్లో కొత్త యూనిట్లకు కోటా కేటాయించేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. మే నెలలో కొన్ని కొత్త యూనిట్లకు బియ్యం కోటా విడుదల చేయగా.. తాజాగా మరికొన్ని యూనిట్లకు జూన్ కోటా కేటాయించి విడుదల చేయాలని నిర్ణయించింది. ఎనిమిదేళ్ల నిరీక్షణ అనంతరం కొత్త యూనిట్లకు ఆమోదం లభించిన విషయం విదితమే. అయితే.. రేషన్ కార్డు లబ్ధి కుటుంబాల్లో కొత్తగా సభ్యులుగా చేరిన ఏడేళ్ల వయసు దాటిన వారికి మాత్రమే రేషన్ కోటా కేటాయించే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతున్నా.. పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం వయసుతో నిమిత్తం లేకుండా కార్డుల్లోని ప్రతి యూనిట్‌కు బియ్యం కోటా విడుదల ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.



60 శాతం కొత్త సభ్యులకు ఆమోదం..

గ్రేటర్ పరిధిలో ఇప్పటి వరకు 60 శాతం కొత్త సభ్యులకు ఆమోదం లభించినట్లు పౌరసరఫరాల శాఖ అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వాస్తవంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల పౌరసరఫరాల పరిధిలో సుమారు మూడు లక్షల లబ్ధి కుటుంబాలు కొత్త సభ్యుల చేర్పుల కోసం దరఖాస్తులు చేసుకున్నాయి. ఇప్పటి వరకు సుమారు సగానికి పైగా ఆమోదం లభించినట్లు తెలుస్తోంది. మిగిలిన దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పౌరసరఫరాల అధికారులు మాత్రం పాతరేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల ఆమోదం ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంటున్నారు. మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ప్రతి పెండింగ్ దరఖాస్తునూ పరిశీలించి అర్హులైన సభ్యుల పేర్లను ఆమోదిస్తున్నామని స్పష్టం చేస్తున్నారు.

దర్యాప్తు ముమ్మరం

అగ్ని ప్రమాద ఘటనపై లోతుగా విచారణ

- అన్ని విభాగాలు సమన్వయంతో ముందుకు..
- నమూనాలను సేకరించిన నాగ్‌పూర్ బృందం

చార్మినార్: చారిత్రక చార్మినార్ సాక్షిగా హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్ హౌజ్ వద్ద ఆదివారం తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాద ఘటనపై పోలీసులు ఇప్పటికే దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఫోరెన్సిక్, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, అగ్నిమాపక విభాగాలకు చెందిన అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. విచారణలో భాగంగా వారిని సహకరించాలని కోరుతున్నారు. చార్మినార్ పోలీసుల అభ్యర్థన మేరకు ఇప్పటికే నగర ఫోరెన్సిక్ క్లూస్ విభాగాలకు చెందిన నిపుణుల బృందం గుల్జార్ హౌజ్ వద్ద జరిగిన ఘటన స్థలాన్ని సందర్శించి అవసరమైన నమూనాలను సేకరించారు.

నమూనాల సేకరణ

విచారణలో భాగంగా బుధవారం నాగ్‌పూర్ అగ్నిమాపక విభాగం నిపుణుల బృందం ఘటన స్థలాన్ని సందర్శించింది. అగ్ని ప్రమాదానికి గురైన భవనంలోకి వెళ్లి అవసరమైన నమూనాలను సేకరించింది. భవనంలో ఎన్ని గదులు ఉన్నాయి.. ఎక్కడెక్కడ ఏసీలు ఉన్నాయి.. మృతుల కుటుంబ సభ్యులు ఏయే గదుల్లో ఉన్నారు.. ఎంత మంది ఉన్నారు..? ఘటన జరగకముందు పరిస్థితులతో పాటు అగ్ని ప్రమాదం సంభవించిన అనంతర పరిస్థితులపై ఆరా తీసింది. పొగతో పాటు మంటల వేడికి బీటలువారిన భవనం పైకప్పులు, పగుళ్లుపట్టిన గోడలను నాగ్‌పూర్ అగ్నిమాపక నిపుణుల బృందం పరిశీలించింది.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు..

అగ్ని ప్రమాద ఘటనపై ఇప్పటికే సీఎం ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ విచారణ నిమిత్తం ఉన్నత స్థాయి ఉన్నతాధికారుల కమిటీని నియమించిన విషయం తెలిసిందే. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ తదితర ఉన్నతాధికారులు విచారణ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఉన్నత స్థాయి విచారణ ద్వారా తెలుసుకోవడంతో పాటు మునుముందు ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా ప్రభుత్వం విచారణ కొనసాగిస్తోంది. నాగ్‌పూర్ బృందం పరిశీలనలో వెలుగు చూసిన అంశాలతో కూడిన రిపోర్టును త్వరలో సంబంధిత ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సమాచారం.

మురిపించే 'నయా'..

నేడు బేగంపేట రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవం

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.26.55 కోట్ల వ్యయంతో పునరభివృద్ధి చేసిన బేగంపేట రైల్వేస్టేషన్ గురువారం (నేడు) ప్రారంభం కానుంది. ఉదయం 9 గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. చూడగానే ముగ్ధులను చేసే ప్రవేశ ద్వారం, ప్రాంగణంలో కనువిందు చేసేలా రాక్ గార్డెన్ నిర్మాణం, రాష్ట్ర పక్షి పాలపిట్ట దర్శనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. - సనత్‌నగర్



విగ్రహాలకు తొలగనున్న ముసుగులు?

నేటి స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ ప్రవేశ ద్వారం వద్ద ఎంతో కాలంగా ముసుగులతో కప్పిన మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిల విగ్రహాలకు త్వరలోనే ముసుగులు తొలగనున్నాయి. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయ ఆవరణలోనే వేరే ప్రాంతాల్లో వాటిని ప్రతిష్ఠించేందుకు గురువారం జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. రాజకీయ కారణాలతో ఇంత కాలం ముసుగులో కప్పి ఉన్నాయి. వీటికి ముసుగులు తొలగించేందుకు మేయర్ విజయలక్ష్మి జీహెచ్‌ఎంసీలో గుర్తింపు పొందిన ఐదు కార్మిక సంఘాల నేతలతో సంప్రదింపులు జరిపారు. అందుకు అన్ని యూనియన్లు సుముఖత వ్యక్తం చేయడంతో విగ్రహాల ముసుగుల అంశం కొలిక్కి రానుంది.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ



చార్మినార్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చార్మినార్: రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఉగ్రవాద వ్యతిరేక దినంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం చార్మినార్ వద్ద బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ఆధ్వర్యంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం గుల్జార్ హౌస్ అగ్నిప్రమాద ఘటనలో మృతిచెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నిరంజన్ మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఎన్నో సంస్కరణలతో మన దేశాన్ని ప్రగతిపథంలో నిలిపారని చెప్పారు. కార్యక్రమంలో సద్భావన యాత్ర స్మారక సమితి సభ్యులు జి.ఆనంద్, జి.కన్నయ్య లాల్, రాఘవేందర్, బహదూర్‌పుర, చార్మినార్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిలు పులిపాటి రాజేశ్ కుమార్, ముజీబ్ ఉల్లాహ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం.. యువకుడిపై కేసు

ఫిలింనగర్: ప్రేమ పేరుతో ఓ యువతిని మోసగించి..మరో యువతితో తిరుగుతున్న యువకుడిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..అర్పిత్ పసుపులేటి అనే యువకుడు 2023 ఓ యువతిని పరిచయం చేసుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆ యువతితో సన్నిహితంగా ఉండడంతో గర్భందాల్చగా అబార్షన్ చేయించాడు. అనంతరం ఆమెను దూరం పెట్టాడు. ఇటీవల అర్పిత్ మరో యువతితో తిరుగుతున్నట్లు తెలుసుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అర్పిత్‌తో పాటు అతని సోదరుడు, మామ, మరో ఇద్దరు స్నేహితులపై కూడా చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదులో పేర్కొంది. తనను మానసికంగా వేధిస్తుండడంతో పాటు ఆత్మహత్యాయత్నానికి పాల్పడేలా ప్రవర్తించారని, ఆర్థికంగా దెబ్బ తీశారని ఫిర్యాదులో పేర్కొంది. తనను ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టడమే కాకుండా అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు తోసేశారని, అర్ధరాత్రి రోడ్డుపై బలవంతంగా నడుచుకుంటూ ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశానని, ఇందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు ఆమె పోలీసులకు అందజేశారు. ఈ మేరకు పోలీసులు అర్పిత్‌తో పాటు సోదరుడు, మామ, మరో ఇద్దరిపై బీఎన్ఎస్ సెక్షన్ 69, 79, 89, 351 (3) కింద కేసు నమోదు చేశారు.

కుంట్లూర్ కంటతడి

- ముగ్గురు యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు
- రోడ్డు ప్రమాద స్థలంలో భారీగా ట్రాఫిక్ జామ్
- బాధితులను పరామర్శించిన మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ పరిధిలోని కుంట్లూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందారని తెలుసుకున్న స్థానికులు పెద్దఎత్తున ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యుల రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. కుంట్లూరు–పసుమాముల రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సీఐలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పోస్టుమార్టం అనంతరం ఒకేసారి మూడు మృతదేహాలు కుంట్లూర్‌కు రావడంతో బంధువులు, స్థానికులు, మృతుల స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఒకేసారి ముగ్గురికి అంత్యక్రియలు జరపడంతో వందల సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

నేతల పరామర్శ..

యువకుల మృతి సమాచారం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గ్రామానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేశ్ తదితరులు మృతుల కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

24 నుంచి కన్హా శాంతివనంలో మ్యూజిక్ అండ్ మోర్

సాక్షి, సిటీబ్యూరో: కన్హా శాంతి వనంలో ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు మ్యూజిక్ అండ్ మోర్ పేరుతో సమ్మర్ రీట్రీట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని శాంతివనం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. వెల్‌నెస్, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కనీసం 7 ఏళ్లు పైబడిన వారికి ఎంట్రీ ఉంటుందన్నారు.

ఇబ్రహీంపట్నం ఎస్ఐపై వేటు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎస్ఐగా పనిచేస్తున్న శ్రీనివాస్‌పై వేటు పడింది. ఆయనను మల్టీజోన్ రేంజ్ ఆఫీస్‌కు సరెండర్ చేస్తూ పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2022లో మంచాల ఎస్ఐగా విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ ఓ యాక్సిడెంట్ కేసును తప్పుదోవ పట్టించారనే ఆరోపణలపై, విచారణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితమే ఆయన ఇబ్రహీంపట్నం పీఎస్ నుంచి రిలీవ్ అయినట్లు సమాచారం.

విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి జీఎన్ రావు కన్నుమూత



సాక్షి, సిటీబ్యూరో: విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి గోపిశెట్టి నాగేశ్వరరావు గుండెపోటుతో బుధవారం రాత్రి కన్నుమూశారు. 1988 బ్యాచ్ కు చెందిన జీఎన్ రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ హోదాలలో పనిచేసి అందరి నుండి ప్రశంసలు అందుకున్నారు. గుంటూరు కలెక్టర్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యువజన సర్వీసుల శాఖ కమిషనర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్, జౌళి శాఖ కమిషనర్, ఉన్నత విద్య శాఖ కమిషనర్, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్‌గాను సేవలందించారు. ఆయన అకాల మృతి పట్ల పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన అంత్యక్రియలు మహాప్రస్థానంలో శుక్రవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు కల్పించాలి

మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్



జలమండలి ఎండీకి వినతి పత్రం సమర్పిస్తున్న మధుయాష్కీ గౌడ్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిలో రిజర్వేషన్ నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించాలని, తక్షణమే గ్రాట్యుటీ చెల్లింపులు చేయాలని తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. బుధవారం సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ , ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్ అధ్వర్యంలో ప్రతినిధుల బృందం జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డితో సమావేశమై ఉద్యోగులకు సంబంధించి ముఖ్యమైన సమస్యలపై చర్చించింది. ప్రధానంగా రిజర్వేషన్ నిబంధనలు అమలు విషయంలో ఉన్న లోపాలను ఎత్తి చూపింది. పదోన్నతులు నిలిపివేయడం వల్ల సీనియర్ ఉద్యోగులకు జరుగుతున్న నష్టాన్ని వివరించింది. సీనియారిటీ ఆధారంగా తక్షణమే పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. అనంతరం సమస్యలను వినతిపత్రం రూపంలో సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు తీవ్ర నష్టాలు వాటిల్లుతున్న నేపథ్యంలో సంఘం వారిని అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ ప్రతినిధుల బృందంలో సంఘం నేతలు ఎండీ జహంగీర్, బి.దేవేందర్, అక్తర్ అలీ, ఎం.రాంచందర్, మహేష్, గౌస్ పాషా, నరసింహారెడ్డి, సాయి చరణ్, శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- ఎమ్మెల్యే సబితారెడ్డి
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి, అధికారులు

తుక్కుగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రేవంత్ సర్కార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక ఉచిత హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 18 నెలల గడుస్తున్నా ఇంతవరకు పూర్తి స్థాయిలో హామీలు నెరవేర్చలేదన్నారు. ఆడపిల్లలకు కల్యాణలక్ష్మితో పాటు, తులం బంగారం అందజేస్తామన్నారు. కానీ రాష్ట్రంలో ఇప్పటివరకు ఎవరికీ బంగారం అందలేదని గుర్తు చేశారు. కేవలం ఎన్నికల సందర్భంగా అడ్డగోలుగా వాగ్దానాలు ప్రకటించారని మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ వాణి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు, లబ్ధిదారులు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి



మహేశ్వరం: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహేశ్వరం మండలం ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయం హనుమాన్ జయంతి ఉత్సవాలకు ముస్తాబైంది. సుమారు 500 వందల ఏళ్ల నాటి అక్కన్న మాదన్న కాలం నాటి ఆలయ ఉత్సవాలను ఏటా కమిటీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తారు. స్వయంభువుగా వెలసిన స్వామివారు.. దక్షిణ ముఖం కలిగి తూర్పునకు నమస్కారం చేసి ఉంటారు. భక్తుల కొంగు బంగారమైన స్వామివారి ఆలయాన్ని.. ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు ప్రభుత్వ ప్రోత్సాహంతో అభివృద్ధి చేస్తున్నారు. గురువారం జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 5.30 గంటలకు పంచామృతాభిషేకం, 7 గంటలకు నాగవల్లి పూజ(లక్ష తమలపాకుల పూజ), 8 గంటలకు మన్యుసూక్త హోమం, మధ్యాహ్నం 1 గంటకు హారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు వేద పండితుల సమక్షంలో నిర్వహిస్తారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిలుగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి హాజరు కానున్నారని ఆలయ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

జాడలేని ఓపెన్ జిమ్

రూ.10 లక్షలు మంజూరు

- రెండేళ్లు దాటినా పట్టించుకోని అధికారులు



ఓపెన్ జిమ్‌కు కేటాయించిన స్థలం

బడంగ్‌పేట్: ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యమని, అందుకు రోజువారి వ్యాయామం చాలా అవసరమని గుర్తించిన ప్రభుత్వం ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ పరిధి 21వ డివిజన్ భీష్మానగర్ కాలనీలో జిమ్ ఏర్పాటుకు 240 గజాల స్థలం కేటాయించింది. కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించింది. 2023 మేలో నాటి విద్యాశాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి.. కార్పొరేటర్ బంగారు అనితతో కలిసి జిమ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కానీ నేటి వరకు ఓపెన్ జిమ్‌కు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టలేదు. శిలాఫలకం చుట్టూ గడ్డి పెరిగి, అపరిశుభ్రంగా మారింది. ఇదిలా ఉండగా.. కుటుంబంలో నలుగురు ఉంటే ప్రైవేట్ జిమ్‌కు వెళ్లాలంటే సుమారు రూ.15 నుంచి 20 వేల దాక ఖర్చు అవుతుందని, ప్రభుత్వం జిమ్ ఏర్పాటు చేస్తే స్థానికులందరికీ ఉపయోగంగా ఉంటుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. శంకుస్థాపన చేసి రెండేళ్లు గడుస్తున్నా.. జిమ్ జాడ కానరావడం లేదని, ఎవరూ దాని ఊసెత్తడం లేదని వాపోతున్నారు.

కాలనీపై చిన్నచూపు



జిమ్ కోసం ఎదురు చూస్తున్నాం. శంకుస్థాపన చేసినప్పుడు నెల రోజుల్లోనే పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తెస్తామని పాలకులు, అధికారులు హామీ ఇచ్చారు. రెండేళ్లు గడిచినా అది నెరవేడం లేదు. అడిగినా పట్టించుకునే వారు లేరు. భీష్మానగర్ కాలనీపై అధికారులు, రాజకీయ నాయకులు చిన్నచూపు చూస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి త్వరగా జిమ్ ఏర్పాటు చేయాలి. – బంగారు సురేష్, స్థానికుడు

సాంకేతిక సమస్యతో ఫ్రాంక్‌ఫర్ట్ విమానం రద్దు

శంషాబాద్: మరికొద్ది సెకన్లలో టేకాఫ్ తీసుకునేందుకు రన్‌వేపైకి వచ్చిన విమానంలోని ముందు టైరులో సాంకేతిక సమస్యను గుర్తించడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి బుధవారం తెల్లవారు జామున 3.10 గంటలకు జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎల్‌హెచ్–753 విమానం 160 మంది ప్రయాణికులతో బయలుదేరేందుకు సిద్ధమైంది. టేకాఫ్ తీసుకునేందుకు రన్‌వేపైన కొద్ది దూరం ప్రయాణించింది. ఆ సమయంలో విమానంలోని ముందు టైరులో ఉన్న సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్ వెంటనే ఏటీసీకి సమాచారం అందించి విమానాన్ని తిరిగి వెనక్కి తీసుకున్నారు. సాంకేతిక సమస్యను సరిచేసేందుకు ఎయిర్‌లైన్స్ సంస్థ విమానాన్ని రద్దు చేసింది. విమానంలో ప్రయాణికులను దింపేసి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

పెళ్లి కుదరడంలేదని యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్‌గౌడ్ (ఫైల్)

శంషాబాద్ రూరల్: పెళ్లి సంబంధాలు కుదరడం లేదని మనో వేదనతో ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని పెద్దతూప్రలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాలమూరు ప్రవీణ్‌గౌడ్(33) షాద్‌నగర్‌లోని ఓ ఫైనాన్స్ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తండ్రితో పాటు గ్రామంలో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. అతని తండ్రి బాల్‌రాజ్‌గౌడ్ 15 రోజుల కిందట అల్వాల్‌లోని పెద్ద కూతురు ఇంటికి వెళ్లాడు. దీంతో ప్రవీణ్‌గౌడ్ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఇదిలా ఉండగా.. ఇతని పెళ్లి కోసం కుటుంబ సభ్యులు పలు సంబంధాలు చూసినా కుదరలేదు. ఈ క్రమంలో మనోవేదనకు గురైన ప్రవీణ్ మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో..అర్ధరాత్రి ఇంటికి వచ్చి చూడగా.. బెడ్‌షీట్‌తో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీహెచ్‌ఎఫ్ సెట్ చోరీ

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ మొదటి బెటాలియన్‌లో ఏఆర్ ఎస్ఐలు ఉపయోగించే వీహెచ్‌ఎఫ్ (వెరీ హై ఫ్రీక్వెన్సీ) సెట్‌ను చోరీ చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..యూసుఫ్‌గూడలోని ఫస్ట్ బెటాలియన్‌కు చెందిన ఏఆర్ ఎస్ఐ నాగిరెడ్డి ఈ నెల 17న రాత్రి షిఫ్ట్ విధులకు హాజరయ్యాడు. అప్పటివరకు విధులు నిర్వర్తించిన ఏఆర్ ఎస్ఐ ముస్తఫా నుంచి 9 గంటల సమయంలో సెంట్రీబుక్‌తో పాటు వీహెచ్‌ఎఫ్ సెట్‌ను సేకరించాడు. తనకు కేటాయించిన విధంగా ఎమ్మెల్యే కాలనీ వాటర్ ట్యాంక్ దగ్గర రాత్రంతా విధులు నిర్వర్తించాడు. మరుసటి రోజు ఉదయం 5 గంటలకు ఫ్రెష్ అయ్యి వద్దామని ఎమ్మెల్యే కాలనీ నుంచి యూసుఫ్‌గూడ బెటాలియన్ ప్రధాన కార్యాలయానికి వెళ్లాడు. అయితే వెళ్లే సమయంలో సెంట్రీబుక్‌తో పాటు వీహెచ్‌ఎఫ్ సెట్‌ను ఎమ్మెల్యే కాలనీ వాటర్ ట్యాంక్ వద్ద ఉంచాడు. తిరిగి వెళ్లే క్రమంలో ఆయన స్థానంలో పగటి షిఫ్టులో డ్యూటీకి వచ్చిన ఏఆర్ ఎస్ఐకు వీహెచ్‌ఎఫ్ సెట్ అప్పగించేందుకు చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేదు. దీంతో నాగిరెడ్డి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విమానంలో అత్యవసర ద్వారం తెరిచేందుకు యత్నం..కేసు నమోదు

శంషాబాద్: మరికొద్ది సమయంలో విమానం టేకాఫ్ తీసుకుంటుండగా ఓ మహిళ అత్యవసర ద్వారం తెరిచేందుకు యత్నించిన సంఘటన ఇండిగో విమానంలో చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్ స్టేషన్ సీఐ బాలరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన 6ఈ–922 విమానం టేకాఫ్ తీసుకునేందుకు సిద్ధం కాగా అందులో సీట్ నంబర్ 20లో కూర్చున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన దీప ప్రశాంత్(39) ఎమర్జెన్సీ డోరును తెరిచేందుకు యత్నించింది. విమానంలో సిబ్బంది నివారించినప్పటికీ ఆమె అదేవిధంగా ప్రయత్నిస్తుండటంతో అధికారులు ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చదివింది ఉన్నత చదువులు.. చేసేది డ్రగ్స్ వ్యాపారం

ఇద్దరు అరెస్టు, ముగ్గురి పరారీ

సాక్షి, సిటీ బ్యూరో: లండన్‌లో బారిష్టర్ చదవులు చదివి..నైజీరియన్‌లతో స్నేహం చేసి డ్రగ్స్, గంజాయి వంటి గలీజు దందాలో పట్టుబడిన ఇద్దరు యువకులు కటకటాలు లెక్కిస్తున్నారు. ఎస్టీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరుణ్, ప్రభు చైతన్య ఇద్దరు అన్నదమ్ములు. ఉన్నత చదువులకు లండన్ వెళ్లారు. విద్యాభ్యాసం పూర్తి చేసుకుని తిరిగి ఇండియాకు వచ్చారు. అక్కడ ఏర్పడిన పరిచయాలతో తరచు బెంగళూరు వెళుతూ డ్రగ్స్ హైదరాబాద్‌కు తెచ్చి అమ్ముతుండగా ఇద్దర్ని పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 2.58 ఎండీఎంఏ డ్రగ్స్, 38.56 గ్రాములు ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్టీఎఫ్ పోలీసులు తెలిపారు. బెంగళూరులో వీరు నిర్వహిస్తున్న వ్యాపారాలపైనా నిఘా పెట్టామని, పరారీలో ఉన్న వారిని పట్టుకుని అరెస్టు చేస్తామని తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.15, నల్లవంకాయ.18, పొడుగు వంకాయ.18, బెండకాయ.35, పచ్చిమిర్చి.35, బజ్జిమిర్చి.35, క్యాప్సికం.45, పచ్చి కాకరకాయ.35, పందిరిబీర.35, క్యాబేజీ.13, క్యారెట్.28, దొండకాయ.19, గుండు బిన్నీస్.85, గింజచిక్కుడు.50, గోకరకాయ.35, కీర.23, దోసకాయ.18, బీట్‌రూట్.21, ఉల్లిగడ్డ.16, ఆలుగడ్డ.25, చామగడ్డ.35, మొరంగడ్డ.18, కందగడ్డ.50, క్యాలిప్లవర్ 18, సొరకాయ.09, పొట్లకాయ.18, అరిటికాయ.10, మునగకాయ.4, మామిడికాయ.45, ముల్లంగి.4-5, ఉల్లిపొరక.40. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు హనుమాన్ జయంతి వేడుకలు



వెంగళరావునగర్: వెంగళరావు నగర్ డివిజన్ పరిధిలోని వీరాంజనేయ భవానీ శంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానం (జీటీఎస్)లో ఈనెల 22న హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు దేవాదాయ ధర్మాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుమ్మడిదల సుధాకర్ బుధవారం నో ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు సర్వాభిషేకం, 9 గంటలకు హనుమత్ హోమం, మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. విశేష పూజా కార్యక్రమాలకు భక్తులు వేలాదిగా తరలి రావాలని కోరారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

అమీర్‌పేట: పొగాకు ఉత్పత్తులను సేవిస్తున్న కారణంగా ప్రతి 8 సెకెన్లకు ఒకరు మృత్యువాత పడుతున్నారని శ్రీ సాయి ఓరల్ హెల్త్ ఛారిటబుల్ ట్రస్ట్, గాంధీ ఆసుపత్రి మాజీ ఆర్‌ఎంఓ డాక్టర్ నాగేశ్వర్‌రావు తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన దేశంలో ప్రతి యేటా 10 లక్షల మందికి పైగా పొగాకు ఉత్పత్తుల కారణంగా నోటి క్యాన్సర్ బారినపడుతున్నారని అన్నారు. ర్యాలీలో వైద్యులు శ్రీనాథ్‌రెడ్డి, కుసుమ బోగరాజు, కుసుమ నాని,శ్రీనివాస సమాజ సేవా ట్రస్టు చైర్మన్ పార్థసారధి,సీనియర్ సిటిజన్ కౌన్సిల్ మాజీ అధ్యక్షులు మానిక్ రావు పాటిల్ పాల్గొన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

- వరదనీటి ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలి..
- మ్యాన్‌హోల్ మూతలపై రెడ్ పెయింట్ చేయాలి..
- వర్కర్లు కూడా యూనిఫాం ధరించాలి..
- జలమండలి జీఎం హరిశంకర్..

పకడ్బందీగా మాన్సూన్ యాక్షన్ ప్లాన్



మాట్లాడుతున్న జల మండలి డివిజన్-6 జీఎం హరిశంకర్



హాజరైన వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది..

బంజారాహిల్స్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మాన్సూన్ యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వం సూచించిన జాగ్రత్తలను పాటించాలని జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్ అన్నారు. బుధవారం ఆయన బంజారాహిల్స్ వార్డు సెక్షన్ కార్యాలయంలో వర్షాకాల కార్యాచరణ ప్రణాళికపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ఫిలింనగర్, తట్టిఖానా, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎర్రగడ్డ, ఎస్సార్‌నగర్, సోమాజిగూడ, ఎస్పీఆర్‌హిల్స్, వెంగళరావునగర్, ఎల్లారెడ్డిగూడ, ఎర్రగడ్డ, బోరబండ వాటర్ సెక్షన్ల పరిధిలోని డీజీఎంలు ఇంద్రశీలా రాణి, వంశీకృష్ణ, మేనేజర్లు రాంబాబు, హర్షిణి, జయప్రకాష్, ప్రేంకుమార్, సూర్యకుమార్‌తో పాటు 200 మంది సిబ్బంది హాజరయ్యారు. ఎయిర్‌టెక్ మెషిన్ ఆపరేటర్లు, ఓనర్లు, సీవరేజీ సిబ్బందిని ఉద్దేశించి జీఎం హరిశంకర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో మ్యాన్‌హోళ్ల వద్ద గత ఏడాది మాదిరిగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లోతైన మ్యాన్‌హోళ్ల వద్ద మూతలపై రెడ్ కలర్ వేయాలని సూచించారు. వరదనీటి ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటి నుంచే వరద నీటి ప్రాంతాలపై తగిన శ్రద్ధ చూపాలన్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. అలాగే సిబ్బంది కూడా వ్యక్తిగత రక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తమకిచ్చిన పరికరాలు ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలన్నారు. మెషిన్లు కంట్రోల్‌లో ఉన్నాయో లేవో చూసుకోవాలన్నారు. యూనిఫాంలు ధరించాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వరదనీటి ప్రవాహం ఇబ్బందులు లేకుండా చూసుకోవచ్చన్నారు. ఎప్పటికప్పుడు తాము సమావేశాలు నిర్వహిస్తూనే ఉంటామని, హెచ్చరికలు జారీ చేస్తున్నా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. తమ ఆరోగ్యంతో పాటు భద్రత తీసుకుంటూనే ప్రజల భద్రతపై కూడా దృష్టి కేంద్రీకరించాలన్నారు.

విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు మార్పు

బంజారాహిల్స్: టీజీఎస్‌పీడీసీఎల్ అధికారుల ఫోన్ నంబర్లు మారాయి. మారిన ఫోన్ నెంబర్లు బుధవారం నుంచి అమలులోకి వస్తాయని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మారిన ఫోన్ నెంబర్ల ఆధారంగా వినియోగదారులు తమ సమీప అధికారులను సంప్రదించాలన్నారు. ముఖ్యంగా హెచ్చుతగ్గులు, కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బంది నెంబర్లను కూడా ప్రకటనలో పేర్కొనడం జరిగిందని వారు వివరించారు.

బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని అధికారుల వివరాలు..

అధికారి హోదా	అధికారి పేరు	ఫోన్‌నెంబర్
డీఈఈ (ఆపరేషన్స్-బంజారాహిల్స్)	పి.హనుమంతరావు	8712468949
ఏఈటీ (బంజారాహిల్స్)	ఎస్.భారతి	8712468967
ఏడీఈ (ఆపరేషన్స్-బంజారాహిల్స్)	జి.రమేష్	8712468950
ఏఏఈ (ఆపరేషన్స్-బంజారాహిల్స్)	వై.రమేష్‌కుమార్	8712468958
ఏఈ (ఆపరేషన్స్-ఫిలింనగర్)	బి.పవిత్ర	8712468961
ఏడీఈ (ఆపరేషన్స్-అమీర్‌పేట)	ఎం.బాలకృష్ణ	8712468952
ఏఈ (ఆపరేషన్స్-అమీర్‌పేట)	బి.సాంబశివరావు	8712468959
ఏఏఈ (ఆపరేషన్స్-యూసుఫ్‌గూడ)	డి.జాన్‌పీటర్	8712468964
ఏఏఈ (ఆపరేషన్స్-కృష్ణానగర్)	ఎస్.తిరుపతిరావు	8712468957
ఏడీఈ (ఆపరేషన్స్-జూబ్లీహిల్స్)	హెచ్.మల్లేశం	8712468951
ఏఈ (ఆపరేషన్స్-జూబ్లీహిల్స్)	బి.సత్యనారాయణ	8712468960
ఏఈ (ఆపరేషన్స్-మాదాపూర్)	బి.సుధీర్‌కుమార్	8712468968
ఏడీఈ (సీబీడీ-బంజారాహిల్స్)	జి.గోపి	8712468953
ఏఏఈ (సీబీడీ-బంజారాహిల్స్)	వి.వెంకటేశ్వరరావు	8712468955
ఏఈ (సీబీడీ-బంజారాహిల్స్)	ఆర్.లక్ష్మణ్	8712468956
ఏఏఈ (సీబీడీ-షిఫ్ట్)	వి.శివశంకర్‌రావు	8712468962
ఏఈ (సీబీడీ-బంజారాహిల్స్)	ఎల్.ప్రవీణ్‌కుమార్	8712468963
ఏఈ (సీబీడీ-బంజారాహిల్స్)	డి.ఆంజనేయులు	8712468966
ఏడీఈ (స్టోర్స్)	ఎం.సుధాకర్	8712468954
ఏఈ (స్టోర్స్)	బీపీవీ ప్రసాద్‌యాదవ్	8712468970
ఏఏఈ (స్టోర్స్)	బి.విజయభాస్కర్‌రెడ్డి	8712468971
ఏడీఈ (ఐసీఎస్‌సీ)	జి.స్వాతి	8712468969

సెక్షన్ల ఏఈలు, ఫ్యూజ్‌ఆఫ్ కాల్ (ఎఫ్‌ఓసీ) నెంబర్లు..

సెక్షన్ పేరు	ఎఫ్ఓసీ	ఏఈ
శ్రీకృష్ణానగర్	8712469028	8712468957
బంజారాహిల్స్	8712469018	8712468958
అమీర్‌పేట	8712469026	8712468959
జూబ్లీహిల్స్	8712469020	8712468960
ఫిలింనగర్	8712469022	8712468961
యూసుఫ్‌గూడ	8712469031	8712468964
మాదాపూర్	8712469024	8712468968
మినిస్టర్ క్వార్టర్స్	8712469030	8712468961

గ్రీన్‌ల్యాండ్స్ డివిజన్ పరిధిలో..

గ్రీన్‌ల్యాండ్స్ డీఈఈ	8712469036
గ్రీన్‌ల్యాండ్స్ ఏఈ	8712469037
గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ	8712469038
ఎస్సార్‌నగర్ ఏఈ	8712469043
మోతీనగర్ ఏఈ	8712469044
బేగంపేట ఏఈ	8712469045
ఎర్రగడ్డ ఏఈ	8712469046
బోరబండ ఏఈ	8712469051
సీఎం క్యాంప్ ఆఫీసు	8712469103

అంబటి కృష్ణమూర్తిపై దాడి అమానుషం



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

హిమాయత్‌నగర్: ఐఎన్‌టీయూసీ (ఆర్) జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తిపై ఇటీవల బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో కొందరు వ్యక్తులు దాడికి పాల్పడటం దారుణమని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజాసంఘాల నేతలు జేబీ రాజు, సత్యం, పోకల కిరణ్, నాగుల శ్రీనివాస్ యాదవ్, జేమ్స్, భూదాల అమర్ బాబు, గొల్లపల్లి దయానంద, నాగరాజు, కష్ణ గౌడ్, జనార్దన్, బండారు శైలజ, పి.అరుణ, జ్యోతి, సత్యదేవ్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న సంజీవ రెడ్డి అనుచరులు ఆర్.డి.చంద్రశేఖర్ తదితరులు అంబటి కృష్ణమూర్తి ఆయన కార్యవర్గ సభ్యులపై దాడి చేయడం దారుణమన్నారు. అసంఘటిత రంగంలో అంబటి కృష్ణమూర్తికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక దాడి చేశారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకుడు జాతీయస్థాయికి ఎదగడాన్ని సహించలేని సంజీవ రెడ్డి రౌడీలతో దాడి చేయించారని ఆరోపించారు. ఈ దాడిని అణగారిన వర్గాలపై జరిగిన దాడిగా వర్ణించారు. నిందితులకు చట్టపరంగా కఠిన శిక్ష విధించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

25న పుస్తకావిష్కరణ

హిమాయత్‌నగర్: వెనుకబడిన తరగతుల సాధికారత సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'చేతివృత్తుల ఆధునికీకరణ ప్రత్యామ్నాయం' పుస్తకావిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు రచయిత, బీసీసీఈ కార్యదర్శి ఇంద్రవెల్లి రమేష్ బుధవారం తెలిపారు. మాజీ ఎంపీ తూళ్ల దేవేందర్ గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, విశిష్ట అతిథిగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్యతో పాటు వక్తలుగా విశ్రాంత ఆచార్యులు ఇనుకొండ తిరుమలి, కె.మురళీ మనోహర్ హాజరుకానున్నట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

రహమత్‌నగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరమని జీహెచ్‌ఎంసీ స్టాడింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. డివిజన్‌లో పరిధిలోని శ్రీరాంనగర్‌కు చెందిన సల్మాన్‌కు రూ 60వేలు, రహమత్‌నగర్‌కు చెందిన సుల్తానకు రూ. 60 వేలు, వెంగళ్‌రావునగర్‌కు చెందిన బానుకు రూ.60వేలు, మహత్మనగర్‌కు చెందిన రాములు రూ.1.50 లక్షల చెక్కులను బుధవారం తన కార్యాలయంలో బాధితులకు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి కోడలు

అమీర్‌పేట: మాజీ మంత్రి, దివంగత నేత కంజర్ల లక్ష్మి నారాయణ యాదవ్ కోడలు కంజర్ల విజయ లక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం 300 మందితో ర్యాలీగా గాంధీ భవన్‌కు వెళ్లి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తామని,పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ, ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి,సీనియర్ నాయకులు మానుక రాజు యాదవ్ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రసూల్‌పురా: కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా వైద్యులు పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం కార్ఖానా న్యూవాసవీనగర్‌లో ఉమెన్ కేర్ అండ్ పాలి క్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఈటల, ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఈటల కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ సుప్రియ, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపికా, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

3 నుంచి టీటీడీ ఆలయ బ్రహ్మోత్సవాలు

హిమాయత్‌నగర్: హిమయత్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 3 నుంచి 7వ జరగనున్నట్లు ఆలయ ఏఈఓ రమేష్ బుధవారంఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉత్సవ ఆహ్వాన పత్రిక, పోస్టర్లను టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు తిరుమలలోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. వేసవి నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, తాగునీరు, విద్యుత్ అలంకరణలు తదితర ఏర్పాట్లు చేయాలని సూచించినట్లు తెలిపారు. జూన్ 2న సాయంత్రం అంకురార్పణ, 3న ఉదయం మిథున లగ్నంలో ధ్వజారోహణం, 3న ఉదయం శేష వాహన సేవ, రాత్రి హనుమంత వాహన సేవ, 4న సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహన, 5న గజ వాహన, శ్రీవారి శాంతి కల్యాణం, రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. 6న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహన సేవ, 7న ఉదయం చక్రస్నానం, సాయంత్రం పుష్పయాగం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అన్నప్రసాద వితరణ జరుగనుందని ఆయన వివరించారు.

ఓయూ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జేఏసీ నూతన కమిటీలను చైర్మన్ కొత్తపల్లి తిరుపతి బుధవారం ప్రకటించారు. ఓయూ అధ్యక్షులుగా నేరెళ్ల చరణ్, ఉపాధ్యక్షులుగా నంద కిశోర్, హరీష్, సెక్రెటరీగా అరుణ్, ఇంజినీరింగ్ కాలేజీ ప్రెసిడెంట్‌గా బానోత్ ఉమేష్, కార్యదర్శిగా నవీన్, ఓయూ టెక్నాలజీ కాలేజీ ప్రెసిడెంట్‌గా కరుణాకర్, జనరల్ సెక్రెటరీగా పరమేష్‌లను నియమించారు. నూతన కమిటీ నేతలకు ఆర్ట్స్ కాలేజీ ఎదుట నియామక పత్రాలను అందచేశారు.

అడ్డగోలు తవ్వకాలతో అవస్థలు



ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో పైప్‌లైన్ కోసం తవ్విన దృశ్యం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీ క్లబ్‌కు వెళ్లే రోడ్డులో అడ్డగోలు తవ్వకాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారుల అనుమతులు లేకుండానే చేపట్టిన ఈ తవ్వకాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా ఏ శాఖ చేస్తుందో స్పష్టం చేయకుండా, హెచ్చరిక బోర్డులు లేకుండానే తవ్వకాలు చేపడుతున్నారన్నారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు చేరి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్య కారణంగానే అడ్డగోలుగా తవ్వకాలు అడ్డగోలుగా జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో తవ్వకాలపై పోలీసులకు ఫిర్యాదులు అందడంతో బుధవారం పోలీసులు తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో విచారణ చేపట్టారు. రోడ్డంతా రాళ్లు, గుంతలతో అవస్థలు పడుతున్నామని వారు ఫిర్యాదు చేశారు.

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి




రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న రవిశేఖర్‌రెడ్డి

వెంగళరావునగర్: దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా వెంగళరావునగర్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ హత్య ఒక నాయకుడిపై జరిగింది కాదని, భారతదేశ స్ఫూర్తిపై జరిగిన దాడి అన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు రాజీవ్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజీవ్ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ జైలర్ రంగారావు, ప్రొఫెసర్ టి.వి.రెడ్డి, సారంగరావు, సాంబయ్య, నాగరాజు, సాయి, మల్లేష్‌గౌడ్, మైనార్టీ నాయకులు పాషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్‌కాలనీలో..

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం ఎర్రగడ్డ డివిజన్ కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్, ఎస్టీసెల్ స్టేట్ కోఆర్డినేటర్ రమేష్‌నాయక్, ఖాసీం, ఇమ్రాన్, మల్లేష్, శశి, హనుమంతరావు, బాబీ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు

రాజీవ్ గాంధీ సేవలు ఎనలేనివి.

రహమత్‌నగర్: దేశాభివృద్ధికి దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చేసిన సేవలు ఎనలేనివని జీహెచ్‌ఎంసీ స్టాడింగ్ కమిటీ సభ్యుడు, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి అన్నారు.రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం తన కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ భారతినాయక్

ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్టు

రహమత్‌నగర్: ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని బుధవారం బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అయ్యప్ప టీ పాయింట్, జేజే ఆసుపత్రి వద్ద ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు మంగళవారం రాత్రి సెక్టార్ ఎస్సై మనోజ్ కూమార్‌కు సమాచారం అందింది. దీంతో సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్న ఆయన ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న పూజరి రూపేష్ అనే యువకుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి సెల్ ఫోన్, నగదును స్వాధీనం చేసుకున్నారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్ అమృతా బార్ అండ్ రెస్టారెంట్ వెనుక ఫుట్‌పాత్‌పై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి సంబంధించి వివరాల కోసం ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభ్యం కాలేదు. దీంతో గుర్తుతెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఆదా చేయిస్తానని.. స్వాహా చేశాడు..

క్రెడిట్ పేరుతో రూ.38,000 టోకరా

ఫిలింనగర్: ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగం నుంచి ఫోన్ చేస్తున్నానని, తాను చెప్పినట్లు చేస్తే మీరు నెలవారీ డబ్బులు చెల్లించే అవసరం ఉండదని నమ్మించి అకౌంట్‌లో నుంచి రూ.38,000 కాజేసిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఫిలింనగర్ రోడ్డునెంబర్-9లో నివసించే ఎర్రంపల్లి సత్యం గత ఫిబ్రవరిలో ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు తీసుకున్నాడు. గత నెలలో దాని ద్వారా ఐదు లావాదేవీలు చేశాడు. ఈ నెల 17న రవి అనే వ్యక్తి అతడికి ఫోన్ చేసి మీ నెల వారీ చెల్లించే రూ.1999 మీ అకౌంట్ నుంచి కట్ కాకుండా ఉండాలంటే తాను చెప్పినట్లు చేయాలని సూచించాడు. మర్నాడు ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ప్రధాన కార్యాలయం నుంచి తన బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను తీసుకుని పరిశీలించగా నాలుగు దఫాలుగా రూ.38,000 గల్లంతైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రుణం పేరుతో టోకరా

బంజారాహిల్స్: మీకు లోన్ మంజూరైంది..ఇన్సూరెన్స్ నిమిత్తం రూ.5,590 చెల్లించాలని చెప్పడంతో వారి మాటలు నమ్మిన ఓ వ్యక్తి ఆ మొత్తాన్ని బదిలీ చేసి మోసపోయిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్‌కు చెందిన రమేష్ సినిమా కెమెరామెన్‌గా పనిచేస్తుంటాడు. గత ఫిబ్రవరి 29న ధన యాప్‌లో వచ్చిన ప్రకటనను చూసిన అతను తనకు రూ. 3 లక్షలు లోన్ కావాలని కోరాడు. అందుకు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ వివరాలను పంపించాల్సిందిగా సూచించడంతో వాట్సప్‌లో పంపించాడు. అనంతరం లోన్ మంజూరైందని, ఇన్సూరెన్స్ రూ.5,590 చెల్లించాలని చెప్పగా ఆ మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత నుంచి వారి ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. తాను మోసపోయినట్లు గుర్తించి బాధితుడు బుధవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ సీటు ఇప్పిస్తానని మోసం..

వెంగళరావునగర్: మెడికల్ సీటు ఇప్పిస్తానని నగదు తీసుకుని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షేక్ షకీర, షేక్ రబ్బానీ అనే వ్యక్తులు యూసుఫ్‌గూడలో ఎంఈపీ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ పేరుతో సంస్థను నిర్వహిస్తున్నారు. మూడేళ్ల కిందట వెస్ట్ గోదావరి జిల్లా పాలకొల్లు ప్రాంతానికి చెందిన ఈమని శ్రీనివాస్ తన కుమార్తెకు మెడికల్ సీటు కోసం వారిని సంప్రదించాడు. ఇందుకు గాను వారు రూ.25 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో ఆయన పలు దఫాలుగా వారికి నగదు చెల్లించాడు. అయినా సీటు ఇప్పించలేదు. దీంతో ఆయన సంస్థ ప్రతినిధులను ప్రశ్నించగా కాలయాపన చేస్తున్నారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు బుధవారం మధురానగర్ పీఎస్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డెమో రైలులో ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: డెమో రైల్లో ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీ జరిగిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ ప్రాంతానికి చెందిన ఏనుగుల నవీన్‌కుమార్ (26) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. మెదక్ నుంచి కాచిగూడకు డెమో రైలులో వస్తుండగా విద్యానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో ల్యాప్‌టాప్ కనిపించలేదు. రైలులో బాత్‌రూమ్‌కు వెళ్లి తిరిగి సీటు వద్దకు వచ్చి చూసే సరికే ల్యాప్‌టాప్ కనిపించకుండా పోయింది. దీంతో నవీన్‌కుమార్ కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీలను ఇబ్బంది పెట్టొద్దు

ఐఎన్‌టీయూసీ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు అన్నపూర్ణ

హిమాయత్‌నగర్: రాజకీయ స్వార్థం కోసం సీఎంకి లేఖ రాసి అంగన్‌వాడీలను ఇబ్బందులు పెట్టొద్దని ఐఎన్‌టీయూసీ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు అన్నపూర్ణ అన్నారు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తోందన్నారు. బుధవారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్‌తో కలసి ఆమె మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఆర్థికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు మినీ అంగన్వాడీలు, అంగన్‌వాడీ సిబ్బంది బాధలు పట్టించుకోని హరీశ్‌రావు ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చు చేసి జీతాలు పెంచాలన్న ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో నెలల తరబడి అంగన్‌వాడీల జీతాలు పెండింగ్‌లో ఉండేవని, ఇప్పుడు ఏ నెల జీతాలు ఆ నెలలోనే ఇస్తున్నారని పేర్కొన్నారు.

నిమ్స్ పరిపాలన సలహాదారుగా నబీ

లక్డీకాపూల్: నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)విస్తరణ ప్రాజెక్టుకు చీఫ్ ఆడిట్ అధికారిగా సీనియర్ ఆడిట్ ఆఫీసర్ ఎన్.మధుసూదన్‌ను, ఆస్పత్రి పరిపాలన, న్యాయ విభాగాలను మరింత బలోపేతం చేసే క్రమంలో సలహాదారుగా ఎస్అండ్ ఆర్ డీఐజీగా రిటైరైన డాక్టర్ షేక్ మహమ్మద్ నబీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆయా అధికారులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. చీఫ్ ఆడిట్ అధికారిగా మధుసూదన్ వెంటనే బాధ్యతలు చేపట్టారు. ఆస్పత్రిలో ఇప్పటికే శరవేగంగా విస్తరణ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. 33 ఎకరాల విస్తరణలో రూ.1,571 కోట్లతో బహుళ అంతస్తుల భవన సముదాయాలు నిర్మితమవుతున్న నేపథ్యంలో ఈ నియమకాలకు ప్రాధాన్యత సంతరించుకుంది.

నిమ్స్‌లో టెండర్ల నిబంధనలకు తూట్లు

రద్దు చేయాలని స్క్రాప్ కాంట్రాక్టర్ల ఆందోళన

లక్డీకాపూల్ : నిమ్స్‌లో టెండర్ల నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని స్క్రాప్ కాంట్రాక్టర్ సయ్యద్ మసూద్ ఖుర్రాన్ ఆరోపించారు. బహిరంగ టెండర్ల ప్రక్రియలో అయినవాళ్లకే అవకాశం కల్పిస్తున్నారని అన్నారు. ఈ మేరకు బుధవారం నిమ్స్‌లో పలువురు స్క్రాప్ కాంట్రాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన స్క్రాప్ కాంట్రాక్ట్ టెండర్లను రద్దు చేసిన నిమ్స్ యాజమాన్యం కొత్తగా టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలోని కాంట్రాక్టర్లకే వెసులుబాటు కల్పిస్తూ, అర్హులకు అవకాశం ఇవ్వకుండా ఓపెన్ టెండర్లను నిర్వహించడం తగదన్నారు. అధికారుల అండదండలతోనే ఆస్పత్రిలోని కాంట్రాక్టర్ ఈ స్క్రాప్ కాంట్రాక్ట్ దక్కించుకున్నారని ఆరోపించారు. టెండర్ల ప్రక్రియలో అర్హులందరూ పాల్గొనే అవకాశం కల్పించాలని నిమ్స్ డైరెక్టర్‌ని కోరినట్టు పేర్కొన్నారు. నిమ్స్‌లో అర్హులైన కాంట్రాక్టుకు అవకాశం లభించకుంటే కోర్టును ఆశ్రయిస్తామని ఖుర్రాన్ అనే కాంట్రాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి కాంట్రాక్టర్ హల్‌చల్



ఆల్విన్ కాలనీ: పనులు చేయించుకున్న బిల్డర్ డబ్బులు చెల్లించటం లేదని ఓ సివిల్ కాంట్రాక్టర్ సెల్ టవర్ ఎక్కిన హల్‌చల్ చేశారు. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లాకు చెందిన బత్తుల రాము కూకట్‌పల్లి వసంత్‌నగర్‌లోని ఆర్ అండ్ ఎల్ అనే సంస్థ వద్ద సబ్ కాంట్రాక్ట్ తీసుకొని సివిల్ ఇంజనీరింగ్ పనులు చేస్తున్నాడు. కాగా, ఆ కంపెనీ యజమానికి, రాముకు మధ్య లావాదేవీల్లో తేడాలు రావటంతో డబ్బులు ఇచ్చేందుకు ఆ కంపెనీ నిర్వాహకుడు సత్యనారాయణ నిరాకరించారు. దీంతో బుధవారం మధ్యాహ్నం రాము హైదర్‌నగర్‌లోని ఓ భవనంపైన ఉన్న సెల్ టవర్ ఎక్కి తనకు రావాల్సిన డబ్బులు చెల్లించకుంటే కిందికి దూకుతానని హల్‌చల్ చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని రామును సముదాయించి టవర్‌పై నుంచి కిందికి దించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విచారణకు ఎంపీ అనిల్ కుమార్ గైర్హాజరు

– జూన్ 12కు వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు: 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌పై నమోదైన కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ విచారణకు ఆయన గైర్హాజరయ్యారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొంటున్నందున అనిల్‌కుమార్ యాదవ్ కోర్టుకు హాజరు కాలేకపోతున్నారని ఆయన తరఫు న్యాయవాది కుర్మ నరేందర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారణను జూన్ 12వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది. ఆ రోజు తప్పకుండా కోర్టుకు హాజరు కావాలని సూచించింది. ఎన్నికల సమయంలో అనిల్‌యాదవ్ తన అభిమానులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేసిన సందర్భంగా అడిక్‌మెట్ నుంచి రాంనగర్ గుండు వరకు సుమారు 100 ద్విచక్ర వాహనాలతో భారీ నిర్వహించారని, రోడ్డుపై టపాకులు కాల్చడంతో చుట్టుపక్కన ఇళ్లల్లో ఉన్నవారికి, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలిగిందని పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో అనిల్‌కుమార్ యాదవ్‌తోపాటు మరో నలుగురిపై పోలీసులు కేసులను నమోదు చేశారు.

ఫిర్యాదులపై కదిలి..

- రంగనాథ్ నగర్‌లోని ప్లాట్లను పరిశీలించిన హైడ్రా కమిషనర్
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మార్కింగ్



గోపన్‌పల్లిలో రంగనాథ్‌నగర్ ప్లాట్ల యజమానులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

గచ్చిబౌలి: ప్రజావాణి ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి రంగనాథ్‌నగర్‌లోని పలు ప్లాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాట్ల యజమానులు హైడ్రా కమిషనర్‌కు గోడు వెళ్లబోసుకున్నారు. 1985లో 184 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ చేయగా తామంతా ప్లాట్లు కొన్నామని తెలిపారు. 2021లో కోవిడ్ సమయంలో రియల్ ఎస్టేట్ సంస్థల యజమానులు కుమ్మక్కై తమ లేఅవుట్‌ను కబ్జా చేశారని ఆరోపించారు. ఈ విషయం సుప్రీంకోర్టు వరకు వెళ్లిందని తెలిపారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు హైకోర్టు 4 వారాల్లో న్యాయం చేయాలని తీర్పు ఇచ్చిన విషయాన్ని కమిషనర్‌కు వివరించారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలిచ్చినా ఫలితం లేకుండా పోయిందని, స్థలం దరిదాపులకు వెళితే దాడులు చేశారని కన్నీరుమున్నీరయ్యారు. పది రోజుల్లో ఇరు పార్టీలను పిలిచి మాట్లాడతానని, ఆందోళన చెందవద్దని ప్లాట్ల యజమానులకు కమిషనర్ భరోసా ఇచ్చారు. అన్ని కోణాల్లో పరిశీలించి న్యాయం చేస్తానని చెప్పారు. మేడ్చల్ జిల్లాలోని చెంగిచెర్ల , బోడుప్పల్ ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ పర్యటించారు. దేవాదాయ శాఖ ట్రస్ట్ భూములను ఆక్రమించి పక్కనే ఉన్న తమ లేఅవుట్‌ను మాక్రమించేందుకు ఓ మాజీ ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని శ్రీమాత అరవింద కాలనీ వాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బోడుప్పల్ గ్రామంలో వికాస్ వెల్ఫేర్ కాలనీలో ఓ రాజకీయ నాయకుడు తమ ప్లాట్లు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, లేఅవుట్‌లో రోడ్లు, పార్కులు లేకుండా చేశాడని కమిషనర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. శ్మశానవాటిక స్థలం తనదేనంటూ ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని వివరించారు.

మేడిపల్లిలో అక్రమ నిర్మాణాలు నేలమట్టం

కాలనీ రోడ్డుపై నిర్మించిన గోడను కూల్చిన హైడ్రా అధికారులు



స్కూల్ యాజమాన్యం కబ్జాచేసిన నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా

మేడిపల్లి: మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండల పరిధిలోని అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం మోపింది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వరంగల్ జాతీయ రహదారికి ఆనుకుని సర్వే నెంబర్ 26ఎ, యాదాద్రి రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీకి వెళ్లే రహదారికి అడ్డంగా సేజ్ స్కూల్ యాజమాన్యం నిర్మించిన 30 అడుగుల గోడను జేసీబీలతో నేలమట్టం చేశారు. 15 ఏళ్లుగా రోడ్డు కబ్జాపై పోరాడుతున్నామని, ఇప్పుడు హైడ్రా గోడను కూల్చేయడంతో రోడ్డు వినియోగంలోకి రానుందని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూ ఆక్రమణలపై ఫిర్యాదులు అందడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం ఆ ప్రాంతాలను సందర్శించారు. పర్వతాపూర్ సర్వే నెంబర్-1లో మైనారిటీల శ్మశానవాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రంగనాథ్ మాట్లాడుతూ రెండురోజుల్లో సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎర్రకుంట చెరువు ప్రక్షాళనకు శ్రీకారం

లాలాపేట: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తార్నాక ఎర్రకుంట చెరువు పరిరక్షణకు ముందడుగు పడింది. దాదాపు 6 ఎకరాల చెరువును ప్రక్షాళన చేయడానికి హైడ్రా శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, హైడ్రా అధికారులు సంయుక్తంగా ఎర్రకుంట చెరువును సర్వే చేశారు. గతంలో నిర్ధారించిన 6 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఎఫ్‌టీఎల్, 9 మీటర్ల బఫర్ జోన్‌లలో మొత్తం 14 చోట్ల మార్కింగ్ చేశారు. చెరువులో తమ భూములు ఉన్నాయని చెబుతున్నావారందరినీ పిలిచి మాట్లాడారు. పూర్తి డాక్యుమెంట్లతో హైడ్రా కార్యాలయానికి రావాలని అధికారులు వారికి సూచించారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా చెరువు అభివృద్ధికి ఉన్న అడ్డంకులను తొలగిస్తామని చెప్పారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా స్థానికులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపామని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో మార్కింగ్ చేశామని చెప్పారు. హెచ్‌ఎండీఏ నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రాథమిక సమాచారం మేరకు చెరువును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



తార్నాక ఎర్రకుంట చెరువులో సర్వే చేస్తున్న అధికారులు

టీవర్క్స్-యూఎస్‌టీల మధ్య ఒప్పందం

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీవర్క్స్ ప్రముఖ సంస్థ యూఎస్‌టీ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఆ సంస్థల ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ప్రముఖ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్ కంపెనీ అయిన యూఎస్‌టీ తయారీ, ఇంజనీరింగ్ రంగాల్లో ఉత్పత్తి, ఆవిష్కరణలను వేగవంతం చేయడానికిగాను టీవర్క్స్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఆటోమోటివ్ ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, సెమీ కండక్టర్ ఏటీఈ ఫ్రేమ్‌వర్క్‌లు, స్మార్ట్ ఫ్యాక్టరీ ఇంటిగ్రేషన్ వంటి రంగాల్లో ఇది తోడ్పడనుంది. యూఎస్‌టీ తిరువనంతపురం క్యాంపస్‌లో యూఎస్‌టీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అలెగ్జాండర్ వర్గీస్, టీవర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల ఒప్పందం పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. అలెగ్జాండర్ వర్గీస్ మాట్లాడుతూ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్‌లో యూఎస్‌టీ విస్తృత స్థాయి నైపుణ్యాన్ని, టీవర్క్స్ అధునాతన ప్రోటో టైపింగ్ సామర్థ్యాలను మిళితం చేయడంలో భాగంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీవర్క్స్ అధికారులు సహజ్ ఆర్ సంధు, యూఎస్‌టీ తిరువనంతపురం సెంటర్ హెడ్ శిల్పా మీనా తదితరులు పాల్గొన్నారు.



టీవర్క్స్-యూఎస్‌టీతో ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్న రెండు సంస్థల ప్రతినిధులు

నగరంలో నేడు

- మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సాయంత్రం 5 గంటలకు 'అందాల పోటీలు- వ్యాపార సంస్కృతి'అనే అంశంపై సామాజిక సదస్సు జరుగుతుంది.
- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, భాషా సాంస్కృతిక శాఖ, ఆది-హిందూ సోషల్ సర్వీస్ లీగ్ సంయుక్తాధ్వర్యంలో మాదరి భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతోత్సవం సాయంత్రం 5.30 గంటలకు రవీంద్రభారతిలో జరుగుతుంది.
- మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- లూలూ మాల్‌లో నేటి నుంచి సమ్మర్ గేమ్స్ నిర్వహిస్తున్నారు. ఇందులో పికెల్ బాల్, ఆర్సీ కార్ రేస్, ఆర్సీ ఫుట్‌బాల్ వంటి గేమ్స్ ఉన్నాయి. వీటిని ఉచితంగా ఆడుకునే అవకాశం ఉంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 7 విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఈవీఎంల ట్యాంపరింగ్ సాధ్యమే..

– ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

పంజగుట్ట: టెక్నాలజీ తయారు చేసిన వాడికి దాన్ని ఎలా వాడాలో తప్పకుండా తెలుస్తుందని, ఈవీఎంలు తయారు చేసిన వాడికి దాన్ని ట్యాంపరింగ్ చేయడం కూడా తప్పకుండా తెలుస్తుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. దళిత్, ఆదివాసీ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'ఈవీఎంలల్లో ఫలితాలు, అణగారిన వర్గాల రాజ్యాధికారాన్ని అడ్డుకుంటున్నాయా ..?'అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు బి.ఎన్.రత్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య భవిష్యత్ మొత్తం ఎన్నికలపై ఉంటుందన్నారు. ఎన్నికలు సక్రమంగా, నిష్పక్షపాతంగా జరగకపోతే భారత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదమని అన్నారు. ఎన్నికలు లోపభూయిష్టమైతే దళిత, అట్టడుగు వర్గాల నాయకత్వం, ప్రత్యామ్నాయ నాయకత్వం పైకి వచ్చే అవకాశం లేదన్నారు. గతంలో ఎలక్షన్ కమిషన్‌ను నియమించే కమిటీలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కూడా మెంబర్‌గా ఉండే వారని, కానీ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ స్థానంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను సభ్యునిగా నియమించి ఎన్నికల కమిషన్‌ను జేబు సంస్థలా మార్చుకున్నారని ఆరోపించారు. ఓటర్లు కూడా అన్ని పార్టీల వద్ద డబ్బులు తీసుకుని ఓటు ఎవరికి వెయ్యాలో వారికే వేస్తున్నారని, అందుకే నాయకులు ఎన్నికల కమిషన్‌ను బలహీనపరిచారని అన్నారు. ఎన్నిక వ్యవస్థను, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని హరగోపాల్ పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ఎన్నికల నిఘా వేదిక అధ్యక్షుడు వి.వి.రావు, పీవోడబ్ల్యూ నేత సంధ్య, బొమ్మక్ మురళి, శక్తి అభియాన్ ప్రతినిధులు ప్రియాంక, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రేపు భరతనాట్యంలో

శ్రీనిధి, శివాని అరంగేట్రం

సాక్షి, సిటీబ్యూరో: ప్రఖ్యాత నృత్యకారుడు, శంకరానంద కళాక్షేత్ర డైరెక్టర్, పద్మశ్రీ డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ శిష్యులు శ్రీనిధి రామస్వామి, శివాని నంబియార్ భరతనాట్యంలో అరంగేట్రం చేస్తున్నారని కళాక్షేత్రం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమం మొదలవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా భరతనాట్య నర్తకి, శృతిలయ కేంద్ర నటరాజాలయం డైరెక్టర్ డాక్టర్ రాజేశ్వరి సాయినాథ్, నాట్య స్వర సమితి కళా విమర్శకుడు జీవీ అన్నారావు, ప్రముఖ నర్తకుడు, వైష్ణవి నాట్యశాల డైరెక్టర్ మిథున్ శ్యామ్ హాజరుకానున్నారని తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు

విచారణను జూన్ 11కి వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు: బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ విచారణకు ప్రతివాది అయిన సీఎం రేవంత్ రెడ్డి, పిటిషనర్ కాసం వెంకటేశ్వర్లు గైర్హాజరయ్యారు. దీంతో వీరి తరఫు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. దీంతో తదుపరి విచారణకు తప్పకుండా హాజరుకావాలని కోర్టు సూచిస్తూ జూన్ 11వ తేదీకి వాయిదా వేసింది. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగా సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని అసత్యపు ఆరోపణలు చేశారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. సుమారు 50 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న సభలో రేవంత్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే.

వర్సిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలి

అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం ఉద్యోగులు నిరంతరం కృషి చేయాలని, విద్యార్థులకు అందించే సేవలను మరింత విస్తరించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. ఓపెన్ యూనివర్సిటీ, బోధనేతర ఉద్యోగుల సంఘం, టెక్నికల్ ఆఫీసర్స్ స్టాఫ్ అసోసియేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం పీఎం-ఉషా నిధుల కింద యూజీసీ నుంచి రూ.25 కోట్లు మంజూరయ్యాయని, అందులోంచి దాదాపు రూ.10 కోట్లతో డిజిటల్ రిసోర్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కొత్త ప్రయోగశాల, సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్‌ను రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో పనిచేసే అత్యవసర సిబ్బందికి డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాన్ని నిర్మిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో విశ్వవిద్యాలయంలో మహిళలకు ప్రత్యేకంగా స్పోర్ట్స్ లాంజ్, ఉద్యోగుల ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం జిమ్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కేఎల్ విజయకృష్ణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎండీ మియాజాని, ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీ అశోక్, కోశాధికారి పాండు, టెక్నికల్ ఆఫీసర్స్ స్టాఫ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వసంతరావు, ప్రధాన కార్యదర్శి యాకేష్ దైదా, సంయుక్త కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి ధర్మకళ్యాణ్ పాల్గొన్నారు.

దక్షిణ తెలంగాణకు సాగునీరు ఇవ్వాలి

మాజీమంత్రి గుత్తా మోహన్‌రెడ్డి



పంజగుట్ట: దక్షిణ తెలంగాణలోని ప్రతీ రైతుకు కృష్ణా జలాలు అందేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టులు నిర్మించాలని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి గుత్తా మోహన్‌రెడ్డి కోరారు. బీఆర్‌ఎస్ 10 సంవత్సరాల పాలనలో దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చారని, ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి కాళేశ్వరం కడితే దక్షిణ తెలంగాణకు ఒక్క ఎకరం నీరు పారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కుటుంబాలకు విద్యా, ఉద్యోగం, రాజకీయాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి విజయ్ పాల్ రెడ్డి, రైతు సంఘాల ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, సీనియర్ పాత్రికేయుడు తెలంగాణ విఠల్ మాట్లాడుతూ మరో దక్షిణ తెలంగాణ ఉద్యమం ప్రారంభం కాకముందే, దక్షిణ తెలంగాణ తల్లి విగ్రహం రూపుదిద్దుకోక ముందే కృష్ణా నది పరీవాహకంలో ప్రాజెక్టులు రూపొందించాలని డిమాండ్ చేశారు. కృష్ణా నదిలో రాష్ట్రం వాటా తప్పకుండా రావాలని, ఆంధ్రప్రదేశ్‌తో కుమ్మక్కై వారికి తరలిస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. రైతులకు రుణమాఫీ ఇంకా పూర్తిగా కాలేదని, పాతవి ఇస్తూనే వర్షాకాలం వచ్చిన నేపథ్యంలో కొత్త రైతుబంధు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతును ఏడిపించిన ఏ ప్రభుత్వం ముందుకు సాగలేదని, రేవంత్ రెడ్డి రైతులను విస్మరించరాదని తెలిపారు.

దళితులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్న వివేక్



మాట్లాడుతున్న పిడమర్తి రవి. చిత్రంలో గజ్జెల కాంతం తదితరులు

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి

హిమాయత్‌నగర్/పంజగుట్ట: దళితులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవటం ఎమ్మెల్యే జి.వివేక్ కుటుంబానికి పరిపాటిగా మారిందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి విమర్శించారు. పెద్దపల్లిలో వివేక్‌కు పెద్ద అవమానం జరిగిందనడానికి మాల మహానాడు నాయకులకు సిగ్గు ఉండాలని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ కాకుండా చేయడానికి వివేక్ డ్రామా చేస్తున్నారని విమర్శించారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతంతో కలసి ఆయన మాట్లాడారు. జూన్ 1 నుంచి జూలై 31 వరకు ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమంలో పాల్గొన్న మాదిగలకు రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో మందకృష్ణ మాదిగ అనుచరులను మినహాయించి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి ఘనంగా సన్మానిస్తున్నట్లు తెలిపారు. వివేక్, వారి కుమారునికి ప్రోటోకాల్ పాటించడం లేదంటూ మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసి ధర్నాలు నిర్వహించడం సిగ్గుచేటని అన్నారు. సమావేశంలో బీఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, నాయకులు మీసాల మల్లేశం, బుదాల బాబురావు, లింగం యాదవ్, నక్క మహేష్, పాతకోటి కరన్, డా.బొమ్మెర స్టాలిన్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్రాండింగ్ ఆస్పత్రుల్లో 'కార్పొరేట్' వసతులు



కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ అజయ్ కుమార్

వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్

గచ్చిబౌలి: బ్రాండింగ్ ఆఫ్ హాస్పిటల్స్ పేరిట కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో వసతులను కల్పిస్తామని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. బుధవారం కొండాపూర్ జిల్లా ఆస్పత్రిని ఆయన సందర్శించారు. హాస్పిటల్‌లోని ఆయా విభాగాలను పరిశీలించి డాక్టర్లతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో 40 ఆస్పత్రులను ఎంపిక చేసి బ్రాండింగ్ ఆఫ్ హాస్పిటల్స్ పేరిట వసతుల కల్పనకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్ జిల్లా ఆస్పత్రితో పాటు వనస్థలిపురం, షాద్‌నగర్ ఆస్పత్రుల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఓపీ, ఫార్మసీ వద్ద ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రుల అధికారులను ఆదేశించారు. రోగుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు, అటెండెంట్స్‌కు క్యాంటీన్, సెక్యూరిటీ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కొండాపూర్ జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ అనురాగినిరెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్, ఆర్‌ఎంఓ డాక్టర్ చంద్రకృష్ణ పాల్గొన్నారు.

గొప్ప అభ్యుదయవాది సుకుమారన్

– సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా



సుకుమారన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అజీజ్ పాషా తదితరులు

హిమాయత్‌నగర్ : దేశంలో సాంస్కృతిక సహకారం ద్వారా శాంతిని పెంపొందించడానికి తీవ్రంగా కృషి చేసిన గొప్ప అభ్యుదయవాది టీఎస్ సుకుమారన్ అని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్) జాతీయ కార్యదర్శిగా కొనసాగుతున్న సుకుమారన్ విశాఖపట్నంలోని స్వగృహంలో ఆకస్మికంగా మరణించారని తెలిపారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూమ్ భవన్‌లో ఇస్కఫ్ రాష్ట్ర శాఖ ఏర్పాటు చేసిన సుకుమారన్ సంతాపసభలో అజీజ్ పాషా మాట్లాడారు. ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రేఖల గోపాల్, ఐపీసో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేపీఎల్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్, ఇస్కఫ్ రాష్ట్ర నాయకులు ఎండి.మహబూబ్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అజీజ్ పాషా మాట్లాడుతూ దోపిడీ, వివక్షకు గురైన ప్రజల స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం శాంతియుత ఉద్యమాలు చేసిన సుకుమారన్ ప్రగతిశీల నేత అని కొనియాడారు. ప్రజల నుంచి ప్రజలకు సాంస్కృతిక అవగాహన, స్నేహాన్ని ప్రోత్సహించేందుకు ఆయన విశేషంగా కృషి చేశారని కొనియాడారు.



నాలుగు దశాబ్దాల చరిత్రను ఇముడ్చుకున్న చారిత్రక నగరం మరెన్నో చరిత్రలు తిరగరాస్తూ దూసుకుపోతోంది. అటు ఐటీ ఇటు రియల్టీ మరోవైపు ఫార్మా, ఇంకోవైపు సినిమా.. ఇలా ఏ రంగంలో చూసినా ఎదురేలేదు అన్నట్టు ఎదుగుతోంది. ఈ నేపథ్యంలో మరి కొన్నేళ్ల పాటు ఈ దూకుడు ఇలాగే కొనసాగనుందని, దేశంలోనే మన సిటీ అగ్రగామిగా అవతరించనుందని జేఎల్ఎల్ సంస్థ తాజా నివేదిక వెల్లడించింది. ఆ నివేదిక వెల్లడించిన విశేషాల్లో కొన్ని..

- సాక్షి, సిటీబ్యూరో



హైరేంజ్‌లో.. హైదరాబాద్

ఐటీ నుంచి రియల్టీ దాకా అన్నింటా ఫుల్ స్పీడ్

- స్టార్టప్స్ నుంచి మాల్స్ దాకా అదే దూకుడు
- అంతర్జాతీయ జీవనశైలి, సంతులిత అభివృద్ధి
- నగరాభివృద్ధికి బాటలు వేస్తున్న కారణాలెన్నో..
- పెట్టుబడుల విశ్లేషణా సంస్థ జేఎల్ఎల్ నివేదిక వెల్లడి

దేశంలో అభివృద్ధి కేంద్రంగా నగరం స్థిరపడుతోంది. పలు రంగాల్లో ప్రగతితో పాటు ప్రణాళికాబద్ధమైన మౌలిక వసతుల అభివృద్ధి, విస్తరించిన అంతర్జాతీయ స్థాయి జీవనశైలి కారణంగా నగరంలో నివాస, వాణిజ్య గిడ్డంగుల విభాగాల్లో వేగవంతమైన అభివృద్ధి కొనసాగుతోంది. విశ్లేషకుల అంచనాల ప్రకారం, నగరంలో వచ్చే 3–4 సంవత్సరాల్లో లక్ష కొత్త నివాస యూనిట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ప్రధాన రిటైల్ కంపెనీలు నగరంలో తమ పరిధిని విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఇది పెట్టుబడిదారుల విశ్వాసాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది.

ఐటీ నుంచి స్టార్టప్స్ దాకా..


నగరంలో ఐటీ/ఐటీఈఎస్ రంగం సిటీ దూకుడుకు దోహదం చేస్తున్న ప్రధానమైన డ్రైవర్‌గా నిలుస్తోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో నగరం 32 బిలియన్ డాలర్ల విలువైన ఐటీ ఎగుమతులతో దేశంలోనే రెండవ స్థానాన్ని సాధించింది. ఇక్కడ 4 వేలకు పైగా స్టార్టప్‌లు విజయవంతంగా కొనసాగుతున్నాయి. దేశంలోని మొత్తం గ్రేడ్ ఏ కార్యాలయ స్థలాల్లో 15.6 శాతం భాగస్వామ్యంతో నగరం ముందంజలో నిలిచింది. అలాగే, దేశంలోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో(జీసీసీఎస్) 17 శాతం నగరంలో ఉన్నాయి.



ఆఫీస్ స్పేస్‌కి డిమాండ్

మెరుస్తున్న మాల్స్

2019 నుంచి ఇప్పటి వరకు 78.2 మిలియన్ స్క్వేర్ ఫీట్ల గ్రేడ్ ఏ కార్యాలయ స్థలాన్ని నగరం జోడించగా, 2024లో 7.31 మిలియన్ స్క్వేర్ ఫీట్ల కార్యాలయ స్థలాన్ని ఆక్రమించడం జరిగిందని జేఎల్ఎల్ పేర్కొంది. ఇది అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 6.1 శాతం అధిక వృద్ధిగా తేల్చింది. నగరంలోని గ్రేడ్ ఏ షాపింగ్ మాల్స్ స్థలం 9.86 మిలియన్ స్క్వేర్ ఫీట్లుగా లెక్కించింది. ఇక నగరంలో రానురానూ ఖాళీ స్థలాలు తగ్గుముఖం పడుతున్నాయి. ఇది ఆరోగ్యకరమైన డిమాండ్‌కి సంకేతంగా భావించవచ్చు. మరోవైపు డేటా సెంటర్ల సామర్థ్యం కూడా వచ్చే రెండు సంవత్సరాల్లో 23 మెగావాట్ల మేరకు పెరగనుంది. తద్వారా హైదరాబాద్ ఒక ప్రధాన డేటా సెంటర్ హబ్‌గా మారనుంది. దీని సామర్థ్యం 2020 మొదటి అర్ధభాగంలో 32ఎం.డబ్ల్యు నుంచి 2025 నాటికి నాలుగు రెట్లు పెరిగి 130ఎం.డబ్ల్యుకు చేరుకుంటుంది.



హైదరాబాద్‌కి ఈ ఊపు ఎందుకు..?

'హైదరాబాద్‌లో 17 శాతం గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు(జీసీసీఎస్) ఉండటం దేశీయ వాణిజ్య రియల్ ఎస్టేట్ రంగంలో కీలకమైన మలుపు కాగా ఈ కేంద్రాల నాణ్యత, పరిధి నగర స్థిరాభివృద్ధికి అండగా నిలుస్తాయి,' అని ప్రముఖ అర్బర్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యవస్థాపకుడు చిరాగ్ మెహతా అన్నారు. జేయుఎస్‌టివో రియల్ ఫిన్ టెక్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు పుష్పమిత్ర దాస్ మాట్లాడుతూ 'హైదరాబాద్ రానున్న రెండేళ్లలో ఏడాదికి 17–19 మిలియన్ స్క్వేర్ ఫీట్ల కార్యాలయ స్థలాన్ని జోడించనుందని, అలాగే, గిడ్డంగుల సామర్థ్యాన్ని మరో 4 మిలియన్ స్క్వేర్ ఫీట్లకు పెంచనుందనీ తెలిపారు. ఈ అభివృద్ధికి దోహదం చేస్తున్న అంశాల్లో ఆయన అభిప్రాయం ప్రకారం, 'బెంగళూరుతో పోలిస్తే హైదరాబాద్ ఒక సంతులిత ఆర్థిక వ్యవస్థను నిర్మించగలిగింది. ఇది ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, లాజిస్టిక్స్ ఇలా భిన్న రంగాల్లో వృద్ధిని చూపిస్తోంది. 'మెగా మాస్టర్ ప్లాన్ 2050, ముచెర్ల 4.0 ఐటీ హబ్, మెట్రో రైలు విస్తరణ వంటి ప్రణాళికలు నగరాభివృద్ధిని మరింత వేగవంతం చేస్తాయని ఆయన జోస్యం చెప్పారు. అంతేకాకుండా బెంగళూరుతో పోలిస్తే స్థిరాస్తి ధరలు తక్కువగా ఉండటం వల్ల కూడా ఇది పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన గమ్యంగా మారిందని అన్నారు. 'నాణ్యమైన వసతులు, తక్కువ ధరలతో వ్యాపారం నిర్వహించాలనుకునే సంస్థలకు హైదరాబాద్ గొప్ప అవకాశం,' అని దాస్ అన్నారు. 'పలు రంగాల్లో సమతులిత అభివృద్ధి కనిపిస్తుండటంతో పాటు మౌలిక వసతుల పురోగతికి పెట్టుబడుల ద్వారా దీర్ఘకాలిక లాభాలు పొందవచ్చు.' అన్నారాయన.



హిమాలయ వనాల స్ఫూర్తిగా డిజైన్లు



హిమాలయ వనాల్లోని పుష్పాల నుంచి స్ఫూర్తి పొంది రూపొందించిన బొటానికల్ ప్రింటెడ్ శారీస్, ఇతర దుస్తులు కలెక్షన్‌ను ప్రముఖ దుస్తుల బ్రాండ్ రా మ్యాంగో అందుబాటులోకి తెచ్చింది. బంజారాహిల్స్‌లోని సంస్థ స్టోర్‌లో ఈ కలెక్షన్‌ను బుధవారం విడుదల చేసిన సందర్భంగా షోరూమ్ ప్రతినిధులు మాట్లాడుతూ చేతితో పెయింటింగ్ వర్క్ చేసిన ఈ ఫ్లోరల్ డిజైన్లను లైట్ మల్బరీ సిల్క్ ఫ్యాబ్రిక్‌తో ఆకట్టుకునేలా తీర్చిదిద్దామన్నారు. నగరంలోని తమ స్టోర్స్‌లో ఇవి అందుబాటులో ఉంటాయన్నారు. **- సాక్షి, సిటీబ్యూరో**

ఉద్యోగాల వేటలో.. 68శాతం మంది



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మూడింట రెండు వంతుల మంది వృత్తి నిపుణులు(68%) కొత్త అవకాశాలను అందుకోవడానికి సిద్ధంగా ఉన్నారనీ, కానీ ఏ ఉద్యోగం ఎక్కడ? ఏ పరిశ్రమలో అన్వేషించాలో తెలియని పరిస్థితిలో అత్యధికులు ఉన్నట్టు తేలింది.. ప్రముఖ అంతర్జాతీయ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ అయిన లింక్డ్‌ఇన్ చేసిన కొత్త పరిశోధన ఫలితాన్ని లింక్డ్‌ఇన్ కెరీర్ నిపుణులు నీరాజిత బెనర్జీ వెల్లడించారు. ఈ పరిశోధనను అనుసరించి ఉద్యోగార్థుల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగాలను కనుగొనడంలో సహాయపడటానికి లింక్డ్‌ఇన్ కొత్త ఏఐ–ఆధారిత ఉద్యోగ శోధన అనుభవాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఉద్యోగ అన్వేషణలో అవసరమైన చిట్కాలను కూడా అందిస్తున్నామన్నారు.



నగరం కేవలం ఐటీ హబ్ మాత్రమే కాదు. విభిన్న రుచుల సంగమం. శతాబ్దాలుగా బిర్యానీ పరిమళాలతో పేరుగాంచిన మన నగరం, ఇప్పుడు స్ట్రీట్ ఫుడ్ సంస్కృతిలో కొత్త ఒరవడి సృష్టిస్తోంది. బిర్యానీ, హలీం వంటి క్లాసిక్ వంటకాలు ఎప్పటికీ చిరపరిచితమైనవే అయినా, ఇప్పుడు కొత్త తరహా ఫ్యూజన్ ఫుడ్, ఇంటర్నేషనల్ వంటకాలతో నగర వీధులు ఘుమఘుమలకు వేదికలుగా మారిపోయాయి. ఫుడ్ అంటే కేవలం తినేది కాదు.. ఇప్పుడు అది అనుభవించే జీవనశైలి భాగంగా మారింది. దీనికి ఫుడ్ బ్లాగింగ్ మరింత ప్రాచుర్యాన్ని కల్పిస్తోంది. విదేశీ ఫుడ్ బ్లాగర్స్ ఫుడ్‌టూర్‌లో భాగంగా నగరంలో సందడి చేస్తున్నారు. వారి వీడియోలు విశ్వవ్యాప్తంగా వైరల్‌గా మారుతున్నాయి.

- సాక్షి, సిటీబ్యూరో





స్ట్రీట్ ఫుడ్.. ఫీల్ గుడ్

బిర్యానీ, హలీం కాకుండా కొత్తగా స్ట్రీట్‌ఫుడ్‌పై ఫోకస్

వైరల్ అవుతున్న విదేశీ ఫుడ్ బ్లాగర్స్ వీడియోలు

ఇప్పటి యువత కేవలం రెస్టారెంట్‌లకే పరిమితం కాలేదు. వీధుల్లో అందుబాటులో ఉన్న కొత్త రుచుల కోసం క్యూ కడుతున్నారు. చిన్న చిన్న బండ్లపై కనిపించే పైనాపిల్ డోసా, బబీ బాట్స్, ఫైర్ పానీపూరీ, ఐస్ మల్లై టిండి వంటి ప్రయోగాత్మక ఐటమ్స్ ఇప్పుడు హాట్ ట్రెండ్స్. సికింద్రాబాద్ మటన్ కీమా దోసా, హిమాయత్‌నగర్ టిబ్బటన్ మోమోస్, గచ్చిబౌలి కొరియన్ స్ట్రీట్‌ఫుడ్ – ఇవన్నీ యువతను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి.

ఫుడ్ బ్లాగింగ్ ట్రెండ్.

ఈ విప్లవానికి కేంద్ర బిందువుగా నిలుస్తోంది ఫుడ్ బ్లాగింగ్. యూట్యూబ్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ వేదికలపై హైదరాబాదీ యువత ఫుడ్ రీల్స్, రివ్యూలతో వైరల్ కంటెంట్ సృష్టిస్తున్నారు. బండి వద్ద కూర్చొని తినే ఒక చిన్న వీడియో లక్షల వ్యూస్‌ను తెచ్చిపెడుతోంది. ఫుడ్ బ్లాగర్ల ప్రసారం వల్ల చిన్న స్టాల్స్‌కు కూడా అంతర్జాతీయ గుర్తింపు రావడం విశేషం. ''అవి కేవలం బండ్లు కావు, అవి డ్రీమ్ టేస్టీ హబ్స్'గా మారుతున్నాయి. ఎక్కడికైనా కొత్తగా ఓ వెరైటీ వంటకం కనిపిస్తే క్యూ కడుతున్నారు. ఇలా బ్లాగర్ల దృష్టిలో పడితే చిన్న ఫుడ్ స్టాల్స్‌కు కూడా గుర్తింపు వస్తోంది.

విదేశీ వ్లాగర్స్‌కి టేస్టీ సర్‌ప్రైజ్..

ఇటీవల కొంతమంది విదేశీ ఫుడ్ వ్లాగర్లు హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడి వీధి వంటకాలపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చిన్న చిన్న పానీపూరీ బండ్ల దగ్గర నిలబడి, 'ది బెస్ట్ థింగ్ ఐ ఎవర్ ఈట్!' అంటూ ఇంగ్లిష్‌లో చెప్పే మాటలు యూట్యూబ్‌లో ట్రెండింగ్ అయ్యాయి. వీధి వంటల అద్భుత రుచితో ఇక్కడి ఆతిథ్యం, సరదా వాతావరణం వాళ్లను ఎంతగానో ఆకట్టుకుంది. దాంతో విదేశీయుల కళ్లలో కూడా నగరం ఒక ఫుడ్ డెస్టినేషన్‌గా గుర్తింపు పొందింది. ప్రస్తుతం అమెరికా, యూరప్, మిడిల్ ఈస్ట్ నుంచి వచ్చిన ఫుడ్ వ్లాగర్లు హైదరాబాదీ స్ట్రీట్ ఫుడ్‌ను మరింతగా ప్రచారం చేస్తున్నారు. 'ఇంత అతంటిక్ ఫుడ్ వీధుల్లో దొరుకుతుందా?' అంటూ ఆశ్చర్యపోతున్నారు.

హైదరాబాదీ ఫుడ్ అదుర్స్..

ఈమధ్య యూఎస్ఏకి చెందిన క్రిష్ లూయిస్ ఫుడ్ టూర్ వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇక్కడి స్పైసీ ఫుడ్, స్వీట్లు, పరోటా, చికెన్–65, రోడ్‌సైడ్ మిర్చి తనకు ఎంతో నచ్చాయంటూ వీడియోలను పోస్ట్ చేస్తున్నాడు.

లైఫ్ స్టైల్ ఫుడ్‌కి కొత్త నిర్వచనం..

ఇప్పుడు ఫుడ్ తినడం కేవలం ఆకలి తీర్చుకోవడం కాదు. అది ఫ్రెండ్స్‌తో రాత్రివేళ స్ట్రీట్ టూర్‌కు వెళ్లడం, కొత్త స్టాల్ కనుగొనడం, అందులో ప్రత్యేకమైన ఐటెం రుచి చూసి, దాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడం.. ఇవన్నీ ఒక లైఫ్‌స్టైల్‌గా మారిపోయాయి. 'నేడు ఏ స్ట్రీట్ ఐటెం ట్రై చేయాలి?' అనే ప్రశ్న, ప్రతీ ఫుడ్ లవర్ డైలీ రొటీన్‌లో భాగం అయ్యింది.

ఫుడ్ క్రియేటివిటీతో..

హైదరాబాద్ ఇప్పుడు కేవలం చారిత్రక కట్టడాల నగరమే కాదు. ఇది రుచుల పండుగలా మారింది. స్ట్రీట్‌ఫుడ్ ద్వారా స్థానికులు తమ క్రియేటివిటీని చూపిస్తూ, జీవనశైలిని కొత్త కోణంలో నిర్వచిస్తున్నారు. ఫుడ్ బ్లాగర్లు, ఫుడ్ ప్రియులు, ప్రయాణికులు అందరూ కలిసి ఈ నగరాన్ని ఒక రుచుల ప్రయాణ కేంద్రంగా మార్చేశారు.



అద్భుతం.. చిన్నారుల చిత్తరువులు..

- టీజీపీసీబీ ఆధ్వర్యంలో పోటీలు
- నగరవ్యాప్తంగా 250 మంది విద్యార్థులు హాజరు

- ప్లాస్టిక్ కాలుష్యం అంతం చేయడంపై సందేశాత్మక పెయింటింగ్స్



సనత్‌నగర్: చిన్నారులు అద్భుత చిత్తరువులతో అమూల్య సందేశాన్ని అందించారు. ప్లాస్టిక్ భూతంతో పర్యావరణాన్ని మనమే హరించేస్తున్నామంటూ ఆ చిన్ని మస్తిష్కాలు హెచ్చరించాయి. ఇకనైనా మేల్కొకపోతే భవిష్యత్తు తరాలు ప్రశ్నార్థకం అంటూ ఆ చిట్టి బుర్రలు గీసిన చిత్రాలు స్ఫూర్తిని నింపాయి. పర్యావరణాన్ని నాశనం చేసుకుంటూ ఆకాశానికి నిచ్చెనలు వేసుకుంటూ వెళ్తుండటం మానవ మనుగడకు శ్రేయస్కరం కాదంటూ బొమ్మలతో మేల్కొల్పే ప్రయత్నం చేశారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా టీజీపీసీబీ(తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి) ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని ప్రధాన కార్యాలయంతో పాటు జవహర్ బాలభవన్‌లో డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. నగరం నలుమూలల నుంచి కదిలి వచ్చిన వివిధ పాఠశాలల విద్యార్థులు ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనే అంశంపై ఆలోచింపజేసే చిత్రాలను గీశారు. దాదాపు 250 మంది విద్యార్థులు పర్యావరణ సంబంధిత అంశాలపై అందమైన చిత్రాలను గీసి పెయింటింగ్ వేశారు. ముఖ్యంగా భూమి, నీరు, గాలి, ప్లాస్టిక్ కాలుష్యం, ఎనర్జీ సేవింగ్, నీటి సంరక్షణ, మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపు, కాలుష్యం నుంచి భూమిని రక్షించే అనేక అంశాలపై చిత్రాలను గీశారు. విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు వచ్చేనెల 5న పర్యావరణ దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ ధర్మేందర్, డ్రాయింగ్ మాస్టర్లు నరేందర్, రాములు, మల్లేశం, ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.





45 ఏళ్ల అజ్ఞాతం.. అడవిలోనే అంతం

శ్రీకాకుళం జిల్లా జియ్యన్నపేట కేశవరావు స్వస్థలం • ఆర్ఎస్‌యూ సభ్యుడి నుంచి సుప్రీం కమాండర్‌గా ఎదిగిన నంబాల

35 ఏళ్లపాటు మిలటరీ ఆపరేషన్ల నిర్వహణ బాధ్యతలు • మావోయిస్టు పార్టీ ఏర్పాటులో కీలకపాత్ర

'అలిపిరి' సహా అనేక దాడులకు బాధ్యుడు, వ్యూహకర్త

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/కాజీపేట అర్బన్: మావోయిస్టు పార్టీ తన ప్రస్థానంలో ఎన్నో ఎదురు దెబ్బలు కాసింది. కానీ.. ఆ పార్టీకి బుధవారం తగిలిన ఎదురుదెబ్బ మాత్రం అశనిపాతమే. పార్టీ సుప్రీం కమాండర్‌గా ఉన్న ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు (ఎన్కే) అలియాస్ బసవరాజు అలియాస్ గంగన్న ఎవరూ ఊహించని విధంగా ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పోలీసు తూటాలకు నేలకొరిగారు. మిలటరీ ఆపరేషన్ల నిర్వహణలో దిట్టగా గుర్తింపు పొందిన నంబాల అనేక భారీ దాడులకు వ్యూహకర్తగా వ్యవహరించారు.



కేశవరావు చదువుకున్న ప్రాథమిక పాఠశాల


కాలేజీ రోజుల్లో...

విద్యార్థి దశ నుంచే..

కేశవరావు స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలోని జియ్యన్నపేట. వాసుదేవరావు, లక్ష్మీనారాయణమ్మ దంపతులకు 1955లో జన్మించారు. ఆయనకు ఇద్దరు సోదరులు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. తండ్రి ఉపాధ్యాయుడు కాగా 1 నుంచి 5 వరకు స్వగ్రామమైన జియ్యన్నపేటలోనే విద్యనభ్యసించారు. ఆ తర్వాత 6 నుంచి 10 వరకు టెక్కలి మండలం తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్‌లోను, టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్, టెక్కలి ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారుడిగా రాణించిన కేశవరావు విద్యార్థి దశలోనే విప్లవ భావజాలానికి ఆకర్షితుడయ్యారు. విద్యార్థి దశలో తన స్వగ్రామం వచ్చి తనకు రావాల్సిన వాటాను ఆస్తిగా ఇస్తే, పేదలకు పంపిణీ చేస్తానని తండ్రిని అడిగినట్టు సమాచారం. వరంగల్‌లోని రీజనల్ ఇంజినీరింగ్ కాలేజీలో (ఇప్పటి నిట్) బీటెక్ చేశారు. ఆ సమయంలోనే విప్లవ పార్టీలతో పరిచయాలు ఏర్పడ్డాయి. రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) సభ్యుడిగా చేరిన ఆయనకు సీపీఐ (ఎంఎల్) అగ్రనేతలు కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తితో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి.

మలుపు తిప్పిన ఎంటెక్..

ఎంటెక్ చదువుతుండగా కళాశాలలోని మెస్‌లో జరిగిన చిన్నపాటి వివాదం కేశవరావు జీవితాన్ని మలుపు తిప్పింది. రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ లీడర్‌గా కేశవరావు ఉన్న సమయంలో మరో విద్యార్థి సంఘం ఏబీవీపీతో జరిగిన వివాదానికి సంబంధించిన కేసులో ఆయన చిక్కుకున్నారు. అరెస్టు చేస్తారన్న సమాచారంతో.. 1980లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన కేశవరావు 1982లో చింతపల్లి ప్రాంతంలో పోలీసులకు పట్టుబడ్డారు. విశాఖపట్టణం సెంట్రల్ జైలులో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆ తర్వాత ఆయన ఆచూకీ లేదు.

ఒక్కసారి కూడా ఇంటికి రాలేదు..

కేశవరావు విప్లవ పార్టీలో చేరిన తరువాత ఒక్కసారి కూడా తన స్వగ్రామం జియ్యన్నపేటకు రాలేదు. 1980లో పీపుల్స్ వార్ పార్టీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. తొలుత గంగన్న అనే పేరుతో పీపుల్స్ వార్ ఈస్ట్ డివిజన్ కార్యదర్శిగా చేశారు. 1987లో ఈస్ట్ డివిజన్‌ను విస్తరించి ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీ ప్రాంతాలను కలుపుతూ దండకారణ్య కమిటీ ఏర్పాటు ఆయన ఆలోచనే. ఆ కమిటీలో కేశవరావుతో పాటు మల్లోజుల కోటేశ్వరరావు, కటకం సుదర్శన్ కీలకపాత్ర పోషించారు.


స్వగ్రామంలోని కేశవరావు గృహం

ఎల్‌టీటీఈ ద్వారా శిక్షణ

1990లో కేశవరావు పీపుల్స్‌వార్ పార్టీ అగ్రనేతగా ఎదిగారు. ఆ తరువాత పీపుల్స్ వార్ పార్టీకి గుండెకాయ వంటి దండకారణ్య కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. కేశవరావు పేలుడు పదార్థాల తయారీ నిపుణుడిగా, మిలటరీ ఆపరేషన్ల వ్యూహ నిపుణుడిగా గుర్తింపు పొందారు. అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ కీలక నేతలు మల్లోజుల కోటేశ్వరరావు, మల్లోజుల వేణుగోపాల్, మల్లా రాజిరెడ్డిలతో కలసి 1987లో మధ్యప్రదేశ్‌లోని బస్తర్ అడవుల్లో పేలుడు పదార్థాల ప్రయోగం, గెరిల్లా దాడుల్లో శిక్షణ పొందారు. ఎల్‌టీటీఈ ద్వారా వీరు ఈ శిక్షణ తీసుకున్నారు.

దేశవ్యాప్త మిలటరీ ఆపరేషన్లకు నేతృత్వం

పీపుల్స్‌వార్ పార్టీలో ప్రత్యేక మిలటరీ ఆపరేషన్స్ విభాగం ఏర్పాటు చేయాలని 1995లో గణపతి, కేశవరావు భావించారు. ఆ మిలటరీ ఆపరేషన్స్ విభాగానికి బసవరాజు, బీఆర్ పేర్లతో కేశవరావే నేతృత్వం వహించారు. 2001లో పీపుల్స్‌వార్ 7వ కాంగ్రెస్‌లో సెంట్రల్ మిలటరీ కమిషన్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. అప్పటి వరకు దండకారణ్య ప్రాంతానికే పరిమితమైన ఆయన ఆ తర్వాత దేశవ్యాప్తంగా పీపుల్స్‌వార్ పార్టీ మిలటరీ ఆపరేషన్లను పర్యవేక్షించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి బిహార్, ఉమ్మడి మధ్యప్రదేశ్, ఒడిశాలో వేలాదిమందికి గెరిల్లా పోరాటంలో శిక్షణ ఇచ్చారు.

2016లో సుప్రీం కమాండర్‌గా..

పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు పార్టీ సెంటర్(ఎంసీసీ)ను విలీనం చేయడంలో గణపతి, కేశవరావు జోడీ ప్రధాన పాత్ర పోషించింది. గణపతి మొదటి ప్రధాన కార్యదర్శిగా పనిచేయగా.. కేశవరావు మిలటరీ కమిషన్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 2016లో వయోభారంతో గణపతి ఆ పదవి నుంచి వైదొలగడంతో ప్రధాన కార్యదర్శి హోదాలో కేశవరావు సుప్రీం కమాండర్‌గా నియమితులయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో రెండు దశాబ్దాల పాటు పీపుల్స్‌వార్/మావోయిస్టు పార్టీ జరిపిన అన్ని ప్రధాన దాడుల వెనుక వ్యూహకర్త నంబాల కేశవరావే అని పోలీసులు చెబుతారు. గెరిల్లా వార్‌ఫేర్, ఆయుధాల తయారీ, మెరుపు దాడులు చేయడం వంటి అంశాల్లో నంబాల కేశవరావుకు దిట్టగా పేరుంది. స్వతహాగా ఇంజనీరింగ్ చదివి ఉండడంతో ఆ నైపుణ్యాన్ని పార్టీ బలోపేతానికి వినియోగించినట్టు చెబుతారు. పీపుల్స్‌వార్ చరిత్రలో తొలిసారి 1987లో తూర్పుగోదావరి జిల్లా దారగడ్డలో పోలీసు బలగాలపై గెరిల్లా దళం దాడికి కేశవరావు నేతృత్వం వహించారు. ఆ దాడిలో ఆరుగురు పోలీసులు మరణించారు.

అలిపిరి ఘటనకు, ఇతర భారీ దాడులకు బాధ్యుడు

2003 అక్టోబర్ 1న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుపై తిరుపతిలోని అలిపిరిలో క్లెమోర్ మైన్స్ దాడి వ్యూహం కేశవరావుదే. 2008లో ఒడిశా నాయగఢ్‌లో పోలీసుల ఆయుధాగారంపై దాడిచేసి వెయ్యికి పైగా ఆధునిక ఆయుధాలను అపహరించుకుపోయిన దాడికి నేతృత్వం వహించారు. 2010లో ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో 76 మంది సీఆర్‌పీఎఫ్ బలగాలను బలిగొన్న దాడికి వ్యూహకర్త నంబాల కేశవరావే. ఆ దాడికి హిడ్మా నేతృత్వం వహించాడు. 2013లో ఛత్తీస్‌గఢ్ మాజీ మంత్రి, మావోయిస్టులకు వ్యతిరేకంగా సల్వా జడుం వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మతో పాటు కాంగ్రెస్ నేత నందకుమార్ మరో 27మందిని బలిగొన్న దాడికి కూడా కేశవరావే వ్యూహకర్త. విశాఖ జిల్లా అరకులో అప్పటి ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు హత్య ఘటనలోనూ కేశవరావు ప్రమేయం ఉందన్న వాదనలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నయాగరా, చింతల్నార్, బలిమెల వంటి దాడులు కూడా ఆయన నేతృత్వంలోనే చోటుచేసుకున్నాయి. శత్రువులుగా భావించిన వారికి మాటల కంటే తూటాలతోనే ఎక్కువ బదులిస్తారనే పేరు మోశారు. కాగా బసవరాజు పేరు ఏపీ, తెలంగాణలో కంటే జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో ఎక్కువ ప్రాచుర్యంలో ఉంది.

నీడను కూడా నమ్మని మావోయిస్టు పార్టీ

గెరిల్లా పోరాట పంథాను అనుసరిస్తుండటంతో మావోయిస్టు పార్టీ నీడను సైతం నమ్మకుండా జాగ్రత్తలు తీసుకుంటుంది. పార్టీలో ఏదైనా విభాగానికి నిర్దిష్టమైన పనులు తప్ప మొత్తం వ్యవహారంపై అవగాహన ఉండదు. అయితే జాతీయ ప్రధాన కార్యదర్శి పొలిట్‌బ్యూరో, సెంట్రల్ మిలటరీ కమిషన్, రాష్ట్ర కమిటీలు, వివిధ డివిజన్ కమిటీలను సమన్వయం చేయడం, ఆర్థిక, ఆయుధ వ్యవహారాలను చక్కదిద్దడం వంటి పనులు చూస్తుంటారు. ఎక్కడ నుంచి ఆయుధాలు వస్తుంటాయి, ఆర్థిక వనరుల ఆనుపానులు ఎక్కడ ఉంటాయి, పార్టీకి సంబంధించిన కీలక నేతలు ఎక్కడ షెల్టర్లలో ఉన్నారనే అంశాలు కూడా ఆయనకే ఎక్కువగా తెలుస్తాయి. ఇప్పటికే పెరిగిన నిర్బంధంతో ఆ పార్టీ విభాగాలు, కీలక నేతలు చెల్లాచెదురయ్యారు. ఇప్పుడు కేంద్ర కార్యదర్శే చనిపోవడంతో పార్టీకి సంబంధించిన వివిధ విభాగాల మధ్య సమన్వయం దెబ్బతినే అవకాశముందని భావిస్తున్నారు.

ఒక్కసారి చిక్కినా విదిలించుకుని..

నంబాల కేశవరావు విద్యార్థి సంఘాలు ఆర్ఎస్‌యూ, ఏబీవీపీ ఘర్షణల్లో ఒక్కసారి మాత్రమే అరెస్టయ్యారు. 1987లో విశాఖపట్నానికి ఒంటరిగా వచ్చిన ఆయన్ను పట్టుకునేందుకు పోలీసులు యత్నించారు. అయితే కబడ్డీ క్రీడాకారుడు కావడంతో చాకచక్యంగా విదిలించుకుని పరారయ్యారు. మిలటరీ ఆపరేషన్ల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన ఆయనపై రూ.10 లక్షలతో మొదలైన పోలీసు రివార్డు రూ.1.50 కోట్లకు చేరుకుంది. పోలీసు శాఖ మోస్ట్‌వాంటెడ్ లిస్టులో అత్యధిక రివార్డు కేశవరావుపైనే ఉందని సమాచారం. 45 ఏళ్ల క్రితం విద్యార్థిగా ఇంటిని వదిలివెళ్లిన కేశవరావు మావోయిస్టు అగ్రనేతగా ఎదిగి అప్పట్నుంచీ అజ్ఞాతంలోనే జీవితాన్ని గడిపారు. చివరకు అడవిలోనే ప్రాణాలు విడిచారు. కేశవరావు కుటుంబం విశాఖపట్నంలోనే స్థిరపడింది.

నంబాల ఎన్‌కౌంటర్

▶ మొదటి పేజీ తరువాయి


మాడ్ డివిజన్ సీనియర్ కేడర్, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) సభ్యులు సైతం ఉన్నారని పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలకు తోడు నారాయణపూర్, దంతెవాడ, బీజాపూర్, కొండగావ్ జిల్లాల డీఆర్‌జీ దళాలు మంగళవారం రాత్రి సెర్చ్ ఆపరేషన్ మొదలెట్టాయి. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున ఇరువర్గాల మధ్య మొదలైన కాల్పులు ఉదయం 11గంటల వరకు కొనసాగాయి. ఈ కాల్పుల్లో మధు, నవీన్ అనే డివిజన్ స్థాయి నేతలు కూడా మరణించినట్లు తెలుస్తోంది. మధు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కాగా, నవీన్ మావోయిస్టు పార్టీ పత్రిక 'జంగ్' బాధ్యతలు చూస్తున్నట్లు సమాచారం.బాపట్ల జిల్లా చీరాల మండలం జాండ్రపేటకు చెందిన చేనేత కుటుంబంలో పుట్టిన సజ్జా నాగేశ్వరరావు అలియాస్ నవీన్ గత 36 ఏళ్లుగా విప్లవోద్యమంలో అజ్ఞాత జీవితం గడుపుతున్నారు. ఆపరేషన్ జరిగిన తీరుతెన్నులు, ఇతర మృతుల వివరాలను పోలీసులు ప్రకటించలేదు. అయితే 27 మంది మావోయిస్టుల మృతదేహాలతో పాటు


నవీన్

పెద్ద సంఖ్యలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మావోయిస్టుల కోసం గాలింపు ఇంకా కొనసాగుతోంది.

ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్ల ఆధారంగా.. గతనెల 18న నారాయణ్‌పూర్ జిల్లాలో జరిగిన ఆపరేషన్‌లో మావోయిస్టులకు సంబంధించిన డంప్‌ను భద్రతా దళాలు కనుగొన్నాయి. ఇందులో కీలక డాక్యుమెంట్లు, పుస్తకాలతో పాటు 11 ల్యాప్‌టాప్‌లు లభించాయి. వాటిలో లభించిన వివరాల ఆధారంగానే ఏప్రిల్ 21న తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రిగుట్టల్లో ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ భారీ స్థాయిలో మొదలైందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే కర్రిగుట్టల ఆపరేషన్‌తో భారీ ఫలితం రాబోతుందని ఛత్తీస్‌గఢ్ పోలీసులు ప్రకటించారు. కానీ అలాంటిదేమీ జరగలేదు. ఆపరేషన్ ముగిసేసరికి వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 31 మంది సాధారణ స్థాయి మావోయిస్టులు చనిపోగా డంప్‌లు, ఆయుధ తయారీ పనిముట్లను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.

మళ్లీ విశ్లేషించుకుని..: డంప్‌లో లభించిన ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లలో లభించిన సమాచారాన్ని విశ్లేషించుకోవడంలో జరిగిన పొరపాటు కారణంగానే కర్రిగుట్టలో ఆశించిన విజయం దక్కలేదని భావించిన దళాలు మరింత జాగ్రత్తగా సమాచారాన్ని విశ్లేషించుకున్నట్లు సమాచారం. అందులో భాగంగా నంబాల కేశవరావుకు రక్షణ కల్పించే 7వ నంబర్ కంపెనీలో పనిచేసి లొంగిపోయిన కొందరు మావోయిస్టుల నుంచి మరోసారి సమాచారం తెప్పించుకున్నట్టు తెలుస్తోంది. ఈ రెండింటినీ కచ్చితత్వంతో డీకోడ్ చేయడం ద్వారా నంబాల ఎక్కడున్నాడనే అంశాన్ని భద్రతా దళాలు పసిగట్టి మెరుపుదాడి చేసినట్టు తెలుస్తోంది. కాగా, ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు కాల్పులు కొనసాగినట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ మీడియాకు తెలిపారు.


ఇందులో ఉన్నది నంబాల కేశవరావే. అప్పట్లో వరంగల్‌లోని రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ (ఆర్ఈసీ)లో బీటెక్ చదువుతున్న రోజుల్లో కళాశాల సావనీర్‌లో ఆయన గురించి ఇలా రాశారు. "మొదటి సంవత్సరంలో ఎంతో అమాయకుడిలా ఉన్న ఇతడు ఇప్పుడు క్లాసులో 'దాదా'. యూనివర్సిటీ కబడ్డీ ఆటగాడు. ఏ పరీక్ష వాయిదా పడినా.. దానికి వ్యతిరేకంగా జరిగే నిరసనలకు ఇతడే ప్రేరణ" అని పేర్కొన్నారు.

అంత ఈజీగా ఎలా?

సాధారణంగా కేంద్ర కమిటీ సభ్యులకు మూడంచెల భద్రతా వ్యవస్థ ఉంటుంది. ఈ వలయాన్ని ఛేదించుకుని వారి దగ్గరికి చేరుకోవడం చాలా కష్టంతో కూడుకున్న పని. అయినా స్వల్ప నష్టంతోనే పోలీసులు నంబాల దగ్గరికి ఎలా చేరుకున్నారనేది మిస్టరీగా మారింది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. ఏడాది క్రితం వరకు నంబాల కేశవరావుకు 70 మందితో కూడిన కంపెనీ రక్షణ కల్పించేది. ఇందులో కనీసం 40 మంది వద్ద ఏకే 47లాంటి ఆయుధాలు ఉంటాయని, తన చుట్టూ ఉన్న బృందం ఆధునిక ఆయుధాలతో ఉంటే నంబాల తన చేతిలో ఎప్పుడూ ల్యాప్‌టాప్‌తో ముందుకు సాగుతారని తెలుస్తోంది. తాగునీరు, ఆహారం విషయంలోనూ ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తారని, రాత్రి వేళ సైతం రెండు, మూడు గంటల కంటే ఎక్కువ నిద్రించరని సమాచారం. అయితే ఇటీవల పెరిగిన నిర్బంధం కారణంగా భద్రతను 28 మందికి కుదించినట్టు తెలుస్తోంది.

కబడ్డీలో అతను కెప్టెన్.. నేను వైస్ కెప్టెన్

నంబాల కేశవరావు కెమికల్ ఇంజనీరింగ్‌లో ఉండగా, నేను సివిల్ ఇంజనీరింగ్‌లో ఉన్నా. ఆటల సందర్భంగా మైదానంలో తరచూ కలుసుకునే వాళ్లం. ఆయన మంచి కబడ్డీ ప్లేయర్. ఆయన కెప్టెన్‌గా, నేను వైస్ కెప్టెన్‌గా ఉండే వాళ్లం. మైదానంలో దిగితే గెలుపు మాదే అంటూ తోటి మిత్రులు కేరింతలు కొట్టేవారు.

– ఆలపాటి ప్రసాద్,
1978 సివిల్ ఇంజనీరింగ్ బ్యాచ్

నంబాల మంచి ఉద్యమ నాయకుడు

నాటి ఆర్ఈసీలో వివిధ ప్రాంతాలనుంచి ఒకే తరగతిలో చదువుకున్న మాకు నంబాల క్లాస్ లీడర్‌గా, విద్యార్థి నాయకుడిగా దిశా నిర్దేశం చేసేవాడు. శ్రీకాకుళం నుంచి వచ్చినా కూడా సెలవులు దొరికితే చాలు ఇంటికి వెళ్లి వ్యవసాయం చేస్తా అనే నంబాల తరగతి గదిలో తక్కువగా కనిపించడంతో పాటు పూర్తిగా క్లాస్‌కు రాకపోవడంతో ఇంటికి వెళ్లి వ్యవసాయం చేసుకుంటున్నాడు అనుకున్నాం. కానీ 1980లో మావోయిస్టుగా మారాడని తెలుసుకుని షాక్ అయ్యాం. అతను మరణించాడని తెలియగానే బాధ వేసింది.

– 1974–1979
రీ యూనియన్ కమిటీ

ఇది అసాధారణ విజయం: మోదీ



న్యూఢిల్లీ: మావోయిస్టుల ఏరివేతలో భద్రతా దళాలు అసాధారణ విజయాన్ని సాధించడం గర్వకారణమని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల ప్రగతిశీల, శాంతియుత జీవనానికి వీలు కల్పించే క్రమంలో మావోయిస్టుల ఏరివేతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు మృతిని ధ్రువీకరిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన 'ఎక్స్'లో చేసిన పోస్టును మోదీ రీ పోస్టు చేశారు.

మైలురాయిలాంటి విజయం

నంబాల ఎన్‌కౌంటర్‌పై అమిత్ షా




న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణించినట్లు ప్రకటించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా.. భద్రతా దళాలు ఓ మైలురాయి వంటి విజయాన్ని సాధించాయని 'ఎక్స్'లో పేర్కొన్నారు. మావోయిస్టుల అణచివేతలో ఘన విజయం సాధించిన భద్రతా బలగాలను, సంస్థలను ఆయన అభినందించారు. 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు ముగిసేనాటికి ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలో 54 మంది నక్సలైట్లను అరెస్టు చేశాం. 84 మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని మోదీ సర్కారు పూర్తిగా అంతం చేస్తుంది..'అని ప్రకటించారు.

నిర్ణయాత్మక విజయం: బండి



సాక్షి, హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావును ఎన్‌కౌంటర్ చేయటం ద్వారా భద్రతాబలగాలు నిర్ణయాత్మక విజయం సాధించాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ ఎన్‌కౌంటర్ జాతీయ భద్రత విషయంలో గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని బుధవారం ఎక్స్‌లో ఒక ప్రకటన పోస్ట్ చేశారు.

న్యాయ విచారణ జరపాలి: సీపీఐ


డి.రాజా

సాక్షి, హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరారు సహా 27 మంది మావోయిస్టులు మరణించిన ఘటనపై స్వతంత్ర న్యాయ విచారణ జరపాలని సీపీఐ డిమాండ్ చేసింది. మావోయిస్టు అగ్రనేతను అరెస్టు చేయకుండా చంపివేయడం ప్రజాస్వామ్య విలువలను ప్రశ్నార్థకం చేస్తోందని పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్ హేయమైన చర్య అని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ధ్వజమెత్తారు. మావోయిస్టులు, వామపక్ష భావజాలాన్ని అంతం చేయడమే లక్ష్యంగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆపరేషన్ కగార్ చేపట్టి బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

'కగార్'ను నిలిపివేయాలి

ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్



సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో పౌరహక్కుల సంఘం నేతలు లక్ష్మణ్, నారాయణరావులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కర్రెగుట్టను వేలాది మంది పోలీసు బలగాలు చుట్టుముట్టి ఆదివాసులు, మావోయిస్టులను కేంద్రం హతమారుస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో లక్షలాది మంది ప్రజల సమక్షంలో.. ఆపరేషన్ కగార్‌ను ఆపి శాంతి చర్చలను కొనసాగించాలని డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. కర్రె గుట్టలో మావోయిస్టుల శవాలను ఎలాపడితే అలా ఉంచడం వల్ల.. గుర్తు పట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. శవాలను గౌరవించకపోవడం దురదృష్టకరమన్నారు.

శభాష్ అంటారా?: పౌరహక్కుల సంఘం



సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని మాడ్ సమీపంలో జరిగిన మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌ను ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాలు శభాష్ అని పొగడటం శోచనీయమని తెలంగాణ పౌరహక్కుల సంఘం పేర్కొంది. హంతకులను మెచ్చుకునే దశకు పాలకులు చేరుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో బుధవారం సాయంత్రం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భవాని విలేకరులతో మాట్లాడారు. మావోయిస్ట్ అగ్రనేత నంబాల కేశవరావుతో పాటు 27 మందిని కేంద్ర ప్రభుత్వ భద్రత బలగాలు మట్టుపెట్టాయని ఆందోళన వ్యక్తం చేశారు. పౌర సమాజం మొత్తం మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తున్న సందర్భంలో.. ఆపరేషన్ కగార్ పేరుతో 550 మందిని హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాల్పులు ఆపాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబితేనే కేంద్ర ప్రభుత్వం వింటుందా? అని ప్రశ్నించారు.

మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ

తాజా ఎన్‌కౌంటర్‌లో సుప్రీం కమాండర్ కేశవరావు మృతి

- ఒకవైపు 'కగార్'తో తరుముతున్న సాయుధ బలగాలు
- మరోవైపు వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
- తుడిచిపెట్టుకుపోతున్న పార్టీ నాయకత్వం

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టులకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మరణించడం మావోయిస్టు పార్టీకి తీవ్ర నష్టమనే చెప్పాలి. ఆపరేషన్ కగార్ పేరిట తరుముతున్న సాయుధ పోలీసు బలగాలు.. మరోవైపు ముంచుకొస్తున్న అనారోగ్య సమస్యలు.. కొన్నేళ్లుగా మావోయిస్టు పార్టీ కేడర్‌ను సతమతం చేస్తున్నాయి. ప్రధానంగా మావోయిస్టు సెంట్రల్ కమిటీలో ఉన్న నాయకులంతా ఐదుపదుల వయస్సు దాటినవారే కావడంతో ఏదో ఒక రకమైన ఆరోగ్య సమస్య వారిని వెంటాడుతూనే ఉంది. కొందరు కీలక నేతలను అనారోగ్యంతో కోల్పోతే, మరికొందరు ఎన్‌కౌంటర్లలో హతమవడం మావోయిస్టులను కలవర పెడుతోంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సెంట్రల్ కమిటీ మెంబర్ కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ జూన్ 2023లో మృతి చెందారు. అంతకు ముందే మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, సెంట్రల్ కమిటీ మెంబర్ యాపా నారాయణ (హరిభూషణ్) కరోనాతో మృతి చెందారు. మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ మెంబర్ అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ (ఆర్కే) సైతం కిడ్నీలు ఫెయిల్ అవడం ఇతర అనారోగ్యంతో బాధపడుతూ బస్తర్ అటవీ ప్రాంతంలో చనిపోయారు. ఇక సెంట్రల్ కమిటీలోని కొందరు నేతలు సొంతగా నడవలేని స్థితిలోనూ ఉన్నట్టు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర సాయుధ బలగాల నుంచి తప్పించుకుని తిరగడం వారికి కష్టమవుతోందనే వాదనలు ఉన్నాయి.

కీలక నేతలే టార్గెట్‌గా ఆపరేషన్లు

మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి 31 డెడ్‌లైన్‌గా విధించడంతో సీఆర్‌పీఎఫ్, డీఆర్జీ, గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక బలగాలతో పాటు స్థానిక పోలీసులు మావోయిస్టు కీలక నేతలనే టార్గెట్ చేసుకుంటున్నారు. ఓవైపు మావోయిస్టుల కంచుకోటగా ఉన్న అబూజ్‌మఢ్, బస్తర్, కర్రిగుట్టలు సహా కీలక ప్రాంతాలన్నింటిలోకి చొచ్చుకుని వెళుతూ దళాలు క్యాంపులు నిర్మిస్తున్నాయి. మరోవైపు మావోయిస్టు అగ్ర నాయకత్వాన్ని టార్గెట్ చేస్తేనే మావోయిస్టులను మూలాల నుంచి దెబ్బ కొట్టవచ్చన్న వ్యూహంతో ముందుకు వెళుతున్నాయి. గతంలోనూ ఇదే తరహా వ్యూహాలను అమలు చేశాయి. ఈ ఏడాది జనవరి 16న ఛత్తీస్‌గఢ్ జాపూర్ జిల్లా పరిధిలో చేసిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌ను మట్టుపెట్టాయి. జనవరి 21న ఒడిశా మావోయిస్టు పార్టీ కార్యదర్శి చలపతి మరణించారు. 2024 డిసెంబర్‌లో ములుగు జిల్లా పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కుర్సుం మంగు అనే కీలక నేత చనిపోయారు. దంతెవాడ–బీజాపూర్ జిల్లా పరిధిలో 2024 సెప్టెంబర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మాచర్ల ఏసోబు అలియాస్ రణధీర్ ఎన్‌కౌంటర్ అయ్యారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో అత్యంత చురుకైన, ప్రమాదకరమైన మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు మాడ్వి హిడ్మా కోసం వేలాది మందితో కూడిన భద్రత బలగాలు గాలిస్తున్నాయి.

క్రమంగా కుచించుకుపోతున్న పార్టీ

మావోయిస్టుల స్థావరాలు భద్రత బలగాల హస్తగతం అవుతుండడం..వరుస ఘటనల్లో అగ్ర నాయకత్వాన్ని కోల్పోతుండడంతో మావోయిస్టుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలోనే పదుల సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారు. ప్రస్తుతం మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీలో వంద మంది లోపే సభ్యులు ఉన్నారని, వారిలోనూ 80 శాతానికి పైగా ఇతర రాష్ట్రాల వారే ఉన్నట్టు పోలీసులు అధికారికంగా వెల్లడించారు. ఇలా తెలంగాణ సహా అన్ని రాష్ట్రాల్లోనూ మావోయిస్టు కమిటీల్లో కొత్తగా రిక్రూట్‌మెంట్లు లేకపోగా..ఉన్న వారు లొంగిపోతుండడంతో పార్టీ క్రమంగా కుచించుకుపోతోందని అంటున్నారు.

తుడిచివేతే లక్ష్యంగా 'కగార్'

దేశంలో మావోయిస్టులు లేకుండా చేయాలనే లక్ష్యంతో 2009లో కేంద్రం ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను చేపట్టింది. గడిచిన పదహారేళ్లలో ఈ కార్యక్రమం ఆపరేషన్ సమాధాన్, ప్రహార్‌గా కొనసాగి ఇప్పుడు కగార్ (ఫైనల్ మిషన్)కు చేరుకుంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లోని మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలను నలువైపుల నుంచి చుట్టుముట్టడం ద్వారా మావోయిస్టులను పూర్తిగా ఏరివేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అందులో భాగంగా..

1) ఆయా ప్రాంతాల్లో ఫార్వర్డ్ బేస్ క్యాంపులను ఏర్పాటు చేస్తారు. దీని కోసం సీఆర్‌పీఎఫ్, ఇండోటిబెటన్ పోలీస్, బస్తర్ ఫైటర్స్, డీఆర్‌జీ, కోబ్రా ఇలా వివిధ పేర్లతో లక్ష మందికి పైగా జవాన్లను తయారు చేశారు. ప్రతి ఐదు కిలో మీటర్లకు ఒకటి వంతున క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు.
2) మావోయిస్టుల సమాచారం సేకరించడంలో భాగంగా డ్రోన్లు, శాటిలైట్ ఇమేజెస్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లను వాడుతున్నారు.
3) తమ ఆధీనంలోకి వచ్చిన ప్రాంతాల్లో వెనువెంటనే పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి లా అండ్ ఆర్డర్‌ను అమలు చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది.
4) లొంగిపోవాలని భావించే మావోయిస్టులకు ఉదారంగా సరెండర్ పాలసీ అమలు.

ఈ నాలుగు లక్ష్యాలతో ఆపరేషన్ కగార్ 2024 జనవరి 1న మొదలైంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోకి క్యాంపులు రావడంతో నక్సలైట్ల కదలికలు పరిమితం అయ్యాయి. వారు దట్టమైన అడవుల్లో, షెల్టర్ జోన్లలో ఉండటాన్ని ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి గుర్తిస్తున్నారు. సెర్చ్ ఆపరేషన్లు చేసే క్రమంలో ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. మావోయిస్టులు పెద్ద సంఖ్యలో చనిపోతున్నారు. సరెండర్ పాలసీ కారణంగా లొంగుబాట్లు కూడా పెరిగాయి.

విప్లవాల జోలికి వెళ్లొద్దన్నా వినలేదు

'సాక్షి'తో నంబాల కేశవరావు సోదరుడు రాంప్రసాద్


సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విప్లవ పార్టీలోకి వెళ్లొద్దని, ఇంటికి తిరిగి రావాలని బతిమాలినా తన సోదరుడు వినకుండా నక్సలైట్ ఉద్యమంలోకి వెళ్లిపోయాడని సీపీఐ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సోదరుడు నంబాల రాంప్రసాద్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో కేశరావు మరణించిన నేపథ్యంలో తన సోదరుడి గురించి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 'వరంగల్ ఆర్ఈసీ మెస్‌లో ఏబీవీపీ, రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ మధ్య జరిగిన గొడవల్లో అప్పటి మహారాష్ట్ర/మధ్యప్రదేశ్ హోంమంత్రి (కచ్చితంగా గుర్తులేదు) కుమారుడు చనిపోయాడు. ఆ కేసులో మా సోదరుడు కేశవరావు ఏ–1 ముద్దాయిగా ఉన్నారు. వేసవి సెలవులకు ఇంటికి వచ్చిన సమయంలో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. అప్పుడే ఆర్ఎస్‌యూలో పనిచేస్తున్నాడని మాకు తెలిసింది. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఆ తర్వాత చింతపల్లి వద్ద పోలీసులకు దొరికాడు. ఇక్కడ విశాఖ బస్‌స్టేషన్ వద్ద ఉన్న సెంట్రల్ జైలులో ఆయనను ఉంచారు. అప్పుడు నేను, మా నాన్న వెళ్లి విప్లవ పార్టీలోకి వెళ్లొద్దని.. ఇంటికి రావాలని బతిమాలాం. అయినా వినలేదు. బెయిల్‌పై విడుదలై అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఇప్పుడే మా సోదరుడి గురించి వినడం . ఎంతో తెలివైన వాడు. బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత ఐఐటీ ఖరగ్‌పూర్‌లో వచ్చిన సీటును కూడా పార్టీ కోసం వదులుకుని వరంగల్ ఆర్ఈసీలోనే ఎంటెక్‌లో చేరాడు. ఇప్పుడు ఎలా ఉంటాడనేది కూడా మాకు తెలియదు. కాలేజీలో ఉన్న ఫొటోనే పేపర్లు, టీవీల్లో వస్తే చూసేవాళ్లం'అని చెప్పారు. నంబాల రాంప్రసాద్ ప్రస్తుతం విశాఖలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు. తన సోదరుడి మృతదేహాన్ని అప్పగిస్తే గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఛత్తీస్‌గఢ్‌కు బయలుదేరామని చెప్పారు. కేశవరావు తండ్రి వాసుదేవరావు మొదటి భార్య లక్ష్మీనారాయణమ్మ కుమారుడు కేశవరావు. మొదటి భార్య మరణించిన తర్వాత వాసుదేవరావు రెండో పెళ్లి చేసుకున్నారు. ఆమె కుమారులే నంబాల ఢిల్లేశ్వరరావు, నంబాల రాంప్రసాద్. ఢిల్లేశ్వరరావు విశాఖ పోర్టు సెక్రటరీగా పనిచేసి పదవీ విరమణ పొంది కైలాసపురంలో నివసిస్తుండగా.. రాంప్రసాద్ విశాఖ ఎంవీపీ కాలనీలో ఉంటూ కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారు.

మైనారిటీ సమాజంలోని స్త్రీల జీవితాన్ని, సంఘర్షణను కథలుగా రాసిన కన్నడ రచయిత్రి బాను ముష్టాక్‌కు ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ మంగళవారం ప్రకటించారు. 50 వేల పౌండ్ల బహుమతి. కర్నాటక రాష్ట్రంలో సామాజిక కార్యకర్తగా, అడ్వకేట్‌గా, రచయిత్రిగా గుర్తింపు పొంది నేడు తొలిసారి దక్షిణాది భాషకు బుకర్ ప్రైజ్ తెచ్చి పెట్టిన బాను ముష్టాక్ పరిచయం.

● న్యూస్‌మేకర్

స్త్రీ హృదయ దీపానికి మరింత కాంతి





‘మీరు రచయిత కావడానికి స్ఫూర్తినిచ్చింది ఎవరు?’ అనే ప్రశ్నకు ‘ప్రజలు’ అని సమాధానం చెప్తారు బాను ముష్టాక్. ‘వారిలోని మంచి, చెడు, టక్కరితనం, నిస్సహాయత, ఓర్పు, ప్రతి మనిషికీ ఉండే కథ... ఇవే నన్ను రచయిత్రిని చేశాయి’ అంటారామె.

75 ఏళ్ల బాను ముష్టాక్ భారతీయ సాహిత్యం, అందునా దక్షిణాది సాహిత్యం, ప్రత్యేకం కన్నడ సాహిత్యం గర్వపడేలా ‘ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ 2025’ను మంగళవారం రాత్రి గెలుచుకున్నారు. ఇంగ్లిష్‌లో ట్రాన్స్‌లేట్ అయిన ఆమె 12 కథల పుస్తకం ‘హార్ట్ ల్యాంప్’ ఈ ప్రతిష్టాత్మక బహుమతి గెలుచుకుంది. దక్షిణాది భాషలకు బుకర్ ప్రైజ్ దక్కడం ఇదే మొదటిసారి.

జర్నలిస్టుగా, అడ్వకేట్‌గా, సామాజిక కార్యకర్తగా గుర్తింపు పొందిన బాను ముష్టాక్ 1990 నుంచి ముస్లిం స్త్రీల జీవన గాథలను కథనం చేస్తూ వచ్చారు. ఆమె రాసిన మొత్తం 50 కథల నుంచి 12 కథలు ఎంచి దీపా బస్తీ అనువాదం చేయగా ఇంగ్లాండ్‌లోని షెఫీల్డ్‌కు చెందిన ‘అండ్ అదర్ స్టోరీస్’ అనే చిన్న పబ్లిషింగ్ సంస్థ ప్రచురించింది.

బాను ముష్టాక్ ఎవరు?

బాను ముష్టాక్ కర్ణాటక రాష్ట్రం హాసన్‌లో జన్మించారు. తండ్రి సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్. ఆమెను చిన్నప్పుడు ఉర్దూ స్కూల్లో వేయగా, అక్కడి వాతావరణం సరిపడక ఎనిమిదేళ్ల వయసులో శివమొగ్గలోని కన్నడ స్కూల్లో చేరారు. ఆరు నెలల్లో కన్నడ నేర్చుకుంటేనే స్కూల్లో ఉంచుతాం లేకుంటే పంపించేస్తాం అనంటే కొద్ది రోజుల్లోనే కన్నడ భాషను నేర్చుకుని ఆశ్చర్యపరిచారు. దీంతో ఒక్క ఏడాదిలోనే ఆమెను ఒకటో తరగతి నుంచి నాలుగో తరగతికి పంపించారు. ‘నేను మా ఇంటికి పెద్ద కూతుర్ని. మా నాన్న తన పిల్లలు డబుల్ డిగ్రీలు చేయాలని పట్టుదలగా ఉండేవాడు’ అంటుంది బాను ముష్టాక్.

ఆది నుంచి సవాళ్లే

బాను ముష్టాక్‌కు ముందునుంచి తిరగబడే స్వభావం ఉంది. మగపిల్లలతో కలిసి సైకిల్ నేర్చుకుంటున్న ఆమెను ముస్లిం పెద్దలు ఆపి ఇలా సైకిల్ తొక్కకూడదని హెచ్చరించారు. అయినా ఆమె లెక్క చేయలేదు. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు మాత్రమే జరిగే కాలంలో ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. 1974లో కట్నం ప్రస్తావన లేకుండా ఆమె పెళ్లి జరిగింది. అయితే వాచ్ రిపేరర్ అయిన భర్తకు సరైన సంపాదన లేకపోవడం, అత్తింటివారి నుంచి ఇబ్బందులు, ఉమ్మడి సంసారం కలిగిన ఇంటిలో వారితో కలిసి ఉండటం.. ఇవన్నీ ఆమెను మానసికంగా బలహీనురాలిని చేశాయి. దీంతో ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నారు. ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. అగ్గిపుల్ల వెలిగించే సమయంలో భర్త ఆపారు. చివరకు ఆమె షరతులకు భర్త ఒప్పుకోవడంతో ఆత్మహత్య, విడాకుల ఆలోచనలు మానుకున్నారు. అప్పటినుంచి ఆమెకు కాస్త స్వేచ్ఛ లభించింది.

పత్రికా రచయితగా

‘ముస్లిం మహిళలు సినిమాలు చూడటం నేరమా?’ అనే అంశంపై ఆమె రాసిన వ్యాసం కన్నడ పత్రిక ‘లంకేశ్ పత్రికె’లో ప్రచురితమై విశేషమైన పేరు తెచ్చింది. దాంతో అదే పత్రికలో రిపోర్టరుగా చేరారు. అనంతరం కొన్ని నెలల పాటు బెంగళూరు ఆలిండియా రేడియోలో పని చేశారు. 1978లో తండ్రి ప్రోద్బలంతో మీద ఆమె మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థినిగా పోటీ చేశారు. ఎన్నికల గుర్తు ‘కుట్టు మిషన్’. తండ్రితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఆమె ప్రచారం చేశారు. అయితే ఇలా చేయడం స్థానిక ముస్లిం పెద్దలకు నచ్చలేదు. ఓటు వేయొద్దని వారు వ్యతిరేక ప్రచారం చేశారు. అలా ఒక్క ఓటు తేడాతో ఆమె ఓడిపోయారు. మొదటి ప్రయత్నంలో ఓడిపోయినా, ఆ తర్వాత రెండు సార్లు హాసన్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి, గెలిచారు. బాను ముస్తాక్ రచయితగానే కాక, సామాజిక కార్యకర్త


అనువాదకురాలు దీపా బస్తీతో రచయిత బాను ముష్టాక్

గానూ తన ప్రయాణాన్ని ప్రారంభించారు. అందరికీ సమానహక్కులు దక్కాలని, సామాజిక న్యాయం అందాలని పోరాడారు. తొలుత దళిత హక్కుల ఉద్యమ పరిచయంతో మొదలైన పోరాట జీవితం ఆ తర్వాత అనేక అంశాలపై పోరాడేందుకు బాటలు వేసింది. ఆ కాలంలో మొత్తం జిల్లాలో అలాంటి పోరాటాల్లో పాల్గొన్న ఏకైక ముస్లిం మహిళ ఆమే.

ముస్లింల కథలు

‘నేను రాసే వరకు ముస్లింల జీవితం అంతగా కన్నడలో రాలేదు. హిందూ రచయితల కథల్లో ముస్లింల పాత్రలు బ్లాక్ అండ్ వైట్‌గా ఉండేవి. బండాయ సాహిత్య ఉద్యమ ప్రభావంతో ఎవరి జీవితం వారు రాయాలనే ప్రయత్నం మొదలయ్యాక మా జీవితాలను రాయడం మొదలెట్టాను’ అంటారు బాను ముష్టాక్. ఆమె ఇప్పటికి ఆరు కథాసంపుటాలు, ఒక నవల, ఒక వ్యాససంపుటి, కవిత్వ సంపుటి ప్రచురించారు. బాను ముస్తాక్ రాసిన ‘కరి నాగరగళు’ అనే కథ ఆధారంగా ప్రముఖ దర్శకుడు గిరీశ్ కాసరవెల్లి 2005లో ‘హసీనా’ అనే కన్నడ చిత్రం తీశారు. అందులో నటి తార ప్రధాన పాత్ర పోషించారు. అందులోని నటనకుగానూ ఆమెకు జాతీయ ఉత్తమ నటి పురస్కారం లభించింది. బాను ముస్తాక్ కన్నడతోపాటు హిందీ, దక్కనీ ఉర్దూ, ఇంగ్లిష్ మాట్లాడగలరు. ఆమె రచనలు ఉర్దూ, హిందీ, తమిళం, మలయాళ, పంజాబీ, ఇంగ్లిషు భాషల్లోకి అనువాదమయ్యాయి. ఇస్లాం ప్రకారం స్త్రీలకు మసీదుల్లో ప్రవేశం ఉందని, కేవలం మగవారే వారిని ఆపుతున్నారు అని ఆమె చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా సంచలనంగా మారి, తీవ్ర దుమారానికి దారి తీశాయి. ఆమెను, ఆమె కుటుంబాన్ని మూడు నెలలపాటు సామాజికంగా బహిష్కరించారు. కర్ణాటకలో ముస్లిం బాలికలు స్కూళ్లలో హిజాబ్ వేసుకునే హక్కు కోసం పోరాడిన సమయంలో బాను ముస్తాక్ వారికి మద్దతుగా నిలిచారు. 1990లో లా చదివిన బాను ముస్తాక్, లాయర్‌గా స్త్రీల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారు. ఇప్పటివరకూ వేలాది కేసులపై ఆమె వాదించారు.

బాను ముష్టాక్‌కు బుకర్‌ప్రైజ్

సీనియర్ కన్నడ రచయిత్రి బాను ముష్టాక్ (75)కు సాహిత్యంలో ప్రతిష్టాత్మకంగా భావించే ‘ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్’ను 2025 సంవత్సరానికి గాను ప్రకటించారు. మంగళవారం రాత్రి లండన్‌లో జరిగిన బహుమతి ప్రదాన వేడుకలో ఆమె రాసిన ‘హార్ట్ ల్యాంప్’ అనే కథా సంపుటికి ఈ బహుమతి దక్కింది. కన్నడంలో ఆమె రాసిన కథల నుంచి ఎంచిన 12 కథలను దీపా బస్తీ ఇంగ్లిషులో అనువాదం చేయగా ఈ బహుమతి దక్కింది. 50 వేల పౌండ్లు (57 లక్షల రూపాయలు) నగదు అందించారు. ఈ మొత్తాన్ని రచయిత్రి, అనువాదకురాలు చెరిసగం పంచుకోవాలి. బ్రిటిష్ రచయిత మేక్స్ పోర్టర్ న్యాయ నిర్ణేతల కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించారు. ‘హార్ట్ ల్యాంప్‌లోని కథలు ఇంగ్లిష్ పాఠకులకు కొత్త ప్రపంచాన్ని చూపుతాయి’ అని ఆయన అన్నారు. 12 దేశాలకు చెందిన 13 మంది రచయితలు ఈ అవార్డు కోసం లాంగ్‌లిస్ట్‌లో ఎంపిక కాగా ఆ తర్వాత ఆరుమంది రచయితలతో షార్ట్ లిస్ట్‌ను అనౌన్స్ చేశారు. బాను ముష్టాక్ పుస్తకం షార్ట్ లిస్ట్‌లో రావడమే ఘనత అనుకుంటే ఏకంగా బహుమతిని గెలవడంతో భారతీయ సాహిత్యాభిమానులలో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. కర్నాటక ముఖ్యమంత్రి సిద్ద రామయ్య ‘ఇది కన్నడ భాషకు దక్కిన గౌరవం’ అని కొనియాడారు. అలాగే కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి కుమార స్వామి తదితరులు అభినందనలు తెలిపారు. భాను ముష్టాక్ స్వస్థలం హాసన్. ఆమె రచయితగానే గాక అడ్వకేట్‌గా, సామాజిక కార్యకర్తగా కూడా కృషి చేస్తున్నారు. కాగా ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్‌కు అర్హత పొందాలంటే ఆ పుస్తకం ఇంగ్లాండ్‌లో ప్రచురితం అయి ఉండాలి. 2022లో గీతాంజలి శ్రీ రాసిన ‘రేత్ కీ సమాధి’ ఇంగ్లిష్‌లో ‘టూంబ్ ఆఫ్ శాండ్’గా అనువాదమై బుకర్‌ప్రైజ్ గెలుచుకోవడం పాఠకులకు విదితమే.

వారితో మాట్లాడడం అంటే వైద్యరంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న నర్సుల గురించి మాట్లాడడమే కాదు... ‘నర్సింగ్’లో కాలక్రమంలో వస్తున్న మార్పుల గురించి తెలుసుకోవడం.
వృత్తిని ప్రేమిస్తే, అంకితభావం చూపిస్తే... ఆ వృత్తి మన పేరును ప్రపంచానికి సగర్వంగా పరిచయం చేస్తుందని చెప్పడానికి వీరి వృత్తి నిబద్ధతే నిదర్శనం.
ప్రపంచవ్యాప్తంగా నర్సుల అసాధారణ సేవలను గుర్తించి, గౌరవించే ‘ఆస్టర్ గార్డియన్స్ గ్లోబల్ నర్సింగ్ అవార్డ్’ టాప్ 10లో నర్సింగ్ ప్రొఫెషనల్స్ సుఖ్‌పాల్ కౌర్, విభా సలాలియా చోటు సంపాదించారు.


సుఖ్‌పాల్ కౌర్
విభా సలాలియా

● ఘనత

గ్లోబల్ నర్సింగ్ స్టార్స్

చండీగఢ్‌లోని ‘పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్’కి చెందిన సుఖ్‌పాల్ కౌర్, అహ్మదాబాద్‌లోని ‘హాస్పిటల్ ఫర్ మెంటల్ హెల్త్’కి చెందిన విభా సలాలియా 199 దేశాలలోని లక్ష మంది అభ్యర్థుల నుంచి గ్లోబల్ నర్సింగ్ అవార్డ్ తుది జాబితాకు ఎంపికయ్యారు.

నర్సింగ్ గత సంవత్సరాలలో ఎలా మారిందో, గ్లోబల్ నర్సింగ్ స్టాండర్స్‌తో సమానంగా ఉండడానికి మన దేశంలో ఏం చేయవచ్చో... మొదలైన అంశాలపై వీరికి మంచి అవగాహన ఉంది.

చాలా మార్పులు

పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లో పుట్టిన సుఖ్‌పాల్ కౌర్‌కు సామాజిక సేవకు సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొనడం అంటే ఇష్టం. ఆ ఇష్టమే ఆమెను నర్సింగ్‌లో చేరేలా చేసింది.

‘ఇతరులకు సహాయపడాలనే నా తత్వానికి నేను ఎంచుకున్న వృత్తి బాగా సరిపోయింది’ అంటారు కౌర్.

> నర్సింగ్ విద్యలో చాలా మార్పులు వచ్చాయి. ఇప్పుడు మేము క్రిటికల్ కేర్ నర్సింగ్, ఆంకాలజీ నర్సింగ్‌లాంటి ఏడు స్పెషలైజ్‌డ్ బ్రాంచ్‌లను నడుపుతున్నాం. – కౌర్

ప్రస్తుతం ఆమె ‘నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ ఎడ్యుకేషన్’కి ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడే ఆమె బీఎస్సీ, మాస్టర్స్, నర్సింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

నిజానికి ఆమె ఈ ఇన్‌స్టిట్యూట్‌లో క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్‌గా చేరారు. క్రమంగా లెక్చరర్, అసోసియేట్ ప్రొఫెసర్ అయ్యారు. ప్రిన్సిపల్ కావడానికి ముందు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా ప్రమోట్ అయ్యారు.

‘నర్సింగ్ విద్యలో చాలా మార్పులు వచ్చాయి. ఇప్పుడు మేము క్రిటికల్ కేర్ నర్సింగ్, ఆంకాలజీ నర్సింగ్ లాంటి ఏడు స్పెషలైజ్‌డ్ బ్రాంచ్‌లను నడుపుతున్నాం’ అంటున్నారు 58 సంవత్సరాల కౌర్.

తలకు గాయాలు అయిన పేషెంట్‌ల కోసం నర్సుల ఆధ్వర్యంలో క్లినిక్స్‌ను ప్రారంభించారు కౌర్.

మన దేశంలో మొట్టమొదటి ఎంఎస్సీ నర్సింగ్ ప్రోగ్రామ్ ఇన్ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్‌ను లీడ్ చేస్తున్నారు కౌర్.

‘మేము మొదట్లో మాన్యువల్‌గా చెక్ చేసేవాళ్లం. ఇప్పుడు ముఖ్య లక్షణాలు నేరుగా చూపించే మానిటర్స్ వచ్చాయి. ఇది టైమ్‌ను సేవ్ చేస్తుంది. ఇక చదువుకు సంబంధించి చాక్, బ్లాక్‌బోర్డ్ నుండి మల్టీమీడియా క్లాస్ రూమ్‌లు, ఇంటరాక్టివ్ బోర్డ్స్, ఫ్లిప్ క్లాస్‌రూమ్‌లకు మారాయి. ఫ్లిప్ క్లాస్‌రూమ్‌లో స్టూడెంట్స్ ముందుగానే ప్రిపేర్ అవుతారు’ అంటున్నారు కౌర్.

బాల్య జ్ఞాపకమే బాట చూపింది...

మెంటల్ హెల్త్ కేర్‌ని మార్చడానికి తన కెరీర్‌ను అంకితం చేశారు యాభై ఆరు సంవత్సరాల విభా సలాలియా. 33 సంవత్సరాల వృత్తి అనుభవాన్ని గుజరాత్‌లోని మెంటల్ హెల్త్ కేర్‌ని మెరుగుపరచడంలో ఉపయోగించారు. మానసిక అనారోగ్యం బారినపడిన వేలాదిమందికి అండగా ఉన్నారు. వారు ఆత్మగౌరవంతో బతికేలా చేశారు.

‘మెంటల్ హెల్త్ కేర్’పై విభా ఆసక్తి చూపడానికి కారణం... బాల్య జ్ఞాపకం.

‘మా ఇంటి బయట ఒక మహిళ చింపిరి జుట్టుతో, శుభ్రత లేకుండా అస్తవ్యస్తంగా కూర్చొని ఉండడం నాకు గుర్తుంది. ఊరివాళ్లు ఆమెను అవమానించి పిచ్చిది అని పిలిచేవాళ్లు. ఆమెకు సహాయం చేయలేని నిస్సహాయత స్థితిలో ఉండి బాధపడేదాన్ని’ తన బాల్య జ్ఞాపకాన్ని గుర్తు చేసుకుంటారు విభా సలాలియ.

ఈ జ్ఞాపకమే తనను మెంటల్ హెల్త్ నర్సింగ్‌లో స్పెషలైజ్ చేయడానికి కారణం అయింది. నిజానికి విభా రెగ్యులర్ బీఎస్సీలో చేరారు. అయితే తన బంధువు ఒకరు అడ్మిట్ అయిన హాస్పిటల్‌కు వెళ్లినప్పుడు నర్సింగ్‌ని ప్రొఫెషనల్‌గా చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

‘మా బంధువును నర్సులు చాలా జాగ్రత్తగా చూసుకున్నారు. ఆ దృశ్యాలు చూసిన తరవాత ఎలాగైనా నర్సింగ్ చేయాల్సిందే అని నిర్ణయించుకున్నాను. బీఎస్సీ కోర్సు వదిలేసి అహ్మదాబాద్‌లోని సివిల్ హాస్పిటల్‌లో నర్సింగ్‌లో చేరాను’ అని గతాన్ని గుర్తు చేసుకున్నారు విభా.

● ఇంటిప్

కప్పు నీటిలో రెండు టేబుల్ స్పూన్ల తేనె వేసి కలపాలి . ఈ నీటిలో యాపిల్ ముక్కలు నానబెడితే ఎక్కువ సేపు రంగు మారకుండా తాజాగా ఉంటాయి.



బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) 21న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,010
బంగారం (22 క్యారెట్లు)	90,100
వెండి	99,800
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,930
బంగారం (22 క్యారెట్లు)	89,300
వెండి	1,00,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	95,830
బంగారం (22 క్యారెట్లు)	87,844
వెండి	98,020
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,930
బంగారం (22 క్యారెట్లు)	91,980
వెండి	1,00,100
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,450
బంగారం (22 క్యారెట్లు)	88,730
వెండి	99,500
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,420
బంగారం (22 క్యారెట్లు)	89,300
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● మాది జిబ్రాల్టర్

అందమైన సమాజం!!




హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో మిస్ వరల్డ్ 2025 పాజెంట్స్ మధ్య కలివిడిగా తిరుగుతున్నారు షానియా బాలెస్టర్. కొత్తగా కనిపించిన వారిని తానే ముందుగా పలకరించి ‘ఐ యామ్ ఫ్రమ్ జిబ్రాల్టర్’ అని పరిచయం చేసుకుంటోంది. దేశం పేరు అడగకుండానే చెబుతోంది, తన పేరు మాత్రం అడిగితే తప్ప చెప్పడం లేదు. ‘భౌగోళికంగా దేశాలుగా విడిపోయిన మనందరిదీ ఒకటే ప్రపంచం’ అన్నారు షానియా బాలెస్టర్.

చిన్న దేశం

‘‘మిస్ వరల్డ్ 2025కి క్యాప్షన్ బ్యూటీ విత్ పర్పస్. నాకు సంబంధించినంత వరకు ప్రపంచపటంలో జిబ్రాల్టర్ అనే దేశం ఒకటుందని ప్రపంచానికి తెలియచేసే అరుదైన అవకాశం. జిబ్రాల్టర్ చాలా చిన్నదేశం. జనాభా ముప్పై ఐదు వేల లోపే. ప్రపంచంలోని అనేక ఖండాల నుంచి వచ్చి స్థిరపడిన వారితో మా దేశం రకరకాల సంస్కృతుల నిలయమైంది. దాంతో ఇండియా కూడా నాకు సుపరిచితమైన దేశంలానే అనిపిస్తోంది. హైదరాబాద్ ఆహారం కొంచెం ఘాటుగా అనిపించినప్పటికీ చాలా రుచిగా ఉంది.

ప్రపంచానికి పరిచయం

నా కెరీర్ మోడలింగ్. నాకు సంతోషాన్నిచ్చే పని చారిటీ. నాలుగేళ్ల నుంచి మోడలింగ్‌కు కొంత విరామం ఇచ్చి బ్యూటీ కాంటెస్ట్ మీద దృష్టి పెట్టాను. మిస్ జిబ్రాల్టర్ కిరీటంతోనే ఆగిపోయి ఉంటే ఆ విజయం నాకు మాత్రమే పరిమితమయ్యేది. నా విజయం నా దేశానికి ఉపయోగపడాలంటే అది ప్రపంచ వేదిక మీదనే సాధ్యమవుతుంది. మాది సార్వభౌమత్వం సాధించాల్సిన దేశం. ఇప్పుడు మాకున్న గుర్తింపు బ్రిటిష్ ఓవర్సీస్ టెరిటరీగానే. ఈ మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా వందకు పైగా దేశాలకు మా దేశం పరిచయమైంది. అందాల పోటీల ద్వారా దేశాలన్నీ ఒకదానితో మరొకటి అనుసంధానమవుతాయి. ప్రపంచం అంతా ఒకటేననే భావన పెంపొందుతుంది. రెండు దేశాల మధ్య మాత్రమే కాదు ప్రపంచదేశాలన్నింటి మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుంది. ఒక దేశం చరిత్ర మరొకరికి అర్థమవుతుంది, సాంస్కృతిక గొప్పదనం అవగతమవుతుంది. మనకిప్పటి వరకు తెలియని అనేక దేశాల గురించి తెలుసుకుంటాం. ఒకదేశం ఔన్నత్యం గురించి మరొక దేశంలో సందర్భోచితంగా తెలియచేయగలుగుతాం. అవసరమైన సందర్భంలో సంఘీభావంతో వ్యవహరించగలుగుతాం.



మెంటల్ హెల్త్, క్యాన్సర్ పేషెంట్‌లకు స్వచ్ఛంద సేవలందిస్తున్న షానియా (ఫైల్ ఫొటో)

> మా జిబ్రాల్టర్ చాలా చిన్నదేశమే కానీ సమాజం చాలా అందమైనది. వివక్ష లేని సమాజం మాది. స్త్రీ పురుషుల లిటరసీ రేట్ సమానం అని చెప్పడానికి గర్వంగా ఉంది. – షానియా

అందం మనసుదే

మా జిబ్రాల్టర్ చాలా చిన్నదేశమే కానీ సమాజం చాలా అందమైనది. వివక్ష లేని సమాజం మాది. స్త్రీ పురుషుల లిటరసీ రేట్ సమానం అని చెప్పడానికి గర్వంగా ఉంది. నిజానికి అందం అనేది బాహ్య సౌందర్యం కాదు. దయ, కరుణ, అర్థం చేసుకోవడం. ఎదుటి వారి కష్టాన్ని వారి దృష్టి కోణం నుంచి విశ్లేషించుకుని అర్థం చేసుకోగలిగిన మనసు ఉండడమే నిజమైన అందం. ఈ బ్యూటీ పాజంట్ తర్వాత కూడా నా సర్వీస్‌ని కొనసాగిస్తాను. అయితే భవిష్యత్తు ప్రణాళిక గురించి ఇప్పుడే చెప్పలేను. నా దేశం సార్వభౌమాధికారం సాధించడానికి నేనేం చేయగలనో అంతా చేస్తాను’’ అన్నారు మిస్ వరల్డ్ జిబ్రాల్టర్ షానియా బాలెస్టర్.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: ఎస్ ఎస్ ఠాకూర్

● మన(సు)లో మాట

ఇంటర్వ్యూకెళ్ళాలంటే భయం!

నేను బీటెక్, ఎం. బి.ఎ. చేశాను. చదువులో మొదట్నుంచి టాప్! ఈ మధ్య చాలా చోట్ల నుండి – ఇంటర్వ్యూలు వస్తున్నాయి. కానీ ఇంటర్వ్యూ కెళ్ళాలంటేనే దడ పుట్టుకొస్తుంది. ఆ మధ్య హైద్రాబాద్‌లో ఒక సాఫ్ట్వేర్ కంపెనీలో ఇంటర్వ్యూకెళితే, వెయిటింగ్ హాల్లో వొళ్ళంతా వణుకుడు, చెమటలు పట్టి విపరీతమైన భయం వేసి శ్వాస కూడా ఆడలేదు. చివరికి లోపలికి వెళ్ళిన తరువాత వారడిగే ప్రశ్నలకు సమాధానాలు తెల్సినా, టెన్షన్, మాట తడబడటం, మైండ్ బ్లాక్ కావడంతోఒక్క ప్రశ్నకు కూడా సరిగా ఆన్సర్ చెప్పలేక పోయాను. చదువులో అంత టాప్‌లో ఉన్న నాకు ఇంటర్వ్యూ విషయానికొచ్చేసరికి ఎందుకిలా అవుతోందో అర్థం కావడం లేదు. ఈ భయం వల్ల మంచి ఆఫర్స్ కూడా చేతులారా పోగొట్టుకుంటున్నాను. అందరి లాగా నేను కూడా ఇంటర్వ్యూలు ధైర్యంగా ఫేస్ చేయగలనంటారా?

– రవిచంద్ర, కాకినాడ

చదువులో టాప్‌లో ఉండి భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకొని మంచి క్వాలిఫికేషన్స్ ఉన్న మీరు కేవలం ఈ ఇంటర్వ్యూ భయం వల్ల వచ్చిన ఆఫర్స్ పోగొట్టుకుంటున్నారన్న విషయం బాధాకరమైందే. మంచి తెలివి తేటలు, క్వాలిఫికేషన్స్ ఉండి కూడా కేవలం ఈ ఇంటర్వ్యూ భయం వల్ల ఇలా వెనకబడిపోతున్నారు.

‘సోషల్ యాంక్సైటీ డిజార్డర్’ అనే ఒక మానసిక రుగ్మతకు లోనయిన వారిలో ఇలాంటి భయాలుంటాయి. కొందరికి నలుగురిలో కలవాలంటే భయం. మరికొందరికి స్టేజి మీద మాట్లాడాలన్నా, గుంపులో కలవాలన్నా అమితమైన భయం, సిగ్గు, మొహమాటం. ముడుచుకుపోయి ఒక మూలగా ఒంటరిగా ఉండటం ఇవన్నీ ఈ సోషల్ యాంక్సైటీ లక్షణాలే! వారసత్వం వల్ల కొందరు, కుటుంబ వాతావరణం వల్ల మరి కొందరు ఈ మానసిక రుగ్మతకు లోనయ్యే అవకాశముంది. దీనివల్ల ఎంత మెరిట్ ఉన్నా, ఉద్యోగంలో, జీవితంలో నెగ్గుకు రాలేరు. మరికొందరు అన్నింటిలో యావరేజ్‌లో ఉన్నా ఇలాంటి భయాలేం లేకుండా ఆత్మవిశ్వాసంతో అన్నింటిలో ఉన్నత స్థితికి చేరుకుంటారు. ఇది కూడా ఒక మానసిక రుగ్మత అన్న విషయం తెలియక చాలామంది అలాగే ఉండిపోతున్నారు. ఈ సమస్యను కొన్ని మానసిక చికిత్స పద్ధతుల ద్వారా, మరి కొన్ని మంచి మందుల ద్వారా పూర్తిగా తగ్గించవచ్చు. జాకబ్‌సన్స్ రిలాక్సేషన్, ‘డీసెన్సిటైజేషన్, మైండ్ ఫుల్ నెస్, ‘వర్చువల్ రియాలిటీ’ అనే ఆధునిక పద్ధతుల ద్వారా ఇలాంటి వారిని పూర్తిగా ఈ సమస్య నుండి పూర్తి బయట పడవేయవచ్చు. వెంటనే సైకియాట్రిస్టుని సంప్రదించండి.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ sakshifamily3@gmail.com

● బ్యూటిప్



అరటిపండు గుజ్జులో కొద్దిగా కొబ్బరి నూనె వేసి కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత మర్దన చేసి నీటితో కడిగేయాలి. ఇది మంచి క్లెన్సర్‌గా పనిచేయడమేగాక, చర్మానికి తేమనందిస్తుంది.



సుమిత్ నగాల్‌కు నిరాశ

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించడంలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ విఫలమయ్యాడు. పారిస్‌లో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీలో... బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 170వ ర్యాంకర్ సుమిత్ నగాల్ 2-6, 4-6తో ప్రపంచ 225వ ర్యాంకర్ రొడియోనోవ్ (ఆస్ట్రియా) చేతిలో ఓడిపోయాడు. 89 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ 30 అనవసర తప్పిదాలు చేశాడు. తన సర్వీస్‌ను ఏడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు.

తొలి రౌండ్‌లోనే ఓడిన బోపన్న జోడీ



జెనీవా ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. రోహన్ బోపన్న, యూకీ బాంబ్రీ తొలి రౌండ్‌లోనే ఓడారు. బోపన్న (భారత్)-పావ్లాసెక్ (చెక్ రిపబ్లిక్) ద్వయం 1-6, 6-3, 4-10తో కబ్రాల్ (పోర్చుగల్)-మిడ్లెర్ (ఆస్ట్రియా) జంట చేతిలో ఓడింది. రెండో సీడ్ యూకీ బాంబ్రీ (భారత్)-రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ 6-7 (3/7), 4-6తో ష్నయిటర్-వాల్నర్ (జర్మనీ) ద్వయం చేతిలో ఓటమి పాలైంది.

సంచలనాల మోత

- తమకంటే మెరుగైన ర్యాంక్ ఆటగాళ్లను ఓడించిన భారత షట్లర్లు
- ప్రపంచ 9వ ర్యాంకర్‌పై సతీశ్, 12వ ర్యాంకర్‌పై ప్రణయ్, 13వ ర్యాంకర్‌పై శ్రీకాంత్ విజయం
- మహిళల సింగిల్స్‌లో ముగిసిన భారత్ పోరు


ప్రణయ్


సతీశ్


శ్రీకాంత్

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులు అదరగొట్టారు. తొలి రౌండ్‌లో నలుగురు భారత ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్, సతీశ్ కుమార్ కరుణాకరన్, ఆయుశ్ శెట్టి తమకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న ఆటగాళ్లను బోల్తా కొట్టించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ఈ సీజన్‌లో ఫామ్‌లో లేని ప్రపంచ మాజీ నంబర్‌వన్, ప్రస్తుత 65వ ర్యాంకర్ శ్రీకాంత్ 23-21, 13-21, 21-11తో ప్రపంచ 13వ ర్యాంకర్ లు గ్వాంగ్ జు (చైనా)ను ఓడించాడు. మరో మ్యాచ్‌లో ప్రపంచ 35వ ర్యాంకర్ ప్రణయ్ 19-21, 21-17, 21-16తో ప్రపంచ 12వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్)పై సంచలన విజయం సాధించాడు. ప్రపంచ 51వ ర్యాంకర్ సతీశ్ కుమార్ కరుణాకరన్ 21-13, 21-14తో ప్రపంచ 9వ ర్యాంకర్ చౌ టియెన్ చెన్ (చైనీస్ తైపీ)ను కంగుతినిపించాడు. ప్రపంచ 41వ ర్యాంకర్ ఆయుశ్ శెట్టి 20-22, 21-10, 21-8తో ప్రపంచ 30వ ర్యాంకర్ బ్రియాన్ యాంగ్ (కెనడా)పై గెలుపొందాడు.

అయితే భారత్‌కే చెందిన ప్రపంచ 34వ ర్యాంకర్ ప్రియాన్షు రజావత్‌కు నిరాశ ఎదురైంది. ప్రియాన్షు 15-21, 17-21తో జియా హెంగ్ జేసన్ టెహ్ (సింగపూర్) చేతిలో ఓడిపోయాడు. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్)తో సతీశ్; యుషి టనాకా (జపాన్)తో ప్రణయ్; ఎన్ హట్ ఎన్గుయెన్ (ఐర్లాండ్)తో శ్రీకాంత్; తొమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)తో ఆయుశ్ శెట్టి తలపడతారు.

సింధుకు నిరాశ

మహిళల సింగిల్స్ విభాగంలో భారత్‌కు నిరాశాజనక ఫలితాలు వచ్చాయి. బరిలో ఉన్న నలుగురు క్రీడాకారిణులు పీవీ సింధు, ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్, మాళవిక తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. ప్రపంచ 16వ ర్యాంకర్ సింధు 11-21, 21-14, 15-21తో ప్రపంచ 26వ ర్యాంకర్ థుయ్ లిన్ ఎన్గుయెన్ (వియత్నాం) చేతిలో ఓడిపోయింది. ఇతర మ్యాచ్‌ల్లో ఉన్నతి 12-21, 20-22తో లిన్ సియాంగ్ టి (చైనీస్ తైపీ) చేతిలో, ఆకర్షి 9-21, 8-21తో పుత్రి కుసుమ వర్ధిని (ఇండోనేసియా) చేతిలో, మాళవిక 21-19, 18-21, 8-21తో చియు పిన్ చియాన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు.

మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) జోడీ 10-21, 14-21తో గువో జిన్ వా-చెన్ ఫాంగ్ హుయ్ (చైనా) జంట చేతిలో ఓడిపోగా... తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల (భారత్) ద్వయం 21-18, 15-21, 21-14తో అద్నాన్-సారి జమాల్ (ఇండోనేసియా) జోడీపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. పురుషుల డబుల్స్‌లో పృథ్వీ కృష్ణమూర్తి రాయ్-సాయిప్రతీక్; హరిహరన్-రూబన్ కుమార్ (భారత్) జోడీలు తొలి రౌండ్‌లోనే ఓడిపోయాయి.

'ప్లే ఆఫ్స్'కు ముంబై

నాలుగో బెర్త్ ఖరారు చేసుకున్న హార్దిక్ పాండ్యా బృందం

తొలి ఐదు మ్యాచ్‌లలో **నాలుగు** పరాజయాలు... ఎప్ప**టిలాగే ముంబై** ఇండియన్స్ తమ సీజ**న్‌ను నెమ్మదిగా** మొదలు పెట్టింది... **అయితే ఆ తర్వాత తమ** స్థాయికి తగ్గ ఆటతో **తర్వాతి ఎనిమిది మ్యాచ్** లలో ఏడు విజయాల**తో ముందంజ వేసింది.** 2025 సీజన్‌లో 'ప్లే ఆ**ఫ్స్'లో చివరిదైన** నాలుగో బెర్త్‌ను ఖరారు **చేసుకుంది. సొంత** మైదానంలో జరిగిన కీలక **పోరులో ఢిల్లీ** క్యాపిటల్స్‌పై ముంబై పైచేయి సాధించింది. మరోవైపు వరుసగా నాలుగు విజయాలతో ఘనంగా సీజన్‌ను ప్రారంభించినా... ఆపై గతి తప్పిన ఆటతో వరుస ఓటములు ఎదుర్కొన్న ఢిల్లీ క్యాపిటల్స్ 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది.

- ఢిల్లీపై 59 పరుగులతో విజయం
- రేసు నుంచి క్యాపిటల్స్ నిష్క్రమణ


బుమ్రా
'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్

ముంబై: ఐపీఎల్‌లో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ మరో టైటిల్ వేటలో నిలిచింది. ఈ సీజన్ 'ప్లే ఆఫ్స్'లో మిగిలిన నాలుగో స్థానాన్ని ముంబై భర్తీ చేసింది. బుధవారం వాంఖెడే మైదానంలో జరిగిన పోరులో ముంబై 59 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై నెగ్గింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. సూర్యకుమార్ (43 బంతుల్లో 73 నాటౌట్; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) దూకుడైన బ్యాటింగ్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం ఢిల్లీ 18.2 ఓవర్లలో 121 పరుగులకే కుప్పకూలింది. సమీర్ రిజ్వీ (35 బంతుల్లో 39; 6 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగతా వారు విఫలమయ్యారు. బుమ్రా 3 వికెట్లతో ఢిల్లీని దెబ్బ తీశాడు.

2 ఓవర్లలో 48 పరుగులు...

బంతి తక్కువ ఎత్తులో వస్తూ నెమ్మదిగా ఉన్న పిచ్‌పై పరుగులు చేయడంలో ముంబై బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. రోహిత్ శర్మ (5) విఫలం కాగా... రికెల్టన్ (18 బంతుల్లో 25; 2 సిక్స్‌లు), విల్ జాక్స్ (13 బంతుల్లో 21; 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. దాంతో పవర్‌ప్లే ముగిసేసరికి జట్టు స్కోరు 54 పరుగులకు చేరింది. కుల్దీప్ తన తొలి ఓవర్లోనే రికెల్టన్‌ను వెనక్కి పంపగా, తిలక్ వర్మ (27 బంతుల్లో 27; 1 ఫోర్, 1 సిక్స్) వేగంగా ఆడలేకపోయాడు. ఆరంభంలో సూర్యకుమార్ బ్యాటింగ్‌లో కూడా తడబాటు కనిపించగా, హార్దిక్ పాండ్యా (3) కూడా ఎక్కువసేపు నిలవలేదు. 18 ఓవర్లలో ముంబై స్కోరు 132/5 మాత్రమే. కనీసం 160 పరుగులు కూడా దాటడం అసాధ్యంగా అనిపించింది. అయితే ఆఖరి 2 ఓవర్లలో సూర్య, నమన్ ధీర్ (8 బంతుల్లో 24 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) పండగ చేసుకున్నారు. ముకేశ్ వేసిన 19వ ఓవర్ తొలి బంతికి సూర్య సిక్స్ బాది 36 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా... చివరి నాలుగు బంతుల్లో నమన్ వరుసగా 4, 6, 6, 4 బాదడంతో మొత్తం 27 పరుగులు వచ్చాయి. చమీరా వేసిన ఆఖరి ఓవర్లో సూర్య ఒక్కడే 2 సిక్స్‌లు, 2 ఫోర్లు కొట్టడంతో 21 పరుగులు లభించాయి.

టపటపా...

ఛేదనలో ఢిల్లీ పూర్తిగా తలవంచింది. ఏ దశలోనూ జట్టు విజయం దిశగా వెళ్లలేకపోయింది. తొలి 5 ఓవర్లలోపే డుప్లెసిస్ (6), కేఎల్ రాహుల్ (11), అభిషేక్ పొరేల్ (6) అవుట్ కావడంతోనే గెలుపుపై ఆశలు తగ్గిపోయాయి. ఆ తర్వాత విప్‌రాజ్ నిగమ్ (11 బంతుల్లో 20; 3 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువసేపు నిలవలేకపోగా, ట్రిస్టన్ స్టబ్స్ (2) కూడా విఫలం కావడంతో సగం ఓవర్లు ముగిసేసరికి స్కోరు 66/5కు చేరింది. మరో ఎండ్‌లో రిజ్వీ కొంత పోరాడినా లాభం లేకపోయింది. మరో 10 బంతులు మిగిలి ఉండగానే జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. రెగ్యులర్ కెప్టెన్ అక్షర్ పటేల్ జ్వరంతో ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో డుప్లెసిస్ ఢిల్లీకి సారథిగా వ్యవహరించాడు.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) మాధవ్ తివారి (బి) కుల్దీప్ 25; రోహిత్ (సి) పొరేల్ (బి) ముస్తఫిజుర్ 5; జాక్స్ (సి) నిగమ్ (బి) ముకేశ్ 21; సూర్యకుమార్ (నాటౌట్) 73; తిలక్ వర్మ (సి) రిజ్వీ (బి) ముకేశ్ 27; పాండ్యా (సి) ముకేశ్ (బి) చమీరా 3; నమన్ ధీర్ (నాటౌట్) 24; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 180. వికెట్ల పతనం** : 1-23, 2-48, 3-58, 4-113, 5-123. **బౌలింగ్:** ముకేశ్ కుమార్ 4-0-48-2, చమీరా 4-0-54-1, ముస్తఫిజుర్ 4-0-30-1, విప్‌రాజ్ నిగమ్ 4-0-25-0, కుల్దీప్ యాదవ్ 4-0-22-1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: కేఎల్ రాహుల్ (సి) రికెల్టన్ (బి) బౌల్ట్ 11; డుప్లెసిస్ (సి) సాంట్నర్ (బి) చహర్ 6; పొరేల్ (స్టంప్డ్) రికెల్టన్ (బి) జాక్స్ 6; రిజ్వీ (బి) సాంట్నర్ 39; నిగమ్ (సి అండ్ బి) సాంట్నర్ 20; స్టబ్స్ (ఎల్బీ) (బి) బుమ్రా 2; అశుతోష్ శర్మ (స్టంప్డ్) రికెల్టన్ (బి) సాంట్నర్ 18; మాధవ్ తివారి (బి) బుమ్రా 3; చమీరా (నాటౌట్) 8; కుల్దీప్ (సి) రాజ్ బావా (సబ్) (బి) కరణ్ శర్మ 7; ముస్తఫిజుర్ (బి) బుమ్రా 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం** (18.2 ఓవర్లలో ఆలౌట్) 121. **వికెట్ల పతనం:** 1-12, 2-20, 3-27, 4-55, 5-65, 6-103, 7-104, 8-108, 9-120, 10-121. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-29-1, చహర్ 3-0-22-1, జాక్స్ 1-0-16-1, సాంట్నర్ 4-0- 11-3, బుమ్రా 3.2-0-12-3, కరణ్ శర్మ 3-0-31-1.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	12	9	3	0	18	0.795
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	13	6	6	1	13	-0.019
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లక్నో	12	5	7	0	10	-0.506
హైదరాబాద్	12	4	7	1	9	-1.005
రాజస్తాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ × లక్నో
వేదిక: అహ్మదాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

దైవిక శక్తితో కిరాత


మోహన్ లాల్

విష్ణు మంచు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మోహన్ లాల్ కీలక పాత్ర పోషించారు. బుధవారం (మే 21) ఆయన పుట్టినరోజు సందర్భంగా 'కన్నప్ప' నుంచి గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ''కన్నప్ప'లో దైవిక శక్తితో ముడిపడి ఉన్న కిరాత పాత్రను మోహన్‌లాల్ చేశారు. ఈ పాత్రలో ఆయన ప్రెజెన్స్, నటన ఆకట్టుకునేలా ఉంటాయి'' అని యూనిట్ పేర్కొంది. మంచు మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, శరత్‌కుమార్ నటించగా, మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న రిలీజ్ కానుంది.

మోహన్ లాల్ జీవిత చరిత్రతో ఓ పుస్తకం రూపొందనుంది. 'ముఖరాగం' పేరుతో రానున్న ఈ పుస్తకంలో గత 47 సంవత్సరాల మోహన్ లాల్ నట జీవితంలో జరిగిన ఎన్నో అంశాలు ఉంటాయి. ఈ పుస్తకం డిసెంబరు 25న విడుదల కానుంది.

అక్టోబరు 16న వృషభ: మోహన్ లాల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న 'వృషభ' చిత్రం నుంచి ఆయన పోస్టర్ విడుదలైంది. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలీఫిలిమ్స్ సమర్పణలో నంద కిశోర్ రచన, దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ''యాక్షన్, ఎమోషన్, పౌరాణిక గాథలను అద్భుతంగా మిళితం చేసి ఓ దృశ్య కావ్యంలా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. మలయాళం, తెలుగులో ఏకకాలంలో చిత్రీకరిస్తున్న ఈ మూవీని అక్టోబరు 16న తెలుగు, మలయాళ, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

జూన్‌లో స్టార్ట్


అల్లు అర్జున్

హీరో అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. తమ కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో రానున్న సినిమా పనులను స్పీడప్ చేశారు. తాజాగా ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనుల నిమిత్తమై అల్లు అర్జున్‌ను కలిసేందుకు హైదరాబాద్ వచ్చారు అట్లీ. వీలైనంత త్వరగా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను ముగించేసి, జూన్‌లో ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించాలన్నది వీరి ప్లాన్ అని సమాచారం. ఈ చిత్రంలో అల్లు అర్జున్ త్రిపాత్రాభినయం చేస్తారని, ఈ మూడు పాత్రల్లో ఒకటి యానిమేటెడ్ రోల్ అనే టాక్ వినిపిస్తోంది. ''ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సాగే ఈ చారిత్రాత్మక చిత్రంలో గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్ అంతర్జాతీయ స్థాయిలో ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

ఈ సినిమా కోసం ఐదేళ్లు కష్టపడ్డాం

- ఏఎం రత్నం


ఏఎం రత్నం, కీరవాణి, జ్యోతికృష్ణ, నిధీ అగర్వాల్

''చిత్ర పరిశ్రమలో నా ప్రయాణం 54 ఏళ్లు. తెలుగు, తమిళ, హిందీ... అన్ని భాషల్లో సినిమాలు తీశాను. 90 శాతానికి పైగా నా సినిమాలు విజయం సాధించాయి. సినిమా ద్వారా వినోదంతో పాటు ఏదో ఒక సందేశం ఇవ్వాలనేది నా తపన. 'భారతీయుడు, ఒకే ఒక్కడు' లాంటి చిత్రాలు అందించాను. ఐదేళ్లు ఎంతో కష్టపడి 'హరిహర వీరమల్లు' సినిమా తీశాం'' అని నిర్మాత ఏఎం రత్నం తెలిపారు. పవన్ కల్యాణ్, నిధీ అగర్వాల్ జోడీగా నటించిన చిత్రం 'హరిహర వీరమల్లు'. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వం వహించారు. ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మించిన ఈ సినిమా జూన్ 12న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'అసుర హననం...' అంటూ సాగే మూడో పాట విడుదల వేడుకని హైదరాబాద్‌లో నిర్వహించారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ సాంగ్‌ని లాంచ్ చేశారు. రాంబాబు గోసాల సాహిత్యం అందించిన ఈ పాటని ఐరా ఉడుపి, కాల భైరవ, సాయిచరణ్ భాస్కరుని, లోకేశ్వర్ ఈదర, హైమత్ మహమ్మద్ పాడారు. ఈ సందర్భంగా ఎం.ఎం. కీరవాణి మాట్లాడుతూ– ''ఏఎం రత్నంగారికి ఈ సినిమా రూపంలో మరో భారీ విజయం సొంతం అవుతుంది'' అని తెలిపారు. జ్యోతికృష్ణ మాట్లాడుతూ– ''మొదట ఈ ప్రాజెక్ట్‌కి పెద్ద పునాది వేసింది క్రిష్‌గారు. పవన్‌కల్యాణ్, రత్నంగారిని మెప్పించడం మామూలు విషయం కాదు. ఆ ఇద్దరూ మెచ్చారంటే ఈ సినిమా హిట్టే'' అన్నారు. నిధీ అగర్వాల్ మాట్లాడుతూ– ''ఈ సినిమాకి నా హృదయంలో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది'' అని చెప్పారు. ఈ వేడుకలో గీత రచయిత రాంబాబు గోసాల, నటుడు రఘుబాబు మాట్లాడారు.


కాన్స్‌లో విశ్వంభర

- అబ్దుల్ కలామ్‌గా ధనుష్
- 'హోమ్ బౌండ్' చిత్రానికి తొమ్మిది నిమిషాల స్టాండింగ్ ఒవేషన్


జాన్వీ కపూర్


ఐశ్వర్యా రాయ్

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తొలి అడుగు వేశారు జాన్వీ కపూర్. పింక్ కలర్ గౌన్ ధరించి రెడ్ కార్పెట్‌పై నడిచారీ బ్యూటీ. హైదరాబాదీ ఫిల్మ్ మేకర్ నీరజ్ ఘైవాన్ తెరకెక్కించిన 'హోమ్ బౌండ్' సినిమా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని 'అన్ సర్టైన్ రిగార్డ్స్' విభాగంలో పోటీలో నిలవగా ఈ చిత్రంలో నటించిన జాన్వీ, ఇషాన్ కట్టర్ తదితరులు హాజరయ్యారు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో జరుగుతున్న 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డు కోసం ఎంపికైన తొలి భారతీయ చిత్రం కూడా 'హోమ్ బౌండ్' కావడం విశేషం. కరణ్ జోహార్, అపూర్వా మెహతా, అదార్ పూనావాలా, సోమెన్ మిశ్రా నిర్మించిన ఈ చిత్రాన్ని కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించగా, తొమ్మిది నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ దక్కింది. ఇదిలా ఉంటే.. గత కొన్ని సంవత్సరాలుగా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు తప్పకుండా హాజరవుతున్నారు హీరోయిన్ ఐశ్వర్యా రాయ్. ఈ సారి కూడా కాన్స్ రెడ్ కార్పెట్‌పై నడిచారామె. ఇక ఈ ఫెస్టివల్‌కు ఐశ్వర్యారాయ్ రావడం 22వ సారి కావడం విశేషం.


విక్రమ్ రెడ్డి

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తెలుగు సినిమా 'విశ్వంభర' గ్లింప్స్‌ని ప్రదర్శించనున్నారు. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ డ్రామా 'విశ్వంభర'. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. వి. వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'విశ్వంభర' గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేయనున్నారు. ఇందుకోసం ఫ్రాన్స్ వెళ్లారు నిర్మాత విక్రమ్ రెడ్డి.


అభిషేక్ అగర్వాల్

భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం జీవితం వెండితెరపైకి రానుంది. 'కలాం: ది మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ బయోపిక్‌లో ధనుష్ టైటిల్ రోల్ చేయనున్నారు. కాన్స్ ఫెస్టివల్‌లో ఈ సినిమాను ప్రకటించి, టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఓం రౌత్ దర్శకత్వంలో గుల్షన్ కుమార్, తేజ్ నారాయణ్ అగర్వాల్, టీ-సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ ఈ సినిమాను నిర్మించనున్నారు. "డా. కలాం జీవితం, భారత అంతరిక్ష, రక్షణ కార్యక్రమాలకు ఆయన చేసిన అమూల్యమైన సేవను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం" అని మేకర్స్ తెలిపారు.

మరింత వైల్డ్‌గా ఉంటుంది

- రానా


అర్జున్ రాంపాల్, రానా

''రానా నాయుడు' తొలి సీజన్ కంటే 'రానా నాయుడు 2' మరింత వైల్డ్‌గా ఉంటుంది'' అని నటుడు రానా తెలిపారు. వెంకటేశ్, రానా ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు 2'. కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ ఎస్. వర్మ, అభయ్ చోప్రా దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో అర్జున్ రాంపాల్, సుర్వీన్ చావ్లా, కృతీ కర్బందా కీలక పాత్రలు పోషించారు. సుందర్ ఆరోన్ నిర్మించిన 'రానా నాయుడు 2' వెబ్ సిరీస్ జూన్ 13 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. బుధవారం హైదరాబాద్‌లో 'రానా నాయుడు 2' భారీ పోస్టర్‌ను రానా, అర్జున్ రాంపాల్ విడుదల చేశారు. అనంతరం రానా మాట్లాడుతూ– ''ఈ సిరీస్‌లో నేను రానా నాయుడుగా నటిస్తే, రవూఫ్ పాత్రలో అర్జున్ రాంపాల్ నటించారు. ఇద్దరం ఢీ అంటే ఢీ అనేలా నటించాం'' అని తెలిపారు. అర్జున్ రాంపాల్ మాట్లాడుతూ– ''రవూఫ్ పాత్రకు జీవం పోయటం చాలా కష్టమైంది. అయితే కరణ్ అన్షుమన్ పట్టుదల, అంకితభావంతో అది సాధ్యమైంది'' అన్నారు.

వీర రాజు కథ


రుద్ర వీరాజ్, కిరణ్మయ్

రుద్ర వీరాజ్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'వీర రాజు 1991'. అజయ్ ఘోష్, బెనర్జీ, అర్చన, రాహుల్, గోపరాజ్, కిశోర్ ముఖ్య పాత్రలు పోషించారు. రాయల్ స్టార్ ప్రొడక్షన్స్ సమర్పణలో కిరణ్మయ్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రుద్ర వీరాజ్ మాట్లాడుతూ– ''రా అండ్ రస్టిక్‌గా తెరకెక్కిన చిత్రం 'వీర రాజు 1991'' అన్నారు. ''మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అని కిరణ్మయ్ చెరుకూరి కోరారు. ''ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం సంతోషంగా ఉంది'' అన్నారు సహనిర్మాత శివాన్వితా రావు. ''ఇలాంటి చిన్న సినిమాలను ప్రేక్షకులు ఆదరించాలి. అప్పుడే భవిష్యత్తులో మంచి నటీనటులు, సాంకేతిక నిపుణులు పరిశ్రమకి వస్తారు'' అని అజయ్ ఘోష్ తెలిపారు.

జూన్ 1 నుంచి థియేటర్స్ బంద్‌పై సందిగ్ధత

- అతి త్వరలో నిర్మాతలు, ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్ సంయుక్త సమావేశం?

జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా సింగిల్ స్క్రీన్ థియేటర్స్ మూసివేత విషయంపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. మల్టీప్లెక్స్‌లో సినిమాల ప్రదర్శన విషయంలో పర్సెంటేజీ విధానాన్ని ప్రోత్సహిస్తున్న నిర్మాతలు... సింగిల్ స్క్రీన్స్‌లోనూ అదే తరహా విధానాన్ని పాటించాలని, అద్దె ప్రాతిపదికన సినిమాల స్క్రీనింగ్ ఇకపై కుదరదనీ ఎగ్జిబిటర్స్ డిమాండ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ విషయంపై తెలుగు రాష్ట్రాల్లోని ఎగ్జిబిటర్స్ ఇటీవల హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. సింగిల్ స్క్రీన్స్‌లో సినిమాల ప్రదర్శన విషయంలో నిర్మాతలు పర్సెంటేజీ విధానాన్ని అమలు చేయాలని, లేకపోతే జూన్ 1 నుంచి ఎగ్జిబిటర్స్ థియేటర్స్‌ను మూసివేయాలని నిర్ణయించుకున్నట్లుగా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఫిల్మ్ చాంబర్‌లో ఉదయం డిస్ట్రిబ్యూటర్స్ సమావేశమై... ఎగ్జిబిటర్స్ కొత్త ప్రతిపాదన, థియేటర్స్ బంద్ వంటి అంశాలపై చర్చించారని సమాచారం. అలాగే సాయంత్రం ఈ విషయంపై నిర్మాతలు సమావేశమయ్యారని తెలిసింది. ప్రముఖ నిర్మాతలు డి. సురేష్‌బాబు, 'దిల్' రాజు, స్రవంతి రవికిశోర్, మైత్రీ రవిశంకర్, డీవీవీ దానయ్య, నాగవంశీ, బాపినీడు, సాహు గారపాటి వంటి వారు ఎగ్జిబిటర్స్ డిమాండ్స్‌ని అమలు చేసే విషయంలో సాధ్యాసాధ్యాలపై చర్చలు జరిపారని సమాచారం. ఈ సమావేశంలో కొందరు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ పర్సంటేజీ విధానానికి ససేమిరా అన్నారని, పాత పద్ధతిలోనే మొదటివారం అద్దె విధానంలో, రెండో వారం పర్సంటేజీ ప్రకారమే ఎగ్జిబిటర్స్‌కు చెల్లిస్తామన్నట్లుగా వాదించారని భోగట్టా. కాగా ఈ వారంలోనే మరోసారి ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్‌తో ఓ సమావేశం నిర్వహించాలని నిర్మాతలు భావిస్తున్నారని తెలిసింది.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	410	81,597
నిఫ్టీ ▲	130	24,813

విదేశీ సూచీలు			
నాస్‌డాక్ (అమెరికా)	18,941	▽	141
డోజోన్స్ (అమెరికా)	41,911	▽	766
ఎఫ్‌టీఎస్‌ఈ 100 (బ్రిటన్)	8,786	▲	5
డాక్స్ (జర్మనీ)	24,122	▲	86
షాంఘై (చైనా)	3,380	▲	7
నికాయ్ (జపాన్)	37,299	▽	231

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	86.20	86.22
£	బ్రిటన్ పౌండ్	113.60	116.56
€	యూరో	95.74	98.44
¥	జపాన్ యెన్ (100)	58.36	58.89
AU$	ఆస్ట్రేలియా డాలర్	54.17	56.37
S$	సింగపూర్ డాలర్	64.12	68.80
SAR	సౌదీ రియాల్	21.94	23.45
UAE D	యూఏఈ దిర్హామ్	22.43	24.21
¥	చైనా యువాన్	11.01	12.84

ఇండిగో లాభం 'హై'జంప్



రూ. 3,067 కోట్లతో రికార్డ్

- షేరుకి రూ. 10 డివిడెండ్

న్యూఢిల్లీ: దేశీ విమానయాన దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 62 శాతం దూసుకెళ్లి రూ. 3,067 కోట్లను అధిగమించింది. ఇది క్యూ4లో కంపెనీ సాధించిన రికార్డ్ లాభంకాగా.. ఇందుకు విమాన ప్రయాణికులు పెరగడం సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 1,895 కోట్లు ఆర్జించింది. ఇండిగో బ్రాండ్ విమాన సర్వీసుల కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ. 18,505 కోట్ల నుంచి రూ. 23,098 కోట్లకు ఎగసింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 10 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.

ప్రయాణికుల జోరు

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఇండిగో నికర లాభం రూ. 7,258 కోట్లను అధిగమించింది. విదేశీ మారక ప్రభావాన్ని మినహాయిస్తే దాదాపు రూ. 8,868 కోట్ల లాభం ఆర్జించింది. గతేడాది 11.8 కోట్లమంది ప్రయాణికులను గమ్యాలకు చేరవేసినట్లు సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. కాగా.. క్యూ4లో ఇండిగో ప్రయాణికుల టికెట్ ఆదాయం 25% జంప్‌చేసి రూ. 19,567 కోట్లను దాటింది. అనుబంధ విభాగాల ఆదాయం 25 శాతం అధికమై రూ. 2,153 కోట్లకు చేరింది. మొత్తం నగదు నిల్వలు రూ. 48,170 కోట్లను అధిగమించగా.. విమానాల సంఖ్య 400ను దాటింది.

ఇండిగో షేరు బీఎస్‌ఈలో 0.4% లాభంతో రూ. 5,466 వద్ద ముగిసింది.

మళ్లీ బంగారం రయ్..!

- 10 గ్రాములకు రూ. 1,910 ర్యాలీ
- మళ్లీ రూ.98 వేల పైకి చేరిక

న్యూఢిల్లీ: అంతర్జాతీయ పరిణామాలతో పసిడికి మరోసారి డిమాండ్ ఏర్పడింది. దీంతో ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.1,910 పెరిగి రూ.98,450 స్థాయికి చేరింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.1,870 లాభపడి రూ.98,000 స్థాయిని అందుకుంది. ''బలహీన డాలర్ పసిడి ధరలకు మద్దతునిచ్చింది. యూఎస్ క్రెడిట్ రేటింగ్‌ను మూడీస్ డౌన్‌గ్రేడ్ చేయడంతో సావరీన్ రిస్క్‌ను సైతం ఇన్వెస్టర్లు పరిగణనలోకి తీసుకుంటున్నారు. రేటింగ్ డౌన్‌గ్రేడ్‌తో దీర్ఘకాలంలో యూఎస్ ఆర్థిక స్థిరత్వంపై అనిశ్చితి ఏర్పడింది. దీంతో ఇన్వెస్టర్లు సురక్షిత సాధనమైన బంగారంలో పెట్టుబడులకు ఆసక్తి చూపించారు''అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. మరోవైపు వెండి ధరలకు సైతం కదలిక వచ్చింది. ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి రూ.1,660 పెరిగి రూ.99,160 స్థాయికి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ బంగారం 3,300 స్థాయిని దాటేసింది. స్పాట్ గోల్డ్ 22 డాలర్ల లాభంతో 3,312 డాలర్ల స్థాయికి చేరుకుంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకుతోడు అమెరికా ఆర్థిక ఆర్థిక పరిస్థితులపై నెలకొన్న ఆందోళనలతో బంగారం 3,300 డాలర్లను తిరిగి అందుకున్నట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.



ప్రైవేట్ లేబుల్స్‌కి జై...



- వినియోగదారుల్లో సగం మంది మొగ్గు
- సొంత బ్రాండ్ ఉత్పత్తులకు ప్రాచుర్యం
- ఈవై సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా వినియోగదారుల కొనుగోలు ధోరణులు మారుతున్నాయి. ప్రైవేట్ లేబుల్స్ వైపు మళ్లే వారు గణనీయంగా పెరుగుతున్నారు. ప్రస్తుతం దాదాపు సగం మంది వినియోగదారులు ఇలా మొగ్గు చూపుతున్నట్లు కన్సల్టెన్సీ సంస్థ ఈవై ఒక సర్వే నివేదికలో తెలిపింది. ఈవై రూపొందించిన ఫ్యూచర్ కన్స్యూమర్ ఇండెక్స్ (ఎఫ్‌సీఐ) ఇండియా నివేదిక ప్రకారం సంప్రదాయ బ్రాండెడ్ ఉత్పత్తుల స్థానంలో స్టోర్ల సొంత బ్రాండ్లకు ప్రాచుర్యం పెరుగుతోంది. 52% మంది వినియోగదారులు ప్రైవేట్ లేబుల్స్‌కు మారారు. ప్రైవేట్ లేబుల్ బ్రాండ్లు మంచి నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్నాయని విశ్వసిస్తున్నట్లు సర్వేలో పాల్గొన్న వారిలో 70% మంది తెలిపారు. అలాగే, బ్రాండెడ్ ఉత్పత్తులతో సరిసమానంగా ప్రైవేట్ లేబుల్స్ ప్రొడక్టులు తమ అవసరాలను తీర్చే విధంగా ఉంటున్నాయని భావిస్తున్నట్లు 70% మంది వినియోగదారులు పేర్కొన్నారు.ముడి సరుకులను లేదా ఫార్ములాను మార్చి, ఉత్పత్తిని మెరుగుపర్చి, వినూత్నంగా అందించేందుకు బ్రాండ్లు ప్రయత్నిస్తున్నా.. ఇవన్నీ నిఖార్సయిన ఆవిష్కరణలు కావని, కంపెనీలు ఖర్చు తగ్గించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు మాత్రమేనని 34% మంది భావిస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది. మారుతున్న ఆర్థిక పరిస్థితుల రీత్యా వినియోగదారుల ధోరణులు మారడం సాధారణమే అయినా, ప్రస్తుత మార్పులు శాశ్వత ప్రాతిపదికన కొనసాగేలా కనిపిస్తోందని ఈవై-పార్థినన్ పార్ట్‌నర్ అంగ్షుమన్ భట్టాచార్య చెప్పారు.

నివేదికలో మరిన్ని ముఖ్యాంశాలు..

- బ్రాండ్‌కు కట్టుబడి ఉండటం కన్నా డిస్కౌంట్లకే వినియోగదారులు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. సేల్ పెట్టినప్పుడు మాత్రమే పెద్ద బ్రాండ్లను కొంటున్నామని 59 % మంది తెలిపారు.
- రిటైల్ స్టోర్స్‌లో కూడా ప్రైవేట్ లేబుల్స్‌కి ప్రాధాన్యత పెరుగుతోంది. తాము షాపింగ్ చేసే చోట మరిన్ని ప్రైవేట్ లేబుల్ ఆప్షన్లు కనిపిస్తున్నట్లు 74 శాతం మంది చెప్పారు. స్టోర్లలోని షెల్ఫుల్లో సరిగ్గా కంటికి కనిపించే స్థాయిలో మరిన్ని ప్రైవేట్ లేబుల్ ఉత్పత్తులను డిస్‌ప్లే చేస్తున్నట్లు గమనించామని 70 శాతం మంది వివరించారు. స్టోర్ల సొంత బ్రాండ్లు, ప్రైవేట్ లేబుల్స్‌తో డబ్బు ఆదా అవుతోందని 69 శాతం మంది వినియోగదారులు చెప్పారు.
- రిటైలర్లు మరింత ధీమాగా ప్రైవేట్ లేబుల్స్‌ను ప్రవేశపెడుతున్నారు. వాటికి ప్రధానమైన ప్రైమ్ షెల్ఫ్ స్పేస్ కూడా ఇస్తున్నారు. అలాగే, వినియోగదారులకు అపరిమిత ఆప్షన్లను, టెక్నాలజీతో ఇతర ఉత్పత్తులతో పోల్చి చూసుకునే వెసులుబాట్లను కల్పిస్తూ మెరుగైన షాపింగ్ అనుభూతిని అందిస్తున్నారు.
- తాజా, కొత్త బ్రాండ్లకు భారత వినియోగదారుల్లో ప్రాచుర్యం పెరుగుతుండటాన్ని ప్రైవేట్ లేబుల్స్ వేగవంతమైన వృద్ధి సూచిస్తోంది. వినూత్న ఆవిష్కరణలతో వారికి మరింతగా చేరువయ్యేందుకు పెద్ద బ్రాండ్లు దృష్టి పెట్టాల్సిన అవసరం నెలకొంది.
- అత్యుత్తమమైన రుచి, నాణ్యత లేదా పనితీరును అందిస్తే తిరిగి బ్రాండెడ్ ఉత్పత్తికి మళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని 47 శాతం మంది తెలిపారు. కట్టే డబ్బుకు మరింత మెరుగైన విలువను పొందడం కోసం తాము మళ్లీ బ్రాండెడ్ ఉత్పత్తులకు మళ్లే అవకాశం ఉందంటూ 44 శాతం మంది సూచనప్రాయంగా తెలిపారు.
- కృత్రిమ మేధ(ఏఐ) కీలకమైన షాపింగ్ సాధనంగా మారింది. ఏఐ సిఫార్సుల ఆధారంగా తాము కొనుగోలు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు 62 శాతం మంది చెప్పారు. తమ షాపింగ్ అనుభూతిని ఏఐ మరింత మెరుగుపర్చిందంటూ 58 శాతం మంది వినియోగదారులు తెలిపారు.

ఇండస్‌ఇండ్‌కు నష్టాలు

క్యూ4లో రూ. 2,329 కోట్లు



ముంబై: ప్రైవేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో లాభాలనువీడి నష్టాలలోకి ప్రవేశించింది. రూ. 2,329 కోట్ల నికర నష్టం ప్రకటించింది. ఖాతాల అవకతవకలతో ప్రొవిజన్లు పెరగడం ప్రతికూల ప్రభావం చూపింది. 2023-24 ఇదే కాలంలో రూ. 2,349 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇందుకు కొంతమంది ఉద్యోగుల పాత్రపై అనుమానాలతో బ్యాంక్ బోర్డు దర్యాప్తు ఏజెన్సీలు, నియంత్రణ సంస్థలకు ఖాతాల మోసాలపై నివేదించమని బ్యాంక్‌ను ఆదేశించింది. ఖాతాల లోపాలు, మైక్రోఫైనాన్స్ పోర్ట్‌ఫోలియోలో మోసం, బ్యాలెన్స్‌షీట్‌లో పొరపాటు అంశాలతో బ్యాంక్ సవాళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అంతర్గత ఆడిట్‌కు ఆదేశించడం తెలిసిందే. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఇండస్‌ఇండ్ నికర లాభం 71% పడిపోయి రూ. 2,576 కోట్లకు పరిమితమైంది. 2023-24లో రూ. 8,977 కోట్ల లాభం సాధించింది. ప్రొవిజన్లు రూ. 3,885 కోట్ల నుంచి రూ. 7,136 కోట్లకు పెరిగాయి.

ప్రొవిజనింగ్ జూమ్

క్యూ4లో ఇండస్‌ఇండ్ బ్యాంక్ రూ. 2,522 కోట్లమేర ప్రొవిజనింగ్ చేపట్టింది. అంతక్రితం క్యూ4లో ఈ పద్దు రూ. 950 కోట్లు మాత్రమే. 2023-24 క్యూ4లో రూ. 12,199 కోట్ల వడ్డీ ఆదాయం అందుకుంది. డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో రూ. 1,979 కోట్లమేర ఖాతాలలో లోపం, మైక్రోఫైనాన్స్ బిజినెస్‌లో రూ. 674 కోట్ల వడ్డీ తప్పుగా నమోదు చేసినట్లు అంతర్గత ఆడిట్‌లో గుర్తించడం, బ్యాలెన్స్‌షీట్‌లో రూ. 595 కోట్ల ఇతర ఆస్తుల అక్రమ పద్దు తదితరాలను బ్యాంక్ మార్చిలో వెల్లడించింది. ఏప్రిల్ 29న సీఈవో సుమంత్ కథ్పాలియా, డిప్యూటీ సీఈవో అరుణ్ ఖురానా రాజీనామా చేశారు. దీంతో బ్యాంక్ బోర్డు కార్యకలాపాల పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్‌ల కమిటీ ఏర్పాటు చేసింది. 2025 జూన్30లోగా కొత్త సీఈవో ఎంపికకు వీలుగా ప్రతిపాదనలు పంపమని బ్యాంక్‌ను ఆర్‌బీఐ ఆదేశించినట్లు ఇండస్‌ఇండ్ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ షేరు 1.4% క్షీణించి రూ. 771 వద్ద ముగిసింది.

మూడు రోజుల నష్టాల నుంచి లాభాల్లోకి

- ఫైనాన్స్, ఫార్మా, రియల్టీకి డిమాండ్
- సెన్సెక్స్ 410 పాయింట్లు ప్లస్
- నిఫ్టీ లాభం 130 పాయింట్లు

ముంబై: దేశీయ స్టాక్ సూచీలు మూడు రోజుల నష్టాల నుంచి తేరుకున్నాయి. అమెరికా సుంకాల ప్రభావం, అంతర్జాతీయ వాణిజ్య అంతరాయాల ప్రతికూలతలను తట్టుకునే స్థితిలో భారత్ ఉందని మూడీస్ రేటింగ్స్ నివేదిక ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. రియల్టీ, ఫార్మా, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు కొనుగోళ్లతో కళకళలాడాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 410 పాయింట్లు పెరిగి 81,597 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 130 పాయింట్లు బలపడి 24,813 వద్ద నిలిచింది. ఒక సెన్సెక్స్ 835 పాయింట్లు బలపడి 82,022 వద్ద, నిఫ్టీ 262 పాయింట్లు ఎగసి 24,946 వద్ద గరిష్టాన్ని తాకాయి. డాలర్లకు డిమాండ్, క్రూడాయిల్ ధరలు పెరగడంతో డాలర్ మారకంలో రూపాయి విలువ ఒక పైసా బలహీనపడి 85.59 వద్ద స్థిరపడింది. ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి ఇజ్రాయెల్ ప్రణాళికలు వేస్తోందన్న వార్తలతో అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

చమురుకు మరింత డిమాండ్	టారిఫ్ ప్రభావాలను భారత్ తట్టుకోగలదు

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ కళ్యాణిలో 210 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

పశ్చిమ బెంగాల్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, కళ్యాణి.. ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 210.
» **విభాగాలు:** అనెస్తీషియా, కార్డియాలజీ, సీటీవీఎస్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ట్రామా, ఎండోక్రైనాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఆంకాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, ఓబీజీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, పీఎంఆర్, సైకియాట్రీ, పల్మోమెడిసిన్, రేడియో డయాగ్నోసిస్, రేడియో థెరపీ, రుమటాలజీ, సర్జికల్ ఆంకాలజీ, యూరాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, బ్లడ్‌బ్యాంక్, బయోకెమిస్ట్రీ, సీఎంఎఫ్‌ఎం, మైక్రోబయాలజీ, పాథాలజీ, బయోస్టాటిస్టిక్స్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డీఎన్‌బీ, ఎంఎస్సీ, ఎంఫిల్/పీహెచ్‌డీ, ఎంఎస్/ఎండీ, ఎంసీహెచ్, డీఎంలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.**వయసు:** 15.06.2025 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.15,600 నుంచి 39,100.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 14.06.2025
» **ఇంటర్వ్యూ తేది:** 01.07.2025 నుంచి 02.07.2025. » **ఇంటర్వ్యూ వేదిక:** అకడమిక్ బ్లాక్-1, గ్రౌండ్ ఫ్లోర్, అకడమిక్ సెక్షన్ ఆఫ్ ఏహెచ్‌ఎంఎస్, కళ్యాణి-741245.
» **వెబ్‌సైట్:** https://aiimskalyani.edu.in

బీసీపీఎల్ లిమిటెడ్‌లో 27 పోస్టులు

అస్సాంలోని బ్రహ్మపుత్ర క్రాకర్ అండ్ పాలిమర్ లిమిటెడ్(బీసీపీఎల్).. డిప్యూటీ జనరల్ మేనేజర్, సీనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం పోస్టుల సంఖ్య:** 27.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్-01, సీనియర్ ఇంజనీర్ (కెమికల్)-15, సీనియర్ ఆఫీసర్(కాంట్రాక్ట్-ప్రొక్యూర్‌మెంట్)-01, సీనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-01, సీనియర్ ఆఫీసర్(ఫైనాన్స్-అకౌంట్స్)-02, సీనియర్ ఇంజనీర్(ఇన్‌స్ట్రుమెంటేషన్)-03, సీనియర్ ఇంజనీర్(ఐటీ)-01, సీనియర్ ఆఫీసర్(మార్కెటింగ్)-01, సీనియర్ ఇంజనీర్(మెకానికల్)-01, ఆఫీసర్(ల్యాబొరేటరీ)-01.
» **విభాగాలు:** ఫైర్ సేఫ్టీ, కెమికల్, కాంట్రాక్ట్ అండ్ ప్రొక్యూర్‌మెంట్, ఎలక్ట్రికల్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఐటీ, మార్కెటింగ్, మెకానికల్, ల్యాబొరేటరీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, సీఏ/ఐసీడబ్ల్యూఏ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 50 ఏళ్లు, మిగతా పోస్టులకు 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.1,00,000,ఆఫీసర్(ల్యాబొరేటరి) పోస్టుకు రూ.40,000 నుంచి రూ.1,40,000, మిగతా పోస్టులకు రూ.50,000 నుంచి 1,60,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.06.2025
» **వెబ్‌సైట్:** https://bcplonline.co.in

జిప్‌మర్‌లో 11 ప్రొఫెసర్ పోస్టులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్).. రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:**11. **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-06, అసిస్టెంట్ ప్రొఫెసర్-05.
» **విభాగాలు:** మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ(మైక్రోబయాలజీ) ఉత్తీర్ణతతో పాటు 3 నుంచి 14 ఏళ్ల బోధన అనుభవం ఉండాలి. **వయసు:** 01.07.2025 నాటికి ప్రొఫెసర్ పోస్టుకు 58 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు 50 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 02.06.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.07.2025
» **వెబ్‌సైట్:** http://https//jipmer.edu.in

రుచికరమైన కెరీర్



పాకశాస్త్రంపై ఆసక్తి ఉందా..! రుచికరంగా వండటంతోపాటు, వాటిలోని పోషకాలు, అనుసరించాల్సిన ప్రమాణాలు, వండిన పదార్థాలను అందంగా అలంకరించడం వంటివి శాస్త్రీయంగా నేర్చుకోవాలని ఉందా!! అయితే కలినరీ సైన్స్ మీకు ఉత్తమ మార్గం! ఇందులో ప్రావీణ్యం సంపాదిస్తే.. గరిట తిప్పి ఉపాధి రుచిని చవిచూడవచ్చు. పాకశాస్త్ర బోధనలో కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ అధ్వర్యంలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ (ఐసీఐ) ముఖ్యమైంది. ఈ ఇన్‌స్టిట్యూట్ బీబీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నేపథ్యంలో.. కలినరీ కోర్సులు, సీట్లు, పరీక్ష విధానం తదితర వివరాలు..

» కలినరీ ఇన్‌స్టిట్యూట్‌లో బీబీఏ, ఎంబీఏ కోర్సులు
» రాత పరీక్షలో ప్రతిభ ద్వారా ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఆతిథ్య, హోటల్ మేనేజ్‌మెంట్ రంగాలకు నానాటికీ ఆదరణపెరుగుతోంది. ఈ రంగంలో ఉపాధి ఖాయంగా లభిస్తుండటంతో ఇటీవల యువత కలినరీ సైన్స్ కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. దేశంలో కలినరీ కోర్సులను అందించడంలో ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్‌కు మంచి పేరుంది. ఈ ఇన్‌స్టిట్యూట్‌కు నోయిడా, తిరుపతిలో ఉన్న క్యాంపస్‌లు బీబీఏ, ఎంబీఏ కలినరీ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.

రెండు కాలేజీలు.. 300 సీట్లు

బీబీఏ కలినరీ ఆర్ట్స్ కోర్సుకు సంబంధించి నోయిడా, తిరుపతిల్లోని ఒక్కో కళాశాలల్లో 120 చొప్పున సీట్లు ఉన్నాయి. అలాగే ఎంబీఏ కలినరీకి సంబంధించి నోయిడా, తిరుపతిల్లో ఒక్కో క్యాంపస్‌లో 30 చొప్పున సీట్లు ఉన్నాయి. ప్రవేశ పరీక్షలో మార్కుల ఆధారంగా సీటు లభిస్తుంది.

అర్హతలు

- **బీబీఏ కలినరీ:** ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించాలి. జనరల్ అభ్యర్థులు 45శాతం మార్కులు; ఎస్సీ,ఎస్టీ, దివ్యాంగులు 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- **ఎంబీఏ కలినరీ:** డిగ్రీలో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 40 శాతం ఉండాలి.

కోర్సు వ్యవధి

బీబీఏ కలినరీ ఆర్ట్స్ మూడేళ్ల వ్యవధిలో ఆరు సెమిస్టర్లుగా ఉంటుంది. ఎంబీఏ కలినరీ కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

ప్రతిభ ఆధారంగా ప్రవేశం

సెంట్రల్ యూనివర్సిటీల్లోని సీట్ల భర్తీకోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)లో సాధించిన స్కోరు, లేదా ఐసీఐ (ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్) నిర్వహించే జేఈఈ స్కోర్ ఆధారంగా కలినరీ యూజీ, పీజీ కోర్సుల్లో సీటు లభిస్తుంది.

వంద మార్కులకు పరీక్ష

- ఐసీఐ జేఈఈ బీబీఏ కలినరీ పరీక్ష 100 మార్కులకు జరుగుతుంది. ఈ పరీక్షలో ప్రధానంగా ఐదు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ అప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్, జీకే అండ్ కరెంట్ అఫైర్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, సర్వీస్ ఆప్టిట్యూడ్‌లపై ఒక్కో విభాగం నుంచి 20 ప్రశ్నలు చొప్పున ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. రుణాత్మక మార్కులు లేవు.
- ఎంబీఏ కలినరీ కోసం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో ఫుడ్‌ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజెస్ సర్వీసెస్, అనలిటికల్ అప్టిట్యూడ్/ఐక్యూ, హ్యూమన్ రిసోర్స్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఒక్కో విభాగం నుంచి 20 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.

విస్తృత అవకాశాలు

కలినరీ కోర్సును పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు విస్తృతం. స్టార్ హోటళ్లలో చెఫ్, అలాగే క్యాటరర్‌గా, కిచెన్ పేస్ట్రీగా, న్యూట్రీషన్‌గా ఉద్యోగం పొందవచ్చు. ఎయిర్ ఫోర్స్‌లో, ఎయిర్ లైన్స్‌లో, క్రూజ్‌లైన్స్‌లోనూ ఉద్యోగ అవకాశాలుంటాయి. దీంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ టూరిజం హోటళ్లలోనూ కొలువులు సొంతం చేసుకోవచ్చు. సొంతంగా హోటళ్లు, రెస్టారెంట్లు సైతం ఏర్పాటు చేసుకోవచ్చు. అలాగే క్యాటరింగ్ సర్వీస్‌లతో స్వయం ఉపాధిని పొందవచ్చు. కలినరీ కోర్సులు పూర్తిచేసిన వారికి విదేశాల్లోని ప్రముఖ హోటళ్లలో సైతం ఉపాధి అవకాశాలుంటాయి. ఇందుకు ఇంగ్లిష్‌లో చక్కని ప్రావీణ్యం తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 23.05.2025
- పరీక్ష తేది: 25.05.2025
- తరగతులు ప్రారంభం: 15.07.2025
- వెబ్‌సైట్: www.icitirupati.in

ప్రిలిమ్స్.. పరీక్ష రోజు మీదయ్యేలా!



» మే 25న దేశవ్యాప్తంగా సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష
» ఓఎంఆర్ షీట్ విధానంలో ఒకే రోజు రెండు పేపర్లు

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామ్ 2025ను మే 25న దేశవ్యాప్తంగా నిర్వహించనుంది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ప్రతిష్టాత్మక సర్వీసులకు నిర్వహించే మూడంచెల సివిల్స్ ఎంపిక ప్రక్రియలో ప్రిలిమ్స్ అత్యంత కీలకమైన తొలిదశ. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా ఐదు లక్షల మందికిపైగా హాజరయ్యే అవకాశముంది. మరో రెండు రోజుల్లో జరిగే సివిల్స్ ప్రిలిమ్స్‌కు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఎగ్జామ్ డే టిప్స్..

ప్రిలిమ్స్ పరీక్షకు రెండ్రోజుల ముందు నుంచీ అభ్యర్థులు పూర్తి ఆత్మవిశ్వాసంతోపాటు మానసికంగా ఆహ్లాదంగా ఉండేలా చూసుకోవాలి. పరీక్ష గురించి ఆందోళన చెందకుండా బాగా రాయగలం అనే సానుకూల దృక్పథం పెంచుకోవాలి. అదేవిధంగా ఆరోగ్యంగా ఉండటం అత్యంత కీలకమని భావించాలి. ముఖ్యమైన గణాంకాలను షార్ట్ నోట్స్ నుంచి ర్యాపిడ్ రివిజన్ చేసుకోవాలి.

పరీక్ష ముందు రోజు

పరీక్షకు ముందు రోజు అభ్యర్థులు వ్యవహరించే తీరు ఒక్కొక్కరిదీ ఒక్కో విధంగా ఉంటుంది. కొంతమంది పరీక్ష ముందు రోజు కూడా చదవడానికి మానసికంగా సంసిద్ధంగా ఉంటారు. మరికొందరు పరీక్ష ముందు రోజు చదవడం వల్ల టెన్షన్‌కు గురవుతామని భావిస్తారు. అయితే నిపుణులు పేర్కొనే అభిప్రాయం ప్రకారం- పరీక్షకు ముందు రోజు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. వీలైతే ప్రిపరేషన్‌కు దూరంగా ఉండటమే మంచిది. మరుసటి రోజు పరీక్షకు అవసరమైన హాల్ టికెట్, పెన్నులు వంటి వాటిని సిద్ధం చేసుకోవాలి.

మే 25.. పరీక్ష రోజు వచ్చేసింది

ఏడాది, రెండేళ్ల నుంచి ప్రిపరేషన్ సాగిస్తూ వచ్చిన అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు, తమ ప్రతిభను ప్రదర్శించే సమయం వచ్చేసింది. ఈ సమయంలో అభ్యర్థులు ఒత్తిడికి గురవడం సహజం. అయితే పరీక్షకు అందుబాటులో ఉండే రెండు గంటల సమయంలో వీలైనన్ని సరైన సమాధానాలు గుర్తించడంపైనే దృష్టిపెట్టాలి.

ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్య విషయం.. నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంది. కాబట్టి సమాధానాలు ఇచ్చే క్రమంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ముందుగా పరీక్ష పత్రాన్ని పూర్తిగా చదవడానికి కనీసం పది లేదా పదిహేను నిమిషాల సమయం కేటాయించాలి. ఆ తర్వాత సులువుగా ఉన్న ప్రశ్నలకు ముందుగా, ఒక మోస్తరు క్లిష్టత ప్రశ్నలకు తర్వాత, బాగా క్లిష్టమైన ప్రశ్నలను చివరగా సమాధానాలు ఇవ్వాలి.

అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించిన తర్వాత వాటిని మరోసారి క్షుణ్నంగా పరిశీలించుకోవాలి. అదే విధంగా తాము ప్రశ్నకు సమాధానంగా ఇచ్చిన ఆప్షన్‌నే ఓఎంఆర్ షీట్‌లో గుర్తించామా? లేదా? పరిశీలించాలి. కొన్ని సందర్భాల్లో ఒక ప్రశ్నకు బదులు మరో ప్రశ్నకు సంబంధించి బబులు చేయడం జరుగుతుంది. దీనివల్ల మొత్తం ఫలితమే తారుమారవుతుంది. ఇలా అన్ని ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలను సమీక్షించుకున్నాక.. అసలు ఆలోచనకు తట్టని ప్రశ్నలవైపు దృష్టి పెట్టాలి. అప్పటి వరకు తాము ఇచ్చిన సమాధానాలకు లభించే మార్కులను గణించి అవి 120 నుంచి 140 మధ్యలో ఉంటేనే.. ఏ మాత్రం సమాధానం తెలియని ప్రశ్నలకు గెస్‌వర్క్ చేయాలి. ఒకవేళ అభ్యర్థులు తాము సమాధానాలిచ్చిన ప్రశ్నలకు వచ్చే మార్కుల శ్రేణి 100 నుంచి 120 మధ్యలోనే ఉంటుందని భావిస్తే.. తెలియని ప్రశ్నలకు సమాధానాలిచ్చే ప్రయత్నం చేయకపోవడమే మంచిది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- టీచింగ్ అప్టిట్యూడ్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-కంప్యూటర్ అవేర్‌నెస్




అమ్మ గెలిచింది!

మన్ననూర్: కూనను కాపాడుకునేందుకు ఒక ఎలుగుబంటి పెద్దపులిపై తిరగబడింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టులో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అటవీశాఖ అధికారుల కథనం మేరకు.. అమ్రాబాద్ మండలం ఫర్హాబాద్ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఒక పెద్దపులి.. ఎలుగుబంటి పిల్లను వేటాడే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో తల్లి ఎలుగుబంటి పెద్దపులి బారినుంచి తన పిల్లకూనను రక్షించుకునేందుకు సాహసోపేతంగా పోరాడింది. చివరకు పెద్దపులి పలాయనం చిత్తగించింది. అబ్బురపరిచే ఈ దృశ్యాలు.. అటవీశాఖ వన్యప్రాణుల కదలికలను గుర్తించేందుకు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి.

ఉన్న బోధకులకే 'కొత్త' శిక్షణ

ఆధునిక కోర్సులకు ఫ్యాకల్టీ కొరత
ఇప్పటికిప్పుడు అర్హులు దొరకని పరిస్థితి
ఉన్నవారికే శిక్షణ ఇవ్వాలని ఏఐసీటీఈ సూచన
ఐఐటీ, ఎన్ఐటీలతో సమన్వయం
సాఫ్ట్‌వేర్ నిపుణులతోనూ వీకెండ్ క్లాసులు
రాష్ట్రాలకు ఏఐసీటీఈ మార్గదర్శకాలు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఎమర్జింగ్ కోర్సుల బోధనకు ఆధునిక మెళకువలు అవసరమని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) సూచించింది. ప్రస్తుతం ఉన్న ఫ్యాకల్టీకే శిక్షణ ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చని తెలిపింది. ఈ మేరకు పలు మార్గదర్శకాలను జారీచేసింది. ఇంజనీరింగ్‌లో కొన్నేళ్లుగా కోర్ గ్రూపుల కన్నా, కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ వంటి బ్రాంచీలకు డిమాండ్ ఎక్కువైంది. అయితే, ఈ కోర్సుల బోధనకు సరైన ఫ్యాకల్టీ ఉండటం లేదనే విమర్శలు పెరుగుతున్నాయి. ఇవి కొత్తగా వచ్చిన కోర్సులు కావడంతో ఇందులో మాస్టర్స్ డిగ్రీ చేసినవారు ఉండటం లేదు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ బోధించే వారితోనే కొత్త కోర్సులూ చెప్పిస్తున్నారు. ఇంకో మూడేళ్లపాటు ఇదే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న బోధకులకే శిక్షణ ఇచ్చి కొత్త కోర్సులు చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని ఏఐసీటీఈ సూచించింది.



శిక్షణ తప్పనిసరి

రాష్ట్రంలో 1.16 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉంటే, ఇందులో సగానికిపైగా కంప్యూటర్ సైన్స్ కోర్సులే ఉన్నాయి. సీఎస్ఈ కోర్ కాకుండా ఏఐ, ఏఐఎంఎల్, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి సీట్లు 15 వేల వరకు ఉన్నాయి. ప్రతి 40 మంది విద్యార్థులకు ఒక నిపుణుడైన బోధకుడు ఉండాలి. దీంతో ఫ్యాకల్టీ కొరత ఏర్పడింది. వాస్తవానికి కొత్త కోర్సులకు అదనంగా ఆరు సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి. ఇందులో కూడా బేసిక్ చాప్టర్లు సీఎస్ఈ కోర్సులో ఉన్నవే. అదనపు చాప్టర్లు కొత్తగా వస్తున్న ఏఐ, డేటా అనాలిసిస్, సైబర్ లాంగ్వేజ్ సిస్టమ్‌కు సంబంధించినవి. ఐఐటీలు, ఎన్ఐటీల్లో కొత్త కోర్సులతోపాటు, ఆధునిక సాంకేతికతపై ఎప్పటికప్పుడు అంతర్జాతీయ సంస్థలతో ఓరియంటేషన్ నిర్వహిస్తున్నారు. దీంతో అక్కడి ఫ్యాకల్టీ అప్‌డేట్ అయ్యింది. రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో సీఎస్ఈతోపాటు ఎలక్ట్రానిక్స్ బోధిస్తున్న అధ్యాపకులను ఎన్ఐటీ, ఐఐటీల్లో కొంతకాలం శిక్షణకు పంపడం లేదా ఆన్‌లైన్ శిక్షణ ఇప్పించాలని ఏఐసీటీఈ సూచించింది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతోనూ శిక్షణ

ఇంజనీరింగ్ నేపథ్యం ఉన్న ఐటీ ఉద్యోగులు కంపెనీల శిక్షణతో వృత్తిపరమైన ఉన్నతి పొందుతున్నారు. నాలుగేళ్ల అనుభవం ఉన్న ఉద్యోగులకు సబ్జెక్టుపై మంచి అవగాహన ఉంటోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఐటీ ఉద్యోగులతో ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపకులకు శిక్షణ ఇప్పించాలని ఏఐసీటీఈ సూచించింది. ఐటీ ఉద్యోగులకు సాధారణంగా శని, ఆదివారాల్లో సెలవులు ఉంటాయి. ఈ రెండు రోజులు అధ్యాపకులకు క్లాసులు నిర్వహించవచ్చని తెలిపింది. దీంతోపాటు ఆన్‌లైన్‌లో నిర్వహించే ఏఐ కోర్సుల ద్వారా కూడా ఫ్యాకల్టీని అప్‌గ్రేడ్ చేయవచ్చని పేర్కొంది. ఇలా శిక్షణ పొందిన ఫ్యాకల్టీకి ప్రతి సంవత్సరం ఏఐసీటీఈ నేతృత్వంలో పరీక్ష నిర్వహించే ఆలోచనపై కూడా కసరత్తు జరుగుతోంది. దీంతో అధ్యాపకుడు ఆయా రంగంలో నిష్ణాతుడన్న ధ్రువీకరణ జరుగుతుంది. ఫ్యాకల్టీ లేని కారణంగా సీట్ల పెంపు ఆపేకన్నా, ఉన్నవారిని మెరుగుపర్చుకోవడం సులభమన్న విధానాన్ని ఏఐసీటీఈ రాష్ట్రాల ముందు ఉంచింది.

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్ రెస్పాన్స్ షీట్

సాక్షి, హైదరాబాద్: ఐఐటీల్లో ప్రవేశానికి ఈ నెల 18వ తేదీన కాన్పూర్ ఐఐటీ నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ అడ్వాన్స్‌డ్) రెస్పాన్స్ షీట్ గురువారం విడుదలయ్యే అవకాశం ఉంది. సాయంత్రం 5 గంటల తర్వాత డౌన్‌లోడ్ ఆప్షన్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని కాన్పూర్ ఐఐటీ వర్గాలు తెలిపాయి. మే 26 లోపు కీ విడుదల చేసే వీలుంది. విద్యార్థుల అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత జూన్ 2వ తేదీన ఆన్‌లైన్ ద్వారా ఫలితాలు వెల్లడిస్తారు. జూన్ 3వ తేదీ నుంచి ఎన్ఐటీ, ఐఐటీ ఇతర జాతీయ సంస్థల్లో ప్రవేశానికి సంబంధించిన షెడ్యూల్‌ను జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ (జోసా) విడుదల చేస్తుంది.

నేటినుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి మొదలవుతాయి. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఇంటర్ బోర్డ్ పరీక్ష విభాగం అధికారిణి జయప్రదాబాయ్ తెలిపారు. మొదటి సంవత్సరంలో మార్కుల పెంపు కోసం ఇంప్రూవ్‌మెంట్ రాసేవారు పరీక్షలకు హాజరవుతారు. మొత్తంగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి 4,13,597 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో మొదటి సంవత్సరం జనరల్ విభాగానికి 2,49,204 మంది, ఒకేషనల్‌కు 17,003 మంది, రెండో సంవత్సరం జనరల్‌కు 1,34,988 మంది, ఒకేషనల్‌కు 12,402 మంది దరఖాస్తు చేసుకున్నారు.

డిగ్రీలో తప్పిన విద్యార్థులకు ఓయూ వన్‌టైం చాన్స్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో 3 సంవత్సరాల డిగ్రీ (నాన్ సెమిస్టర్) కోర్సులో తప్పిన పూర్వవిద్యార్థులు తిరిగి పరీక్ష రాసుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సులను 2000 నుంచి 2015 విద్యా సంవత్సరంలో చదివి ఫెయిలైన పూర్వవిద్యార్థులు జూన్ 17 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని అధికారులు తెలిపారు. రూ.500 అపరాధ రుసుముతో జూన్ 20 నుంచి 24 వరకు ఆయా కాలేజీల్లో ఫీజు చెల్లించవచ్చు. 2015–16 విద్యా సంవత్సరం సిలబస్ ప్రకారం పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడవచ్చు.

దోస్త్‌కు 57,719 మంది ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే దోస్త్‌కు ఇప్పటివరకూ 87,863 మంది దరఖాస్తు చేసుకున్నారు. 70,005 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. వీరిలో 78,778 మంది రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు. దోస్త్ మొదటి దశ ఆప్షన్లు బుధవారంతో ముగిశాయి. ఇప్పటి వరకూ 57,719 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. సీట్ల కేటాయింపు గురువారం చేపడతారు. ఆ తర్వాత రెండో దశ దోస్త్ రిజిస్ట్రేషన్ మొదలవుతుంది.

దేశ మేధో వారసత్వానికి గుర్తింపు

ఫెలోస్ ఆఫ్ ది రాయల్ సొసైటీగా ఇద్దరు తెలుగు శాస్త్రవేత్తలు
ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి హర్షం
జగదీశ్, మల్లికార్జున్‌లకు వచ్చిన గుర్తింపు అందరికీ స్ఫూర్తినిస్తుందని వ్యాఖ్య


బీఎస్ మూర్తి

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఇద్దరు శాస్త్రవేత్తలు ప్రతిష్టాత్మక 'ఫెలోస్ ఆఫ్ ది రాయల్ సొసైటీ (ఎఫ్ఆర్ఎస్)'గా ఎంపిక కావడంపై ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఐఐటీ హైదరాబాద్‌తో అనుబంధం కలిగిన ఆ ఇద్దరు శాస్త్రవేత్తలు..ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చెన్నుపాటి జగదీశ్, సిలికాన్ వ్యాలీలో ఎరిక్సన్ సీటీఓగా ఉన్న డాక్టర్ మల్లికార్జున్ తాటిపాములతో ఆయన వర్చువల్‌గా భేటీ అయ్యారు. బుధవారం నాటి ఈ సమావేశం సందర్భంగా ఆ ఇద్దరినీ మూర్తి అభినందించారు. ఎఫ్ఆర్ఎస్‌కు ఎంపిక కావడం దేశ మేధోవారసత్వానికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. అంతర్జాతీయంగా శాస్త్ర సాంకేతిక రంగంలో రాణించేందుకు చేసిన కృషి, ఆవిష్కరణలను ఈ గుర్తింపు ప్రతిబింబిస్తోందన్నారు. జగదీశ్, మల్లికార్జున్‌లకు వచ్చిన గుర్తింపు ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు స్ఫూర్తినిస్తుందని, విద్యా, పరిశోధన రంగాల్లో తమ సంస్థ కొత్త శిఖరాలకు చేరేందుకు తోడ్పడుతుందని మూర్తి పేర్కొన్నారు.

కలిసి కట్టుగా సవాళ్లకు పరిష్కారం: ప్రొఫెసర్ జగదీశ్



ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్లిష్ట సవాళ్లకు కేవలం ఒక దేశమో, వ్యక్తో పరిష్కారం చూపలేరని, కలిసికట్టుగా మాత్రమే ఇది సాధ్యమని ప్రొఫెసర్ జగదీశ్ అన్నారు. ప్రస్తుతం వాతావరణ మార్పు, మహమ్మారులు, ఆరోగ్య రక్షణ, డిజిటల్ పరివర్తన, శిలాజ ఇంధనాల నుంచి ఇతర ఇంధనాలపై మళ్లడం వంటి అనేక సవాళ్లను అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటోందని చెప్పారు. శాస్త్ర, సాంకేతికత, ఇంజనీరింగ్, గణితం (స్టెమ్) పరిజ్ఞానాన్ని సామాజిక శాస్త్రాలతో జోడించడం ద్వారా సవాళ్లను కొంత మేర అధిగమించవచ్చునని అన్నారు.

విభిన్న సాంకేతికతల సంగమం: డాక్టర్ మల్లికార్జున్



సాంకేతికంగా మనం అత్యంత కీలకమైన చారిత్రక సందర్భంలో ఉన్నామని, ఏఐ, క్లౌడ్, కమ్యూనికేషన్ వంటి సాంకేతికతలు వేటికవే కాకుండా ఒక దానితో మరొకటి సంగమిస్తూ పురోగమిస్తున్నాయని డాక్టర్ మల్లికార్జున్ చెప్పారు. ఇది ఆరోగ్య రక్షణ, విద్య, వ్యవసాయం తదితర రంగాల్లో వాస్తవిక సమస్యల పరిష్కారానికి కొత్త దారులు చూపుతోందని అన్నారు. అయితే సాంకేతికత ఒక్కటే భవిష్యత్తును నిర్ణయించలేదని మల్లికార్జున్ వ్యాఖ్యానించారు.


పెళ్లి పెద్ద కలెక్టర్ దీవెనలు తీసుకుంటున్న వధూవరులు

కల్యాణ వైభోగమే..

పెద్దపల్లి రూరల్: కలెక్టరే పెళ్లి పెద్ద అయ్యారు. అధికారులే అయినవాళ్లయ్యారు. తమ ఇంటి ఆడపడుచులా అక్కున చేర్చుకున్నారు. అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. రామగుండం ప్రాంతానికి చెందిన తబితా ఆశ్రమంలో ఉంటున్న నక్క మానస వివాహం.. రాజేశ్‌తో కలెక్టరేట్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. తల్లిదండ్రులను చిన్నతనంలోనే కోల్పోయిన నక్క మానస, నక్క లక్ష్మి అక్కాచెల్లెళ్లు. వీరు 16 ఏళ్లుగా తబితా ఆశ్రమంలో ఉంటున్నారు. మానసకు వివాహం నిశ్చయం కావడంతో వివాహతంతు జరిపించేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష చొరవ తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే కలెక్టరేట్ ఆవరణలోని శ్రీవేంకటేశ్వర ఆలయాన్ని వివాహవేదిక చేశారు. అర్చకుల మంత్రోచ్చారణలు, బాజాభజంత్రీల మధ్య ఉదయం 11.05 గంటలకు వివాహం ఘనంగా జరిగింది. కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, అడిషనల్ కలెక్టర్ వేణు, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ సహా పలుశాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో సేకరించిన రూ.61,800 విలువైన చెక్కును కలెక్టర్ శ్రీహర్ష వధూవరులకు అందించారు. వరుడి బంధుమిత్రులతో పాటు మోచి సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, కార్యదర్శి రాజు, ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు.. మోచికుల ఆరాధ్య దైవమైన సంత్ రవిదాస్ హరలయ్య జ్ఞాపికను వధూవరులకు అందజేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
గురువారం । 22-5-2025



ప్రమాద సమయాల్లో వ్యవరించాల్సిన తీరుపై వివరిస్తున్న రెస్క్యూ, ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు



రోప్ ద్వారా సురక్షితంగా తరలించే విధానాన్ని చూపిస్తున్న రెస్క్యూ సభ్యులు

ఆపద్బాంధవులకు అద్భుత శిక్షణ

36 రోజులు.. 1,200 మంది ● ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు కఠోర శిక్షణ ● రెస్క్యూ, ఫైర్‌ఫైటింగ్, రోప్ క్లైంబింగ్‌పై తర్ఫీదు ● తక్కువ సమయంలో ఎక్కువ మందిని కాపాడటమే లక్ష్యం

గోదావరిఖని: ప్రకృతి వైపరీత్యాల సమయంలో అనుసరించాల్సిన విధానంపై స్టేట్ డిజాస్టర్స్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్‌ఎఫ్) బృందాలకు సింగరేణి శిక్షణ ఇస్తోంది. జల, వాయు, అగ్ని ప్రమాదాలతోపాటు.. బహుళ అంతస్తుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు అనుసరించాల్సిన సహాయక చర్యలపై సింగరేణి సంస్థ.. 36 రోజుల పాటు 1,200 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి శిక్షణ ప్రారంభించింది. వంద మందికి ఒక బృందం చొప్పున, మూడురోజులపాటు పలు అంశాలపై శిక్షణతోపాటు ప్రాక్టికల్స్ కూడా నిర్వహిస్తోంది. ఇలా 36 రోజుల పాటు 12 బృందాలకు శిక్షణ ఇవ్వనుంది. నాలుగు నెలల క్రితమే రాష్ట్రంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రిజర్వ్ పోలీసు విభాగం నుంచి ఆసక్తి ఉన్న 1,200 మందిని ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్రంలోని 12 క్యాంప్‌ల్లో ఉన్నవారికి ప్రకృతి వైపరీత్యాల సమయంలో స్పందించాల్సిన తీరు, ఆపత్కాలంలో తాము సురక్షితంగా ఉండి, ఆపదలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం లక్ష్యంగా శిక్షణ కొనసాగుతోంది. ముందుగా ఇతర రాష్ట్రాల్లో కొన్ని బృందాలకు శిక్షణ ఇస్తున్నారు. కోయంబత్తూర్, విజయవాడ, పుణె, వడోదర, ఒడిశా రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్‌డీఆర్‌ఎఫ్ ద్వారా పలు అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ఒక్కొక్క బృందానికి రెండు నెలల పాటు శిక్షణ కొనసాగుతుంది. దీంతోపాటు రాష్ట్రంలో పలు అంశాలపై స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ (ఎస్‌డీఆర్‌ఎఫ్) సిబ్బందికి శిక్షణ ప్రారంభమైంది. ముందుగా హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో బోట్లపై వెళ్లి.. నీటిలో చిక్కుకున్న వారిని కాపాడే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత సింగరేణి రెస్క్యూ విభాగంతో శిక్షణ ఇస్తున్నారు.



ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడటాన్ని చూపిస్తున్న బ్రిగేడియర్లు



మంటలను ఆర్పే విధానాన్ని చూపిస్తున్న బ్రిగేడియర్లు

ఎస్ఎల్‌బీసీతో సింగరేణి రెస్క్యూపై నజర్

ఎస్ఎల్‌బీసీ ప్రమాదంతో.. సింగరేణి రెస్క్యూ ప్రాధాన్యం దేశవ్యాప్తంగా వెలుగులోకి వచ్చింది. సుమారు 40 రోజుల పాటు సొరంగంలో చిక్కుకున్న వారిని వెలికితీసే పనుల్లో సహాయ బృందాలు అందించిన సేవలు ప్రత్యేకంగా నిలిచాయి. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం ఏర్పాటైన ఎస్‌డీఆర్‌ఎఫ్ విభాగానికి.. విపత్తుల సమయంలో స్పందించాల్సిన తీరుపై కఠోర శిక్షణ ఇస్తున్నారు. మొదటి బ్యాచ్‌లో డిచ్‌పల్లిలోని 7వ బెటాలియన్‌కు చెందిన వంద మందికి శిక్షణ కొనసాగుతోంది.

మూడు రోజుల ప్రత్యేక శిక్షణ

ప్రకృతికి విరుద్ధంగా భూగర్భ గనుల్లోకి వెళ్లి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కార్మికులు ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు వారిని కాపాడే విధానం, అగ్ని ప్రమాదాలు, విషవాయువులు ఏర్పడినప్పుడు ఎలాంటి పరికరాలు వినియోగించి.. ఎలా అదుపులోకి తీసుకురావాలో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి ప్రత్యక్షంగా చూపించారు. భవనం కూలిపోయినప్పుడు, అగ్ని ప్రమాదాలకు గురైనప్పుడు సహాయక సిబ్బంది సురక్షితంగా ఉంటూ.. ప్రమాదంలో చిక్కుకున్న వారిని సు రక్షితంగా బయటకు తీసుకురావడమే లక్ష్యంగా ఈ శిక్షణ ఇస్తున్నారు. బుధవారంతో మొదటిబ్యాచ్ శిక్షణ పూర్తయింది. సింగరేణి అందించిన శిక్షణ భవిష్యత్‌లో చాలా ఉపయోగపడుతుందని విపత్తుల విభాగం సిబ్బంది పేర్కొన్నారు.



సంతోషంగా ఉంది

అంతర్జాతీయ స్థాయి సామగ్రి సింగరేణి వద్ద ఉంది. ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలో అన్ని విషయాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. ఇందుకు చాలా సంతోషంగా ఉంది.

– కె.రవీందర్, ఆర్ఎస్ఐ, డిచ్‌పల్లి 7వ బెటాలియన్

ఎలా రక్షించాలో తెలుసుకున్నాం..



క్లిష్ట సమయాల్లో ప్రకృతి వైపరీత్యాల సహాయక బృందం ఎలా వ్యవహరించాలనే విషయాలను తెలుసుకున్నాం. సకాలంలో స్పందించడంతో పాటు సురక్షితంగా ఉండి ఆపదలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడమే లక్ష్యంగా అందించిన శిక్షణ భవిష్యత్‌లో ఉపయోగపడుతుంది.

– బదావత్ రంజిత్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్,

కళ్లకు కట్టినట్టు..



ఎత్తయిన భవనాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా స్పందించాలి. ఏవిధమైన చర్యలు తీసుకోవాలనే తీరుపై కూలంకషంగా వివరించారు. ప్రమాదాల్లో చిక్కువారిని రక్షించడంతో పాటు.. మనం కూడా సురక్షితంగా బయటకు వచ్చే విధానం, మంటలను అదుపులోకి తెచ్చే తీరుతో పాటు పలు అంశాలపై కళ్లకు కట్టినట్లు వివరించారు.

– కె.రవి, ఏఎస్ఐ, ఎస్‌డీఆర్‌ఎఫ్

అంతర్జాతీయ ప్రమాణాలతో..



ప్రకృతి వైపరీత్యాలతో పాటు భూగర్భ గనుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు అనుసరించాల్సిన తీరుపై అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ కేంద్రంగా నిలుపుతాం. ఇప్పటికే కోలిండియాలోని అనేక సంస్థలకు సహాయ చర్యలపై శిక్షణ ఇచ్చాం. రాబోయే రోజుల్లో మరిన్ని సంస్థలకు కూడా శిక్షణ ఇచ్చి.. సింగరేణి పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలుపుతాం.

– ఎన్.బలరాం, సీఎండీ, సింగరేణి



4 నెలల క్రితమే చేరా..

నాలుగు నెలల క్రితం ఎస్‌డీఆర్‌ఎఫ్‌లో చేరాను. ముందుగా హుస్సేన్‌సాగర్‌లో నీటిలో పడిపోయిన వారిని రక్షించే అంశంపై శిక్షణ ఇచ్చారు. సింగరేణి రెస్క్యూ ద్వారా అందించిన శిక్షణ చాలా బాగుంది.

– బీర్ల ఆనంద్, కానిస్టేబుల్, ఎస్‌డీఆర్‌ఎఫ్

రాజీవ్‌కు పీసీసీ ఘన నివాళి

గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ రక్తదానం

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా టీపీసీసీ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ ఫహీమ్ ఖురేషీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి.కుమార్‌రావు, నేతలు కోటూరి మానవతారాయ్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి దేశాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి నేతృత్వంలో గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌లు ప్రారంభించారు. కేన్సర్ బాధితుల సహాయార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

రాజీవ్‌కు మంత్రి దామోదర నివాళి

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కొనియాడారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలదండ వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అగ్రస్థానంలో ఉండడానికి కారణం రాజీవ్‌గాంధీ అవలంబించిన విధానాలేనని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు.

పాక్‌తో పోరుపై సీఎం అజ్ఞాన వ్యాఖ్యలు

● బీజేఎల్పీ నేత 'ఏలేటి'

సాక్షి, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి వల్లే.. పాకిస్తాన్‌తో పోరులో మోదీ ప్రభుత్వం తలొగ్గిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం.. ఆయన అజ్ఞానానికి నిదర్శనమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. దేశ భద్రత, విదేశాంగ వ్యవహారాలకు సంబంధించిన అంశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి తన అజ్ఞానంతో అబద్ధాలను ప్రచారం చేయడం అత్యంత దుర్మార్గమని, ఇది దేశద్రోహ చర్యతో సమానమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి నేతలు.. పాకిస్తాన్ అనుకూల ధోరణిలో మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గితే పాకిపై భారత సైన్యం దాడులు జరిగేవి కాదన్న విషయం తెలుసుకోవాలని హితవు పలికారు.

వాటర్ రిసోర్స్ రికవరీ సెల్

● సీడీఎంఏ ఆధ్వర్యంలో డబ్ల్యూఆర్‌ఆర్‌సీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక అభివృద్ధి సంస్థ – అమృత్ 2.0 కింద వాటర్ రిసోర్స్ రికవరీ సెల్(డబ్ల్యూఆర్‌ఆర్‌సీ) ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సెల్‌కు చైర్మన్‌గా సీడీఎంఏ, సభ్యులుగా డిప్యూటీ సెక్రటరీ (అర్బన్ లోకల్ బాడీస్), జలమండలి మేనేజింగ్ డైరెక్టర్, నీటిపారుదల/వ్యవసాయ శాఖల ప్రతినిధి, ఇంధన శాఖ ప్రతినిధి, ప్రజారోగ్య విభాగం ఈఎన్‌సీ, పరిశ్రమల శాఖ ప్రతినిధి, కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు, తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

బస్తీ, పల్లె దవాఖానాల్లో ఫార్మసిస్టులను నియమించాలి: ఫార్మసిస్టులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అన్ని బస్తీ, పల్లె దవాఖానాలలో ఫార్మసిస్టులను నియమించాలని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం ఓ వినతిపత్రాన్ని అందజేసింది. అన్ని జిల్లాలలో డీఎంహెచ్‌ఓ పరిధిలోని ఫార్మసీ స్టోర్స్, వ్యాక్సిన్ స్టోర్స్‌లో, మలేరియా, లెప్రసీ, టీబీ సెంటర్లలో ఫార్మసిస్టులను నియమించాలని వారు కోరారు. అలాగే అన్ని పీహెచ్‌సీలలో ముగ్గురు ఫార్మసీ ఆఫీసర్లను నియమించాలని, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న టీచింగ్ ఆసుపత్రులలో క్లినికల్ ఫార్మసీ డిపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. రాష్ట్రంలో ఫార్మసీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సంఘం తెలిపింది. మంత్రిని కలిసిన వారిలో ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు ఉన్నారు.

గురుకుల కళాశాలల్ని ఎత్తివేయొద్దు

సాక్షి, హైదరాబాద్: సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 12 గురుకుల ఇంటర్మీడియెట్ కళాశాలలు ఎత్తివేయాలనే తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. పేద విద్యార్థులకు ఆసరాగా ఉన్న విద్యాసంస్థలను అభివృద్ధి చేసి.. మరింత మందికి ప్రవేశాలు కల్పించి.. చదువు అందేలా చర్యలు తీసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో కోరింది.

కాల్పుల విరమణ ప్రకటించాలి

● శాంతి సమన్వయ కమిటీ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మందిని ప్రభుత్వ పోలీసు బలగాలు హతమార్చడాన్ని శాంతి సమన్వయ కమిటీ తీవ్రంగా ఖండించింది. వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు చేయాలని కమిటీ నేతలు కవిత శ్రీవాత్సవ, క్రాంతి చైతన్య, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లొంగిపోయిన నక్సలైట్లు.. మావోయిస్టుల వ్యతిరేక ఆపరేషన్స్‌లో పాల్గొనరాదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకంగా.. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ)ను వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. మావోయిస్టుల మృతదేహాలను అప్పగించడంలో కాలయాపన చేయడం చూస్తుంటే.. ఎదురుకాల్పులు జరిగాయా? లేదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయని వారు పేర్కొన్నారు. గతంలో 31 మంది మావోయిస్టులు మరణించారన్న అంశంపై న్యాయవిచారణ జరిపించాలని శాంతి సమన్వయ కమిటీ డిమాండ్ చేసిందని వారు గుర్తు చేశారు. కాగా, ఎన్‌కౌంటర్ల పేరుతో నరహత్యలకు అంతం పలకరా? అని సీపీఐ(ఎం-ఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన చేపట్టండి

● సీఎంకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ



సాక్షి, హైదరాబాద్: రాజధానిలోని హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన కార్యక్రమం చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి.. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి బుధవారం లేఖ రాశారు. హుస్సేన్‌సాగర్‌లో బంజారా, పికెట్, బల్కాపూర్, కూకట్‌పల్లి కాలువలు కలుస్తాయని, కూకట్‌పల్లి నాలా బాలానగర్‌లోని పరిశ్రమలు వదిలిన ప్రమాదకరమైన రసాయనాలతో సాగర్ నిండుతోందని వివరించారు. 2006లో హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థ (హుడా).. హుస్సేన్ సాగర్ అభివృద్ధి పేరుతో రూ.380 కోట్లతో ప్రణాళిక తయారు చేసిందని గుర్తు చేశారు. హుస్సేన్ సాగర్ నీటిని శుద్ధి చేయడం, ఏడాదంతా తగిన నీటి నిలువలు ఉంచడం, చెరువు అడుగున ప్రమాదకరమైన రసాయనాలు కలిసిన మట్టి తీయడం, సాగర్‌లోకి వచ్చే నాలాలను అభివృద్ధి చేసి.. రసాయనాలు చెరువులోకి రాకుండా చేయడం, చెరువు చుట్టుపక్కలతో పాటు పర్యాటకాభివృద్ధి ప్రణాళిక లక్ష్యాలుగా పెట్టుకుందని తెలిపారు. 2013లో పూర్తి కావలసిన ఈ ప్రాజెక్టు రూ.370 కోట్లు ఖర్చయినా లక్ష్యం నెరవేరలేదని తెలిపారు.

మూస చదువులకు స్వస్తి పలకండి

అకడమిక్ సక్సెస్ మీట్–2025 కార్యక్రమంలో మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: విద్యా బోధనలో మూస పద్ధతికి స్వస్తి పలకాలని ఉపాధ్యాయులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క సూచించారు. బోధన, అభ్యసన కార్యక్రమాలకే పరిమితం కాకుండా.. విద్యార్థులకు విలువలు, వినయం, సంస్కారం, సామాజిక స్పృహ, సమానత్వ భావన నేర్పించేందుకు కృషి చేయాలని కోరారు. బుధవారం బంజారాహిల్స్‌లోని కుమ్రంభీం ఆదివాసీ భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అకడమిక్ సక్సెస్ మీట్–2025 కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతోపాటు ఆదివాసీ గిరిజన విద్యార్థులు తమ సొంత సంప్రదాయాలను నేర్చుకొని ప్రత్యేకతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజనులమని చెప్పుకుంటే సమాజంలో చిన్న చూపు చూస్తారనే భయం ఇప్పటి విద్యార్థుల్లో ఉందని, అలాంటి భయాలు వదిలేయాలని సూచించారు. అనంతరం పదోతరగతి, ఇంటర్, ఈఏపీసెట్‌లో ప్రతిభ కనబర్చిన గిరిజన గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులను మంత్రి సీతక్క సన్మానించారు.

రాహుల్ స్క్రిప్ట్ మేరకే కేంద్రంపై సీఎం విమర్శలు

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ఆయన అజ్ఞానానికి నిదర్శనమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి కేంద్రంపై చేస్తున్న విమర్శలన్నీ రాహుల్ గాంధీ స్క్రిప్ట్ ఆధారంగానే జరుగుతున్నాయన్నారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండించి.. కేంద్రానికి బాసటగా నిలవాల్సిన సమయంలో విమర్శలు చేయడం దేశద్రోహమని బుధవారం ఏలేటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశభద్రత, విదేశాంగ వ్యవహారాల్లోనూ కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేయడం దురదృష్టకరం అని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాకిస్తాన్‌కు అనుకూల ధోరణిలో మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ముఖ్య నేతల తీరు చూస్తుంటే ఆ పార్టీ పేరును భారత జాతీయ కాంగ్రెస్‌కు బదులు పాకిస్తాన్ జాతీయ కాంగ్రెస్‌గా మార్చుకున్నారా? అనే సందేహం భారతీయులకు కలుగుతోందన్నారు.

అప్పుడు ఈ నలుగురు ఎందుకు మాట్లాడలేదు?

టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ సంఘాల మాజీ నేతలు స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పాతూరి సుధాకర్‌రెడ్డి, విఠల్‌ల వైఖరిని టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏరోజున కూడా ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలివ్వనప్పుడు ఈ నలుగురు ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, బెనిఫిట్లు ఇవ్వలేక రిటైర్‌మెంట్ వయసు పెంచినప్పుడు, ఆరోగ్య కార్డులు పెండింగ్‌లో పెట్టినప్పుడు ఎందుకు నోరెత్తలేదని నిలదీశారు.

నేడు ప్రధాని చేతుల మీదుగా 'అమృత్' స్టేషన్ల ప్రారంభం

బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వేస్టేషన్లు వర్చువల్‌గా ప్రారంభం

బేగంపేట స్టేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొననున్న కిషన్‌రెడ్డి




సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా నేడు రాష్ట్రంలో పలు అమృత్ భారత్ స్టేషన్లు ప్రారంభం కానున్నాయి. గురువారం దేశవ్యాప్తంగా మొత్తం 103 రైల్వే స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. వాటిలో రాష్ట్రంలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వే స్టేషన్లు కూడా ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేశారని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేగంపేట రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో తాను స్వయంగా పాల్గొన నున్నట్లు పేర్కొన్నారు. బేగంపేట రైల్వేస్టేషన్ పూర్తిగా మహిళా ఉద్యోగులతో నడుస్తుందని చెప్పారు. తెలంగాణలో ప్రస్తుతం రూ.42,219 కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం రైల్వే బడ్జెట్‌లోనూ రూ.5,337 కోట్లు తెలంగాణకు కేటాయించిందని, ఇది 2014–15 నాటి బడ్జెట్‌తో పోలిస్తే 20 రెట్లు ఎక్కువ అని తెలిపారు. రాష్ట్రంలోని 40 రైల్వేస్టేషన్లలో దాదాపు రూ. 2,750 కోట్లతో పునరాభివృద్ధి పనులు జరుగుతున్నాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు.



రాష్ట్రంలో అమృత్ భారత్ రైల్వేస్టేషన్లు - వాటి పునరాభివృద్ధికి కేటాయించిన బడ్జెట్ వివరాలు..

రైల్వేస్టేషన్ పేరు	బడ్జెట్	రైల్వేస్టేషన్ పేరు	బడ్జెట్
1. ఆదిలాబాద్ –	రూ. 17.76 కోట్లు	22. మల్కాజ్‌గిరి –	రూ. 27.61 కోట్లు
2. బాసర –	రూ. 11.33 కోట్లు	23. మంచిర్యాల –	రూ. 26.49 కోట్లు
3. బేగంపేట –	రూ. 22.57 కోట్లు	24. మెదక్ –	రూ. 15.32 కోట్లు
4. భద్రాచలం రోడ్డు –	రూ. 25.41 కోట్లు	25. మేడ్చల్ –	రూ. 32.11 కోట్లు
5. గద్వాల –	రూ. 34.29 కోట్లు	26. మిర్యాలగూడ –	రూ. 9.50 కోట్లు
6. హఫీజ్ పేట –	రూ. 29.2 కోట్లు	27. నల్లగొండ –	రూ. 9.50 కోట్లు
7. హైటెక్ సిటీ –	రూ. 25.93 కోట్లు	28. నిజామాబాద్ –	రూ. 53.03 కోట్లు
8. ఉప్పుగూడ –	రూ. 26.81 కోట్లు	29. పెద్దపల్లి –	రూ. 26.49 కోట్లు
9. హైదరాబాద్ –	రూ. 327.27 కోట్లు	30. రామగుండం –	రూ. 26.49 కోట్లు
10. జనగామ –	రూ. 24.45 కోట్లు	31. సికింద్రాబాద్ –	రూ. 699.77 కోట్లు
11. జడ్చర్ల –	రూ. 35.54 కోట్లు	32. షాద్‌నగర్ –	రూ. 32.99 కోట్లు
12. కాచిగూడ –	రూ. 424.29 కోట్లు	33. శ్రీ బాలబ్రహ్మేశ్వర జోగుళాంబ –	రూ. 6.07 కోట్లు
13. కామారెడ్డి –	రూ. 39.84 కోట్లు	34. తాండూరు –	రూ. 24.35 కోట్లు
14. కరీంనగర్ –	రూ. 25.89 కోట్లు	35. ఉందానగర్ –	రూ. 12.37 కోట్లు
15. కాజీపేట –	రూ. 24.45 కోట్లు	36. వికారాబాద్ –	రూ. 24.25 కోట్లు
16. ఖమ్మం –	రూ. 25.41 కోట్లు	37. వరంగల్ –	రూ. 25.41 కోట్లు
17. లింగంపల్లి –	రూ. 310.38 కోట్లు	38. యాదాద్రి –	రూ. 24.45 కోట్లు
18. మధిర –	రూ. 25.41 కోట్లు	39. యాకుత్‌పుర –	రూ. 8.53 కోట్లు
19. మహబూబాబాద్ –	రూ. 26.49 కోట్లు	40. జహీరాబాద్ –	రూ. 24.35 కోట్లు
20. మహబూబ్‌నగర్ –	రూ. 39.82 కోట్లు		
21. మలక్‌పేట –	రూ. 36.44 కోట్లు		



జలకళతో రత్నగిరి నుంచి కనువిందు చేస్తున్న పంపా రిజర్వాయర్

పంపా.. ఆహ్లాదకరంగా..

నెల రోజుల కిందటి వరకూ నీరుంటుందా.. ఆవిరైపోయి.. నీటిమట్టం 79 అడుగులకు పడిపోయి.. డెడ్ స్టోరేజ్‌కు చేరుకుని.. రిజర్వాయర్ ఎండిపోతుందా అనే పరిస్థితి. కాకినాడ జిల్లా అన్నవరం గ్రామానికి, దేవస్థానానికి నీటి ఎద్దడి తప్పదేమోననే ఆందోళన.. అటువంటి పరిస్థితుల్లో వరుణుడు కరుణ ధారలు కురిపిస్తూండటంతో పావన పంపా రిజర్వాయర్ జలకళతో తొణికిసలాడుతోంది. ఓవైపు ఎండలు మండిపోతున్నా.. పరీవాహక ప్రాంతాలైన శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని కొండల్లో నెల రోజుల నుంచి తరచుగా కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. దీంతో, రిజర్వాయర్ నీటిమట్టం బుధవారం నాటికి 84.60 అడుగులకు పెరిగింది. పంపా రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 103 అడుగులు. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 0.43 టీఎంసీలు. ప్రస్తుతం 0.028 టీఎంసీలకు నీటి నిల్వలు పెరిగాయి. ప్రస్తుతం 105 క్యూసెక్కుల చొప్పున నీరు వస్తుండడంతో జలాశయం నీటిమట్టం 85 అడుగుల వరకూ పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి వస్తున్న భక్తులు జలకళతో తొణికిసలాడుతున్న పంపా రిజర్వాయర్‌ను చూసి ఆనందిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తురాయి చెట్లు కూడా ఎర్రని పూలు పూస్తూండటంతో ఆ ప్రాంతం ఆహ్లాదకరంగా మారింది. పలువురు భక్తులు రత్నగిరి నుంచి పంపా రిజర్వాయర్ కవరయ్యేలా సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటున్నారు. పంపా ఘాట్‌ల వద్ద స్నానాలు చేస్తూ సేద తీరుతున్నారు.

– అన్నవరం



తీరం కోత

విశాఖలోని రుషికొండ బీచ్ భారీగా కోతకు గురైంది. పెద్ద ఎత్తున దూసుకువచ్చిన కెరటాల ధాటికి తీరం కుంగిపోవడంతో పాటు, సముద్రం ముందుకు చొచ్చుకు వచ్చింది. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎప్పటికప్పుడు మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మెరైన్ పోలీసులు, లైఫ్ గార్డ్స్ పర్యాటకులను అప్రమత్తం చేస్తున్నారు.

-కొమ్మాది

భద్రతా వైఫల్యంతోనే పహల్గామ్‌లోకి ఉగ్రవాదుల చొరబాటు

ఏపీసీసీ ఆహ్వాన కమిటీ సభ్యుడు రుద్రరాజు

అమలాపురం టౌన్: పహల్గామ్‌లోకి ఉగ్రవాదుల చొరబాటు భద్రతా వైఫల్యంతోనే జరిగిందని ఏపీసీసీ ఆహ్వాన కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆయన బుధవారం మాట్లాడారు. పహల్గామ్ దాడికి నైతిక బాధ్యత వహించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పహల్గామ్‌లో పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడి చేసిన తర్వాత పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దేశ ప్రజలకు, ప్రతిపక్షాలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు పాలనలో దళితులకు రక్షణ కరువు

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు చెన్న కేశవులు

తిరుపతి కల్చరల్: చంద్రబాబు దగా కోరు పాలనలో దళితుల పట్ల వివక్షతతో దాడులు మితిమీరి వారికి రక్షణ లేకుండాపోతోందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్న కేశవులు మండిపడ్డారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అధికారం చేపట్టాక రాష్ట్రంలో దళితులపై వివక్ష దాడులు పెరిగిపోయి వారికి న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఇటీవల మోహన్ బాబు కళాశాలలో బీటెక్ విద్యార్థి జేమ్స్‌పై కొందరు అగ్రవర్ణాలు విచక్షణా రహితంగా దాడి హత్యాయత్నానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు.

ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఏపీ ఈఏపీసెట్–2025లో భాగంగా ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 22 కేంద్రాల పరిధిలో ఉదయం, మధ్యాహ్నం జరిగిన ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టులు (సీబీటీ)లకు దరఖాస్తు చేసిన 6,845 మంది విద్యార్థుల్లో 6,603 మంది హాజరయ్యారు. గుంటూరు జిల్లా పరిధిలోని 15 కేంద్రాల్లో 4,317 మందికిగాను 4,144, బాపట్ల జిల్లాలోని రెండు కేంద్రాల్లో 684 మందికిగాను 662, పల్నాడు జిల్లాలోని ఐదు కేంద్రాల్లో 1,844 మందికిగాను 1,797 మంది హాజరయ్యారు.

వృథా లైన్లతో 'సంతోషం'!

కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో రూ.343 కోట్లతో విద్యుత్ లైన్ల మార్పు

- రూ.100 కోట్లకు మించని పనులను రెండింతలు పెంచిన వైనం
- ఈ పనులు ఏమాత్రం అవసరం లేదంటున్న నిపుణులు
- ఓ ఉన్నతాధికారికి లబ్ధి చేకూర్చే యత్నం.. సర్కారు పెద్దలకూ కమీషన్లు
- ఇందుకోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి అప్పు
- రూ.30 వేల కోట్ల అప్పులు చేసిన ఏపీఎస్పీడీసీఎల్‌కు ఇది అదనపు భారం



సాక్షి, అమరావతి: విద్యుత్ శాఖలో అవినీతి పరాకాష్టకు చేరుతోంది. అవసరమైన పనుల కాంట్రాక్టులను అయిన వారికి ఇచ్చి కమీషన్లు దండుకునే స్థాయి నుంచి కమిషన్ల కోసమే అవసరమే లేని పనులు చేసే స్థాయికి దోపిడీ చేరింది. ఇప్పటికే డైరెక్టర్ల నియామకం, ఉద్యోగుల బదిలీల్లో భారీగా దండుకున్న కూటమి నేతలు తమ కమీషన్లతో పాటు విద్యుత్ శాఖలో ఓ అధికారిని 'సంతోష'పెట్టడానికి అక్కర్లేని పనులకు తెరతీశారు. పదవీ కాలం ముగిసినా, మరి కొన్నాళ్లు అదే పదవిలో కొనసాగడానికి ఓ ఉన్నతాధికారికి కూటమి ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించింది. అందుకు ప్రతిఫలంగా పరస్పరం లబ్ధి పొందేందుకు ఇలాంటి వృథా పనులకు శ్రీకారం చుట్టారని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలోని కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో రూ.342.96 కోట్ల వ్యయంతో 33 కేవీ విద్యుత్ లైన్ల పనులకు ఇటీవల టెండర్లు పిలిచారు. టెండర్ దరఖాస్తు దాఖలుకు శుక్రవారంతో గడువు ముగిసింది. ఈ నెల 20న టెండర్లు తెరవనున్నారు. అయితే ఈ టెండర్ల వెనుక భారీ కుంభకోణానికి కూటమి ప్రభుత్వం, ఏపీఎస్పీడీసీఎల్‌లోని ఉన్నతాధికారితో కలిసి తెర తీసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కడప డివిజన్‌లో 28 కిలోమీటర్లు, రాయచోటి డివిజన్‌లో 25 కిలోమీటర్లు, ప్రొద్దుటూరు డివిజన్‌లో 52.5 కిలోమీటర్లు చొప్పున మొత్తం 105.5 కిలోమీటర్లు 9 టవర్లతో కలిపి 157 చదరపు మీటర్ల మేర అల్యూమినియం కండక్టర్‌తో 33 కేవీ లైన్‌ను బలోపేతం చేయడం ఈ పని ఉద్దేశం. ఈ రకమైన ప్రాజెక్టులను 2019–24 మధ్య అనంతపురం, ప్రొద్దుటూరు, కడపలలో మెస్సర్స్ సన్ షైన్ ఎలక్ట్రికల్స్ అనే సంస్థ ద్వారా కేవలం రూ.100 కోట్లతోనే పూర్తి చేశారు. అలాంటిది ఏపీఎస్పీడీసీఎల్ ఇప్పుడు రూ.342.96 కోట్లను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి రుణంగా తీసుకుని మరీ చేస్తామంటోంది. ఈ భారం అంతిమంగా రాష్ట్ర ప్రజలపైనే విద్యుత్ బిల్లుల రూపంలో పడుతుంది. ఇప్పటికే రూ.30 వేల కోట్ల అప్పులు చేసిన ఏపీఎస్పీడీఎల్‌కు ఇది అదనపు భారం కానుంది.

అసలు ఆ అవసరమే లేదు..

- ప్రస్తుతం ఉన్న లైన్ల స్థానంలోనే కొత్త లైన్లు వేయనున్నట్లు డిస్కం ప్రతిపాదనలో స్పష్టంగా పేర్కొంది. అయితే ఈ లైన్లలో కొత్తవి వేయాల్సిన అవసరమే ప్రస్తుతం లేదని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత విద్యుత్ లోడ్‌లను తీర్చడానికి తగినంత సామర్థ్యం గల 33 కేవీ లైన్‌లు ఇప్పటికే ప్రతిపాదిత ప్రాంతాల్లో ఉన్నాయని చెబుతున్నారు. పైగా ప్రస్తుత ఫీడర్లే తక్కువ లోడ్‌లో నడుస్తున్నాయని, మరింత డిమాండ్ పెరిగినా కూడా అవి ఆ లోడ్‌ను తట్టుకోగలవని స్పష్టం చేస్తున్నారు. ఇదే అంచనా వ్యయంతో గతంలో ఇదే డిస్కం టెండర్లు పిలవగా గత ప్రభుత్వం ఆ టెండర్‌ను రద్దు చేసింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అంచనా వ్యయం కూడా లేకుండా నేరుగా టెండర్లు పిలిచేశారు. ఏపీఎస్పీడీసీఎల్‌కు చెందిన ఓ ఉన్నతాధికారికి చెందిన సంస్థకు లబ్ధి చేకూర్చడం కోసం, తద్వారా కొందరు నేతలకు కమిషన్లు దక్కడం కోసం ఈ అనవసర వృథా టెండర్లు పిలిచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఈ రూ.343 కోట్లను పట్టణాల్లో అవసరమైన చోట 33/11కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి, ఇప్పటికే ఓవర్ లోడ్‌ను మోస్తున్న 11 కేవీ ఫీడర్లను విభజించడానికి ఖర్చు చేసి ఉంటే కనీసం విద్యుత్ కోతలైనా తప్పి నాణ్యమైన విద్యుత్ అందడానికి అవకాశం ఉండేదని నిపుణులు చెబుతున్నారు.



ఏపీఎస్పీడీసీఎల్ ప్రతిపాదించిన పనులు

- 3,957 ఎం 6 టైపు టవర్లు. ఒక్కోదానికి రూ.4.5 లక్షల చొప్పున మొత్తం రూ.177.5 కోట్లు
- 1,460 ఎం 9 టవర్లు. ఒక్కోదానికి రూ.5.06 లక్షల చొప్పున మొత్తం రూ.74 కోట్లు
- 12.5 మీటర్ల స్పన్ స్తంభాలు 119. ఒక్కోదానికి రూ.26 వేలు చొప్పున మొత్తం రూ.32 లక్షలు
- 11 మీటర్ల స్పన్ స్తంభాలు 1782. ఒక్కోదానికి రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.2.7 కోట్లు
- 295.71 కిలోమీటర్ల మేర 100 చదరపు మిల్లీ మీటర్ల ఏఏఏ కండక్టర్. కిలోమీటర్‌కు ఖర్చు రూ.88 వేల చొప్పున మొత్తం రూ.2.61 కోట్లు
- 1,475 కిలోమీటర్ల మేర 157 చదరపు మిల్లీ మీటర్ల ఏఏఏ కండక్టర్. కిలోమీటర్‌కు ఖర్చు రూ.1.42 లక్షల చొప్పున మొత్తం రూ.21 కోట్లు.
- ఇంటర్ లింకింగ్ లైన్లను టవర్లు లేకుండా తక్కువ ఖర్చుతో పీఎస్‌సీసీ పోల్స్‌తోనే ఏర్పాటు చేయొచ్చని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు.



నేడు తిరుమలలో ట్రాఫిక్ ఆంక్షలు

తిరుమల : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం తిరుమలలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. జపాలి తీర్థం వెళ్లేందుకు భక్తులు పోటెత్తనున్న నేపథ్యంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 8 గంటల వరకు ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈ మేరకు సుమారు 10వేల నుంచి 15వేల వాహనాలు తిరుమలకు వచ్చే అవకాశమున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.3.92 కోట్లు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో బుధవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. గత 34 రోజులకు నగదు రూపేణా స్వామికి రూ.3,92,94,035 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 556 గ్రాముల బంగారం, 8.100 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2000, రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ.66,500 లభించినట్టు చెప్పారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ జయంత్యుత్సవాలు

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల శ్రీ కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి జయంత్యుత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో మొదటి రోజు బుధవారం ఉదయం 6 గంటల నుంచి రామనామ సంకీర్తనతో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను ఆలయ పండితులు బొర్రా వెంకట అనంతచార్యులు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రసన్నాంజనేయుని మాలధారులు వారి ఇళ్ల వద్ద నుంచి భజన కార్యక్రమాలతో గ్రామోత్సవాలు నిర్వహించారు.

మల్లాదిలో నేడు హనుమజ్జయంతి ఉత్సవాలు

అమరావతి: మండల పరిధిలోని మల్లాది ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమత్ జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త భవిరిశెట్టి హనుమంతరావు బుధవారం తెలిపారు. ఆలయ అర్చకుడు పరుచూరి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా గురువారం 40 అడుగుల అభయాంజనేయ స్వామి వారికి విశ్వక్సేన ఆరాధన అనంతరం పంచామృత స్నపన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.ధ్యానాంజనేయస్వామివారికి పంచామృత స్నపన, సహస్రనామాలతో తమలపాకులతో ఆకుపూజలు నిర్వహిస్తారు.

పొగాకు కొనిపించే ప్రయత్నం చేస్తాం

మంత్రి పార్థసారథి

సాక్షి ప్రతినిధి,బాపట్ల: జూన్ మొదటివారంలో టొబాకో కంపెనీలు, రైతు నాయకులతో సమావేశం నిర్వహించి రైతులవద్దవున్న బ్లాక్ బర్లీ పొగాకును కొనిపించే ప్రయత్నం చేస్తామని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి చెప్పారు. బుధవారం బాపట్లలో జరిగిన డీఆర్సీ సమావేశం అనంతరం ఇన్‌చార్జి మంత్రి వివరాలను విలేకరులకు వెల్లడించారు. బ్లాక్‌బర్లీ రైతుల సమస్యలను సమీక్షించామన్నారు. రైతుల వద్ద ఉన్న పొగాకు కొనేలా కంపెనీలపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. రైతులు కూడా వాణిజ్య పంటలను డిమాండ్ ఉన్నమేరకు మాత్రమే సాగుచేయాలని , ఈ విషయంపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు.

పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు

ఆళ్లగడ్డ టీడీపీ ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ: తాను పార్టీకి, చంద్రబాబు, లోకేశ్‌లకు వ్యతిరేకంగా మాట్లాడలేదని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. బుధవారం ఆమె ఆళ్లగడ్డలో విలేకరులతో మాట్లాడారు. మినీ మహానాడు సందర్భంగా తాను మాట్లాడిన మాటలు ఒకటైతే మీడియాలో మరొకటి వైరల్ చేశారన్నారు. దశాబ్దాల నుంచి పార్టీకోసం పనిచేసిన వారికి కాకుండా ఎన్నికల ముందు వచ్చి హడావిడి చేసిన వారికి పదవులు ఇవ్వద్దు అని మాత్రమే అన్నా అన్నారు. బ్యాక్ డోర్ నుంచి వచ్చిన వారికి పదవులు ఇస్తే అటువంటి వారిని పార్టీ క్యాడర్ ఊర్లోకి రానివ్వరని చెప్పానన్నారు. మీడియా వాళ్లకు ఎవరు డబ్బులిచ్చి తమపై అవాస్తవాలు ట్రోల్ చేయిస్తున్నారో తెలుసన్నారు. ఎవరైనా అవాస్తవాలు చూపించడంతో ప్రజలకు ఏమైనా ఇబ్బందులు కలిగితే పూర్తి బాధ్యత వారిదే అని హెచ్చరించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం మాజీ మంత్రి ఆర్కే రోజా, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, సినీ నటులు అశ్విన్, ఆది దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ

- తాజా ఎన్‌కౌంటర్‌లో సుప్రీం కమాండర్ కేశవరావు మృతి
- ఒకవైపు 'కగార్'తో తరుముతున్న సాయుధ బలగాలు
- మరోవైపు వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
- తుడిచిపెట్టుకుపోతున్న పార్టీ నాయకత్వం



సాక్షి, హైదరాబాద్: మావోయిస్టులకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మరణించడం మావోయిస్టు పార్టీకి తీవ్ర నష్టమనే చెప్పాలి. ఓ వైపు ఆపరేషన్ కగార్ పేరిట తరుముతున్న సాయుధ పోలీసు బలగాలు..మరోవైపు ముంచుకొస్తున్న అనారోగ్య సమస్యలు.. కొన్నేళ్లుగా మావోయిస్టు పార్టీ కేడర్‌ను సతమతం చేస్తున్నాయి. ప్రధానంగా మావోయిస్టు సెంట్రల్ కమిటీలో ఉన్న నాయకులంతా ఐదుపదుల వయస్సు దాటినవారే కావడంతో ఏదో ఒక రకమైన ఆరోగ్య సమస్య వారిని వెంటాడుతూనే ఉంది. కొందరు కీలక నేతలను అనారోగ్యంతో కోల్పోతే, మరికొందరు ఎన్‌కౌంటర్లలో హతమవడం మావోయిస్టులను కలవర పెడుతోంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సెంట్రల్ కమిటీ మెంబర్ కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ 2023 జూన్‌లో మృతి చెందారు. అంతకుముందే మావోయిస్ట్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, సెంట్రల్ కమిటీ మెంబర్ యాపా నారాయణ (హరిభూషణ్) కరోనాతో మృతి చెందారు. మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ మెంబర్ అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ (ఆర్కే) సైతం కిడ్నీలు ఫెయిల్ అవడం ఇతర అనారోగ్యంతో బాధపడుతూ బస్తర్ అటవీ ప్రాంతంలో చనిపోయారు. ఇక సెంట్రల్ కమిటీలోని కొందరు నేతలు సొంతంగా నడవలేని స్థితిలోనూ ఉన్నట్టు సమాచారం.

కీలక నేతలే టార్గెట్‌గా బలగాల ఆపరేషన్లు

మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి 31 డెడ్‌లైన్‌గా విధించడంతో సీఆర్‌పీఎఫ్, డీఆర్జీ, గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక బలగాలతో పాటు స్థానిక పోలీసులు మావోయిస్టు కీలక నేతలనే టార్గెట్ చేసుకుంటున్నారు. ఓవైపు మావోయిస్టుల కంచుకోటగా ఉన్న అబూజ్‌మఢ్, బస్తర్, కర్రిగుట్టలు సహా కీలక ప్రాంతాలన్నింటిలోకి చొచ్చుకుని వెళుతూ దళాలు క్యాంపులు నిర్మిస్తున్నాయి. మరోవైపు మావోయిస్టు అగ్ర నాయకత్వాన్ని టార్గెట్ చేస్తేనే మావోయిస్టులను మూలాల నుంచి దెబ్బ కొట్టవచ్చన్న వ్యూహంతో ముందుకు వెళుతున్నాయి. గతంలోనూ ఇదే తరహా వ్యూహాలను అమలు చేశాయి. ఈ ఏడాది జనవరి 16న ఛత్తీస్‌గఢ్ జాపూర్ జిల్లా పరిధిలో చేసిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌ను మట్టుపెట్టాయి. జనవరి 21వ తేదీన ఒడిశా మావోయిస్టు పార్టీ కార్యదర్శి చలపతి మరణించారు. 2024 డిసెంబర్ లో ములుగు జిల్లా పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కుర్సం మంగు అనే కీలక నేత చనిపోయారు.

క్రమంగా కుచించుకుపోతున్న పార్టీ

మావోయిస్టుల స్థావరాలు భద్రత బలగాల హస్తగతం అవుతుండడం..వరుస ఘటనల్లో అగ్ర నాయకత్వాన్ని కోల్పోతుండడంతో మావోయిస్టుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలోనే పదుల సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారు. ప్రస్తుతం మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీలో వంద మంది లోపే సభ్యులు ఉన్నారని, వారిలోనూ 80 శాతానికి పైగా ఇతర రాష్ట్రాల వారే ఉన్నట్టు పోలీసులు అధికారికంగా వెల్లడించారు. ఇలా తెలంగాణ సహా అన్ని రాష్ట్రాల్లోనూ మావోయిస్టు కమిటీల్లో కొత్తగా రిక్రూట్‌మెంట్లు లేకపోగా..ఉన్న వారు లొంగిపోతుండడంతో పార్టీ క్రమంగా కుచించుకుపోతోందని అంటున్నారు.

తుడిచివేతే లక్ష్యంగా 'కగార్'

దేశంలో మావోయిస్టులు లేకుండా చేయాలనే లక్ష్యంతో 2009లో కేంద్రం ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను చేపట్టింది. గడిచిన పదహారేళ్లలో ఈ కార్యక్రమం ఆపరేషన్ సమాధాన్, ప్రహార్‌గా కొనసాగి ఇప్పుడు కగార్ (ఫైనల్ మిషన్)కు చేరుకుంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లోని మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలను నలువైపుల నుంచి చుట్టుముట్టడం ద్వారా మావోయిస్టులను పూర్తిగా ఏరివేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అందులో భాగంగా..

1) ఆయా ప్రాంతాల్లో ఫార్వర్డ్ బేస్ క్యాంపులను ఏర్పాటు చేస్తారు. దీని కోసం సీఆర్‌పీఎఫ్, ఇండోటిబెటన్ పోలీస్, బస్తర్ ఫైటర్స్, డీఆర్‌జీ, కోబ్రా ఇలా వివిధ పేర్లతో లక్ష మందికి పైగా జవాన్లను తయారు చేశారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒకటి వంతున క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు.
2) మావోయిస్టుల సమాచారం సేకరించడంలో భాగంగా డ్రోన్లు, శాటిలైట్ ఇమేజెస్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లను వాడుతున్నారు.
3) తమ ఆధీనంలోకి వచ్చిన ప్రాంతాల్లో వెనువెంటనే పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి లా అండ్ ఆర్డర్‌ను అమలు చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది.
4) లొంగిపోవాలని భావించే మావోయిస్టులకు ఉదారంగా సరెండర్ పాలసీ అమలు.

ఈ నాలుగు లక్ష్యాలతో ఆపరేషన్ కగార్ 2024 జనవరి 1న మొదలైంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోకి క్యాంపులు రావడంతో నక్సలైట్ల కదలికలు పరిమితం అయ్యాయి. వారు దట్టమైన అడవుల్లో, షెల్టర్ జోన్లలో ఉండటాన్ని ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి గుర్తిస్తున్నారు. సెర్చ్ ఆపరేషన్లు చేసే క్రమంలో ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. మావోయిస్టులు పెద్ద సంఖ్యలో చనిపోతున్నారు. సరెండ్ పాలసీ కారణంగా లొంగుబాట్లు కూడా పెరిగాయి.

ఎన్‌కౌంటర్లు..మరణాలు

ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్ ప్రారంభించిన తర్వాత ఈ ఏడాది జనవరి 5వ తేదీ నుంచి బుధవారం వరకు ఎన్‌కౌంటర్లలో మరణించిన మావోయిస్టుల సంఖ్య (ఇవి కనీసం ముగ్గురు, అంతకుమించి మరణించిన ఘటనలకు సంబంధించిన లెక్కలే..)


నెల	తేదీ	మరణించింది
జనవరి	5	5
	9	3
	12	5
	16	18
	21	14
ఫిబ్రవరి	1	8
	9	31
	19	4
మార్చి	20	30
	25	3
	29	16
ఏప్రిల్	12	3
	21	8
	24	3
మే	7	22
	21	27

హనుమ జీవితమే ఒక వ్యక్తిత్వ వికాసం



సమున్నతమైన ఆలోచనా విధానం, అసాధ్యాన్ని సుసాధ్యంచేసే తెగువ, అసాధారణ కార్యదక్షత, భయాన్నీ, నిరాశానిస్పృహలను దరిచేరనివ్వని ధీశక్తి... ఈ లక్షణాలకు తోడు ఎదుటివారిని ప్రభావితం చేయ గలిగే వాక్పటుత్వం... ఇవన్నీ కలబోసుకున్న ఒక విశిష్ఠ వ్యక్తి హనుమ. కేవలం ఆయనను దైవంగా పూజించడంతో సరిపెట్టుకోకుండా ఆయన బుద్ధిబలం, దేనినైనా సాధించి తీరాలన్న తపన, ధైర్యం, భయ రాహిత్యం, వాక్చాతుర్యం, ఆరోగ్యం, దేహ దారుఢ్యం వంటి వాటిని అలవరచుకో గలగాలి. నేడు హనుమజ్జయంతి సందర్భంగా ఆయనలోని వ్యక్తిత్వ వికాస కోణాన్ని చర్చించుకుందాం.

జీవితంలో మనకు ప్రధానమైన శత్రువు భయం. మతంగ మహర్షి శాపం వల్ల వాలి ఋష్యమూక పర్వతం మీదకు రాలేడని సుగ్రీవునికి తెలుసు. అయినా ధనుర్బాణాలు, కత్తులు ధరించి, ఋషి వేషంలో ఉన్న బలిష్ఠులైన రామలక్ష్మణులను ఋష్యమూక పర్వత శిఖరం మీద నుంచి చూసి భయపడిపోతున్న సుగ్రీవునికి ధైర్యం చెప్పేప్రయత్నం చేస్తాడు హనుమ ఈ రకంగా చూస్తే హనుమ తొలి దర్శనంలోనే సుగ్రీవునికే కాదు మనకు కూడా నిర్భయత్వాన్ని అలవరచుకోవాలనే పాఠం చెప్పే గురువుగా.. మంత్రిగా... సన్మిత్రుడిగా దర్శనమిస్తాడు. 'సుగ్రీవా! నువ్వు మహారాజుగా ఉండవలసిన వాడివి, ఎవరో ఇద్దరిని చూసి నిన్ను చంపడానికే వచ్చారని భయపడితే ఎలాగయ్యా.. నడక చేత, అవయవాల కదలిక చేత,










మాట చేత, అవతలివారు ఎటువంటి స్థితిలో ఉన్నారో, ఎందుకు వచ్చారో, వారి మనస్సులలో ఏ భావన ఉన్నదో కనిపెట్టి, దానికి అనుగుణంగా నడిచి, తనని, తన ప్రజలని రక్షించుకోగల సమర్థత ఎవడికి ఉన్నదో వాడు రాజు. అంతేకాని కనపడ్డ ప్రతివాడిని చూసి ఇలా పారిపోతే, నువ్వు రేపు రాచపదవి ఎలా నిర్వహిస్తావు?' ఈ విధంగా హనుమ తొలిసారిగా కనిపించగానే నిర్భీకతను బోధించే గురువుగా దర్శనమిస్తాడు.



సమయోచిత వేష భాషలు

ఇంటర్వ్యూలకు వెళ్ళేటప్పుడు, ఉద్యోగజీవితంలో, వ్యక్తిగత జీవితాలలో సందర్భోచిత వేషధారణ అవసరమని చెపుతూ ఉంటాం. సందర్భోచిత వేషధారణ హనుమను చూసే నేర్చుకోవాలి. సుగ్రీవుని కోరిక మేరకు రామలక్ష్మణులతో మాట్లాడ్డానికి వెళ్ళేముందు కపివేషంలో కాక యతి వేషంలో వెళతాడు. వచ్చినవారు ఎవరు, ఎలాంటి వారు అన్న విషయం తెలిసిన తర్వాతనే నిజరూపం ధరిస్తాడు. మనం రూపాలు మార్చలేకపోయినా వస్త్రధారణనైనా సందర్భోచితంగా మార్చుకోగలం గదా! తాను స్వతహాగా అత్యంత శక్తిమంతుడైనా వ్యక్తి కంటే ధర్మం గొప్పది అని నమ్మిన వాడు గనకనే అధర్మపరుడైన వాలితో కాక సుగ్రీవునితోనే వుంటాడు ఆంజనేయుడు.

అతను మాట్లడిన నాలుగు మాటలకే మురిసి పోతాడు తానే పెద్ద వాగ్విశారదుడైన శ్రీరామచంద్రుడు.

హనుమంతుని సంభాషణా చాతుర్యాన్ని గురించి '' చూశావా లక్ష్మణా, ఈయన మాట్లాడిన విధానాన్ని చూస్తే, ఋగ్వేదం, యజుర్వేదం, సామ వేదం తెలియకపోతే ఇలా మాట్లాడలేడు. అన్నిటినీ మించి ఈయన వ్యాకరణాన్ని చాలాసార్లు చదువుకున్నాడు. ఈయనకి ఉపనిషత్తుల అర్థం పూర్తిగా తెలుసు. అందుకనే ఈయన మాట్లాడేటప్పుడు కనుబొమలు నిష్కారణంగా కదలడం లేదు, లలాటం అదరడం లేదు. కాళ్ళు, చేతులు, శరీరాన్ని అనవసరంగా కదపడం లేదు. ఏ శబ్దాన్ని ఎలా ఉచ్చరించాలో, ఎంతవరకు ఉచ్చరించాలో అలా పలుకుతున్నాడు'' అని రాముడు తన సోదరుడైన లక్ష్మణునితో చెబుతాడు. అంటే దీనిని బట్టి మనం ఎప్పుడు ఏ విధంగా ఉండాలో తెలుసుకోవాలి.

ఆయన జీవితమే ఓ పాఠ్యపుస్తకం

నేను చేపట్టిన కార్యం అసాధ్యమేమో అని భయపడుతూ ఉండిపోతే ఏ కార్యం కూడా సాధ్యం కాదు... ఉదాహరణకు హనుమకు అప్పగించిన పనినే తీసుకోండి. సీతను అతను ఇంతవరకూ చూడలేదు. ఆమె ఎలా ఉంటుందో తెలియదు. ఆమెను ఎత్తికెళ్ళింది ఎవరో తెలియదు ఎక్కడ దాచి ఉంచాడో తెలియదు. ఐనా నెల రోజులలో ఆమె ఆచూకీ తెలుసుకొని వస్తానని బయలుదేరతాడు హనుమంతుడు. అంటే సవాళ్లను స్వీకరించి వాటిని సమర్థంగా ఎదుర్కొని విజయవంతంగా బయటపడటమెలాగో అనే అంశాన్ని నేర్చుకోవడానికి హనుమ జీవితమే మనకు ఒక పెద్ద ఉదాహరణ.

వినయగుణ సంపన్నుడు

సముద్ర తీరానికి చేరుకొన్నప్పుడు హనుమ ప్రవర్తన చూసి వినయమంటే ఏమిటో, అన్నీ ఉన్నా ఒదిగి ఉండటమంటే ఏమిటో నేర్చుకోవాలి. సముద్రాన్ని దాటి లంకను చేరే పని నువ్వే చేయగలవని అందరూ కలిసి అడిగేటంతవరకూ తానుగా నా బలమింతటిది అనీ, ఈ పని నేను చేయగలను అనీ ఎగిసి ఎగిసి పడలేదు. శ్రేయాంసి బహు విఘ్నాని అని ఉత్తమ కార్యంలో అనేక విఘ్నాలు ఎదురవుతూనే ఉంటాయి. అవాంతరాలను ఎదుర్కొని కార్య సాధన చేయడమెలాగో, తొణకకుండా బెణకకుండా కార్యాన్ని చక్క పెట్టడమెలాగో హనుమనే మనకు చేసి చూపించాడు. మైనాకుడు అనే పర్వతం ఆదరించి ఆతిథ్యం స్వీకరించి పొమ్మని అడగటం, దాన్ని సున్నితంగా తిరస్కరించి ముందుకు సాగటం సానుకూలంగా కనిపించే విఘ్నాలను ఎలా ఎదుర్కోవాలో నేర్పుతాయి. భుజబలాన్నీ, బుద్ధి బలాన్నీ ఉపయోగించి విఘ్నాలను గట్టెక్కడం ఎలాగో సింహికను జయించడంలోనూ, సరమ నోటి లోనికి ప్రవేశించి బయటకు రావడంలోనూ చూపుతాడు.

కష్టాల్లో ఉన్న వాళ్ళను ఓదార్చడం

ఇది ఒక గొప్ప కళ. అశోక వనంలో సీతతో మాట్లాడుతున్నప్పుడు చూడాలి హనుమ చాతుర్యం. 'అమ్మా, వానరసైన్యంలో నాకన్నా తక్కువ వాళ్ళెవరు లేరు, నాతో సమానమైనవారూ, నన్ను మించిన వారూ ఎందరో ఉన్నారు. రాముడు వానరసైన్యంతో రావణుని సునాయాసంగా జయించగలడు. కనుక నీవు నిర్భయంగా ఉండమ్మా' అన్న పలుకులు ఎంత దుర్భర పరిస్థితిలో ఉన్న వారికైనా ఎంత సాంత్వన కలిగించ గలుగుతాయో చూడండి.

సమర్థుడైన కార్యసాధకుడు

ఆటంకాలను ఎలా ఎదుర్కోవాలన్న విషయాన్ని హనుమ దగ్గర నేర్చుకోవాలి. అంతిమ విజయానికి ఉపయోగ పడుతుందనుకొంటే, కార్యసాధనలో అవసరమైతే చొరవ తీసుకొని స్వతంత్ర నిర్ణయాలను కూడా తీసుకో గలిగి ఉండాలి.

సీతాన్వేషణకు బయలుదేరినప్పుడు, లంకా దహనం చేయమనీ, రాక్షస సంహారం చేయమనీ, రాముడు ఆయనతో చెప్పలేదు. కానీ రామదూతనైన తనే ఇంత విధ్వంసాన్ని సృష్టించగలిగితే కపిసైన్యంతో రాముడు వస్తే రాముడి ముందు తాను నిలవగలనా అన్న అనుమానాలను రావణునిలో రేకెత్తించే అనే ప్రయత్నం చేయడం హనుమ తీసుకొన్న స్వతంత్ర నిర్ణయం. అక్కడికక్కడ నిర్ణయాలను తీసుకోగలగడం ఒక సమర్థుడైన కార్యసాధకుడి లక్షణం.

హనుమంతుని దగ్గర మనమెన్నో వ్యక్తిత్వ వికాస లక్షణాలనూ, సకారాత్మక ఆలోచనా విధానాన్నీ, యాజమాన్య కౌశలాన్నీ ఎంతైనా నేర్చుకోవచ్చు, నేర్చుకోవాలి కూడా.

డి.వి.ఆర్.

సంభాషణా చతురుడు

లంక నుంచి తిరిగి వచ్చిన తరువాత దూరంనించే 'దృష్టా సీతా' అని ఒక్క మాటలో తన కార్యం విజయవంతమైనదన్న విషయాన్ని సూచించి ఆ తరువాత మిగతా విశేషాలను వివరిస్తాడు. అలాకాకుండా మైనాకుడూ, సరమా, సింహికా, లంఖిణీ అని నస మొదలు పెడితే వినేవారికి ఆందోళన. పెరిగిపోవడం ఖాయం. అలాగే లంకలో సీత దగ్గిర అకస్మాతుగా ఊడిపడి గాభరా పెట్టకుండా కొమ్మమీద కూర్చుని మొదట రామకథను వినిపించి, ఆమెను తగిన మానసిక స్థితికి తేవడంలో హనుమంతుని నేర్పు కనిపిస్తుంది. అదీ మాట తీరు అంటే. ఇదీ మనం నేర్చుకోవాలి హనుమ దగ్గర.

ఎలాంటి వారికైనా సహజంగానే పరిస్థితుల ప్రాబల్యం వల్ల ఒక్కొక్కసారి దారుణమైన ఆవేదన, గ్లాని కలుగుతూ ఉంటాయి గానీ అలాంటి సందర్భాలలో కూడా వెంటనే తేరుకోగలిగి, నిర్వేదం నుంచి తక్షణమే బయటపడగలిగితేనే ఏదైనా సాధించగలం.

● కథానీతి

నేనడిగింది ధర్మం...

అదొక ఆలయం. అక్కడ వాకిట్లో ఓ యాచకుడు కూర్చున్నాడు. ధర్మం చెయ్యండి బాబూ అంటూ యాచిస్తున్నాడు.

అటువైపుగా కొందరు ధనవంతులు వచ్చారు. వారిని చూసీచూడడంతోనే యాచకుడు చేతిలో బిక్షపాత్ర చాచి ''ధర్మం బాబయ్యా'' అని అడిగాడు. కానీ వారిలో ఒక్కరూ చిల్లిగవ్వ కూడా ఆ పాత్రలో వెయ్యలేదు. అలా వెళ్ళిపోయిన వారిలో ఓ ధనవంతుడి దగ్గరున్న ఓ డబ్బు సంచీ కింద జారిపడిపోయింది. ఆ విషయం అతనికి తెలియలేదు. కానీ ఆ డబ్బు సంచీని యాచకుడు చూశాడు. దాన్ని తీసుకుని తన దగ్గర ఉంచుకున్నాడు. ఆలయం లోపలికి వెళ్ళిన కాస్సేపటికి డబ్బు సంచీ పోగొట్టుకున్న వ్యక్తి రొప్పుతూ పరిగెత్తుకుంటూ వచ్చాడు.

''ఇక్కడెక్కడైనా నా సంచీ పడిపోయుంటే చూసేవా'' అని అడిగాడు ఆ ధనవంతుడు.

తాను చూశానని, మీరొస్తే మీకివ్వాలనే నా పక్కనే పెట్టుకున్నాను అన్నాడు యాచకుడు.

ధనవంతుడు ఆత్రుతతో ''ఏదీ ఆ సంచీ, ఇటివ్వు. అందులో యిదు వందల దీనారుల ఉండాలి... నువ్వేమన్నా తీసుకున్నావా'' అని అడిగాడు.



''నేనసలు ఆ సంచీ లోపల ఏం ఉందో కూడా చూడలేదండీ, మీరు లెక్కపెట్టుకోండి'' అన్నాడు యాచకుడు.

ధనవంతుడు లెక్కపెట్టి చూసుకుంటే అతను చెప్పిన అయిదు వందల దీనార్లు అలాగే ఉన్నాయి.

దాంతో అతని ముఖాన అప్పటి వరకూ ఉన్న కంగారు, దాంతో పుట్టిన చెమటా మటుమాయమై సంతోషం ఉప్పొంగింది.

ఆనందంతోనే అతను అందులోంచి పదిహేను దీనార్లు లెక్కపెట్టి ''ఇదిగో ఇది నా కానుక'' అంటూ యాచకుడికి ఇచ్చాడు.

కానీ యాచకుడు తనకక్కరలేదని సున్నితంగా తిరస్కరిస్తూ ''మీరు కానుకగా ఇచ్చే సొమ్ము నాకక్కరలేదు. నేను మొదట మిమ్మల్ని ధర్మం చెయ్యండి బాబూ అని ధర్మం అడిగాను. అప్పుడే ఇచ్చి ఉంటే మహదానందంగా తీసుకునేవాడిని'' అన్నాడు.

ధనవంతుడు మౌనంగా వెళ్ళిపోయాడు.

– యామిజాల జగదీశ్

● ఇస్లాం వెలుగు

అహం పతనానికి నాంది

గర్వం, అహంకారం అన్నవి మహాచెడ్డ దుర్గుణాలు. మానవులకు ఏవిధంగానూ శోభించని లక్షణాలు. నిజానికి ఇవి షైతాన్ గుణాలు. కేవలం అహం కారణంగానే దైవానికి అవిధేయుడై దుర్మార్గుల్లో కలిసి పొయ్యాడు, ధూర్తుడిగా మిగిలి పొయ్యాడు.

దైవం మానవుణ్ణి సృష్టించిన తరువాత, అందరూ అతనికి సజ్దా (సాష్టాంగ ప్రణామం) చెయ్యాలని ఆదేశించాడు. కాని షైతాన్ చెయ్యలేదు. ఈ విషయం పవిత్ర ఖురాన్‌లో ఇలా ఉంది.: ' ... ఆ తర్వాత మేము ఆదంకు గౌరవ సూచకంగా అభివాదం చెయ్యండని దైవదూతలను ఆదేశించాము. అప్పుడు ఇబ్లీసు తప్ప అందరూ అభివాదం చేశారు. ఇబ్లీసు తనేదో గొప్పవాణ్ణన్న అహంకారంతో విర్రవీగుతూ, తిరస్కరించి అవిధేయుడై పొయ్యాడు.'(2 – 34). అల్ ఆరాఫ్ సూరా 11, 12 వాక్యాల్లో, సాద్ సూరా 73, 74, 75 లో కూడా ఈ ప్రస్తావన ఉంది.

అహం అంటే.., తానే గొప్పవాడినని భావించడం. ఇతరులను తక్కువగా, హీనంగా చూడడం. అన్నీ, అంతా తనకే తెలుసని, ఇతరులకేమీ తెలియదని తలపోయడం. షైతాన్ ఇక్కడ రెండు తప్పులు చేశాడు. ఒకటి: దైవాదేశాన్ని తిరస్కరించాడు. రెండు: ఆదిమానవుణ్ణి తనకన్నా తక్కువ వాడుగా, నీచుడిగా చూశాడు. అంటే, తన సృజన అగ్నితో జరిగింది కాబట్టి, మట్టితో సృష్టించబడిన వాడికంటే తానే గొప్పవాడినన్న అహం అతడి సత్యతిరస్కారానికి కారణమైంది. ఈ విధంగా వాడు తన వినాశనాన్ని తానే కొని తెచ్చుకున్నాడు.



సత్యాన్ని సత్యంగా అంగీకరించాలంటే, ఇతరులను గౌరవ దృష్టితో చూడగలగాలంటే, 'అందరి' కన్నా గొప్పవాడయిన సృష్టికర్త ఆదేశాలను పాలించగలగాలి. కాని అతనిలోని అహం మరెవ్వరినీ తన కన్నా గొప్పవాడుగా అంగీకరించడానికి ఒప్పుకోదు. సమాజంలో తనకో గొప్ప స్థానం ప్రాప్తం కావాలని కోరుకుంటాడు. మరెవరూ తన స్థాయికి, కనీసం తన దరిదాపుల్లోకి రావడాన్నీ సహించలేడు. అంతా తనకే తెలుసునని, ఎదుటివారికి ఏమీ తెలియదని, తనమాటే చెల్లుబాటు కావాలని అభిలషిస్తాడు. ఈ వైఖరి సరయినది కానప్పటికీ, ఎదురు దెబ్బలు తగులుతున్న ప్పటికీ అతనిలోని ' అహం ' తప్పుడు వైఖరి గురించి ఆలోచించే అవకాశమే ఇవ్వదు. మంచి అనేది ఉంటే అది తనలోనే ఉందని, ఇతరులు చేరుకోక ముందే తాను దాన్ని అందిపుచ్చుకుంటానని అతను భావిస్తాడు. ఎదుటి వారిలోని ఏమంచినీ, ఏ నైతిక సుగుణాన్నీ అతను అంగీకరించడు. నైతిక వర్తనుడైనా, సౌజన్యశీలుడైనా అంతా తానేనని తలపోస్తాడు.

ఇలాంటివారు తమ అహంకార వైఖరి కారణంగా తమను తామే నష్టపరుచుకుంటారు తప్ప మరొకటి కాదు. ఇదంతా తమకే అంతా తెలుసు, ఎదుటి వారికి ఏమీ తెలియదనుకున్న ఫలితం. వారి మనసులో తామేదో గొప్పవాళ్ళమన్న అహంకార భావం తిష్ట వేసుకొని ఉంటుంది. ఇది ఎంతమాత్రం మంచి విధానం కాదు. గర్వం, అహంకారం లాంటి దుర్లక్షణాల నుండి దైవం అందరినీ కాపాడాలని కోరుకుందాం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● సువార్త

పరిమితి లేని విశ్వాసం



మానవుల జీవితానికి పరిమితి ఉంది. కానీ విశ్వాసానికి పరిమితులు లేవు. మానవుని ఆయుష్కాలం డెబ్బది సంవత్సరాలు. అధిక బలమున్న యెడల ఎనుబది సంవత్సరాలు. అయిననూ వాటి వైభవం ఆయాసమే, దుఃఖమే. అది త్వరగా గతించి పోవును. కాబట్టి మానవుని జీవితానికి పరిమితి వున్నదని స్పష్టంగా (ప్ర) మోషే ప్రబోధించాడు. (కీర్తనలు 90: 10).

విశ్వాసానికి పరిమితి లేదు. కానీ ఇశ్రాయేలీయులు దత్తపుత్రత్వమును మహిమయు నిబంధనలు ధర్మశాస్త్ర ప్రధానమును అర్చనాచారాదులును వాగ్దానాలు వారివేనని పరిమితి గలవారు (రోమా 9:4). దేవునికి గ్రీకుదేశస్థుడని యూదుడని ఏ భేదమూ లేదు. (రోమా 10:12). భూమియు దాని సంపూర్ణతయు లోకమును దాని నివాసులును దేవుడైన యెహోవాయే (కీర్తనలు 4: 1) అందరూ ఆయన జనులే, దేవుడు పరిమితిలేనివాడు, అపరిమితుడు దేవుడు.

భగవంతునికి భూమిమీద నివసించు వారందరూ తనవారే. యూదులు దేవుడు వారినే రక్షించుకుంటాడను కోవడం వారి అవగాహనారాహిత్యం. దేవుడు మాకు మాత్రమే అనుకునే ఇశ్రాయేలీయులతో–ఇశ్రాయేలీయులారా! మీరునూ, కూషీయులును నా దృష్టికి సమానులే కారా! నేను ఐగుప్తు దేశంలో నుండి ఇశ్రాయేలీయులను, కఫ్తోరు దేశంలో నుండి సిరియనులను సృష్టించితిని గదా అని ఇశ్రాయేలీయులతో సర్వోన్నతుడైన దేవుడనుచున్నాడు. (ఆమోసి 9 : 7). అనగా దేవుడు పక్షపాతి కాదని, అందరూ సమానులే అని అర్థం.

పేతురు అన్యజనులను ముట్టుకొనని సహవాసం చేయని బహు నిష్టగల యూదుడు. ఆయనకు యించుమించు పండ్రెండు గంటల వేళ మధ్యాహ్న సమయంలో దేవునిదూత ప్రత్యక్షమై పెద్ద పాత్ర ఒకటి భూమి మీదకు ప్రత్యక్షమైనది. ఆ పాత్రలో భూమియందుండు సకల విధాలైన చతుష్పాద జంతువులును, పాకెడు పురుగులును, ఆకాశ పక్షులు కనపడ్డాయి. ఆ సమయంలో పేతురు ఆకలిగొని యున్నందున నీవు లేచి వాటిని చంపుకొని తినమని దూత చెప్పాడు. అప్పుడు పేతురు ''వద్దు ప్రభువా! నిషిద్ధమైనది అపవిత్రమైనవాటిని నేనెన్నడూ తినలేదనగా – దేవుడు పవిత్రం చేసిన వాటిని నీవు నిషిద్ధంగా ఎంచవద్దని ముమ్మారు చెప్పినప్పటికీ పేతురు తినలేదు. అప్పుడు ఆ పాత్ర ఆకాశానికి తిరిగి తీసుకొనబడింది. దీని భావమేమిటి? సకల విధములైన దేశాలలో వున్న జనులు, వారి సంస్కృతులు, ఆచారాలు, భాషలు గల వారిని నిషిద్ధులుగా ఎంచరాదని, అందరూ ఆయన జనులేనని అర్థం. పాలు, తేనెల వలె కలిసిమెలసి జీవించాలన్నదే భగవంతుని ఉద్దేశంతో కూడిన దర్శనం, కాబట్టి దేవుడు రంగు, జాతి, మతం ఏ భేదం లేనివాడు. (అపో 11:4–10)

– కోట బిపిన్

● వారం.. పర్వం



22. గురువారం హనుమజ్జయంతి...

ఈవేళ ఉదయమే లేచి స్నానం చేసి శుచిగా ఉండి హనుమాన్ చాలీసా లేదా హనుమద్దండకం చదువుకుని స్వామికి అప్పాలు నివేదించి, హారతి ఇస్తే చాలా మంచిది. ఆలయంలో స్వామికి ఆకుపూజ చేయించి, వడమాల వేయించడం వల్ల అనేక దోషాలు తొలగి హనుమ అనుగ్రహం కలుగుతుంది. ఈరోజు రామ నామ జపం చేయడం, సుందరకాండ పారాయణం చేయడం సత్ఫలితాలనిస్తుంది.



23. శుక్ర వారం అపర ఏకాదశి...

హిందూ ధర్మంలో అపర ఏకాదశి ఒక ముఖ్యమైన పర్వదినం. ఈ రోజున విష్ణువును పూజించి, ఉపవాసం ఉండటం ద్వారా పాపాలు తొలగి పుణ్యం ప్రాప్తించడమే గాక కోరికలు కూడా నెరవేరతాయని విశ్వాసం. ఈ పర్వదినాన శక్తిమేరకు బియ్యం, గోధుమలు, పప్పులు, ఇతర ధాన్యాలను లేదా ఆహారాన్ని దానం చేయడం ద్వారా ఇంట్లో ఎప్పుడూ ఆహార కొరత ఉండదు. స్తోమత లేకుంటే కనీసం నీటితో నిండిన కుండను దానం చేయడం లేదా దాహం వేసిన వ్యక్తికి నీరు ఇవ్వడం శుభ ప్రదం.

24. శనివారం శని త్రయోదశి...

ఈ వేళ శనికి నువ్వులనూనెతో అభిషేకం చేసినా ఆ స్వామికి ఇష్టమైన నువ్వులు, నల్లటి వస్త్రం వంటివి దానం చేసినా శని ప్రసన్నుడవుతాడనీ ఏలినాటిశని, అర్ధాష్టమ శని బాధల నుంచి ఉపశమనం లభిస్తుందనీ విశ్వాసం. శత్రుబాధ, ఋణ బాధ, రోగపీడతోనూ... ఏలినాటిశని, అర్ధాష్టమశనితోనూ బాధపడేవారు తూర్పుగోదావరి జిల్లా మందపల్లిలో స్వామికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగానైనా తిల తైలాభిషేకం జరిపిస్తే అవన్నీ తొలగిపోతాయని ప్రతీతి.



25. ఆదివారం మాస శివరాత్రి...

ప్రతినెలా ప్రతి నెలా అమావాస్య ముందు వచ్చే బహుళ (రాత్రిగల) చతుర్దశినాడు 'మాసశివరాత్రి'గా జరుపుకుంటారు. శివుడు అభిషేక ప్రియుడు కాబట్టి ఈవేళ రుద్రాభిషేకం, శివార్చనలు, బిల్వార్చనలు జరపడం ఆయురారోగ్య ఐశ్వర్య ప్రదం. పార్వతీ కల్యాణం జరిపించుకోవడం ప్రశస్తం.



ఐపీవో స్ట్రీట్

లీలా ప్యాలసెస్ @ రూ. 413-435

- ఈ నెల 26-28 మధ్య ఐపీవో
- రూ. 3,500 కోట్ల సమీకరణ




న్యూఢిల్లీ: ఆతిథ్య రంగ కంపెనీ ష్లాస్ బెంగళూరు లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 413-435 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 26న ప్రారంభమై 28న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 23న షేర్లను విక్రయించనుంది. లీలా ప్యాలెసెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ బ్రాండుతో కంపెనీ ఆతిథ్య రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 2,500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 1,000 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ సంస్థ ప్రాజెక్ట్ బాలెట్ బెంగళూరు హోల్డింగ్స్ ఆఫర్ చేయనుంది. తద్వారా రూ. 3,500 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. వెరసి దేశీయంగా ఆతిథ్య రంగంలో అతిపెద్ద ఐపీవోగా నిలవనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 34 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థల రుణ చెల్లింపులతోపాటు.. సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 2025 మార్చికల్లా కంపెనీ రుణ భారం రూ. 3,900 కోట్లుగా నమోదైంది. లీలా బ్రాండ్ సంస్థ 12 హోటళ్ల ద్వారా మొత్తం 3,382 గదుల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది.

షిప్‌రాకెట్ ఐపీవో బాట

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

న్యూఢిల్లీ: ఈకామర్స్ సంస్థలకు సర్వీసులందించే షిప్‌రాకెట్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి గోప్యతా విధానంలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. తద్వారా ప్రాస్పెక్టస్ వివరాలను తొలి దశలో రహస్యంగా ఉంచేందుకు వీలుంటుంది. కాగా.. టెమాసెక్, జొమాటో తదితర దిగ్గజాలకు పెట్టుబడులున్న కంపెనీ ఐపీవో ద్వారా రూ. 2,000-2,500 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇష్యూ నిధులను ప్రాడక్ట్ డెవలప్‌మెంట్, వ్యూహాత్మక కొనుగోళ్లు, లాజిస్టిక్స్ తోపాటు, వేర్‌హౌసింగ్ ఇన్‌ఫ్రా విస్తరణ తదితరాలకు వినియోగించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.



ఏజిస్ వొపాక్ @ రూ. 223-235

ఈ నెల 26-28 మధ్య ఐపీవో ● రూ. 2,800 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: లాజిస్టిక్స్ రంగ సంస్థ ఏజిస్ వొపాక్ టెర్మినల్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 223-235 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 26న ప్రారంభమై 28న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 23న షేర్లను విక్రయించనుంది. ప్రయివేట్ రంగ దిగ్గజం ఏజిస్ లాజిస్టిక్స్ అనుబంధ సంస్థ ఇది. ఇష్యూలో భాగంగా రూ. 2,800 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. తొలుత రూ. 3,500 కోట్ల సమీకరణకు ప్రణాళికలు వేసినప్పటికీ రూ. 2,800 కోట్లకు కుదించింది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 63 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 2,016 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 671 కోట్లు పెట్టుబడి వ్యయాలకు వెచ్చించనుంది. ఈ నిధులతో మంగళూరులో క్రియోజెనిక్ ఎల్‌పీజీ టెర్మినల్‌ను కొనుగోలు చేయనుంది. కాగా.. కంపెనీ విలువను రూ. 26,000 కోట్లుగా బ్రోకరేజీలు మదింపు చేశాయి. 2024 జూన్‌కల్లా కంపెనీ రుణ భారం రూ. 2,584 కోట్లుగా నమోదైంది. కంపెనీ దేశవ్యాప్తంగా పెట్రోలియం, లూబ్రికెంట్స్, కెమికల్స్, ఎల్‌పీజీ, ప్రొపేన్ తదితర లిక్విడ్స్, గ్యాస్ సంబంధ స్టోరేజీ సౌకర్యాలను కలిగి ఉంది. కీలక పోర్టులకు సమీపంలో టెర్మినళ్లను ఏర్పాటు చేసింది.



చమురుకు మరింత డిమాండ్



- వచ్చే పదేళ్ల పాటు ఏటా 4% వృద్ధి
- ఎస్అండ్‌పీ గ్లోబల్ కమోడిటీ ఇన్‌సైట్స్ అంచనా

న్యూఢిల్లీ: దేశీయంగా చమురు వినియోగం వచ్చే దశాబ్ద కాలం పాటు గణనీయంగా పెరగనుంది. వార్షికంగా 4 శాతం చొప్పున వృద్ధి చెందనుంది. ఎస్అండ్‌పీ గ్లోబల్‌లో భాగమైన ఎస్అండ్‌పీ గ్లోబల్ కమోడిటీ ఇన్‌సైట్స్ ఈ మేరకు అంచనాలు వెలువరించింది. దీని ప్రకారం 2025లో ఇప్పటివరకు ఆయిల్ వినియోగం రోజుకు 4.8 మిలియన్ బ్యారెళ్లుగా (ఎంబీపీడీ) ఉంది. గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 4.3 శాతం పెరిగింది. చమురు ఎగుమతి దేశాల నుంచి సరఫరా పెరగడం, అంతర్జాతీయంగా డిమాండ్ కాస్త మందగించడం వంటి అంశాల కారణంగా ఈ ఏడాది చమురు రేట్లు కొంత నెమ్మదించినట్లు సంస్థ హెడ్ ఆఫ్ ఇండియా కంటెంట్ (క్రాస్ కమోడిటీస్) పులకిత్ అగర్వాల్ తెలిపారు. మెరుగైన ఆర్థిక వృద్ధి వంటి సానుకూలాంశాలతో భారత్‌లో ఆయిల్‌కు డిమాండ్ పెరుగుతోందన్నారు. అంతర్జాతీయంగా భారత్‌కి మరింత ప్రాధాన్యం లభిస్తోందని వివరించారు. రష్యా నుంచి వరుసగా నాలుగో ఏడాది కూడా నిరాటంకంగా సరఫరా కొనసాగుతున్న నేపథ్యంలో ముడి చమురు కొనుగోళ్లకు మనకు మరిన్ని వనరులు అందుబాటులో ఉంటున్నాయని పేర్కొన్నారు.

పర్యావరణహిత ఇంధనాల వ్యయాలు తగ్గాలి..

పర్యావరణహిత ఇంధనాల వ్యయాలు ఎంత తక్కువగా ఉంటే అంత వేగంగా వాటి వైపు మళ్లడం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరి జోహర్ చెప్పారు. ఈ విషయంలో వివిధ టెక్నాలజీలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వ విధానాలు, నియంత్రణ సంస్థల నిబంధనలు, కార్పొరేట్ల చొరవ మొదలైన అంశాలన్నీ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అయితే, హరిత ఇంధనాల వైపు మళ్లినంత మాత్రాన పాత ఇంధనాల వినియోగం పూర్తిగా నిల్చిపోతుందనడానికి లేదని తెలిపారు. బొగ్గు నుంచి చమురుకు మారినప్పటికీ ప్రపంచంలో బొగ్గు వినియోగం ఆగిపోలేదన్నారు. వాస్తవానికి గతంతో పోలిస్తే ప్రస్తుతం మరింత పెరిగిందని గౌరి తెలిపారు. మరోవైపు, టారిఫ్‌లపై ఆందోళనలతో దేశీ మార్కెట్లలో నిల్వలు పెరగడం, పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ పడిపోవడం వంటి అంశాలపై ఆందోళన నెలకొన్నప్పటికీ 2025-26లో జీడీపీ వృద్ధికి మించి పెట్రోకెమికల్స్‌కు డిమాండ్ ఉంటుందని అసోసియేట్ డైరెక్టర్ స్తుతి చావ్లా చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ నెమ్మదిస్తుండటం, టారిఫ్‌లపై అనిశ్చితి, మార్జిన్లు తగ్గడం, ఉత్పత్తి సామర్థ్యాలు పెరిగిపోవడంలాంటి అంశాలతో సతమతమవుతున్న అంతర్జాతీయ పెట్రోకెమికల్ ఉత్పత్తిదారులు భారత్‌పై ఆశలు పెట్టుకున్నట్లు తెలిపారు.

టీసీఎస్‌కు రూ. 2,903 కోట్ల బీఎస్ఎన్ఎల్ ఆర్డరు



న్యూఢిల్లీ: దేశీ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తాజాగా ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ నుంచి రూ. 2,903 కోట్ల యాడ్-ఆన్ అడ్వాన్స్ పర్చేజ్ ఆర్డరు (ఏపీవో) దక్కించుకుంది. దీని ప్రకారం బీఎస్ఎన్ఎల్‌కు 18,685 సైట్లలో 4జీ మొబైల్ నెట్‌వర్క్ ప్లానింగ్, ఇంజినీరింగ్, సరఫరా, ఇన్‌స్టాలింగ్, టెస్టింగ్, వార్షిక మెయింటెనెన్స్ మొదలైన సర్వీసులను టీసీఎస్ అందించాల్సి ఉంటుంది. ఏపీవోలో పేర్కొన్న నిర్దిష్ట నిబంధనలకు లోబడి సవివర పర్చేజ్ ఆర్డర్లను (పీవో) బీఎస్ఎన్ఎల్ జారీ చేస్తుందని కంపెనీ తెలిపింది. ఈ కాంట్రాక్టుకు సంబంధించి తాము టీసీఎస్‌కు సరఫరా చేసే రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ (ఆర్ఏఎన్), ఇతరత్రా పరికరాల విలువ సుమారు రూ. 1,526 కోట్లుగా ఉంటుందని తేజాస్ నెట్‌వర్క్స్ పేర్కొంది. నిర్దిష్ట షరతులకు లోబడి టీసీఎస్ సవివర పీవోలను జారీ చేస్తుందని వివరించింది.

ఈపీఎఫ్‌వోలోకి 14.58 లక్షల సభ్యులు

- మార్చి నెలలో నికరంగా చేరిక
- వీరిలో సగం మంది కొత్త సభ్యులే



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో)లో 14.58 లక్షల మంది సభ్యులు మార్చిలో నికరంగా చేరారు. వీరిలో సగం మంది (7.54 లక్షల మంది) కొత్త సభ్యులే కావడం గమనార్హం. అంటే మొదటిసారి వీరు ఈపీఎఫ్‌వో పరిధిలోకి వచ్చారు. సంఘటిత రంగంలో పెరిగిన ఉపాధి అవకాశాలను ఇది ప్రతిఫలిస్తోంది. క్రితం ఏడాది ఇదే నెల గణాంకాలతో పోల్చి చూస్తే 1 శాతం ఎక్కువ మంది చేరినట్టు తెలుస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్త సభ్యుల చేరికతో పోల్చి చూసినా 2 శాతం వృద్ధి కనిపించింది. ఈ మేరకు మార్చి నెల పేరోల్ గణాంకాలు విడుదలయ్యాయి.

- కొత్త సభ్యుల్లో 4.45 లక్షల మంది 18-25 ఏళ్ల వయసులోని వారే కావడం గమనార్హం. కొత్త సభ్యుల్లో వీరు 59 శాతంగా ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెల, గతేడాది మార్చి నెల గణాంకాలతో పోల్చి చూసుకున్నా 4 శాతానికి పైనే వృద్ధి నమోదైంది.
- కొత్త సభ్యుల్లో 2.08 మంది మహిళలు ఉన్నారు. గతేడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 4.18 శాతం పెరుగుదల కనిపిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరితో పోల్చి చూసుకుంటే 0.18 శాతం వృద్ధి నమోదైంది. మార్చిలో నికరంగా చేరిన మహిళా సభ్యుల సంఖ్య 2.92 లక్షలుగా ఉంది.
- 13.23 లక్షల మంది ఒక సంస్థలో ఉద్యోగం మానేసి, మరో సంస్థలో చేరి తమ ఈపీఎఫ్ ఖాతాను ఆన్‌లైన్‌లో బదిలీ చేసుకున్నారు.
- మార్చి నెలలో నికర సభ్యుల చేరికలో అత్యధికంగా 20.24 శాతం మంది మహారాష్ట్ర నుంచి ఉన్నారు.
- తమిళనాడు, కర్ణాటక, హర్యానా, గుజరాత్, ఢిల్లీ, యూపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి సభ్యులు చేరిక విడిగా 5 శాతానికి పైనే నమోదైంది.

దేశీ విమాన ప్రయాణీకులు @ 1.43 కోట్లు

- ఏప్రిల్‌లో 8 శాతం అప్
- డీజీసీఏ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా ఏప్రిల్‌లో 1.43 కోట్ల మంది విమాన ప్రయాణాలు చేశారు. గతేడాది ఇదే వ్యవధిలో నమోదైన 1.32 కోట్లతో పోలిస్తే ప్రయాణికుల సంఖ్య 8.45 శాతం పెరిగింది. మార్కెట్ వాటాపరంగా చూస్తే 64.1 శాతంతో ఇండిగో అగ్రస్థానంలో ఉండగా ఆ తర్వాత స్థానాల్లో ఎయిరిండియా గ్రూప్ (27.2 శాతం), ఆకాశ ఎయిర్ (5 శాతం), స్పైస్‌జెట్ (2.6 శాతం) ఉన్నాయి. 2025 జనవరి-ఏప్రిల్ మధ్యకాలంలో దేశీ విమానయాన సంస్థలు 5.75 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నెలవారీ రిపోర్టులో వెల్లడించింది. వార్షికంగా చూస్తే ఈ సంఖ్య 9.87 శాతం, నెలవారీగా చూస్తే 8.45 శాతం పెరిగినట్లు వివరించింది. సమయ పాలనపరంగా (ఓటీపీ) చూస్తే 80.8 శాతంతో ఇండిగో అగ్రస్థానంలో ఉంది. 77.5 శాతం ఓటీపీతో ఆకాశ ఎయిర్, 72.4 శాతంతో ఎయిరిండియా గ్రూప్ .. ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. స్పైస్‌జెట్ సమయ పాలన అత్యంత కనిష్ట స్థాయిలో 60 శాతంగా నమోదైంది.

జెన్‌సోల్ బాకీలపై డీఆర్‌టీకి ఇరెడా

న్యూఢిల్లీ: జెన్‌సోల్ ఇంజినీరింగ్, దాని అనుబంధ సంస్థ జెన్‌సోల్ ఈవీ లీజ్ నుంచి రూ. 729 కోట్ల బాకీలను రాబట్టుకునేందుకు ఢిల్లీ డెట్ రికవరీ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించినట్లు ప్రభుత్వ రంగ ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఇరెడా) వెల్లడించింది. జెన్‌సోల్ ఇంజినీరింగ్ నుంచి రూ. 510 కోట్లు, జెన్‌సోల్ ఈవీ లీజ్ నుంచి రూ. 218.95 కోట్లు రికవర్ చేసుకునేందుకు అప్లికేషన్ దాఖలు చేసినట్లు తెలిపింది. ఈ రెండు సంస్థలపై ఇరెడా మే 14న దివాలా పిటీషన్ వేసింది. నిధుల మళ్లింపు, గవర్నెన్స్ లోపాల ఆరోపణలపై జెన్‌సోల్ ఇంజినీరింగ్, దాని ప్రమోటర్లు .. మార్కెట్ లావాదేవీలు జరపకుండా సెబీ ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వుల్లో ఆదేశించింది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-5-2025

విశాఖ	545-00
చిత్తూరు	623-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	517-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	382.95	5.26
TATASTEEL	161.75	1.93
CIPLA	1,481.00	1.83
HDFCLIFE	758	1.47
BAJAJFINSV	2,034.30	1.46

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	766.8	-1.98
JSWSTEEL	1,001.90	-1.07
KOTAKBANK	2,072.50	-0.84
GRASIM	2,703.00	-0.65
COALINDIA	405.45	-0.65

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,844
ఎన్ఎస్ఈ	98,948
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,07,253
ఎఫ్ఐఐ	+ 2,202
డీఐఐ	+ 684

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	61.60	$	62.03
బ్రెంట్	64.90	$	65.38

టారిఫ్ ప్రభావాలను భారత్ తట్టుకోగలదు

- ఎగుమతులపై ఆధారపడడం తక్కువే
- దేశీ వృద్ధి చోదకాలు అండగా నిలుస్తాయ్
- మూడీస్ రేటింగ్స్ అంచనా



న్యూఢిల్లీ: యూఎస్ టారిఫ్‌లు, అంతర్జాతీయంగా వాణిజ్య ప్రతికూలతలను భారత్ సమర్థవంతంగా ఎదుర్కోగలదని మూడీస్ రేటింగ్స్ అంచనా వేసింది. భారత్ ఎగుమతులపై తక్కువ ఆధారపడడం.. అదే సమయంలో బలమైన సేవల రంగం అండతో అమెరికా టారిఫ్‌లను అధిగమించగలదని అభిప్రాయం వ్యక్తం చేసింది. దీనికితోడు దేశీ వృద్ధి చోదకాలు మద్దతుగా నిలుస్తాయని పేర్కొంది. మరే వర్ధమాన దేశంతో పోల్చుకున్నా భారత్ మెరుగైన స్థితిలో ఉందని పేర్కొంది. ప్రైవేటు వినియోగం పెంపు, తయారీ సామర్థ్యాల విస్తరణ, మౌలిక సదుపాయలపై వ్యయాలు పెంచడం వంటివి.. అంతర్జాతీయ డిమాండ్ బలహీనతలను అధిగమించేందుకు సాయపడతాయని తెలిపింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో వడ్డీ రేట్ల తగ్గింపునకు అవకాశాలున్నాయని.. ఇది ఆర్థిక వ్యవస్థకు మరింత మద్దతుగా నిలుస్తుందని వివరించింది. వ్యక్తిగత ఆదాయపన్ను మినహాయింపు పెంపు డిమాండ్‌కు ఊతమిస్తుందని అంచనా వేసింది. పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు భారత్ కంటే పాక్‌కే ఎక్కువ నష్టం చేస్తాయని పేర్కొంది. ఆ దేశంతో భారత్‌కు పెద్దగా వాణిజ్య సంబంధాలు లేకపోవడాన్ని ప్రస్తావించింది. పైగా భారత్‌లో అధిక వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తి అంతా ఘర్షణ ప్రాంతాలకు దూరంగా ఉన్నట్టు తెలిపింది. కానీ, రక్షణ రంగంపై అధికంగా వెచ్చించాల్సి వస్తే అది భారత్ ద్రవ్య పరిస్థితులపై ప్రభావం చూపిస్తుందని.. ద్రవ్య స్థిరీకరణ ఆలస్యం కావొచ్చని అభిప్రాయపడింది. భారత ఆటో రంగం మాత్రం అంతర్జాతీయంగా నెలకొన్న సవాళ్లను ఎదుర్కొనాల్సి వస్తుందని పేర్కొంది. అమెరికా టారిఫ్‌ల కారణంగా ఏర్పడిన అనిశ్చితులతో 2025 సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి అంచనాలను మూడీస్ 6.7 శాతం నుంచి 6.3 శాతానికి తగ్గిస్తున్నట్టు ఈ నెల మొదట్లో ప్రకటించడం తెలిసిందే.

మార్చి త్రైమాసిక ఫలితాలు

కోల్గేట్ పామోలివ్ లాభం రూ.355 కోట్లు

ఒక్కో షేరుకు రూ.27 చొప్పున డివిడెండ్



న్యూఢిల్లీ: కోల్గేట్ పామోలివ్ (ఇండియా) మార్చితో ముగిసిన త్రైమాసికానికి రూ.355 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.380 కోట్లతో పోల్చి చూస్తే 6 శాతం తగ్గింది. ఆదాయం సైతం ఇదే కాలంలో రూ.1,513 కోట్ల నుంచి రూ.1,482 కోట్లకు పరిమితమైంది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ లాభం రూ.1,437 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.1,324 కోట్లతో పోల్చి చూస్తే 8.5 శాతం పెరిగింది. ఆదాయం రూ.5,644 కోట్ల నుంచి రూ.5,999 కోట్లకు వృద్ధి చెందింది. ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఎన్నో సవాళ్లు నెలకొన్నట్టు కోల్గేట్ పామోలివ్ ఇండియా ఎండీ, సీఈవో ప్రభా నరసింహన్ తెలిపారు. పట్టణ డిమాండ్ నెమ్మదించడం, పోటీ తీవ్రతరం కావడం చివరి త్రైమాసికం పనితీరుపై ప్రభావం చూపించినట్టు చెప్పారు. ఈ ఏడాది చివరికి పరిస్థితులు కుదుటపడొచ్చన్నారు. ఒక్కో షేరుకు రెండో మధ్యంతర డివిడెండ్ కింద రూ.27 పంపిణీకి బోర్డు సిఫారసు చేసింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు ఒక శాతం లాభపడి రూ.2,658 వద్ద ముగిసింది.

ఎన్‌టీపీసీ గ్రీన్ లాభం మూడింతలు

మార్చి క్వార్టర్‌కు రూ.233 కోట్లు



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్‌జీఈఎల్) మార్చి త్రైమాసికంలో పటిష్ట పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చితే మూడింతలై రూ.233 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.81 కోట్లుగానే ఉంది. మొత్తం ఆదాయం ఇదే కాలంలో రూ.553 కోట్ల నుంచి రూ.751 కోట్లకు పెరిగింది. వ్యయాలు ఈ కాలంలో రూ.425 కోట్ల నుంచి రూ.445 కోట్లకు పెరిగాయి. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,466 కోట్ల ఆదాయంపై రూ.474 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. షేరువారీ ఆర్జన రూ.56గా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలోనే కంపెనీ ఐపీవో ముగించిన స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ కావడం తెలిసిందే.

ఆకర్షణీయమైన ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఎన్‌టీపీసీ గ్రీన్ షేరు 2 శాతానికి పైగా లాభపడి రూ.105 వద్ద ముగిసింది.

ఈఐహెచ్ పనితీరు ఫర్వాలేదు

మార్చి క్వార్టర్‌లో రూ.262 కోట్ల లాభం



న్యూఢిల్లీ: ఒబెరాయ్, ట్రైడెంట్ బ్రాండ్లపై హోటల్స్ నిర్వహించే ఈఐహెచ్ లిమిటెడ్ మార్చితో ముగిసిన త్రైమాసికంలో స్థిరమైన పనితీరు చూపించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 6 శాతం పెరిగి రూ.262 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.247 కోట్లుగా ఉంది. ఆదాయం సైతం 11 శాతం పెరిగి రూ.866 కోట్లుగా నమోదైంది. వ్యాపారాలు, విహార పర్యటనల పరంగా డిమాండ్ కలిసొచ్చినట్టు సంస్థ తెలిపింది. తాము అత్యుత్తమ పనితీరు చూపించినట్టు పేర్కొంది. 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఈఐహెచ్ లిమిటెడ్ లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చిచూసినప్పుడు 14 శాతం వృద్ధితో రూ.770 కోట్లకు చేరింది. ఆదాయం రూ.2,880 కోట్లుగా నమోదైంది. 2029 నాటికి 21 ప్రాపర్టీల నిర్మాణం పూర్తవుతుందని.. వీటిల్లో 19 హోటళ్లు, 2 లగ్జరీ బోట్స్ రానున్నట్టు కంపెనీ తెలిపింది. ఇందులో ఎనిమిది సొంతంగా నిర్వహించనున్నట్టు.. 13 ప్రాపర్టీలు ఒబెరాయ్ గ్రూప్ నిర్వహించనున్నట్టు వెల్లడించింది. ప్రతీ షేరుకు రూ.1.5 చొప్పున తుది డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.

బీఎస్ఈలో కంపెనీ షేరు రెండు శాతానికి పైగా నష్టంతో రూ.371 వద్ద ముగిసింది.

పీఎఫ్‌సీ లాభం ప్లస్

క్యూ4లో రూ. 8,358 కోట్లు

- షేరుకి రూ. 2.05 డివిడెండ్



ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 11 శాతం వృద్ధితో రూ. 8,358 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 7,556 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 2.05 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు జూన్ 13 రికార్డ్ డేట్‌కాగా.. సంక్షోభంలో చిక్కుకున్న జెన్సోల్ ఇంజినీరింగ్ ఖాతాపై రూ. 263 కోట్ల పూర్తి ప్రొవిజన్‌ను చేపట్టినట్లు కంపెనీ చైర్మన్, ఎండీ పర్మీందర్ చోప్రా పేర్కొన్నారు. క్యూ4లో మొత్తం ఆదాయం సైతం రూ. 24,176 కోట్ల నుంచి రూ. 29,285 కోట్లకు జంప్‌చేసింది. నికర వడ్డీ ఆదాయం 38 శాతం జంప్‌చేసి రూ. 12,092 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 3.46 శాతం నుంచి 3.64 శాతానికి మెరుగుపడ్డాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి పీఎఫ్‌సీ నికర లాభం రూ. 26,461 కోట్ల నుంచి రూ. 30,514 కోట్లకు బలపడింది. మొత్తం ఆదాయం రూ. 91,175 కోట్ల నుంచి రూ. 1,06,599 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో పీఎఫ్‌సీ షేరు బీఎస్ఈలో 1.5 శాతం బలపడి రూ. 413 వద్ద ముగిసింది.

ఎన్‌హెచ్‌పీసీ లాభం జూమ్

క్యూ4లో రూ. 920 కోట్లు

- షేరుకి రూ. 0.51 డివిడెండ్



ముంబై: ప్రభుత్వ రంగ జల విద్యుత్ దిగ్గజం ఎన్‌హెచ్‌పీసీ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 52 శాతం జంప్‌చేసి రూ. 920 కోట్లకు చేరింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 605 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 0.51 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. క్యూ4లో మొత్తం ఆదాయం సైతం రూ. 2,320 కోట్ల నుంచి రూ. 2,672 కోట్లకు ఎగసింది. పూర్తి ఏడాదికి మాత్రం ఎన్‌హెచ్‌పీసీ నికర లాభం రూ. 3,412 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్ఈలో 1.2 శాతం బలపడి రూ. 88 వద్ద ముగిసింది.

నాల్కో లాభం రెట్టింపు

క్యూ4లో రూ. 2,067 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ మెటల్ దిగ్గజం నేషనల్ అల్యూమినియం కంపెనీ(నాల్కో) గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 2,067 కోట్లను అధిగమించింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 997 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,579 కోట్ల నుంచి రూ. 5,268 కోట్లకు జంప్ చేసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నాల్కో నికర లాభం రూ. 1,988 కోట్ల నుంచి రూ. 5,268 కోట్లకు దూసుకెళ్లింది. మొత్తం ఆదాయం రూ. 13,149 కోట్ల నుంచి రూ. 16,788 కోట్లకు బలపడింది. వెరసి కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయం, లాభాలను ఆర్జించింది. ఇందుకు అల్యూమినియం, అల్యూమినా ధరలు పుంజుకోవడం, కార్యకలాపాల క్రమబద్ధీకరణ, మెరుగుపడిన సామర్థ్యం, ప్రాజెక్టుల విస్తరణ తోడ్పాటునిచ్చినట్లు నాల్కో వివరించింది. అన్ని బిజినెస్ యూనిట్ల ఆదాయం, లాభదాయకత మెరుగుపడినట్లు పేర్కొంది. గతేడాది సాధించిన 76.48 లక్షల టన్నుల బాక్సైట్ తవ్వకాలకుతోడు, 4.55 లక్షల టన్నుల దేశీ విక్రయాలు కంపెనీ చరిత్రలోనే అత్యధికమని వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో నాల్కో షేరు బీఎస్ఈలో 1.3 శాతం బలపడి రూ. 182 వద్ద ముగిసింది.



టాప్-2లో నిలవాలని...

- నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో గుజరాత్ టైటాన్స్ మ్యాచ్
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

అహ్మదాబాద్: ఇప్పటికే 'ప్లే ఆఫ్స్' చేరుకున్న గుజరాత్ టైటాన్స్ జట్టు... ఇక పాయింట్ల పట్టికలో అగ్రస్థానంపై దృష్టి పెట్టింది. ఐపీఎల్ 18వ సీజన్‌లో ఆడిన 12 మ్యాచ్‌ల్లో 9 విజయాలు, 3 పరాజయాలతో 18 పాయింట్లు ఖాతాలో వేసుకొని 'ప్లే ఆఫ్స్' బెర్త్ దక్కించుకున్న మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ నేడు లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ)తో తలపడనుంది. 2022, 2023లలో ఫైనల్‌కు చేరిన గుజరాత్ టైటాన్స్... ఈసారి కూడా నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిస్తే ఫైనల్‌కు చేరేందుకు అదనంగా మరో అవకాశం ఉండటంతో... ప్రస్తుతానికి టైటాన్స్ దానిపైనే దృష్టి పెట్టింది. మరోవైపు ఇప్పటికే 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి నిష్క్రమించిన లక్నో సూపర్ జెయింట్స్ చివర్లో అయినా మెరిపించాలని భావిస్తోంది. ఈ సీజన్‌లో టైటాన్స్ ఓడిన మూడు మ్యాచ్‌ల్లో ఒకటి లక్నో చేతిలో ఉండటంతో దానికి సొంతగడ్డపై బదులు తీర్చుకోవాలని కూడా చూస్తోంది. గుజరాత్ జట్టు 'హ్యాట్రిక్' విజయాలతో జోరు మీదుంటే... లక్నో జట్టు గత నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. మరి టైటాన్స్ అదే ఊపుతో మరింత ముందుకు దూసుకెళ్తుందా లేక... లక్నో పరాజయాల బాట వీడుతుందా చూడాలి!

ముగ్గురు మొనగాళ్లు...

ఈ సీజన్‌లో టైటాన్స్ ఆధిపత్యానికి ప్రధాన కారణం... టాప్-3 ఆటగాళ్లే. కెప్టెన్ శుబ్‌మన్ గిల్, ఓపెనర్ సాయి సుదర్శన్, ఇంగ్లండ్ స్టార్ జోస్ బట్లర్ కలిసికట్టుగా కదంతొక్కడంతోనే గుజరాత్ జట్టు వరుస విజయాలు సాధించగలిగింది. సాయి సుదర్శన్ 56.09 సగటుతో 617 పరుగులు చేయగా... గిల్ 60.10 సగటుతో 601 పరుగులు సాధించాడు. బట్లర్ 500 పరుగులు చేశాడు. ఈ ముగ్గురు జట్టు భారాన్ని మోస్తూ మెరుగైన ఆరంభాలు అందిస్తుండటంతో... టైటాన్స్ భారీ స్కోర్లు చేయగలుగుతోంది. ఈ త్రయం 16 హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ చేసిందంటే వీరి ఆధిపత్యం ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఈ ముగ్గురితో పాటు రూథర్‌ఫోర్డ్, షారుక్ ఖాన్, రాహుల్ తెవాటియా రూపంలో మిడిలార్డర్ బలంగా ఉండగా... బౌలింగ్‌లో కూడా మంచి ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాదీ పేసర్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, రబడ, రషీద్ ఖాన్, సాయి కిషోర్ రూపంలో బౌలింగ్ దళం మెరుగ్గా ఉంది. అయితే గుజరాత్ బలం, బలహీనత రెండు టాపార్డరే కావడం గమనార్హం. టాప్-3 ఆటగాళ్లు విఫలమైతే మిడిలార్డర్‌లో సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడేవాళ్లు కనిపించడం లేదు. లక్నోతో లీగ్ మ్యాచ్‌లో ఇది నిరూపితమైంది. 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 120 పరుగులు చేసిన టైటాన్స్... గిల్, సుదర్శన్, బట్లర్ అవుటైన తర్వాత 180/6కే పరిమితమైంది. ఈ నేపథ్యంలో కీలక ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకు ముందు మిడిలార్డర్‌ను పరీక్షించుకోవాల్సిన అవసరముంది. సీజన్‌లో అన్నీ మ్యాచ్‌లు ఆడిన ప్రధాన పేసర్లు సిరాజ్, ప్రసిధ్ కృష్ణకు ఈ మ్యాచ్‌లో విశ్రాంతినిచ్చే అవకాశాలు కూడా ఫ్రాంచైజీ పరిశీలిస్తోంది.

తుది జట్లు (అంచనా)

గుజరాత్ టైటాన్స్: గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, బట్లర్, రూథర్‌ఫోర్డ్, షారుక్ ఖాన్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, రబడ, అర్షద్ ఖాన్, సాయి కిషోర్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ.

లక్నో సూపర్ జెయింట్స్: పంత్ (కెప్టెన్), మార్ష్, మార్క్‌రమ్, పూరన్, బదోని, అబ్దుల్ సమద్, శార్దుల్ ఠాకూర్, రవి బిష్ణోయ్, ఆకాశ్ దీప్, అవేశ్ ఖాన్, షాబాజ్ నదీమ్, రూర్కె.


తీవ్ర ఒత్తిడిలో పంత్



ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన రిషభ్ పంత్... సీజన్ చివరికి వచ్చేసరికి తీవ్ర ఒత్తిడిలో కనిపిస్తున్నాడు. అంచనాల భారాన్ని మోయలేకపోతున్న పంత్... అటు బ్యాటర్‌గా, ఇటు కెప్టెన్‌గా విఫలమవుతున్నాడు. మిచెల్ మార్ష్, మార్క్‌రమ్, నికోలస్ పూరన్ రూపంలో ముగ్గురు విదేశీ ఆటగాళ్లు మెరుగైన ప్రదర్శన చేస్తున్నా... జట్టు విజయాలు సాధించలేకపోవడానికి పంత్ ప్రదర్శనే ప్రధాన కారణం. బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేసుకున్నా... పంత్ ఆటతీరు మాత్రం మారడం లేదు. పట్టుమని పది నిమిషాలు కూడా క్రీజులో నిలవకుండానే పేలవ షాట్ ఆడి పెవిలియన్ చేరడం పరిపాటిగా మారింది. ఈ సీజన్‌లో 12 మ్యాచ్‌లాడిన పంత్ 12.27 సగటుతో 135 పరుగులే చేశాడు. గత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమితోనే 'ప్లే ఆఫ్స్' చేరే అవకాశాలు కోల్పోయిన ఎల్ఎస్‌జీ... ఇక మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి మెరుగైన స్థానంతో సీజన్‌ను ముగించాలని భావిస్తోంది. ఆయుశ్ బదోని, అబ్దుల్ సమద్ నిలకడలేమితో ఇబ్బంది పడుతుంటే... బౌలర్లను గాయాల బెడద వెంటాడుతోంది. ప్రధాన పేసర్లు గాయాల బారిన పడటంతో ప్రత్యామ్నాయాలు లేక మేనేజ్‌మెంట్ చిక్కులు ఎదుర్కొంటోంది. మయాంక్ యాదవ్ అందుబాటులో లేకపోగా... అవేశ్ ఖాన్, ఆకాశ్ దీప్ కూడా గాయాలతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు గత మ్యాచ్‌లో హద్దులు దాటినందుకు స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీపై నిషేధం పడింది. ఈ నేపథ్యంలో శార్దుల్ ఠాకూర్, రవి బిష్ణోయ్ కీలకం కానున్నారు.

ఫోన్ ఆన్ చేయగానే 500 మిస్స్‌డ్ కాల్స్

తన ఫాస్టెస్ట్ సెంచరీ ప్రశంసలపై వైభవ్ వ్యాఖ్య



ముంబై: ఈ ఐపీఎల్ సీజన్ నుంచి రాజస్తాన్ రాయల్స్ నిష్క్రమించి ఉండొచ్చు. కానీ ఒక కుర్రాడి ఆగమనం మాత్రం అద్వితీయంగా మలిచింది ఆ ఫ్రాంచైజీ! 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 18 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. టీమిండియా మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ ప్రస్తుతం రాజస్తాన్‌కు కోచింగ్ ఇవ్వడం... ముఖ్యంగా కుర్రాళ్లను సానబెట్టడంతో దిట్టయిన ద్రవిడ్ సూచనలు, హెచ్చరికలు వైభవ్‌పై మంచి ప్రభావమే చూపాయి. బ్యాటింగ్‌పైనే ధ్యాస పెట్టమని, ఎప్పుడైనా సరే చురుకుదనంతో అందుబాటులో ఉండాలనే హెచ్చరికలు తనను ఆటపైనే దృష్టి కేంద్రీకరించేలా చేశాయని స్వయంగా వైభవ్ చెప్పుకొచ్చాడు. గుజరాత్ టైటాన్స్‌పై 35 బంతుల్లో సెంచరీ చేసిన సందర్భంలో తన ఫోన్‌కు ఏకంగా 500 పైచిలుకు మిస్స్‌డ్ కాల్స్ వచ్చాయని చెప్పాడు. ద్రవిడ్ సూచనలతో ఆటపై ఫోకస్ చేసేందుకు ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేయగా సెంచరీ తర్వాత ప్రశంసించేందుకు అన్ని కాల్స్ వచ్చినట్లు వైభవ్ చెప్పాడు. 'మూణ్నాలుగు నెలలుగా నేను పడుతున్న కష్టానికి ఫలితం వచ్చింది. అదేపనిగా ప్రాక్టీస్‌లో నా బలహీనతల్ని అధిగమించడం వల్లే మ్యాచ్‌ల్లో ఆడటం సులువైంది. ముఖ్యంగా పరిస్థితులకు తగ్గట్లుగా ఆడటం ఎలాగో నేర్చుకున్నాను. జట్టు విజయానికి అవసరమైన బ్యాటింగ్ శైలిని అలవర్చుకున్నా. నా బలమేంటో నాకు తెలుసు. జట్టుకేం కావాలనేది అప్పటి పరిస్థితులకు తెలుసు. వీటిని దృష్టిలో ఉంచుకొని రాణించాలి' అని రాయల్స్ హెడ్‌కోచ్ ద్రవిడ్‌తో పాల్గొన్న వీడియోలో వైభవ్ చెప్పాడు. ఈ వీడియోను ఐపీఎల్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా టీనేజ్ సంచలనాన్ని అభినందించిన ద్రవిడ్ అసలైన సవాళ్లు ముందున్నాయని అతనికి గుర్తు చేశాడు. ఈ సీజన్‌లో 7 మ్యాచ్‌లాడిన సూర్యవంశీ 252 పరుగులు సాధించాడు. 206.56 స్ట్రయిక్ రేట్‌తో 36 సగటును నమోదు చేశాడు.



కనక్‌కు కనకం

న్యూఢిల్లీ: జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత జట్టు పసిడి బోణీ కొట్టింది. జర్మనీ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో హరియాణాకు చెందిన యువ షూటర్ కనక్ స్వర్ణ పతకంతో మెరిసింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో బుధవారం 17 ఏళ్ల కనక్ 239 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 8 మంది షూటర్లు పాల్గొన్న 24 షాట్ల తుదిపోరులో కనక్ తన గురితో అదరగొట్టింది. 'ఆరంభంలో కాస్త ఒత్తిడికి లోనయ్యా. కానీ ఆ తర్వాత మెరుగైన ప్రదర్శన చేయడం ఆనందంగా ఉంది.' అని కనక్ వెల్లడించింది. మాల్దోవాకు చెందిన అన్నా డుల్స్ 1.7 పాయింట్ల తేడాతో రెండో స్థానంలో నిలిచి రజతం దక్కించుకోగా... చెన్ యెన్ చింగ్ (చైనీస్ తైపీ) కాంస్యం గెలుచుకుంది. అంతకుముందు జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత్ నుంచి ఇద్దరు షూటర్లు ఫైనల్‌కు అర్హత సాధించారు. కనక్ 571 పాయింట్లతో, ప్రాచి 572 పాయింట్లతో తుదిపోరుకు చేరారు.

వెస్టిండీస్‌కు ఐర్లాండ్ షాక్

డబ్లిన్: వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఐర్లాండ్ బోణీ కొట్టింది. బుధవారం జరిగిన తొలి పోరులో ఐర్లాండ్ 124 పరుగుల తేడాతో విండీస్‌పై ఘనవిజయం సాధించింది. మొదట ఐర్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 303 పరుగులు చేసింది. ఆండీ బాల్‌బిర్నీ (138 బంతుల్లో 112; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ (54; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), టెక్టర్ (56; 6 ఫోర్లు) అర్ధశతకాలు బాదారు. విండీస్ బౌలర్లలో మాథ్యూ ఫోర్డ్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో వెస్టిండీస్ 34.1 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. రోస్టన్ చేజ్ (55; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో మెక్‌కార్తీ 4 వికెట్లు తీశాడు. సెంచరీ హీరో బాల్‌బిర్నీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం రెండో వన్డే జరగనుంది. ఓవరాల్‌గా వెస్టిండీస్‌పై ఐర్లాండ్‌కిది నాలుగో విజయం.


బాల్‌బిర్నీ

ప్రొఫెషనల్‌గా సిమ్రన్‌జీత్ కౌర్

న్యూఢిల్లీ: భారత మహిళా బాక్సర్ సిమ్రన్‌జీత్ కౌర్ ప్రొఫెషనల్‌గా మారనుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన 29 ఏళ్ల సిమ్రన్‌జీత్ కౌర్... అమెరికా మాజీ బాక్సర్ రాయ్ జోన్స్, భారత బాక్సర్ మన్‌దీప్ జాంగ్రాతో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఏడాది భారత్ నుంచి నిశాంత్ దేవ్, అమిత్ పంఘాల్ ప్రొఫెషనల్‌గా మారగా... ఇప్పుడు ఆ జాబితాలో సిమ్రన్‌జీత్ కూడా చేరింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన సిమ్రన్‌జీత్... ఆసియా చాంపియన్‌షిప్స్‌లో పలు పతకాలు నెగ్గింది. ఈ ఏడాది జాతీయ చాంపియన్‌షిప్ 65 కేజీల విభాగంలో రెండో స్థానంలో నిలిచిన కౌర్... అమెచ్యూర్ బాక్సింగ్ నుంచి ప్రొఫెషనల్‌గా మారాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. 'ప్రొఫెషనల్ కెరీర్ ప్రారంభించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. మన్‌దీప్ జాంగ్రా ఇప్పటికే దేశం గర్వపడే విజయాలు సాధించారు. అతడి బాటలోనే నడుస్తూ మెరుగైన ఫలితాలు సాధించేందుకు నావంతు ప్రయత్నం చేస్తా. ఈ ప్రయాణంలో రాయ్ జోన్స్ సహకారం మరవలేను' అని సిమ్రన్‌జీత్ పేర్కొంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన భారత బాక్సర్ విజేందర్ సింగ్... దేశం నుంచి తొలి ప్రొఫెషనల్ బాక్సర్‌గా మారగా... ఆ తర్వాత వికాస్ కృషన్, సరితా దేవి, నీరజ్ గోయత్ వంటి పలువురు బాక్సర్లు ప్రొఫెషనల్స్‌గా మారారు.



ఇంగ్లండ్ 'ఎ' జట్టులో ఫ్లింటాఫ్ తనయుడు రాకీ

లండన్: ఇంగ్లండ్ మాజీ ఆల్‌రౌండర్ ఆండ్రూ ఫ్లింటాఫ్ కుమారుడు రాకీ ఫ్లింటాఫ్ ఇంగ్లండ్ 'ఎ' జట్టుకు ఎంపికయ్యాడు. భారత్ 'ఎ'తో జరిగే 2 నాలుగు రోజుల మ్యాచ్‌ల కోసం ఇంగ్లండ్ లయన్స్ జట్టును బుధవారం ప్రకటించారు. రాకీ ఇంగ్లండ్ 'ఎ' జట్టుకు ఎంపికవడం ఇది తొలిసారేం కాదు. ఫ్లింటాఫ్‌లాగే పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అయిన 17 ఏళ్ల రాకీ ఈ ఏడాది ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన ఐదు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల సిరీస్‌లోనూ బరిలోకి దిగాడు. అక్కడ లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగిన రాకీ సెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో మళ్లీ అతన్ని జట్టులోకి తీసుకున్నారు. వచ్చే నెలలో టీమిండియాతో ఐదు టెస్టుల సిరీస్‌కు ముందు భారత్, ఇంగ్లండ్ 'ఎ' జట్ల మధ్య 2 నాలుగు రోజుల మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ నెల 30 నుంచి కాంటర్‌బరిలో తొలి మ్యాచ్, జూన్ 6 నుంచి నార్తంప్టన్‌లో రెండో మ్యాచ్ జరుగుతుంది.



22 ఏళ్ల తర్వాత...

- ఇంగ్లండ్‌తో జింబాబ్వే టెస్టు
- ఇరు జట్ల మధ్య నాలుగు రోజులు కొనసాగనున్న మ్యాచ్

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్‌కు ఇక ఈ ఏడాదంతా బిజీ షెడ్యూల్ వుంది. మేటి జట్లతో కీలకమైన ద్వైపాక్షిక సిరీస్‌లలో తలపడాల్సి ఉంది. అలాంటి ఇంగ్లండ్ జట్టు తమ సొంతగడ్డపై జింబాబ్వే లాంటి కూనతో నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌కు సిద్ధమైంది. 22 ఏళ్ల తర్వాత జింబాబ్వేతో జరుగుతున్న ఈ ఏకైక టెస్టును ఆతిథ్య జట్టు గెలుపోటములతో సంబంధం లేకుండా నూటికి నూరు శాతం సన్నాహక మ్యాచ్‌గా సద్వినియోగం చేసుకోవాలని భావిస్తోంది. ఎందుకంటే వచ్చే నెలలోనే ఇక్కడ పర్యటించేందుకు భారత్ వస్తోంది. అనంతరం ఈ సీజన్‌లోనే ఆస్ట్రేలియా గడ్డపై ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ ఆడేందుకు ఇంగ్లండ్ వెళ్లనుంది. ఇవన్నీ కూడా ఐదేసి మ్యాచ్‌ల పూర్తిస్థాయి సిరీస్‌లు. ఈ 10 టెస్టులకు ముందు ఇంగ్లండ్ ఓ క్రికెట్ కూనపై నాలుగు రోజులు ప్రతాపం చూపనుంది. టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగం కానీ ఈ టెస్టు మ్యాచ్‌కు ఇంగ్లండ్ ఇచ్చే ప్రాధాన్యత అంతా తదుపరి సన్నద్ధం కోసమేనని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. గురువారం నుంచి జరిగే ఈ సంప్రదాయ పోరులో జింబాబ్వే ఏ మేరకు పోటీనిస్తుందో చూడాలి. 18 ఏళ్ల క్రితం కేప్‌టౌన్‌లో టి20 ప్రపంచకప్ ఆడినప్పటికీ అసలైన టెస్టు మ్యాచ్‌ను జింబాబ్వే చివరిసారిగా 2003లో ఆడింది. ఆ సిరీస్‌లోనే 20 ఏళ్ల అండర్సన్ పేస్ బౌలర్‌గా అరంగేట్రం చేశాడు. ఇన్నేళ్లలో ఓ వెలుగువెలిగిన అండర్సన్ రిటైర్ కూడా అయ్యాడు. మరోవైపు జింబాబ్వే మాత్రం దేశంలోని రాజకీయ అస్థిరత, ఆర్థిక సంక్షోభం, క్రికెట్ బోర్డులో మితిమీరిన ప్రభుత్వ జోక్యం తదితర సమస్యలతో సతమతమైంది. ఆరేళ్ల పాటు పూర్తిగా టెస్టు క్రికెట్‌కు దూరమైంది. 2005 నుంచి 2011 అసలు సంప్రదాయ సమరమే లేకుండా గడిపిన జింబాబ్వే ఆ తర్వాత కూడా పూర్తిస్థాయి సిరీస్‌లను ఆడే అవకాశాన్ని కోల్పోయిందనే చెప్పాలి. 2022 నుంచి 2024 వరకు ఈ జట్టు కేవలం నాలుగంటే నాలుగు టెస్టులే ఆడిందంటే జింబాబ్వే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



→ జింబాబ్వే రెండోసారి నాలుగు రోజుల టెస్టు మ్యాచ్ ఆడనుంది. ఇంతకుముందు 2017లోనూ దక్షిణాఫ్రికాతో కూడా జింబాబ్వే నాలుగు రోజుల టెస్టు ఆడింది. → మరోవైపు ఇంగ్లండ్ కూడా రెండోసారి నాలుగు రోజుల టెస్టు ఆడబోతుంది. 2023లో ఐర్లాండ్‌తో ఇంగ్లండ్ తొలిసారి నాలుగు రోజుల టెస్టులో పోటీపడింది. ఈ రెండింటికంటే ముందు 1973లో న్యూజిలాండ్, పాకిస్తాన్ మధ్య మొదటిసారి నాలుగు రోజుల టెస్టు జరిగింది.

14 జింబాబ్వే జట్టు 1992 నుంచి ఇప్పటి వరకు మొత్తం 123 టెస్టులు ఆడింది. 14 టెస్టుల్లో విజయం సాధించి, 79 టెస్టుల్లో ఓడిపోయింది. 30 టెస్టులు 'డ్రా'గా ముగిశాయి.

3 ఇంగ్లండ్ జట్టుతో ఓవరాల్‌గా జింబాబ్వే 6 టెస్టులు ఆడింది. 3 టెస్టుల్లో ఓడిపోయి, 3 టెస్టులను 'డ్రా' చేసుకుంది.



షాహీన్, బాబర్ ఆజమ్, రిజ్వాన్

బాబర్ ఆజమ్, రిజ్వాన్, షాహీన్‌లకు మొండిచేయి

హసన్ అలీ, ఫఖర్ జమాన్‌లకు పిలుపు ● బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు పాక్ జట్టు ప్రకటన

ఇస్లామాబాద్: సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం పాకిస్తాన్ 16 మందితో కూడిన జట్టును ప్రకటించింది. సీనియర్ ప్లేయర్లు బాబర్ ఆజమ్, మొహమ్మద్ రిజ్వాన్‌లను పరిగణనలోకి తీసుకోని సెలెక్టర్లు... సీనియర్ పేసర్ హసన్ అలీని తిరిగి జట్టుకు ఎంపిక చేశారు. జింబాబ్వే, న్యూజిలాండ్‌లతో జరిగిన సిరీస్‌లకు జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన బాబర్, రిజ్వాన్... తాజాగా పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లోనూ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. దీంతో సెలెక్టర్లు వారితో పాటు మేటి పేసర్ షాహీన్ షా అఫ్రిదిని కూడా పక్కన పెట్టారు. పీఎస్ఎల్‌లో కరాచీ కింగ్స్ జట్టు తరఫున 15 వికెట్లు తీసిన హసన్ అలీ చాన్నాళ్ల తర్వాత తిరిగి జట్టులోకి వచ్చాడు. సల్మాన్ అలీ ఆఘా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుండగా... షాదాబ్ ఖాన్ వైస్ కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. మైక్ హెసన్ పాకిస్తాన్ పరిమిత ఓవర్ల కోచ్‌గా ఎంపికైన తర్వాత పాకిస్తాన్ ఆడనున్న తొలి సిరీస్ ఇదే. చివరిసారిగా న్యూజిలాండ్‌తో ఆడిన సిరీస్‌లో పాకిస్తాన్ 4-1తో పరాజయం పాలవడంతో... వచ్చే ఏడాది జరగనున్న టి20 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని సెలెక్టర్లు జట్టులో 8 మార్పులు చేశారు. లాహోర్ వేదికగా జరగనున్న ఈ సిరీస్‌కు సంబంధించిన షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదు.

పాకిస్తాన్ జట్టు: సల్మాన్ ఆఘా (కెప్టెన్), షాదాబ్ ఖాన్, అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, హారీస్ రవూఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, తలత్, ఖుష్‌దిల్ షా, మొహమ్మద్ హారీస్, వసీమ్, ఇర్ఫాన్ ఖాన్, నసీమ్ షా, ఫర్హాన్, అయూబ్.

ఆర్చర్‌కు గాయం విండీస్ సిరీస్‌కు దూరం



లండన్: ఇంగ్లండ్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ జోఫ్రా ఆర్చర్ గాయంతో వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. 29న ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే తొలి వన్డేతో మూడు మ్యాచ్‌ల సిరీస్ మొదలవుతుంది. ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆర్చర్‌కు కుడిచేతి బొటనవేలికి గాయమైంది. లీగ్ వారం వాయిదా పడగానే స్వదేశానికి చేరుకున్న అతను తిరిగి ఐపీఎల్ పునఃప్రారంభమైనప్పటికీ గాయం కారణంగానే భారత్‌కు రాలేకపోయాడు. గాయపడిన అతని పరిస్థితిని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) వైద్య బృందం పర్యవేక్షిస్తోందని, రెండు వారాల తర్వాత మరోసారి గాయం తీవ్రతను సమీక్షిస్తుందని బోర్డు వర్గాలు తెలిపాయి. అయితే ఆర్చర్‌కు గాయమవడం... జట్టుకు దూరమవడం ఇదేం కొత్త కాదు. సుదీర్ఘకాలంగా అతను మోచేతి గాయంతో సతమతమయ్యాడు. పలుమార్లు సర్జరీలు కూడా జరిగాయి. తర్వాత వెన్నెముక గాయంతో చాన్నాళ్ల పాటు క్రికెట్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఎట్టకేలకు గతేడాది అమెరికా, కరీబియన్‌లు ఆతిథ్యమిచ్చిన టి20 ప్రపంచకప్‌తో పునరాగమనం చేశాడు. ఈ ఏడాది పాక్‌లో జరిగిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఆడాడు. అతని స్థానంలో లాంకషైర్‌కు చెందిన లెఫ్టార్మ్ సీమర్ ల్యూక్ వుడ్‌ను జట్టులోకి తీసుకున్నారు. ఇదివరకే టి20 జట్టుకు ఎంపికైన వుడ్‌కు ఇప్పుడు వన్డే జట్టులోనూ స్థానం దక్కింది. 2022-23 సీజన్‌లో రెండు వన్డేలాడిన ల్యూక్ వుడ్ ఒక వికెట్ కూడా పడగొట్టలేకపోయాడు.

సాక్షి ప్లస్
గురువారం। 22-5-2025

ఐదు రోజుల్లోపే అధిరోహణ

బ్రిటిష్ బృందం కొత్త రికార్డు

ఎవరెస్టుపైకి యమా స్పీడుగా

కఠ్మాండు: బ్రిటన్‌కు చెందిన నలుగురు పర్వతారోహకుల బృందం సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ప్రపంచంలోకెల్లా ఎత్తైన ఆ శిఖరాన్ని ఎలాంటి ముందస్తు సన్నద్ధతా లేకుండా ఐదంటే ఐదు రోజుల్లోపే అధిరోహించి అబ్బురపరిచింది. 8,849 మీటర్ల ఎత్తులో ఉండే ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలంటే నేపాల్‌లోని బేస్ క్యాంప్ వద్ద కనీసం కొద్ది నెలల పాటు శారీరకంగా, మానసికంగా సన్నద్ధమవడం తప్పనిసరి. బ్రిటిష్ బృందం మాత్రం అలాంటిదేమీ లేకుండానే పని కానిచ్చేసింది. మే 16న లండన్ నుంచి బయల్దేరి కఠ్మాండు చేరింది. అదే రోజు మధ్యాహ్నం ఎవరెస్టు బేస్ క్యాంపు చేరుకుని నేరుగా అధిరోహణ మొదలు పెట్టేసింది. బుధవారం ఉదయానికల్లా విజయవంతంగా శిఖరాగ్రం చేరింది. ఈ మొత్తానికీ పట్టింది కేవలం 4 రోజుల 18 గంటలు మాత్రమే. ఈ బృందంలోని నలుగురూ స్పెషల్ ఫోర్సెస్‌లో సైనికులుగా పని చేసి రిటైరైనవాళ్లే కావడం విశేషం. పైగా వారిలో ఒకరు మాజీ మంత్రి కూడా. వారంతా మూడు నెలలపాటు బ్రిటన్‌లోనే పక్కా ప్రణాళికతో సన్నద్ధమయ్యారు. అందుకోసం ఎవరెస్టు ఆరోహణ క్రమంలో ఎదరయ్యే పరిస్థితులన్నింటినీ లండన్‌లోనే కృత్రిమంగా సృష్టించుకున్నారు. హైపోక్సియా టెంట్లు, జెనాన్ వాయువు, ఇతర సాంకేతికతను ఉపయోగించుకున్నారు.



ఏమిటీ టెంట్లు?

సాధారణంగా పైకి వెళ్తున్న కొద్దీ వాతావరణం పలుచబడుతూ వస్తుంది. దాంతోపాటే ఆక్సిజన్ స్థాయి కూడా తగ్గిపోతుంటుంది. 8 కి.మీ. ఎగువన భూ ఉపరితలంతో పోలిస్తే కేవలం మూడో వంతు ఆక్సిజనే అందుబాటులో ఉంటుంది. దాంతో శ్వాసించడం కష్టతరంగా మారుతుంది. అది ఎన్నో ఇతర సమస్యలకూ దారితీస్తుంది. ఎవరెస్టు ఎత్తేమో ఏకంగా 8.8 కి.మీ. పై చిలుకు. అందుకే పర్వతారోహకులు దాన్ని ముద్దుగా డెత్ జోన్ అని పిలుచుకుంటారు. ఎంతటి కొమ్ములు తిరిగిన పర్వతారోహకులైనా అక్కడి అత్యంత ప్రతికూల పరిస్థితులకు ముందుగానే సన్నద్ధం కావాల్సి ఉంటుంది. అందుకోసం కఠ్మాండులోనో, ఎవరెస్టు బేస్ క్యాంప్ వద్దో కనీసం ఆరు నుంచి ఎనిమిది వారాలైనా గడపడం తప్పనిసరి. సన్నద్ధతలో భాగంగా బేస్ నుంచి ఎవరెస్టుపైకి వెళ్లే దారిలోని ఎగువ క్యాంపులకు ప్రాక్టీస్ రన్ తదితరాలు చేపడతారు. అంతా ఓకే అనుకున్నాకే శిఖరాగ్రానికి బయల్దేరతారు. అయితే బేస్ క్యాంప్ వద్ద ఎంతకాలం సన్నద్ధతలో గడపాలన్న దానిపై నేపాల్ ప్రభుత్వం ఎలాంటి నిబంధనలూ విధించలేదు. బ్రిటిష్ బృందం సభ్యులు తమ సన్నద్ధతలో భాగంగా లండన్‌లో ఆరు వారాల పాటు హైపోక్సియా టెంట్లలో నిద్రించారు. అనంతరం జర్మనీలో ఓ క్లినిక్‌లో రెండు వారాల పాటు జెనాన్ వాయువును పీలుస్తూ వచ్చారు. హైపోక్సియా టెంట్లలోని ప్రత్యేక జనరేటర్ ఆక్సిజన్‌ను పీల్చేస్తుంది. దాంతో టెంట్ల లోపల ఆక్సిజన్ స్థాయి మూడో వంతుకు తగ్గుతుంది. ''జెనాన్ వాయువు ఆల్టిట్యూడ్ సిక్‌నెస్‌ను అరికడుతుంది. అంతేగాక శరీరానికి సరిపడా ఆక్సిజన్ అందనప్పుడు ఏర్పడే హైపోక్సియా తరహా పరిస్థితిని ఎదుర్కొనేందుకు దోహదపడే ఎరిత్రోపొయిటెన్ అనే ప్రొటీన్ ఉత్పత్తిని పెంచుతుంది''అని ఈ యాత్రను ఆర్గనైజ్ చేసిన లూకాస్ ఫర్టెన్‌బాచ్ వివరించారు. నలుగురూ క్షేమంగా ఉన్నారని, శిఖరాగ్రం నుంచి కిందకు దిగడం మొదలు పెట్టారని చెప్పారు. ''ఈ కొత్త పద్ధతి వల్ల నేపాల్‌లో నెలల తరబడి గడపాల్సిన అవసరం తగ్గుతుంది. కనుక ఎవరెస్టు యాత్ర ఖర్చు కూడా భారీగా తగ్గుతుంది'' అన్నారు. అయితే జెనాన్ వాయువు వాడటం వంటివి మంచి పద్ధతులు కావని పర్వతారోహణ నిపుణులు అంటున్నారు. ''అది ఆక్సిజన్ కొరత ప్రభావాన్ని అడ్డుకుంటుందనేందుకు శాస్త్రీయ రుజువులేమీ లేవు. పైగా దాని వాడకం ప్రమాదకరం కూడా కావచ్చు''అని హెచ్చరిస్తున్నారు.

11 గంటల రికార్డు పదిలమే

అత్యంత వేగంగా ఎవరెస్టును అధిరోహించిన రికార్డును మాత్రం బ్రిటిష్ బృందం బద్దలు కొట్టలేకపోయింది. లాక్పా గెలు షెర్పా 2003లో బేస్ క్యాంప్ నుంచి మొదలుపెట్టి కేవలం 10 గంటల 58 నిమిషాల్లోనే ఎవరెస్టు శిఖరాగ్రం చేరారు. ఇప్పటిదాకా ఎవరూ దాని దరిదాపులకు కూడా రాలేకపోయారు.



ఎవరెస్ట్ శిఖరం పైకి ఎక్కాక తమ జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న నలుగురు బ్రిటన్ జాతీయులు

అశోక యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు బెయిల్

సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌పై వివాదాస్పద పోస్టు చేసిన అశోక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మదాబాద్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు.. ప్రొఫెసర్‌కు మొట్టికాయలు వేసింది. పోస్టును చౌకబారు ప్రచారం పొందే ప్రయత్నంగా అభివర్ణించింది. దర్యాప్తును నిలిపేయడానికి నిరాకరించింది. దర్యాప్తు జరిపేందుకు 24 గంటల్లో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆపరేషన్ సిందూర్‌పై అలీ ఖాన్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ సాయుధ దళాలను విమర్శించేదిగా ఉండటంతో మే 18న ఆయనను అరెస్టు చేశారు. హర్యానా కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. అయితే.. తనకు బెయిల్ మంజూరు చేయాలని, దర్యాప్తును వెంటనే నిలిపేయాలని అలీ ఖాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ప్రొఫెసర్ పోస్టు సైన్యాన్ని విమర్శించేదిగా, అగౌరవపరిచేదిగా ఉందని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. వాక్‌స్వాతంత్ర్యాన్ని అలీ ఖాన్ దుర్వినియోగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. హక్కుల గురించి మాట్లాడతారు సరే.. విధుల బాధ్యతేమిటని ప్రశ్నించింది. ఉగ్రవాదులు 26 మంది ప్రాణాలు తీసిన ఉద్వేగ సమయంలో ఇలాంటి వ్యాఖ్యలెలా చేస్తారని ప్రశ్నించింది. ప్రొఫెసర్ ఈ కేసుపై ఎలాంటి పోస్టులు, ప్రసంగాలు చేయకూడదని నిషేధించింది. తన పాస్‌పోర్టును అప్పగించాలని ఆదేశించింది.

మాజీ ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్‌కు బెయిల్

న్యూఢిల్లీ: మాజీ ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్‌కు ఉపశమనం కల్పిస్తూ సుప్రీంకోర్టు బుధవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా 'ఆమె హంతకురాలు కాదు. ఉగ్రవాది అంతకన్నా కాదు'అని వ్యాఖ్యానించింది. అయితే.. బెయిల్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన ఢిల్లీ పోలీసులు ఆమె దర్యాప్తునకు సహకరించడం లేదని పేర్కొన్నారు. అందుకు ధర్మాసనం 'ఆమె మాదక ద్రవ్యాల వ్యాపారి కాదు. దర్యాప్తునకు మీకోస వ్యవస్థ లేదా సాఫ్ట్‌వేర్ ఉండాలి. ఎలాగైనా దర్యాప్తు పూర్తి చేయండి. ఆమె ప్రతీదీ కోల్పోయింది. ఇప్పుడు ఎక్కడా ఉద్యోగం కూడా రాదు. ఢిల్లీ హైకోర్టే పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేసి ఉండాల్సింది'అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2022 సివిల్ సర్వీసెస్‌లో అర్హత సాధించడానికి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి, ఓబీసీ నాన్-క్రీమీలేయర్ కోటాను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై మాజీ ట్రైనీ ఐఏఎస్ ఆఫీసర్ పూజా ఖేడ్కర్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. దోషిగా తేలడంతో యూపీఎస్‌సీ ఆమె సెలక్షన్‌ను రద్దు చేసి, ప్రతిష్టాత్మక పరీక్షకు మళ్లీ హాజరు కాకుండా జీవిత కాలం నిషేధం విధించిన సంగతి తెలిసిందే.

బలూచిస్తాన్ స్కూల్ బస్సుపై ఆత్మాహుతి దాడి

ముగ్గురు పిల్లలు సహా ఆరుగురు మృతి

ఇస్లామాబాద్/కరాచీ: పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో బుధవారం ఒక స్కూల్ బస్సుపై జరిగిన ఆత్మాహుతి దాడిలో ముగ్గురు పిల్లలు సహా ఐదుగురు మరణించారు. 38 మంది గాయపడ్డారు. ఖుజ్దార్ జిల్లాలో పాఠశాల విద్యార్థులతో వెళ్తున్న బస్సును లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. మృతదేహాలను మరియు గాయపడిన వారిని కంబైన్డ్ మిలిటరీ ఆసుపత్రికి తరలించారు. ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ ఈ దాడిని ఖండించారు. అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ కూడా ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. మానవ హక్కుల ఉల్లంఘనగా పేర్కొన్న ఆయన బాధితుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. అయితే ఈ దాడికి ఇంకా ఏ సంస్థ బాధ్యత వహించలేదు.

భారత్ ప్రమేయముందని పాక్ ఆరోపణలు.. తోసిపుచ్చిన ఎంఈఏ..

అయితే, భారత్ ఈ దాడికి ప్రణాళిక వేసి, కుట్ర పన్నిందని ఆరోపిస్తూ పాక్ సైన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. అమాయక పిల్లలు, పౌరులు లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్‌లో ఉగ్రవాదాన్ని రెచ్చగొట్టడానికి భారత్ ఉగ్రవాద ప్రతినిధులను ఉపయోగిస్తోందని ఆరోపించింది. పాకిస్తాన్ ఆరోపణలను భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) తోసిపుచ్చింది. ఖుజ్దార్ ఘటనలో జరిగిన ప్రాణ నష్టానికి సంతాపం తెలిపిన ఎంఈఏ... భారత్ ప్రమేయం ఉందంటూ పాకిస్తాన్ చేసిన నిరాధారమైన ఆరోపణలను తిరస్కరించింది. ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా ఉన్న తన మీద ముద్రను మళ్లించడానికి, సొంత వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి భారత్‌ను నిందించడం పాక్‌కు అలవాటుగా మారిందని ఎంఈఏ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మండిపడ్డారు.

కర్ణాటక హోంమంత్రి కాలేజీలపై ఈడీ దాడులు

తుమకూరు: కర్ణాటక హోంమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత జి.పరమేశ్వర్‌కు చెందిన విద్యాసంస్థలపై బుధవారం ఉదయం ఈడీ దాడులు చేపట్టింది. తుమకూరు నగరంలో, బెంగళూరులో ఉన్న సిద్ధార్థ గ్రూప్ విద్యా సంస్థల్లో ఒకే సమయంలో ఈడీ సోదాలు నిర్వహించింది. హోంమంత్రి పరమేశ్వర్‌కు పలు మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. ఇటీవల బంగారం స్మగ్లింగ్‌లో పట్టుబడిన నటి రన్యా రావుతో ఆర్థిక లావాదేవీలు జరిగినందునే సోదాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విద్యాసంస్థల్లో 2019లోనూ ఈడీ తనిఖీలు నిర్వహించింది. మెడికల్ సీట్ల అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులతో ఆ సమయంలో ఈడీ సోదాలు చేసింది. తాజా దాడులు వాటికి కొనసాగింపేనన్న వాదనలూ ఉన్నాయి. ఈడీ దాడుల నేపథ్యంలో మంత్రి పరమేశ్వర్ బెంగళూరు నుంచి తుమకూరుకు చేరుకున్నారు. ఈడీ అధికారులతో మాట్లాడారు.

బీజేపీ ఎమ్మెల్యే కార్యాలయంలో గ్యాంగ్‌రేప్

మహిళ ఫిర్యాదు

యశవంతపుర: మాజీ మంత్రి, రాజరాజేశ్వరి నగర బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న అనుచరులు తనపై అత్యాచారం చేశారని ఓ మహిళ ఆర్ఎంసీ యార్డు పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. తాను బీజేపీ కార్యకర్తనని, మాట వినలేదని చెప్పి మునిరత్న తనపై వ్యభిచారం సహా పలు కేసులు పెట్టించి జైలుకు పంపాడని ఆమె ఆరోపించింది. 2023 జూన్‌లో కేసులు మాఫీ చేయిస్తానని ఎమ్మెల్యే అనుచరులు వసంత్, చెన్నకేశవ, కమల్ ఎమ్మెల్యే ఆఫీసుకు తీసుకెళ్లి అక్కడ అత్యాచారం చేశారని ఆమె ఆరోపించింది. ముఖంపై మూత్రం పోసి, ప్రమాదకరమైన జబ్బు వైరస్‌ను ఎక్కించారని పేర్కొంది. కాగా, మునిరత్నపై ఇదివరకే కాంట్రాక్టర్లకు బెదిరింపులు, హనీట్రాప్ తదితర కేసులు ఉన్నాయి. అరెస్టయి బెయిలుపై విడుదలయ్యారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ చేపట్టారు. అయితే తాజా ఆరోపణలపై ఎమ్మెల్యే స్పందించలేదు.

ఇండియన్ ట్రావెల్ ఏజెంట్లపై ఆంక్షలు!

మానవుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- అక్రమ వలసలను ప్రోత్సహిస్తే శిక్ష తప్పదు
- అమెరికా విదేశాంగ శాఖ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికాను మరోసారి గొప్పదేశంగా మారుస్తానంటూ అధికారంలోకి వచ్చిన డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఆయన నిర్ణయాలతో అమెరికాలో ఉంటున్న భారతీయుల బెంబేలెత్తిపోతున్నారు. ఎవరిని ఎప్పుడు వెళ్లగొడతారో తెలియక హడలిపోతున్నారు. అక్రమ వలసదారుల పేరిట 300 మంది భారతీయులను ఇటీవల అమెరికా నుంచి వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే. అమెరికాలోకి భారతీయులు అక్రమంగా అడుగుపెట్టడానికి ఇండియన్ ట్రావెల్ ఏజెంట్లే ధనదాహమే కారణమని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. అందుకే సదరు ట్రావెల్ ఏజెంట్లపై ఆంక్షలు విధించడానికి సిద్ధమవుతోంది. ''అమెరికాకు భారతీయులను అక్రమంగా పంపిస్తున్న ఏజెంట్లను గుర్తించే పనిలో మిషన్ ఇండియాకు సంబంధించిన కాన్సులర్ అఫైర్స్ అండ్ డిప్లొమాటిక్ సెక్యూరిటీ సర్వీసు సిబ్బంది నిమగ్నమయ్యారు. మానవ అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడం ఖాయం''అని అమెరికా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. అక్రమాలకు పాల్పడుతున్న ఇండియన్ ట్రావెల్ ఏజెన్సీల యజమానులు, ప్రతినిధులపై వీసా ఆంక్షలు విధించడానికి చర్యలు చేపట్టామని స్పష్టంచేసింది. ఉద్దేశపూర్వకంగా చట్టవిరుద్ధమైన వలసలను ప్రోత్సహిస్తే శిక్ష తప్పదని తేల్చిచెప్పింది. మనుషుల స్మగ్లింగ్ అనేది పెద్ద నేరమని వెల్లడించింది. అమెరికాకు రావాలనుకుంటే ముందు తమ ఇమ్మిగ్రేషన్ నిబంధనలు పూర్తిగా తెలుసుకోవాలని విదేశీయులకు సూచించింది. చట్టాలను ఉల్లంఘిస్తే తదుపరి చర్యలకు సిద్ధంగా ఉండాలని పేర్కొంది. అక్రమంగా వలస వచ్చిన వారికే కాకుండా.. అలా రావడానికి సహకరించిన వారికి కూడా శిక్షలు ఉంటాయని ఉద్ఘాటించింది.

హెచ్-1బీ వీసాలు రద్దు చేయాలి

మరోవైపు హెచ్-1బీ వీసాలపై అమెరికాలోని అతివాదుల దృష్టి పడినట్లు తెలుస్తోంది. ఇలాంటి వీసాలను ఎందుకు రద్దు చేయకూడదని అధికార డెమొక్రటిక్ పార్టీ మద్దతుదారు లారా ఎలిజబెత్ లూమర్ ప్రశ్నించారు. చట్టపరమైన ఈ తాత్కాలిక వర్క్ వీసాలతో భారతీయులు ప్రయోజనం పొందుతున్న సంగతి తెలిసిందే. హెచ్-1బీ వీసాలను రద్దు చేయాలంటూ ట్రంప్ మద్దతుదారులు డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో తమ వాదనలు వినిపిస్తున్నారు. ''అక్రమ వలసదారులను బయటకు పంపిస్తున్నాం, బాగానే ఉంది.. మరి హెచ్-1బీ వీసాదారుల సంగతేమిటి?''అని లారా ఎలిజబెత్ లూమర్ తాజాగా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ''హెచ్-1బీ వీసాల కుంభకోణాన్ని ట్రంప్ ప్రభుత్వం అడ్డుకోకపోతే కోట్లాది మంది అమెరికన్లకు అసంతృప్తే మిగులుంది''అని మరో పౌరుడు పోస్టు చేశాడు. గత 30 ఏళ్లుగా కుంభకోణం జరుగుతోందని ఆరోపించాడు. టెక్నాలజీ కంపెనీలు ఈ స్కామ్‌ను అడ్డం పెట్టుకొని వందల కోట్ల డాలర్లు ఆర్జించాయని విమర్శించాడు. అవే కంపెనీలు 2020లో ట్రంప్‌ను ఓడించాయని చెప్పాడు. అమెరికన్ల ప్రయోజనాలను పణంగా పెట్టి టెక్ కంపెనీలకు ట్రంప్ చీఫ్ లేబర్‌ను కానుకగా ఇస్తున్నాడని మండిపడ్డాడు. విదేశీయులను బయటకు వెళ్లగొట్టి, ఉద్యోగాలన్నీ అమెరికన్లకే ఇవ్వాలని మరో వ్యక్తి డిమాండ్ చేశాడు. మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) గ్రాడ్యుయేట్లతో ఈ పని ప్రారంభించాలని చెప్పాడు. అమెరికాను అమ్మకానికి పెట్టొద్దని ట్రంప్ ప్రభుత్వాన్ని కోరాడు.

సెలవుల్లో పని చేయడానికి లాయర్లు ఇష్టపడడం లేదు

పెండింగ్ కేసులపై కోర్టులు నిందలు పడాల్సి వస్తోంది

సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఆవేదన

న్యూఢిల్లీ: సెలవు రోజుల్లో పని చేయడానికి న్యాయవాదులు ఇష్టపడడం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. మరోవైపు పెండింగ్ కేసులు పరిష్కరించడం లేదంటూ న్యాయ వ్యవస్థపై విమర్శలు వస్తున్నాయని పేర్కొంది. తమ పిటిషన్‌పై విచారణను వేసవి సెలవుల తర్వాత ప్రారంభించాలని కోరిన ఓ న్యాయవాది పట్ల ధర్మాసనం బుధవారం అసంతృప్తి వ్యక్తంచేసింది. సుప్రీంకోర్టులో మొదటి ఐదుగురు న్యాయమూర్తులు వేసవి సెలవుల్లోనూ విధులు నిర్వర్తిస్తారని తెలియజేసింది. అయినప్పటికీ బ్యాక్‌లాగ్ కేసుల విషయంలో తమపై నిందలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తంచేసింది. వాస్తవానికి వేసవి సెలవుల్లో పని చేయడం లాయర్లకు ఎంతమాత్రం ఇష్టం లేదని ఆక్షేపించింది. సుప్రీంకోర్టుకు ఈ నెల 26 నుంచి జూలై 13 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. ఈ మేరకు న్యాయస్థానం నోటిఫికేషన్ జారీ చేసింది. సెలవుల సమయంలోనూ ధర్మాసనాలు పాక్షికంగా పని చేయాలని సూచించింది. రెండు నుంచి ఐదు వెకేషన్ బెంచ్‌లు పని చేయాలని నిర్దేశించింది. సీజేఐ సహా ఐదుగురు న్యాయమూర్తులు విధులకు హాజరవుతారు. గతంలో వేసవి సెలవుల్లో కేవలం రెండు వెకేషన్ బెంచ్‌లు పనిచేసేవి. సీనియర్ న్యాయమూర్తులు విధులు నిర్వర్తించాలన్న నిబంధన ఉండేది కాదు. కానీ, ఈ నిబంధనల్లో సుప్రీంకోర్టు తాజాగా మార్పులు చేసింది. ఈ నెల 26 నుంచి ఐదు ధర్మాసనాలకు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ బి.బి.నాగరత్న నేతృత్వం వహిస్తారు. అలాగే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా తెరిచి ఉంటుంది.

గాజాలో ఇజ్రాయెల్ దాడులు.. 82 మంది మృతి

డెయిర్ అల్ బాలాహ్(గాజా స్ట్రిప్): అంతర్జాతీయంగా ఆగ్రహం పెల్లుబుకినప్పటికీ గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగాయి. బుధవారం ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 82 మంది మరణించారు. మృతుల్లో అధికంగా మహిళలున్నారు. ఒక వారం వయసున్న శిశువు కూడా చనిపోయినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మంగళవారం నుంచి గాజాలోకి మానవతా సాయాన్ని అనుమతించినప్పటికీ.. సహాయం ఇంకా అవసరమైన పాలస్తీనియన్లకు చేరుకోలేదు. సహాయం గాజాలోకి ప్రవేశించినప్పటికీ, సహాయక సిబ్బంది దానిని పంపిణీ కేంద్రాలకు తీసుకురాలేకపోయారని, ఇజ్రాయెల్ సైన్యం వారిని ప్రత్యేక ట్రక్కులలోకి సామాగ్రిని రీలోడ్ చేయమని బలవంతం చేయడంతోనే సమయం మించిపోయిందని ఐక్యరాజ్యసమితి ప్రతినిధి స్టెఫాన్ డుజారిక్ తెలిపారు. గాజాకు మానవతా సహాయాన్ని పర్యవేక్షించే ఇజ్రాయెల్ రక్షణ సంస్థ మాత్రం బుధవారం ఉదయం ట్రక్కులు గాజాలోకి ప్రవేశించాయని, పంపిణీ గాజావ్యాప్తంగా కొనసాగుతుందా లేదా అనేది అస్పష్టంగా ఉందని తెలిపింది. గాజాలోకి సహాయాన్ని అనుమతించాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న కొందరు ఇజ్రాయెల్ కార్యకర్తలు బుధవారం ఉదయం సహాయాన్ని తీసుకువెళుతున్న ట్రక్కులను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఇజ్రాయెల్ పోలీసులు వారిని వెనక్కి నెట్టారు.

కన్జ్యూమర్ ఫోరమ్‌కు శాశ్వత 'వ్యవస్థ'ను ఏర్పాటుచేయండి

కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారమే పరమావధిగా వినియోగదారుల ఫోరమ్‌లలో శాశ్వత నియామకాలపై దృష్టిసారించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. వీలైనంతవరకు సిట్టింగ్ జడ్జీలతో వినియోగదారుల ఫోరమ్‌ను కొలువుతీర్చడం, ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బంది ఎంపిక తదితరాల్లో ఖచ్చితమైన నియమనిబంధనలను రూపొందించడం వంటి త్వరితగతిన పూర్తిచేయండి. నిర్ణీత పదవీకాలంఉండేలా చూడండి'' అని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌ల ధర్మాసనం బుధవారం కేంద్రప్రభుత్వానికి పలు సూచనలు చేసింది. ''శాశ్వత కన్జ్యూమర్ ఫోరమ్‌ను వినియోగదారుల ట్రిబ్యూనల్ లేదా వినియోగదారుల కోర్టుల తరహాలో నెలకొల్పండి. అధ్యక్షుడు, వేర్వేరు స్థాయిలో సభ్యులను నియమించండి. ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై మాకు నివేదికను ఈరోజు నుంచి మూడు నెలల్లోపు ఇవ్వండి'' అని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది.

ఆఫ్గన్ వరకు చైనా-పాక్ ఆర్థిక కారిడార్

బీజింగ్‌లో సమావేశమైన ముగ్గురు విదేశాంగ మంత్రులు

బీజింగ్/ఇస్లామాబాద్: చైనా-పాకిస్తాన్ ఆర్థిక కారిడార్‌ను అఫ్గనిస్తాన్‌వరకు విస్తరించనున్నారు. త్రైపాక్షిక సంబధాలను మరింత పెంపొందించుకునే ప్రయత్నాల్లో భాగంగా మూడు దేశాల విదేశాంగ మంత్రులు ఇందుకు అంగీకరించారు. ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్న పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, అఫ్గనిస్తాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకీలతో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి బీజింగ్‌లో సమావేశం అనంతరం.. ఆర్థిక కారిడార్‌ను విస్తరించాలని నిర్ణయించినట్లు పాకిస్తాన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో, ఈ ప్రాంతంలో స్థిరత్వం, అభివృద్ధిని పెంపొందించడానికి మూడు దేశాలు కట్టుబడి ఉన్నాయని పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 'పాకిస్తాన్, చైనా, అఫ్గనిస్తాన్‌లు ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, అభివృద్ధి కోసం కలిసి నిలుస్తాయి'అని ఇషాక్ దార్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ముగ్గురు నాయకులు కలిసి ఉన్న ఫోటోను జత చేశారు. అయితే... సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన చైనా విదేశాంగశాఖ ప్రతినిధి మావో నింగ్.. ఈ సమావేశాన్ని అనధికారికంగా అభివర్ణించారు. తమ సార్వభౌమత్వాన్ని, భద్రతను, జాతీయ గౌరవాన్ని కాపాడుకోవడంలో అఫ్గనిస్తాన్, పాకిస్తాన్‌లకు చైనా మద్దతిస్తుందని విదేశాంగ మంత్రి వాంగ్ హామీ ఇచ్చారని నింగ్ ఉటంకించారు. బెల్ట్ అండ్ రోడ్‌ను నిర్మించడానికి మూడు దేశాలు సహకారాన్ని మరింత పెంచుకోవాలని, చైనా-పాక్ ఆర్థిక కారిడార్‌ను అఫ్గన్‌కు విస్తరించడాన్ని ప్రోత్సహించాలని, ప్రాంతీయ ఇంటర్‌కనెక్షన్ నెట్‌వర్క్‌ల నిర్మాణాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. త్వరలో కాబూల్‌లో 6వ త్రైపాక్షిక సమావేశం జరుగుతుందని తెలిపారు.

అయితే.. చైనా-పాక్ ఆర్థిక కారిడార్ పాక్ ఆక్రమిత కశ్మీర్ గుండా వెళ్తుండటంతో భారత్ మొదటి నుంచీ దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. వేలాది మంది అఫ్గన్ శరణార్థులను పాకిస్తాన్ బలవంతంగా స్వదేశానికి పంపించడంపై ఇస్లామాబాద్, కాబూల్ మధ్య విభేదాల నేపథ్యంలో మూడు దేశాల విదేశాంగ మంత్రుల వరుస సమావేశాలు జరుగుతున్నాయి. అయితే కొంతకాలంగా ఈ యంత్రాంగం సమావేశమవలేదు. పహల్గాంలో ఉగ్రవాదుల దాడి, ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న తరువాత.. పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ మొదటి విదేశీ పర్యటన కావడం గమనార్హం.

మానస సరోవర్ యాత్రకు 750 మంది

న్యూఢిల్లీ: కైలాస మానస సరోవర్ యాత్ర కోసం 750 మంది యాత్రికులను ఎంపిక చేశారు. 4,024 మంది పురుషులు, 1,537 మంది మహిళలు.. మొత్తం 5,561 మంది యాత్రికులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ కంప్యూటరైజ్డ్ డ్రా ద్వారా యాత్రికలను ఎంపిక చేశారు. వీరిలో లిపులేఖ్ మార్గం ద్వారా 50 మంది యాత్రికుల చొప్పున ఐదు బ్యాచ్‌లలో, నాథు లా మార్గం ద్వారా 50 మంది యాత్రికుల చొప్పున 10 బ్యాచ్‌లలో ప్రయాణించనున్నారు. రెండు మార్గాలు ఇప్పుడు పూర్తిగా మోటారు వాహనాలు వెళ్లడానికి అనుకూలంగా ఉన్నాయని, ట్రెక్కింగ్ చాలా తక్కువగా ఉంటుందని మంత్రి కీర్తి వర్ధన్‌సింగ్ తెలిపారు. యాత్రికుల భద్రతను మరింత పటిష్టం చేశామని, ప్రక్రియను మరింత పారదర్శకంగా చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని వెల్లడించారు. యాత్రికులు తమ భద్రతను చూసుకుంటూనే.. పర్యావరణాన్ని కూడా కాపాడాలని పిలుపునిచ్చారు. కైలాస్ మానస సరోవర్ యాత్ర ఐదేళ్ల తరువాత పునఃప్రారంభమవుతోంది. జూన్ నుంచి ఆగస్టు వరకు జరగనుంది. చైనాలోని టిబెట్ ప్రాంతంలో ఉన్న కైలాస పర్వతం నుంచి మానస సరోవర్ సరస్సుకు తీర్థయాత్ర ఉంటుంది.

దేశంలో 72వేల ఈవీ చార్జింగ్ స్టేషన్లు

కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మరిన్ని ఈవీ చార్జింగ్ స్టేషన్లను అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్రం సిద్ధమైంది. ప్రధానమంత్రి ఈ-డ్రైవ్ పథకంలో భాగంగా 72వేల ఈవీ పబ్లిక్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు భారీ పరిశ్రమల శాఖ సన్నద్ధమైంది. ఈ మేరకు ఆ శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి అధ్యక్షతన బుధవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో పెట్రోలియం, సహజ వాయువు, రోడ్డు, రవాణా శాఖ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగించాలని పిలుపునిచ్చారు. వాహనాల సంఖ్య పెరుగుతున్నందున ఈవీ చార్జింగ్ స్టేషన్ల సంఖ్య కూడా పెంచనున్నట్లు తెలిపారు. రూ.2వేల కోట్ల ఆర్థిక వ్యయంతో దేశవ్యాప్తంగా 72వేల పబ్లిక్ ఈవీ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

జపాన్‌కు బయల్దేరిన దౌత్య బృందం

న్యూఢిల్లీ: పాకిస్తాన్ నుంచి విస్తరిస్తున్న ఉగ్రవాదం, దానిపై భారత్ అభిప్రాయాలను తెలిపేందుకు జేడీ (యు) ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం జపాన్‌కు బయలుదేరింది. ఆపరేషన్ సిందూర్, ఆ తరువాత భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై భారత్ అవగాహనను తెలిపేందుకు ప్రతినిధి బృందం దక్షిణ కొరియా, మలేషియా, ఇండోనేషియా, సింగపూర్‌లలో కూడా పర్యటించనుంది. ఝా నేతృత్వంలోని ప్రతినిధి బృందంలో బీజేపీ ఎంపీలు అపరాజిత సారంగి, బ్రిజ్‌లాల్, ప్రధాన్ బారువా, హేమాంగ్ జోషి, కాంగ్రెస్ నాయకుడు, మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ, సీపీఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్, మాజీ రాయబారి మోహన్ కుమార్ ఉన్నారు. పాకిస్తాన్ కుట్రలు, ఉగ్రవాదంపై భారత్ ప్రతిస్పందనను అంతర్జాతీయ సమాజానికి వివరించేందుకు ప్రభుత్వం పలు పార్టీల ప్రతినిధులతో ఏడు బృందాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా యుఎఈ, లైబీరియా, కాంగో, సియెర్రా లియోన్‌లలో పర్యటించేందుకు శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే నేతృత్వంలోని మరో ప్రతినిధి బృందం కూడా బుధవారం బయల్దేరింది.

కేంద్రం నిధులకోసం సుప్రీంలో తమిళనాడు పిటిషన్

సాక్షి, చెన్నై: సర్వశిక్ష అభియాన్ నిధుల కోసం తమిళనాడు ప్రభుత్వం న్యాయ పోరాటానికి సిద్ధమైంది. 2024-2025 సంవత్సరానికి రూ.2,151 కోట్లకు పైగా నిధులను నిలిపేయడాన్ని సవాలు చేస్తూ బుధవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జాతీయ విద్యా విధానం 2020ని డీఎంకే ప్రభుత్వం అమలుచేయకపోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో సర్వ శిక్ష అభియాన్ నిధులను కేంద్రం నిలుపుదల చేసింది. జాతీయ విద్యా విధానం అమలుతోనే నిధులు వస్తాయని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. కేంద్రంపై న్యాయ పోరాటానికి సిద్ధమైంది. సర్వశిక్ష అభియాన్ నిధులను జాతీయ విద్యావిధానాన్ని అనుసంధానిస్తూ కేంద్రం తీసుకున్న చర్య రాజ్యాంగ విరుద్ధం, ఏకపక్షం, అసమంజసమైనదని పిటిషన్‌లో పేర్కొంది. ఇప్పటికే శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ పెండింగ్ పెట్టిన వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో మరోమారు ప్రభుత్వం కేంద్ర నిధులపై పిటిషన్ వేయడం చర్చనీయాంశంగా మారింది.

కన్నడలో మాట్లాడేందుకు నిరాకరించిన బ్యాంకు మేనేజర్

- బదిలీ చేసిన ఎస్‌బీఐ
- స్థానిక భాషలో మాట్లాడేందుకు యత్నించాలి
- ఉద్యోగులకు సీఎం సిద్ధరామయ్య సూచన

శివాజీనగర: కర్ణాటకలో మరోసారి భాష వివాదాస్పదమయ్యింది. కన్నడలో మాట్లాడాలని అడిగినందుకు.. ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ కస్టమర్‌తో వాగ్వాదానికి దిగడం కన్నడనాట ఆగ్రహానికి కారణమైంది. బెంగళూరు శివార్లలోని ఆనేకల్ చందాపురలోని సూర్యనగర ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఈ ఘటన జరిగింది. కస్టమర్ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడగా.. ఆమె హిందీలో స్పందించారు. హిందీ తనకు అర్థం కాదని, కన్నడలో మాట్లాడాలని కోరారు. తాను కన్నడ మాట్లాడేది లేదని, ఏం చేసుకుంటావో చేసుకోమంటూ బ్యాంక్ మేనేజర్ తెగేసి చెప్పడంతో ఆగ్రహానికి గురైన కస్టమర్ వీడియో తీశారు. అది సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వెంటనే.. కన్నడ సంఘాల బ్యాంకు ముందు ధర్నా చేశాయి. దీంతో ఆ మేనేజర్‌ను మరో రాష్ట్రానికి బదిలీ చేసినట్లు ఎస్‌బీఐ ప్రకటించింది.

ముఖ్యమంత్రి ఆగ్రహం: భాసా వివాదంపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ కన్నడ మాట్లాడేందుకు నిరాకరించటం ఖండనీయమన్నారు. 'ఆ అధికారిని బదిలీ చేయడం అభినందనీయం. బ్యాంక్‌మేనేజర్ వ్యవహరించిన తీరు సరైనది కాదు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకూడదు. బ్యాంక్ ఉద్యోగులు వినియోగదారులతో గౌరవంగా నడచుకోవాలి. స్థానిక భాషలో మాట్లాడేందుకు ప్రయత్నించాలి'అని సూచించారు. బ్యాంక్ ఉద్యోగులకు తప్పకుండా స్థానిక భాష, సంస్కృతిపై శిక్షణ ఇవ్వాలని కేంద్ర ఆర్థికశాఖను కోరతానని తెలిపారు.

సర్కారియా కమిషన్ ముఖ్య సిఫార్సులు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ



కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

వివాదాలు - సమీక్షా కమిషన్లు

కేంద్ర , రాష్ట్ర సంబంధాల్లో తలెత్తిన వివాదాలను పరిశీలించి, పరిష్కరించడానికి అనేక కమిటీలను, కమిషన్లను నియమించారు. ఈ కమిటీలు వాటికి నిర్దేశించిన పరిధిలో కొన్ని సిఫార్సులు చేశాయి.

వాటిలో ముఖ్యమైనవి...

పరిపాలనా సంస్కరణల సంఘం (1966)

కేంద్ర ప్రభుత్వం 1966లో ఆరుగురు సభ్యులతో మొరార్జీ దేశాయ్ అధ్యక్షతన పరిపాలనా సంస్కరణల కమిషన్‌ను నియమించింది. (మొరార్జీ దేశాయ్ రాజీనామా చేయడం వల్ల కె.హనుమంతయ్య ఈ కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు). ఈ కమిటీ కేంద్ర రాష్ట్ర సంబంధాలను సమగ్రంగా పరిశీలించింది.

కేంద్ర, రాష్ట్ర సంబంధాల కోసం ఎం.సి. సెతల్వాడ్ అధ్యక్షతన ఒక అధ్యయన బృందాన్ని కూడా నియమించారు. పరిపాలనా సంస్కరణ సంఘం తుది నివేదికను 1969లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో 22 సిఫార్సులు చేసింది.

- ప్రకరణ 263 ప్రకారం, అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- ప్రజా జీవితంలో, పరిపాలనలో అనుభవం ఉన్న వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి.
- రాష్ట్రాల కోరిక మేరకే కేంద్ర బలగాలను పంపాలి.
- రాష్ట్రాలకు మరిన్ని ఆర్థిక వనరులను బదిలీ చేయాలి.

అయితే ఈ సిఫార్సులపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

రాజమన్నార్ కమిటీ (1969)

1969లో తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ పి.వి. రాజమన్నార్ అధ్యక్షతన, ఇద్దరు సభ్యులతో కేంద్ర, రాష్ట్ర సంబంధాల పరిశీలనకు ఒక కమిటీని నియమించింది. ఇది 1971లో నివేదికను సమర్పించింది. దీనిలోని ఇతర సభ్యులు లక్ష్మణస్వామి మొదలియార్, పి. చంద్రారెడ్డి.

ఇది దేశంలో ఉన్న ఏక కేంద్ర ధోరణులకు కారణాలను గుర్తించింది. అవి

- రాజ్యాంగం కేంద్రానికి ఇచ్చిన ప్రత్యేక అధికారాలు
- కేంద్రం, రాష్ట్రంలోనూ ఏక రాజకీయ పార్టీ పాలన
- రాష్ట్రాలకు ఆర్థిక వనరులు తగినన్ని లేకపోవడం, కేంద్రం మీద ఆధారపడటం
- కేంద్ర ప్రణాళిక రచన, ప్రణాళికా సంఘం పాలన

సిఫార్సులు

- రాష్ట్ర మంత్రివర్గంతో లేదా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక ఉన్నతాధికార సంఘంతో సంప్రదించి రాష్ట్రపతి, గవర్నర్‌ను నియమించాలి.
- రాష్ట్ర ప్రభుత్వాన్ని తొలగించి, రాష్ట్రపతి పాలన ప్రకటించే ప్రకరణ 356ను రద్దు చేయాలి.
- గవర్నర్ సంతృప్తి ఉన్నంత వరకే మంత్రివర్గ పదవుల్లో ఉండాలన్న ప్రకరణను తీసివేయాలి.
- కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అవలంబించే ఏకపక్ష నియంతృత్వ చర్యలను నిరోధించడానికి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి రాష్ట్రాలకు తగినన్ని రక్షణలను కల్పించాలి.
- ప్రధాని అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- రాజ్య సభలో రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి.
- కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రాల వారీగా ప్రాతినిధ్యం ఉండాలి.
- ప్రణాళికా సంఘం ఒక శాశ్వత సంస్థగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వ నియంత్రణ తగ్గాలి.
- అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లను రద్దు చేయాలి.
- అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు బదిలీ చేయాలి.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను ప్రముఖ న్యాయ శాస్త్రవేత్తలు తీవ్రంగా విమర్శించారు.

దేశంలో ఎన్నో వేర్పాటువాద శక్తులు తలెత్తుతుండగా జాతి నిర్మాణం, జాతి సమైక్యతా క్రమంలో విద్య, వ్యవసాయ, ఉత్పత్తి రంగాలను విస్తృతం చేసి సామాన్య మానవుని సమస్యలను తీర్చడంలో ప్రయత్నం చేయాల్సి ఉండగా ప్రాంతీయతత్వాన్ని బలోపేతం చేసే విధంగా సిఫార్సులు చేయడం అవాంఛనీయం అని పేర్కొన్నారు.

ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానం (1973)

1973లో పంజాబ్‌లో అకాలీదళ్ పార్టీ ఆనందపూర్ అనే ప్రాంతంలో ఒక తీర్మానాన్ని చేసింది. రక్షణ,అంతర్జాతీయ సంబంధాలు, కమ్యూనికేషన్లు, కరెన్సీ మొదలైన విషయాలకే కేంద్ర ప్రభుత్వ పరిధి పరిమితం కావాలని, దేశంలో నిజమైన సమాఖ్య స్ఫూర్తి తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

పశ్చిమబెంగాల్ ప్రభుత్వ మెమొరాండం(1977)

1977లో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై ఒక విజ్ఞాపన సమర్పించింది. అందులోని కొన్ని ముఖ్యాంశాలు.

- రాజ్యాంగంలో యూనియన్ అనే పదాన్ని తొలగించి సమాఖ్య అనే పదాన్ని చేర్చాలి.
- కొత్త రాష్ట్రాల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోనికి తీసుకోవాలి.
- అఖిల భారత సర్వీసులను రద్దు చేయాలి.
- రాష్ట్రపతి పాలన, అలాగే ఆర్థిక అత్యవసర పరిస్థితి అధికారాలను తొలగించాలి.
- కేంద్ర ప్రభుత్వ అధికార పరిధిని కుదించాలి.
- రాజ్యసభకు లోక్‌సభతో సమానంగా అధికారాలు ఇవ్వాలి.
- జోనల్ కౌన్సిల్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలి.
- శాశ్వత ప్రాతిపదికపై అంతర్రాష్ట్ర ప్రభుత్వ మండలిని ఏర్పాటు చేయాలి.
- జాతీయాభివృద్ధి మండలి పేరును జాతీయ ఆర్థికాభివృద్ధి మండలిగా మార్చి అస్తిత్వాన్ని పరిరక్షించాలి.
- ఆర్థిక నిపుణులనే ఆర్థిక సంఘ సభ్యులుగా నియమించాలి.
- భారతదేశ సమష్టి సంస్కృతిని సంరక్షించడానికి జాతీయ కార్యక్రమాలను ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేయాలి.
- అవశిష్ట అంశాలపై పన్నులు విధించే శాసన నిర్మాణ అధికారాన్ని పార్లమెంటుకు అప్పగించాలి.
- కార్పొరేషన్ పన్నుల్లో కొంత భాగాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలి.
- రాష్ట్రాలతో సంప్రదించి ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసు, ఇండియన్ హెల్త్ సర్వీస్, ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రాల అనుమతి లేకుండా కేంద్ర బలగాలను పంపొద్దు.
- ఉమ్మడి జాబితాలో చట్టాలను రూపొందించే సమయంలో కేంద్రం రాష్ట్రాలను సంప్రదించాలి.
- గవర్నర్ నియామక సమయంలో ముఖ్యమంత్రిని విధిగా సంప్రదించే విధంగా రాజ్యాంగ సవరణ చేయాలి.
- త్రిభాషా సూత్రాన్ని అమలుపరిచేందుకు గట్టి ప్రయత్నం చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీసు చార్జీలను ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే విధించాలి.
- భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రత్యేక కమిషన్‌ను నియమించి క్రియాత్మకం చేయాలి.
- రేడియో, టెలివిజన్‌లకు స్వయం ప్రతిపత్తి అవసరం లేదు. అయితే వాటి పని తీరును వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్థిక సంఘం, ప్రణాళికా సంఘం మధ్య ప్రస్తుత విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది. దాన్ని కొనసాగించాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ వేసే సందర్భంలో పార్లమెంటు అనుమతి తీసుకోవాలి.
- రాష్ట్ర ఎగువసభ రద్దు లేదా ఏర్పాటు విషయంలో పార్లమెంట్ నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయాన్ని తెలపాలి.

గాడ్గిల్ ఫార్ములా

సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ సక్రమంగా జరగాల్సిన ఆవశ్యకత ఉంది. కేంద్ర ప్రణాళికా సహాయాన్ని రాష్ట్రాలకు అందించే ప్రాతిపదికను ప్రణాళిక సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ డి.ఆర్.గాడ్గిల్ పేరుతో 1971లో ఓ ఫార్ములాను రూపొందించారు. దీన్ని 1981లో ఒకసారి, తిరిగి 1992లో మరోసారి సమీక్షించారు. డి.ఆర్.గాడ్గిల్ ఫార్ములా అనుసరించి జనాభా ఆధారంగా 60 శాతం, తలసరి ఆదాయం ఆధారంగా 25 శాతం, ఆదాయ, వ్యయాలను సరిచూసుకుని విత్తలోటు తగ్గించినందుకు 7.5 శాతం, ఇతర సమస్యల (ఎడారి ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, శిశు మరణాలు, ఆరోగ్యం మొదలైనవి) ఆధారంగా 7.5 శాతం కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు సహాయాన్ని అందిస్తుంది. అయితే వెనకబడ్డ, పేద రాష్ట్రాలకు ఈ ఫార్ములా అంత ఉపయోగకరంగా లేదు. విత్త రంగంలో చూపిన క్రమశిక్షణను ఈ ఫార్ములా ప్రోత్సాహపరుస్తున్నట్లుగా లేదని కొందరు విమర్శిస్తున్నారు.

సర్కారియా కమిషన్ సిఫార్సులు (1987)

1983లో కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఆర్.ఎస్. సర్కారియా అధ్యక్షతన బి.శివరామన్, ఎస్.ఆర్.సేన్ సభ్యులుగా, కార్యదర్శిగా ఆర్.ఎం. సుబ్రహ్మణ్యం, రాజ్యాంగ సలహాదారుడుగా ఎల్.ఎన్.సిన్హాతో ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ 1987 అక్టోబర్ 27న 247 సిఫార్సులతో కూడిన 1600 పేజీల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. 1988 జనవరిలో ప్రభుత్వం సర్కారియా కమిషన్ నివేదికను విడుదల చేసింది. అందులో 230 సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయాలను తీసుకుంది. మొత్తం సిఫారసుల్లో 170 సిఫార్సులను అమలు చేసింది.

ముఖ్య సిఫార్సులు

- గవర్నర్‌ల నియామకంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులను సంప్రదించాలి.
- రాజకీయేతర రంగాలకు చెందిన, వివాదాస్పదం కాని వ్యక్తులను, ప్రముఖులను మాత్రమే గవర్నర్‌లుగా నియమించాలి. రాష్ట్రేతర వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి.
- ముఖ్యమంత్రి నియామకం, రాష్ట్రమంత్రి మండలి కొనసాగింపు విషయంలో విధాన సభ మెజారిటీ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకోవాలి. అరుదైన సందర్భాల్లో రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టాలి.
- అఖిల భారత సర్వీసులను మరింత బలోపేతం చేసి, మరిన్ని కొత్త సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీసు చార్జీలను ప్రత్యేక సందర్భాల్లోనే విధించాలి.
- భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రత్యేక కమిషన్‌ను నియమించి క్రియాత్మకం చేయాలి.
- రేడియో, టెలివిజన్‌లకు స్వయంప్రతిపత్తి అవసరంలేదు. అయితే వాటి పనితీరును వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్థికసంఘం, ప్రణాళికా సంఘం మధ్య ప్రస్తుత విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది. దీనిని కొనసాగించాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ వేసే సందర్భంలో పార్లమెంటు అనుమతి తీసుకోవాలి.
- రాష్ట్ర ఎగువసభ రద్దు లేదా ఏర్పాటు విషయంలో పార్లమెంటు నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయాన్ని తెలపాలి.

విద్య, ఉద్యోగ సమాచారం

బాపట్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో వివిధ ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా మహిళా అభివృద్ధి–శిశు సంక్షేమ శాఖలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- » **పోస్టుల వివరాలు:** ఔట్‌రీచ్ వర్కర్(మేల్)-01, డాక్టర్(పార్ట్‌టైమ్)-01, ఆయా-02.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 01.07.2024 నాటికి 25 నుంచి 42 ఏళ్ల ఉండాలి.
- » **వేతనం:** నెలకు ఔట్‌రీచ్ వర్కర్‌కు రూ.10,592, డాక్టర్‌కు రూ.9,930, ఆయాకు రూ.7,944.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా అభివృద్ధి–శిశు సంక్షేమ అధికారి, సి/వో.చిల్డ్రన్ హోమ్, అక్బర్‌పేట, అగ్నిమాపక కేంద్రం దగ్గర, బాపట్ల, బాపట్ల జిల్లా-522101 చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 24.05.2025.
- » **వెబ్‌సైట్:** https://bapatla.ap.gov.in

ఐకార్-ఏఐఈఈఏ(పీజీ)-2025

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)..ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్)-ఆలిండియా ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఫర్ అడ్మిషన్ (ఏఐఈఈఏ పీజీ)-2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన ప్రతిభ ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న 74 అగ్రికల్చర్ యూనివర్శిటీలలో ప్రవేశాలు కల్పిస్తారు.

- » **విభాగాలు:** ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్ సైన్సెస్, ఫిజికల్ సైన్స్, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ, అగ్రోనమీ, సోషల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, కమ్యూనిటీ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, యానిమల్ సైన్సెస్, ఫిషరీస్ సైన్స్, డెయిరీ సైన్స్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ సైన్సెస్ టెక్నాలజీ, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, వాటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ, బీఎస్సీ, బీటెక్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 31.08.2025 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా.
- » **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 120 నిమిషాలు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **దరఖాస్తులకు చివరితేది:** 05.06.2025.
- » **దరఖాస్తు సవరణ తేదీలు:** 07.06.2025 నుంచి 09.06.2025 వరకు
- » **పరీక్షతేది:** 03.07.2025.
- » **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in

తరగతి గదిలో ఉపాధ్యాయుడు ఎలా ఉండాలి?



మాదిరి ప్రశ్నలు

1. **మీరు ఉన్న సమూహానికి ఒక పని అప్పగిస్తే..?**
   1) ఎవరు ఏ పని చేయాలో పురమాయిస్తాను
   2) మిగిలిన వారు ఏవిధంగా చేయమంటే ఆవిధంగా చేస్తాను
   3) నా పనేదో నేను సరిగ్గా చేసుకుంటాను, బాధ్యత తీసుకోను
   4) మిగిలిన వారు పని ఏవిధంగా చేస్తున్నారో గమనిస్తాను
2. **ఒక విద్యార్థి వేసిన ప్రశ్నకు సరైన సమాధానం తెలియకపోతే ఉపాధ్యాయుడిగా మీరు ఏం చేస్తారు?**
   1) విద్యార్థిని నిరుత్సాహపరుస్తాను
   2) వెనుకాడకుండా ఏదో ఒక సమాధానం చెబుతాను
   3) విషయం నుంచి విద్యార్థిని పక్కదోవ పట్టిస్తాను
   4) నిస్సంకోచంగా తెలియదని ఒప్పుకుంటాను
3. **మీరు బోధించే ఒక భావన విద్యార్థులకు అర్థం కానప్పుడు ఏం చేస్తారు?**
   1) అభ్యాసం ద్వారా ప్రయత్నిస్తాను
   2) ఆ భావనను మరిన్ని ఉదాహరణలతో బోధిస్తాను
   3) పరిహారాత్మక బోధన ద్వారా ప్రయత్నిస్తాను
   4) ఆ భావనను విద్యార్థుల పూర్వ అనుభవాలతో అన్వయించి బోధిస్తాను
4. **ప్రతిభావంతుడైన ఉపాధ్యాయుడు కావాలంటే ఎలాంటి స్పృహను కలిగి ఉండాలి?**
   1) గ్రంథాలు ఎక్కువ చదవాలి
   2) బోధనా సామర్థ్యాన్ని పెంచుకోవాలి
   3) ప్రధానోపాధ్యాయుడితో సత్సంబంధాలు ఏర్పరచుకోవాలి
   4) తరగతిని అదుపాజ్ఞల్లో ఉంచాలి
5. **విశ్రాంతి సమయాన్ని మీరు ఎలా వినియోగించుకుంటారు?**
   1) చదువురాని వారికి చదువు చెబుతాను
   2) డబ్బు వచ్చే మార్గం కోసం వినియోగిస్తాను
   3) ఆహ్లాదంగా గడుపుతాను
   4) సరదాలతో కాలక్షేపం చేస్తాను
6. **ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన విద్యార్థులు?**
   1) మందమతులవుతారు
   2) అందరితో కలసి ఉండలేరు
   3) తరగతిలో పాఠాలపై శ్రద్ధ చూపలేరు
   4) తెలివి తేటలతో రాణిస్తారు
7. **రాజీవ్ విద్యా మిషన్ పథకం ఏ తరగతుల వారికి బోధనా వసతులను కల్పిస్తోంది?**
   1) ప్రాథమిక తరగతుల వారికి
   2) ప్రాథమికోన్నత తరగతుల వారికి
   3) మాధ్యమిక తరగతుల వారికి
   4) కళాశాల విద్యార్థులకు
8. **విద్యా లక్ష్యాలను ..... ఆధారంగా నిర్ణయిస్తారు.**
   1) ఉపాధ్యాయుడు
   2) రాజకీయాలు
   3) సమాజం 4) విద్యార్థి
9. **పాఠశాల ముఖ్య ఉద్దేశం ఏమిటి?**
   1) విద్యా లక్ష్యాలను సాధించడం
   2) పాఠ్య ప్రణాళికలు తయారు చేయడం
   3) విద్యార్థులను మూల్యాంకనం చేయడం
   4) విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడటం
10. **కిందివాటిలో బోధనకు సంబంధించనిది?**
    1) నల్లబల్ల 2) హాజరు పట్టిక
    3) పాఠ్యపుస్తకం
    4) నోటు పుస్తకం
11. **కొంత మంది విద్యార్థులు తరచూ ప్రశ్నలు వేస్తే ఉపాధ్యాయుడు ఏం చేయాలి?**
    1) ఊరుకొమ్మని చెప్పాలి
    2) బయటకు వెళ్లగొట్టాలి
    3) ప్రశ్నలన్నింటికీ జవాబులు చెప్పాలి
    4) మిగతా విద్యార్థులకు నష్టం కలుగుతుందని చెప్పాలి
12. **కింది ప్రవర్తనల్లో ఉపాధ్యాయుడికి ఏది తక్కువగా ఉండాలి?**
    1) చిరునవ్వులు నవ్వడం
    2) విద్యార్థులను గౌరవించడం
    3) అపహాస్యంగా మాట్లాడటం
    4) నిర్ణీత సమయానికి ముందుగానే తరగతి గదికి రావడం
13. **ఉపాధ్యాయులు విద్యార్థుల నుంచి సరైన సహకారం, గౌరవం పొందాలంటే ఏం చేయాలి?**
    1) సహకరించాలీ, గౌరవించాలని కోరాలి
    2) విద్యార్థులను తరచూ దండించాలి
    3) విద్యార్థులకు మార్గదర్శకులుగా వ్యవహరించాలి
    4) సిలబస్ సకాలంలో పూర్తిచేసి, రివిజన్ చేయాలి
14. **విద్యార్థులకు సాధ్యమైనంత ఎక్కువగా స్వేచ్ఛ ఇవ్వాలి–దీనితో మీరు ఏకీభవిస్తారా?**
    1) ఏకీభవిస్తాను
    2) ఏకీభవించను
    3) కొన్ని సందర్భాల్లో సమర్థిస్తాను
    4) చాలా వరకూ ఏకీభవిస్తాను
15. **అభ్యసనకు అనుకూల వాతావరణాన్ని కలుగజేయడం ప్రధానంగా ఎవరి బాధ్యత?**
    1) ఉపాధ్యాయులు
    2) ప్రధానోపాధ్యాయుడు
    3) జిల్లా విద్యాశాఖాధికారి
    4) పాఠశాల విద్యా సంచాలకులు
16. **గాంధీజీ ఎలాంటి విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు?**
    1) ప్రాతిపదిక విద్య
    2) కృత్యాధార విద్య
    3) శిశు కేంద్రీకృత విద్య
    4) ఉపాధ్యాయ కేంద్రీకృత విద్య
17. **ముస్లిం విద్యా విధానంలో ఉన్నత విద్యా కేంద్రాన్ని ఏమని పిలిచేవారు?**
    1) ఆశ్రమాలు 2) గురుకులాలు
    3) మక్తాబ్ 4) మదర్సా
18. **భారతీయులపై అత్యంత ప్రభావం చూపిన బ్రిటిష్ విద్యా విధానం ఏది?**
    1) ఉడ్ తాఖీదు
    2) హార్టింగ్ నివేదిక
    3) మెకాలే ప్రతిపాదనలు
    4) హంటర్ నివేదిక
19. **ఉపాధ్యాయులుగా మీరు తరగతి గదిలో క్రమశిక్షణా రాహిత్యాన్ని ఎలా భావిస్తారు?**
    1) సహనంతో పర్యవేక్షిస్తాను
    2) కఠినంగా వ్యవహరిస్తాను
    3) ప్రధానోపాధ్యాయుని దృష్టికి తీసుకెళతాను
    4) స్వీయ శిక్షణలో శిక్షణ ఇస్తాను
20. **కిందివాటిలో సహపాఠ్య కార్యక్రమాల్లో భాగం కానిది ఏది?**
    1) ఇంటిపని
    2) విజ్ఞానయాత్ర
    3) వక్తృత్వ పోటీ
    4) వ్యాసరచన పోటీ
21. **తరగతి నిర్వహణలో తరచుగా ఆటంకాన్ని కలిగిస్తున్న విద్యార్థిని ఉపాధ్యాయుడు ఏం చేయాలి?**
    1) సమస్యాత్మక విద్యార్థిగా గుర్తించాలి
    2) ప్రవర్తన సమస్యగా గుర్తించి మంత్రణం నిర్వహించాలి
    3) పాఠశాల నుంచి బహిష్కరించాలి
    4) విద్యార్థి తల్లిదండ్రులతో చర్చించాలి
22. **పాఠశాల స్థాయి విద్యార్థులకు ఉత్తమ గుణాత్మక విద్యను అందించడానికి ఎలాంటి ఉపాధ్యాయుడు అవసరం?**
    1) ఉన్నత విద్యార్హతలు ఉండాలి
    2) శిక్షణ పొంది ఉండాలి
    3) అనుభవజ్ఞులై ఉండాలి
    4) అంకితభావం ఉండాలి
23. **సర్వశిక్షా అభియాన్ పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఏ విషయంలో బాగా అభివృద్ధి జరిగిందని చెప్పొచ్చు?**
    1) పాఠశాలల్లో విద్యార్థుల నమోదు
    2) ఉపాధ్యాయుల నియామకం
    3) పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
    4) డ్రాపవుట్ విద్యార్థుల సంఖ్యను తగ్గించడం
24. **ఉపాధ్యాయ విద్యతో పాటు నేర్పించాల్సిన అతి ముఖ్య లక్షణం ఏది?**
    1) ఆటలాడటం
    2) కళలపై అభిరుచి
    3) క్రమ శిక్షణ 4) జాతీయతాభావం
25. **విద్యారంగంలో 'ఆపరేషన్ బ్లాక్ బోర్డ్' అనేది?**
    1) నల్లబల్లలకు రంగు వేయడం
    2) ఏకోపాధ్యాయ పాఠశాలను తయారు చేయడం
    3) పాఠశాల కనీస అవసరాలను తీర్చడం
    4) ఉపాధ్యాయ నియామక కార్యక్రమం
26. **బోధన లక్ష్యాలను ఎన్నుకునేది ఎవరు?**
    1) ప్రధానోపాధ్యాయుడు
    2) ఉపాధ్యాయుడు
    3) విద్యార్థి
    4) పైవారందరూ
27. **పాఠం చెప్పే ముందు ఉపాధ్యాయుడు ఏం చేయాలి?**
    1) పాఠం ఆవశ్యకతను చెప్పాలి
    2) పాఠం క్లిష్టతను తెలపాలి
    3) విద్యార్థులను నిశ్శబ్దంగా ఉండమని కోరాలి
    4) విద్యార్థులను పాఠం వైపు ఆకర్షించాలి
28. **తరగతి గదిలో ఉపాధ్యాయుడు ఎలా ఉండాలి?**
    1) ఎల్లప్పుడూ గంభీరంగా ఉండాలి
    2) ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండాలి
    3) విద్యార్థులను ఆకట్టుకోవడానికి హాస్య ప్రియత్వాన్ని వినియోగించాలి
    4) తరగతి గదిలో నవ్వకూడదు
29. **ఒక విషయాన్ని బోధించే ఉపాధ్యాయుడికి..?**
    1) ఆ విషయం పట్ల అవగాహన ఉండాలి
    2) విద్యార్థుల పట్ల అవగాహన ఉండాలి
    3) అన్ని విషయాల్లో అవగాహన ఉండాలి
    4) పైవన్నీ
30. **తెలుగు బోధించే ఉపాధ్యాయుడికి..?**
    1) తెలుగు గురించి తెలిస్తే సరిపోతుంది
    2) మిగతా బోధనా భాషలు గురించి కూడా తెలియాలి
    3) అన్ని పాఠ్య విషయాల గురించి తెలియాలి
    4) మిగతా పాఠ్యాంశాల గురించి తెలియడం అనవసరం
31. **బోధన కంటే అభ్యసనకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే విధానం ఏది?**
    1) ఉపాధ్యాయ కేంద్రీకృత బోధన
    2) విద్యార్థి కేంద్రీకృత బోధన
    3) పాఠ్యాంశ కేంద్రీకృత బోధన
    4) పాఠశాల కేంద్రీకృత బోధన
32. **విద్యార్థుల్లో సత్ప్రవర్తనను పెంపొందించడానికి ఉపాధ్యాయుడు ఏం చేయాలి?**
    1) గొప్పవాళ్ల జీవిత చరిత్రలు చదవమని కోరాలి
    2) సత్ప్రవర్తన గురించి తరచూ ఉపన్యసించాలి
    3) సందర్భోచితంగా సత్ప్రవర్తన గురించి చర్చించాలి
    4) సత్ప్రవర్తన కలిగి ఉండాలి
33. **ఉపాధ్యాయుడు తన వ్యక్తిగత ఇబ్బందులను..?**
    1) తరగతి గదిలో ప్రదర్శించాలి
    2) తరగతి గదిలో మరచిపోవాలి
    3) పాఠశాలలో వ్యక్తీకరించుకోవాలి
    4) పాఠశాల బయటనే విడిచిపెట్టాలి
34. **ఉపాధ్యాయుడు తోటి ఉపాధ్యాయులతో కలిసిమెలిసి ఉండాలి. ఎందుకంటే..?**
    1) విశ్రాంతి సమయంలో కాలక్షేపం చేయొచ్చు
    2) విద్యార్థుల ప్రయోజనాలు నేరవేరుతాయి
    3) మేనేజ్‌మెంట్‌తో సమైక్యంగా పోరాడవచ్చు
    4) అలాగైతే గొడవలు జరగవు
35. **'పాఠశాలే విద్యార్థి దగ్గరికి వెళ్లడం' ఎందులో సాధ్యమవుతుంది?**
    1) నియత విద్య
    2) అనియత విద్య
    3) వయోజన విద్య
    4) ఏదీకాదు
36. **పాఠం చెప్పేటప్పుడు మీరు కొన్ని విషయాలను నల్లబల్లపై రాశారు. పాఠం పూర్తయిన తర్వాత ఏం చేస్తారు?**
    1) ఆ అంశాలను నల్లబల్లపై అలాగే ఉండనిస్తాను
    2) తుడిచేస్తాను
    3) విద్యార్థుల ఇష్టానికే వదిలేస్తాను
    4) అలాగే ఉండనివ్వమని విద్యార్థులకు చెబుతాను

సమాధానాలు


1) 1;	2) 4;	3) 4;	4) 2;
5) 1;	6) 2;	7) 3;	8) 3;
9) 4;	10) 2;	11) 4;	12) 3;
13) 3;	14) 4;	15) 1;	16) 1;
17) 4;	18) 3;	19) 4;	20) 1;
21) 2;	22) 2;	23) 3;	24) 3;
25) 3;	26) 2;	27) 4;	28) 3;
29) 4;	30) 3;	31) 2;	32) 4;
33) 4;	34) 2;	35) 2;	36) 2.

మానవునిలోని కపాలనాడుల సంఖ్య?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ




నాడీ వ్యవస్థ, సమన్వయం, ప్రత్యుత్పత్తి, సహజ వనరులు

1. శరీరంలో టెలిఫోన్ వైర్లలా పనిచేసేవి?
ఎ) జ్ఞానేంద్రియాలు బి) రక్తనాళాలు
సి) నాడులు డి) కండరాలు
2. నాడీకణంలో మాత్రమే ఉన్న ప్రత్యేక కణికలు?
ఎ) రాంసన్ బి) నిస్సల్స్
సి) రాబర్ట్ డి) ష్వాన్
3. పోలియో వ్యాధిలో నశించే నాడీ కణాలు?
ఎ) జ్ఞాన నాడీ కణాలు
బి) చాలక నాడీ కణాలు
సి) అభివాహి కణాలు డి) ఎ, సి
4. మానవునిలోని వెన్నునాడుల సంఖ్య?
ఎ) 30 జతలు బి) 30
సి) 31 డి) 31 జతలు
5. మానవునిలోని కపాలనాడుల సంఖ్య?
ఎ) 12 జతలు బి) 10 జతలు
సి) 31 జతలు డి) 43 జతలు
6. మానవునిలో పరధీయ నాడుల సంఖ్య?
ఎ) 43 బి) 10 జతలు
సి) 31 జతలు డి) 43 జతలు
7. వెన్నునాడులన్నీ?
ఎ) జ్ఞాన నాడులు బి) చాలక నాడులు
సి) అపవాహి నాడులు డి) మిశ్రమ నాడులు
8. మెదడును భద్రపర్చే నిర్మాణం?
ఎ) కపాలం బి) అస్థిపంజరం
సి) కటివలయం డి) శ్రోణివలయం
9. మెదడులో మస్తిష్కంగా పిలిచే భాగం?
ఎ) ముందు మెదడు బి) మధ్య మెదడు
సి) వెనుక మెదడు డి) అనుమస్తిష్కం
10. శ్వాసక్రియ, హృదయ స్పందన, రక్తపీడనం లాంటి చర్యలను నియంత్రించే మెదడు భాగం?
ఎ) ద్వారగోర్ధం బి) అనుమస్తిష్కం
సి) మజ్జాముఖం డి) మస్తిష్కం
11. మెదడులోని ద్వారగోర్ధానికి సంబంధించింది?
ఎ) భావావేశాలు బి) తెలివితేటలు
సి) శరీర సమతాస్థితి డి) దృష్టి
12. మెదడులోని ఏ భాగం వివిధ రకాల అనుభూతులను తనలో ఇముడ్చుకుంటుంది?
ఎ) మస్తిష్కం బి) ద్వారగోర్ధం
సి) మజ్జాముఖం డి) అనుమస్తిష్కం
13. ప్రతీకార చర్యా చాపంలోని భాగాలు?
ఎ) గ్రాహకం, జ్ఞాననాడీ
బి) మధ్యస్థ నాడీకణం, చాలకనాడీ
సి) నిర్వాహకాంగం డి) పైవన్నీ
14. అసంకల్పిత ప్రతీకార చర్యలు నాడీ మండలంలో దేని ఆధీనంలో ఉంటాయి?
ఎ) మజ్జాముఖం బి) అనుమస్తిష్కం
సి) హైపోథలామస్ డి) వెన్నుపాము
15. మెదడు ఏ భాగం వెన్నుపాముగా మారుతుంది?
ఎ) ద్వారగోర్ధం బి) హైపోథలామస్
సి) మజ్జాముఖం డి) మస్తిష్కం
16. శరీరం తీసుకునే మొత్తం ఆక్సిజన్‌లో ఎంత శాతం మెదడు వినియోగించుకుంటుంది?
ఎ) 2 బి) 20 సి) 25 డి) 40
17. అతి ప్రధాన వినాళ గ్రంథి ఏది?
ఎ) పీయూష గ్రంథి బి) అడ్రినల్ గ్రంథి
సి) క్లోమం డి) అవటు గ్రంథి
18. మధుమేహానికి సంబంధించిన గ్రంథి?
ఎ) కాలేయం బి) క్లోమం
సి) అడ్రినల్ గ్రంథి డి) పీయూష గ్రంథి
19. వాయు నాళానికి దగ్గరగా ఉండే వినాళ గ్రంథి?
ఎ) పీయూష గ్రంథి బి) అవటు గ్రంథి
సి) పార్శ్వ అవటు గ్రంథులు డి) క్లోమం
20. ADHగా పిలిచే హార్మోన్?
ఎ) ఇన్సులిన్ బి) గ్లూకగాన్
సి) ఆక్సిటోసిన్ డి) వాసోప్రెసిన్
21. మూత్రంలో గ్లూకోజ్‌కు కారణం?
ఎ) దేహంలో ఇన్సులిన్ లోపం
బి) ఇన్సులిన్ అధికస్రావం
సి) టెస్టోస్టిరాన్ అల్పస్రావం
డి) ఏదీకాదు
22. జీవక్రియా రేటును ప్రభావితం చేసే హార్మోన్?
ఎ) ఇన్సులిన్ బి) థైరాక్సిన్
సి) పారాథార్మోన్ డి) కార్టిసాల్
23. దేహంలో మిశ్రమ గ్రంథి అని దేని అంటారు?
ఎ) క్లోమం బి) అవటు గ్రంథి
సి) ముష్కం డి) స్త్రీ బీజ కోశం
24. కింది వాటిలో స్త్రీ హార్మోన్?
ఎ) ఈస్ట్రోజన్ బి) ప్రొలాక్టిన్
సి) ఆక్సిటోసిన్ డి) పైవన్నీ
25. భావావేశాలను నియంత్రించే వినాళ గ్రంథి ఎక్కడ ఉంటుంది?
ఎ) మెదడు దగ్గర
బి) గొంతు ప్రాంతంలో
సి) మూత్ర పిండం మీద
డి) జీర్ణాశయం కింద
26. ఫలాల పరిపక్వతకు మొక్కల్లో ఏ ఫైటో హార్మోన్ సహాయ పడుతుంది?
ఎ) ఆక్సిన్ బి) జిబ్బరెల్లిన్
సి) ఇథిలిన్ డి) ABA
27. పత్రాలు, పుష్పాలు ఎక్కువ కాలం తాజాగా ఉండడానికి సాయపడే హార్మోన్?
ఎ) సైటోకైనిన్ బి) ఇథిలిన్
సి) జిబ్బరెల్లిన్ డి) ఆక్సిన్
28. బాష్పోత్సేకాన్ని నిరోధించి పత్ర రంధ్రాలు మూసుకోవడానికి సాయపడే మొక్క హార్మోన్?
ఎ) ఆక్సిన్ బి) అబ్‌సైసికామ్లం
సి) ఇథిలిన్ డి) సైటోకైనిన్
29. విత్తనాలలో సుప్తావస్థను తొలగించి అవి మొలకెత్తడానికి సాయపడే హార్మోన్?
ఎ) ఆక్సిన్ బి) జిబ్బరెల్లిన్
సి) అబ్‌సైసికామ్లం డి) సైటోకైనిన్
30. డార్విన్ ఏ ఫైటో హార్మోన్ సంబంధిత ప్రయోగం చేశాడు?
ఎ) ABA బి) ఇథిలిన్
సి) ఆక్సిన్ డి) జిబ్బరెల్లిన్
31. పరాగనాళం అండాన్ని చేరటంలో చూపే అనువర్తన చలనాలు ఏ రకానికి చెందినవి?
ఎ) కాంతి బి) రసాయన
సి) గురుత్వ డి) నీటి
32. నులితీగల్లో సాధారణంగా కనిపించే అనువర్తనం?
ఎ) గురుత్వ బి) నీటి
సి) స్పర్శ డి) ఏదీకాదు
33. ఆకలి సూచనలను నియంత్రించే మెదడులోని భాగం ఏది?
ఎ) మజ్జాముఖం బి) మస్తిష్కం
సి) ద్వారగోర్ధం డి) అనుమస్తిష్కం
34. కింది వాటిలో ఆకలిని కలిగించే హార్మోన్?
ఎ) గాస్ట్రిన్ బి) గ్రీలిన్
సి) లెప్టిన్ డి) సెక్రెటిన్
35. మానవునిలో 'రెండో మెదడు'గా పరిగణించే నాడీ వ్యవస్థ కింది ఏ వ్యవస్థలో భాగంగా ఉంటుంది?
ఎ) విసర్జక బి) ప్రసరణ
సి) జీర్ణ డి) ఏదీకాదు
36. ఏ సందర్భంలో అతి త్వరగా రుచిని తెలుసుకోగలుగుతాం?
ఎ) నాలుకపై చక్కెర వేసుకున్నప్పుడు
బి) నాలుకపై చక్కెర ద్రావణాన్ని పోసినప్పుడు
సి) చక్కెరను నాలుకతో అంగిలికి నొక్కిపట్టినప్పుడు
డి) చక్కెరను నమలకుండా వెంటనే మింగినప్పుడు
37. మానవుని దంత ఫార్ములా?
ఎ) $\frac{2123}{2123}$ బి) $\frac{2033}{1023}$
సి) $\frac{3143}{3143}$ డి) $\frac{2312}{1331}$
38. మానవుని నోటిలో ఉండే రదనికల సంఖ్య?
ఎ) 8 బి) 16 సి) 32 డి) 4
39. మానవుని పైదవడపై ఉన్న కుంతకాల సంఖ్య?
ఎ) 4 బి) 8 సి) 16 డి) 32
40. దవడలోని అంతర కండరాల కదలికను నియంత్రించే కపాలనాడి?
ఎ) 3వ బి) 5వ సి) 7వ డి) 10వ
41. గడ్డి → మిడత → కప్ప → పాము→గద్ద పై ఆహార గొలుసులో ద్వితీయ వినియోగదారి ఎవరు?
ఎ) మిడత బి) కప్ప
సి) పాము డి) గడ్డి
42. ఎల్లప్పుడూ నిటారుగా ఉండే జీవావరణ పిరమిడ్?
ఎ) సంఖ్యా పిరమిడ్
బి) జీవ ద్రవ్యరాశి పిరమిడ్
సి) శక్తి పిరమిడ్ డి) ఏదీకాదు
43. ఆహార గొలుసులో శాఖాహారులను ఏమని పిలుస్తారు?
ఎ) ఉత్పత్తిదారులు
బి) ప్రాథమిక వినియోగదారులు
సి) విచ్ఛిన్నకారులు డి) సర్వభక్షకులు
44. ఆవరణ వ్యవస్థలో శక్తికి మూలం?
ఎ) మొక్కలు బి) జంతువులు
సి) సూర్యుడు డి) బ్యాక్టీరియా
45. మొక్కలు వేటికోసం పోటీపడవు?
ఎ) నీరు బి) స్థలం
సి) ఆహారం డి) ఏదీకాదు
46. ఆహార గొలుసు వేటితో ప్రారంభమవుతుంది?
ఎ) ఉత్పత్తిదారులు
బి) విచ్ఛిన్నకారులు
సి) వినియోగదారులు
డి) మాంసాహారులు
47. తక్కువ కాలంలో ఎక్కువ మొక్కలను తయారుచేసే పద్ధతి?
ఎ) ఛేదనం బి) అంటుతొక్కడం
సి) అంటుకట్టడం డి) కణజాల వర్ధనం
48. 'అంటుకట్టడం' అనే ప్రక్రియలో వాంఛిత లక్షణాలు ఉండే మొక్క భాగం?
ఎ) స్టాక్ బి) ఎక్స్‌ప్లాంట్
సి) సయోన్ డి) సక్కర్
49. ఈ కింది ఏ మొక్క పత్రాల నుంచి చిన్న మొక్కలు ఏర్పడుతాయి?
ఎ) ఉల్లి బి) పసుపు
సి) రణపాల డి) క్యారట్
50. ఈ కిందివాటిలో అంతర ఫలదీకరణం వేటిలో జరుగుతుంది?
ఎ) కప్ప బి) వానపాము
సి) మానవుడు డి) చేప
51. మానవునిలో శుక్రకణాలు ఎక్కడ ఏర్పడతాయి?
ఎ) శుక్రవాహికలలో
బి) శుక్రనాళికలలో
సి) శుక్రోత్పాదక నాళికలలో
డి) మేహనంలో
52. మానవునిలో గర్భావధికాలం?
ఎ) 600 రోజులు బి) 150 రోజులు
సి) 280 రోజులు డి) 100 రోజులు
53. జరాయువు వేటినుంచి ఏర్పడుతుంది?
ఎ) పిండకణాలు బి) తల్లికణాలు
సి) పరాయువు డి) పైవన్నీ
54. శిశుజననం తర్వాత గర్భాశయ కండరాల సంకోచం, జరాయువును బయటకు నెట్టేంతవరకు జరిగే ప్రక్రియను ఏమంటారు?
ఎ) అండోత్సర్గం బి) రుతుస్రావం
సి) జననాంతరం డి) గర్భావధికాలం
55. మొక్క అండంలోని పిండకోశంలో కణాల సంఖ్య?
ఎ) 5 బి) 6 సి) 7 డి) 8
56. ఈ కిందివాటిలో అంకురచ్ఛదరహిత విత్తనం?
ఎ) మొక్కజొన్న బి) ఆముదం
సి) చిక్కుడు డి) వరి
57. ఈ కిందివాటిలో వైరస్ ద్వారా సంక్రమించే లైంగిక వ్యాధి?
ఎ) గనేరియా బి) సిఫిలిస్
సి) ఎయిడ్స్ డి) పైవన్నీ
58. స్త్రీలలో గర్భనిరోధక పద్ధతి?
ఎ) కాపర్ - T బి) ట్యూబెక్టమీ
సి) వాసెక్టమీ డి) ఎ, బి
59. మొక్కల శాఖీయ వ్యాప్తిలో పాల్గొనని భాగం?
ఎ) వేరు బి) కాండం
సి) పుష్పం డి) పత్రం
60. మానవునిలో ఫలదీకరణం జరిగే ప్రాంతం?
ఎ) గర్భాశయం బి) స్త్రీ బీజకోశం
సి) ముష్కం
డి) ఫాలోపియన్ నాళం
61. కాంటూర్ పట్టీ పంటల ప్రయోజనం?
ఎ) జల సంరక్షణ బి) నేల సంరక్షణ
సి) వాయు సంరక్షణ డి) ఏదీకాదు
62. ఆహారజాలకం వేటి కలయిక వల్ల ఏర్పడుతుంది?
ఎ) మొక్కలు బి) జంతువులు
సి) ఆహార గొలుసులు
డి) బ్యాక్టీరియాలు
63. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా చైనా ప్రభుత్వం ఏ పక్షిని అంతరింపజేసింది?
ఎ) పావురం బి) పిచ్చుక
సి) బాతు డి) కోకిల
64. ఆహార గొలుసులోకి కాలుష్యాలు చేరడం?
ఎ) యుట్రోఫికేషన్
బి) జైవిక వృద్ధీకరణం
సి) జైవిక వ్యవస్థాపనం
డి) నైట్రిఫికేషన్
65. మినిమేటా వ్యాధికి కారణం అయిన కాలుష్య కారకం?
ఎ) లెడ్ బి) పాదరసం
సి) ఆర్సెనిక్ డి) కాడ్మియం
66. పర్యావరణ సంరక్షణకు అవసరమయ్యే 3Rలకు సంబంధించింది?
ఎ) Reduce బి) Reuse
సి) Recycle డి) పైవన్నీ
67. కిందివాటిలో పునరుద్ధరించదగిన వనరు?
ఎ) పెట్రోలు బి) బొగ్గు
సి) అడవి డి) సహజ వాయువు
68. సంయోగ బీజాలు ఏర్పడటానికి జరిగే విభజన?
ఎ) సమ విభజన బి) అసమ విభజన
సి) క్షయకరణ విభజన డి) ద్విదావిచ్ఛిత్తి
69. ఈ కింది ఏ కణాలు ఎప్పటికీ విభజన చెందవు?
ఎ) గుండె కణాలు బి) రక్త కణాలు
సి) నాడీ కణాలు డి) ఎ, సి
70. కణచక్రంలోని 'అంతరదశ'లో దశలు?
ఎ) G_1, S, G_2 బి) G_1, S, M
సి) M, G_1, G_2 డి) S, G_1

సమాధానాలు

1) సి	2) బి	3) బి	4) డి	5) ఎ
6) డి	7) డి	8) ఎ	9) ఎ	10) సి
11) ఎ	12) ఎ	13) డి	14) డి	15) సి
16) బి	17) ఎ	18) బి	19) బి	20) డి
21) ఎ	22) బి	23) ఎ	24) డి	25) సి
26) సి	27) ఎ	28) బి	29) బి	30) సి
31) బి	32) సి	33) సి	34) బి	35) సి
36) సి	37) ఎ	38) డి	39) ఎ	40) బి
41) బి	42) సి	43) బి	44) సి	45) సి
46) ఎ	47) డి	48) సి	49) సి	50) సి
51) సి	52) సి	53) డి	54) సి	55) సి
56) సి	57) సి	58) డి	59) సి	60) డి
61) బి	62) సి	63) బి	64) సి	65) బి
66) డి	67) సి	68) సి	69) డి	70) ఎ.

Command that fixes the minor errors..



1. A technique used by codes to convert an analog signal into a digital bit stream is known as:
a) Pulse code modulation
b) Pulse stretcher
c) Query processing
d) Queue management
e) None of these
2. The most important or powerful computer in a typical network is:
a) desktop b) network client
c) network server
d) network station
e) my computer
3. In MS word what is the short cut of Ctrl + L?
a) Left Align b) Left Indent
c) Increase Left Margin
d) Decrease Left Margin
e) None
4. Which of the following can NOT be used to create parallel style column?
a) Format Tabs
b) Table Insert Table
c) Insert Textbox
d) Format Columns
e) None of these
5. An Internet standard for transferring files is known as:
a) IRC b) Telnet c) FTP
d) WAIS e) None of these
6. Another name for electronic cash or e-cash, the Internet equivalent to traditional cash, is:
a) Cybercast and analog cash
b) Digital cash and cybercom
c) Carders and cybercom
d) Cybercast and digital cash
e) None of these
7. This type of e-commerce often takes the form of an electronic version of the classified ads or an auction:
a) B2C b) C2C c) G2C
d) B2B e) None of these
8. The command that fixes the minor errors of the disk:
a) Error.fix b) Scandisk
c) Chkdsk d) Defrag
e) None of these
9. What is a LAN that has one or more dedicated computers and all others act as recipients?
a) Peer-to-peer model
b) Client/server model
c) P-to-p model
d) Ring network e) None
10. If a computer has a(n) _____ port, it does not need a NIC.
a) Internet b) Ethernet
c) Intranet d) Broad band
e) None of these
11. Microprocessors as switching devices are used for which generation computers?
a) First Generation
b) Second Generation
c) Third Generation
d) Fourth Generation
e) None of these
12. ASCII and EBCDIC are the popular character coding systems. What does EBCDIC stand for?
a) Extended Binary Coded Decimal Interchange Code
b) Extended Bit Code Decimal Interchange Code
c) Extended Bit Case Decimal Interchange Code
d) Extended Binary Case Decimal Interchange Code
e) None of these
13. Storage capacity of magnetic disk depends on:
a) Tracks per inch of surface
b) Bits per inch of tracks
c) Disk pack in disk surface
d) All of above) None of these
14. A storage area used to store data to a compensate for the difference in speed at which the different units can handle data is:
a) Memory b) Buffer
c) Accumulator d) Address
e) None of these
15. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is the _____.
a) Internal modem
b) External modem
c) PC Card modem
d) Wireless modem e) None
16. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called _________.
a) ISDN b) Microwave
c) Cable modem d) DSL
e) None of these
17. The rules for exchanging data between computers are called
a) Interconnections
b) Synchronous packages
c) Protocols
d) Data transmission synchronization
e) None of these
18. ______ is the process of breaking down information sent or transmitted across the Internet into small parts called packets.
a) Protocol b) Bandwidth
c) Reformatting d) Identification
e) None of these
19. Relocation bits used by relocating loader are specified (generated) by
a) Relocating loader itself
b) Linker
c) Assembler or translator
d) Macro processor
e) None of these
20. Which of the following scheduling objectives should be applied to the following: the system should admit jobs to create a mix that will keep most devices busy
a) to be fair
b) to balance resource utilization
c) to obey priorities
d) to be predictable e) none
21. A task in a blocked state
a) is executable
b) is running
c) must still be placed in the run queues
d) is waiting for same temporarily unavailable resources
e) none of these
22. The higher versions of the operating systems are so written that programs designed for earlier versions can still be run. What is it called?
a) Upgradability
b) Upward mobility
c) Universality
d) upward compatibility
e) none of these
23. IP address is currently
a) 4 bytes long
b) available in plenty
c) 6 bytes long
d) not assigned as it is all used up
e) none of these
24. Internet data is broken up as
a) Fixed length packets
b) Variable length packets
c) Not packetized
d) 64 bytes packets
e) None of these
25. The packets of an internet message
a) take a predetermined path
b) take a path based on packet priority
c) go along different paths based on path availability
d) take the shortest path from source to destination
e) none of these
26. By an intranet we mean
a) a LAN of an organization
b) a Wide Area Network connecting all branches of an organization
c) a corporate computer network
d) a network connecting all computers of an organization and using the internet protocol
e) none of these
27. The part of machine level instruction, which tells the central processor what has to be done, is
a) Operation code b) Address
c) Locator d) Flip-Flop
e) Register
28. Which of the following systems software does the job of merging the records from two files into one?
a) Security software
b) Utility program
c) Networking software
d) Documentation system
e) None of these
29. Fork is
a) The dispatching of a task
b) The creation of a new job
c) The creation of a new process
d) Increasing the priority of a task
e) None
30. Computer is free from tiresome and boardroom. We call it
a) Accuracy b) Reliability
c) Diligence d) Versatility
e) None of these
31. CD-ROM is a
a) Semiconductor memory
b) Memory register
c) Magnetic memory
d) All the above
e) None of these
32. To produce high quality graphics (hardcopy) in colour, you would want to use a/n
a) RGB monitors b) Plotter
c) Ink-jet printer
d) Laser printer e) None
33. Which of the following IC was used in third generation of computers?
a) SSI b) MSI c) LSI
d) Both a and b
e) None of these
34. On which of the following sites can you set up your email account:
a) www.hotmail.com
b) www.gre.org
c) www.linux.org
d) www.syvum.com e) none
35. The acronym NOS refers to the :
a) Operating system on the clients
b) Network order system, or topology
c)Operating system of the network
d) network architecture
e) none of these

Answers

1) a	2) c	3) a	4) d	5) c
6) d	7) b	8) c	9) b	10) b
11) d	12) a	13) d	14) b	15) c
16) d	17) c	18) c	19) b	20) b
21) d	22) d	23) a	24) b	25) c
26) d	27) a	28) b	29) c	30) c
31) d	32) b	33) d	34) a	35) c